


'పారదర్శకతతో పథకాలు అమలు చేస్తే చిట్టచివరి వ్యక్తికి కూడా సంక్షేమం అందుతుంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 12+6+32 పేజీల ఆదివారం అనుబంధం

వెల: ₹ 7.00

సంపుటి: 16

సంచిక: 245

ఆదివారం

26-11-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. **బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు.** కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

పేదరికం తగ్గినా ఆహార వినియోగం పెరగలేదు

మన దేశంలో ప్రపంచ దేశాలకు భిన్నమైన ధోరణి

- తక్కువ తింటే ఆరోగ్యం అనుకోవటమే ఇందుకు కారణమా?
- ఎఫ్‌పీఓ, ఎన్ఐఎన్ గణాంకాల మధ్య భారీ వ్యత్యాసం
- పోషకాల సాంద్రత గల ఆహారోత్పత్తిపై దృష్టి పెట్టాలి
- నీతి ఆయోగ్ సభ్యుడు డా. రమేశ్ చంద్



సాక్షి సాగుబడి, హైదరాబాద్: తలసరి ఆదాయం పెరిగి పేదరికం తగ్గిన దశలో శక్తినిచ్చే ఆహార వినియోగం పెరగటం ప్రపంచదేశాల్లో సర్వసాధారణం కాగా, భారత్‌లో మాత్రం ఇందుకు భిన్నమైన పరిస్థితి ఉందని నీతి ఆయోగ్ సభ్యుడు, ప్రముఖ వ్యవసాయ ఆర్థిక వేత్త డాక్టర్ రమేశ్ చంద్ అన్నారు. 2012కు ముందు 30 ఏళ్లలో తలసరి ఆదాయం పెరిగి, పేదరికం తగ్గినప్పటికీ శక్తినిచ్చే ఆహార వినియోగం మాత్రం పెరగలేదన్నారు. పేదరికాన్ని తగ్గించినంత సులువుగా శక్తినిచ్చే ఆహార వినియోగాన్ని పెంపొందించలేని విచిత్ర పరిస్థితి మన దేశంలో నెలకొందని ఆయన వ్యాఖ్యానించారు. శనివారం సాయంత్రం ఇక్కడి జాతీయ పోషకాహార సంస్థలో ఆయన డా. గోపాలన్ స్మారకోపన్యాసం చేశారు.

ఆ కారణాన్ని పౌష్టికాహార నిపుణులు శోధించాలి

ప్రపంచ దేశాల పోకడకు భిన్నమైన ఈ ఆహార వినియోగ ధోరణికి మూలకారణాన్ని పౌష్టికాహార నిపుణులు శోధించాలని డా. రమేశ్ చంద్ అభిప్రాయపడ్డారు. ఆహార లభ్యత గత 50 ఏళ్లలో గణనీయంగా పెరిగినప్పటికీ శక్తినిచ్చే ఆహార వినియోగం తగ్గటం వెనుక మర్మాన్ని కనుగొనాల్సిన అవసరం ఉందన్నారు. 1980 నుంచి 2012 నాటికి భారత్‌లో పౌష్టికాహార లోపంతో బాధపడుతున్న వారి శాతం 38 నుంచి 16కి తగ్గిందని ఐక్యరాజ్యసమితికి చెందిన ఆహార–వ్యవసాయ సంస్థ (ఎఫ్.ఎ.ఓ.) చెబుతోందని వివరించారు. అయితే, హైదరాబాద్‌లోని జాతీయ పోషకాహార సంస్థ (ఎన్.ఐ.ఎన్.) గణాంకాల ప్రకారం మాత్రం వీరి శాతం 2012 నాటికి 77%గా ఉందన్నారు. ఎన్.ఐ.ఎన్. విశ్లేషణ నమూనాను ఎఫ్.ఎ.ఓ. నమూనాతో అనుసంధానం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గతంతో పోల్చితే ప్రజలకు యాంత్రీకరణ పెరిగి, శారీరక శ్రమ చేయాల్సిన అవసరం తగ్గిందనీ, దాంతో, ప్రొటీన్లు, ఐరన్ వంటి పోషకాలు తీసుకోవటం పెరిగినా శక్తినిచ్చే ఆహార ధాన్యాల వినియోగం తగ్గి ఉంటుందని అభిప్రాయపడ్డారు.

పోషకాల సాంద్రత ఎక్కువగా ఉన్న ఆహారోత్పత్తి చేపట్టాలి

తక్కువ పరిమాణంలో ఆహార వినియోగం జరుగుతున్నందున పోషకాల సాంద్రత ఎక్కువగా ఉన్న ఆహారోత్పత్తి చేపట్టాలని. స్థానిక / సంప్రదాయ ఆహారాన్ని వినియోగించే దిశగా ప్రోత్సహించాలని ఆయన సూచించారు. ఎన్ఐఎన్ డైరెక్టర్ డాక్టర్ హేమలత పాల్గొన్నారు.

రూ.98 లక్షలు స్వాధీనం

తొర్రూరు: మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణంలోని కంఠాయపాలెం రోడ్డులో శనివారం ఫ్లయింగ్ స్క్వాడ్‌తో కలిసి పోలీసులు తనిఖీలు చేపట్టగా.. కారులో ఎలాంటి ఆధారాల్లేని రూ.98.64 లక్షలు, 118 కాంగ్రెస్ కండువాలను స్వాధీనం చేసుకున్నారు. కారును సీజ్ చేసి ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ సత్యనారాయణ, ఎస్ఐ జగదీష్ తెలిపారు. తెలిపారు. పంచనామా నిర్వహించి ఈ మొత్తాన్ని ఆదాయ పన్ను శాఖాధికారులకు అప్పగిస్తామని తెలిపారు.



తొర్రూరులో పట్టుబడిన నగదును చూపిస్తున్న పోలీసులు

పెరిగిన నేర చరితులు!

ఈసారి పోటీలో ఉన్న అభ్యర్థుల్లో 23% మందిపై క్రిమినల్ కేసులు

మొత్తం 2,290 మందిలో 521 మంది నేర చరితులు

- టాప్ ప్లేస్‌లో కాంగ్రెస్, తర్వాత బీజేపీ, ఆ తర్వాత బీఆర్ఎస్
- 2023 అసెంబ్లీ బరిలో 25 శాతం మంది కోటీశ్వరులు
- నివేదికలో ఏడీఆర్ వెల్లడి

అభ్యర్థుల ఆదాయం, ఆస్తుల విలువ రూ. కోట్లలో ..

ఆస్తుల విలువ రూ.ల్లో	అభ్యర్థులు	అభ్యర్థుల %
రూ.5 కోట్లు అంతకంటే ఎక్కువ	270	11.79 శాతం
రూ.2 కోట్ల నుంచి రూ.5 కోట్లు	150	6.55 శాతం
రూ.50 లక్షల నుంచి రూ.2 కోట్లు	381	16.64 శాతం
రూ.10 లక్షల నుంచి రూ.50 లక్షలు	539	23.54 శాతం
రూ.10 లక్షల లోపు	950	41.48 శాతం

పోటీలో ఉన్న అభ్యర్థులు ఇలా..

పురుషులు	2,067
మహిళలు	2,22
థర్డ్ జెండర్	01
మొత్తం	2,290

పార్టీల వారీగా అభ్యర్థులపై క్రిమినల్ కేసుల వివరాలు

పార్టీ	క్రిమినల్ కేసులు	సీరియస్ క్రిమినల్ కేసులు
కాంగ్రెస్	72%	51%
బీజేపీ	71%	49%
బీఆర్ఎస్	48%	29%
బీఎస్పీ	37%	26%
సీపీఎం	63%	32%
ఎంఐఎం	56%	33%

సాక్షి, హైదరాబాద్/సాక్షి, న్యూఢిల్లీ: గత ఎన్నికలతో పోల్చుకుంటే ఈసారి అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల్లో నేర చరితులు పెరిగారు. నేర చరిత్ర, పెండింగ్ కేసులు ఉన్న వారికి ఎన్నికల్లో సీట్లు కేటాయించవద్దని సుప్రీం కోర్టు సూచించినప్పటికీ రాజకీయ పార్టీలు అది పాటించక పోవడం గమనార్హం. మొత్తం 2,290 మంది అభ్యర్థుల్లో 23 శాతం మంది తమపై క్రిమినల్ కేసులు ఉన్నట్టుగా అఫిడవిట్లలో పేర్కొన్నారని అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫామ్స్ (ఏడీఆర్) వెల్లడించింది. 2018 ఎన్నికలలో 1,777 మంది అభ్యర్థులకు గాను 21 శాతం (368) మంది అభ్యర్థులపై క్రిమినల్ కేసులు ఉండగా, ఈ ఎన్నికల్లో క్రిమినల్ కేసులు ఉన్నవారు 521 మంది ఉన్నారని ఏడీఆర్ వివరించింది. 353 మంది అభ్యర్థులపై సీరియస్ క్రిమినల్ కేసులు (5 ఏళ్ల అంతకు మించి శిక్షపడే కేసులు) ఉండగా, ఈ సంఖ్య 2018లో 321గా ఉన్నట్టు తెలిపింది. ఈ నెల 30న రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే. కాగా అభ్యర్థుల అఫిడవిట్లను పరిశీలించి వారిపై పెండింగ్ కేసులు, విద్యార్హతలు, ఆర్థిక స్థితిగతులు, వయసులు, మహిళలు, పురుషుల సంఖ్య వంటి వివరాలతో నివేదిక రూపొందించినట్టు ఏడీఆర్ తెలంగాణ రాష్ట్ర కో ఆర్డినేటర్లు రాకేశ్ దుబ్బుడు, వై.రాజేంద్రప్రసాద్ తెలిపారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు.

కాంగ్రెస్‌లో ఎక్కువ..

అన్ని ప్రధాన పార్టీలు క్రిమినల్ కేసులు ఉన్న అభ్యర్థులకు టికెట్లు (14% నుంచి 72% వరకు) ఇచ్చాయి. అత్యధికంగా కాంగ్రెస్ పార్టీ నుంచి 85 (72%) మంది, బీజేపీ నుంచి 79 (71%) మంది, అధికార బీఆర్ఎస్ పార్టీ నుంచి 57 (48%) మంది, బీఎస్పీ నుంచి 40 (37%) మంది, సీపీఐ(ఎం) నుంచి 12 (63%) మంది, ఏఐఎంఐఎం నుంచి ఐదుగురు (56%), ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ నుంచి 10 (24%) మంది క్రిమినల్ అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారని ఏడీఆర్, తెలంగాణ ఎలక్షన్ వాచ్ సంస్థలు వెల్లడించాయి.

కోటీశ్వరులూ పెరిగారు

గత అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే ఈసారి ఎన్నికల్లో పోటీలో ఉన్న అభ్యర్థుల్లో కోటీశ్వరుల సంఖ్య పెరిగింది. మొత్తం అభ్యర్థుల్లో 25 శాతం మంది కోటీశ్వరులు కాగా, రూ.10 లక్షల లోపు ఆదాయం ఉన్నవారు 41.48% ఉన్నారు. ఇక ముగ్గురుకు మించి అభ్యర్థులపై క్రిమినల్ కేసులు ఉన్నట్లయితే అటువంటి నియోజకవర్గాలను రెడ్ అలర్ట్ నియోజకవర్గాలుగా గుర్తించారు. 2018లో రెడ్ అలర్ట్ నియోజకవర్గాలు 78 ఉండగా, ప్రస్తుత (2023) ఎన్నికల్లో ఇవి 96కు పెరిగాయి. మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందిన నేపథ్యంలో ఈ ఎన్నికల్లో మహిళలకు ఆయా పార్టీలు ఇచ్చే సీట్ల సంఖ్య పెరిగే అవకాశం ఉంటుందని అంచనా వేసినా అది జరగలేదు. అన్ని పార్టీల్లో కలిపి పోటీలో ఉన్న (2,290 మంది) అభ్యర్థుల్లో 10% మంది మాత్రమే మహిళా అభ్యర్థులు కావడం గమనార్హం.

ప్రధాన పార్టీలదే హవా

ప్రధాన పార్టీలన్నీ సంపన్న అభ్యర్థులకే అత్యధికంగా సీట్లు కేటాయించాయి. 2,290 మంది అభ్యర్థులలో 580 (25%) మంది కోటీశ్వరులు ఉన్నారు. బీఆర్ఎస్‌కు చెందిన 114 (96%) మంది, కాంగ్రెస్‌కు చెందిన 111 (94%) మంది, బీజేపీకి చెందిన 93 (84%)మంది రూ. కోటి కంటే ఎక్కువ ఆస్తులను ప్రకటించారు. 25 మంది తమకు ఒక్క రూపాయి కూడా ఆస్తి లేదని ప్రకటించడం గమనార్హం.

అస్తుల్లో వివేక్ ఫస్ట్

చెన్నూరు కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వివేకానంద్ తన ఆస్తుల విలువ రూ.606+ కోట్లుగా ప్రకటించి తొలి స్థానంలో నిలిచారు. రూ.458+ కోట్లతో మునుగోడు కాంగ్రెస్ అభ్యర్థి రాజగోపాల్‌రెడ్డి, రూ.433 కోట్లతో పాలేరు కాంగ్రెస్ అభ్యర్థి పొంగులేటి రెండు, మూడు స్థానాల్లో ఉన్నారు. సీఎం కేసీఆర్ తన సంపద రూ.58+ కోట్లుగా, ఈటల, కేటీఆర్‌లు రూ.53+ కోట్లుగా, రేవంత్‌రెడ్డి రూ.30+ కోట్లుగా ప్రకటించారు. కాగా, 979 (43%) మంది తమ విద్యార్హతలను 5 నుంచి 12వ తరగతి మధ్య ఉన్నట్లు ప్రకటించగా, 1,143 (50%) మంది డిగ్రీ లేదా అంతకంటే ఎక్కువ విద్యార్హత కలిగి ఉన్నట్లు ప్రకటించారు.

మోదీ, యోగి దేశాన్ని ముక్కలు చేస్తున్నారు

బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్



కౌటాల(సిర్పూర్): ప్రధాని నరేంద్రమోదీ, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ దేశాన్ని మతం పేరుతో ముక్కలు చేస్తున్నారని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. కుమురంభీం జిల్లా కౌటాలలోని బీఎస్పీ కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. తెలంగాణలో ఎక్కడా బీజేపీ గెలిచే పరిస్థితి లేదని, అందుకే ఏకంగా ప్రధాని ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారని ఎద్దేవా చేశారు. కాగజ్‌నగర్‌లో నిర్వహించిన సభలో యోగి చేసిన వ్యాఖ్యలు సరికాదన్నారు. 1984లో ఆ పార్టీకి కేవలం ఇద్దరే ఎంపీలున్న విషయం మరిచిపోవద్దని హితవు పలికారు. ప్రశాంతంగా ఉన్న సిర్పూర్ నియోజకవర్గంలో హిందూ, ముస్లింల మధ్య చిచ్చుపెట్టేలా ప్రసంగించడంపై అసహనం వ్యక్తం చేశారు. బీజేపీ కంటే బీఎస్పీ అభ్యర్థులే ఎక్కువ స్థానాల్లో విజయం సాధిస్తారని జోస్యం చెప్పారు.

మిషన్ ఈ-వేస్ట్‌కు రూ.పదివేల వరకు డిస్కౌంట్

సాక్షి, హైదరాబాద్: ఎలక్ట్రానిక్ వేస్ట్ (ఈ- వేస్ట్) నిర్వహణ, రీసైక్లింగ్‌కు సంబంధించి మిషన్ ఈ-వేస్ట్ పేరుతో సెలెక్ట్ మొబైల్స్ సంస్థ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఆరోగ్యం, పర్యావరణంపై ఎలక్ట్రానిక్ వ్యర్థాలు తీవ్ర ప్రభావం చూపుతున్నాయని, ఈ-వేస్ట్‌ను అరికట్టే చర్యల్లో భాగంగా ఈ వేస్ట్ బిన్‌ను హైదరాబాద్‌లోని రహేజ ఐటీ కారిడార్ మైండ్ స్పేస్‌లో శనివారం ఏర్పాటు చేశారు. ఈ-వేస్ట్‌బిన్‌ను ఐటీ, వాణిజ్య పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్‌రంజన్, సెలెక్ట్ మొబైల్స్ సీఎండీ వై.గురు కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ఎలక్ట్రానిక్ వ్యర్థాలను తీసుకొచ్చి ఈ బిన్‌లో వేసినవారు బిన్‌పై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి ఈ వేస్ట్ వివరాలను పొందుపరచాల్సి ఉంటుందన్నారు. అలా పొందుపరిచినవారికి రూ.10 వేల వరకు డిస్కౌంట్ కూపన్ లభిస్తుందని, ఈ కూపన్‌ను దగ్గరలోని సెలెక్ట్ మొబైల్స్ స్టోర్‌కు వెళ్లి ఏదైనా వస్తువు కొనుగోలుపై రిడీమ్ చేసుకునే అవకాశాన్ని సెలెక్ట్ మొబైల్స్ సంస్థ కల్పిస్తోందని చెప్పారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఆదివారం 26-11-2023

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 12+6+32 పేజీల ఆదివారం అనుబంధం వెల: ₹ 7.00
సంపుటి: 16
సంచిక: 245



'జల ప్రాజెక్టులపై జనం ఎన్నెన్నో ఆశలు పెట్టుకున్నారు. వాళ్ల నమ్మకం వమ్ము కాకుండా పనిచేయాలి'



తుది 'దశ'లో ఆదిత్య ఎల్1
ఆదిత్య ఎల్–1 త్వరలోనే దాని ఎల్–1 పాయింట్‌లోకి చేరుకోనుంది. -4లో



డ్రిల్లింగ్‌కు భారీ అవాంతరం
పూర్తిగా దెబ్బతిన్న ఆగర్ డ్రిల్లింగ్ మెషీన్ బ్లేడ్లు. ఇక మాన్యువల్ డ్రిల్లింగ్ తప్పదేమో! -4లో

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

క్లుప్తంగా...

నా ఇంట్లో మద్యం, నగదు నిల్వలు లేవు

● మాజీ ఐఏఎస్ అధికారి ఏకే గోయల్

సాక్షి, హైదరాబాద్: 'ఎన్నికల సంఘానికి అందిన ఫిర్యాదు మేర కు ఫ్లయింగ్ స్క్వాడ్ శుక్రవారం నా ఇంట్లో తనిఖీ చేసిన విషయం వాస్తవమే'అని మాజీ ఐఏఎస్ అధికారి ఏకే గోయల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటిని తనిఖీ చేయడంతోపాటు సీసీటీవీ ఫుటేజీలను సైతం తీసుకున్నారని, అయితే, మద్యం, నగదు నిల్వలు ఏమీ దొరకలేదని వివరించారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌కు పూర్తిగా సహకరించానని తెలిపారు. కాంగ్రెస్ నేతలు తనపై చేసిన విమర్శలు, ఆరోపణలను గోయల్ ఖండించారు. జూబ్లీహిల్స్, ఖైరతాబాద్ కాంగ్రెస్ అభ్యర్థులు అజారుద్దీన్, విజయారెడ్డి, నేతలు తన నివాసం ముందు నిరసన తెలిపారని, ఇది సరైనది కాదని పేర్కొన్నారు. ఈ ఘటనపై తాను న్యాయపోరాటం చేస్తానని తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్ తమ విధులను శాంతియుతంగా నిర్వహించినందుకు ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

చిత్తశుద్ధి ఉంటే పార్లమెంట్‌లో బీసీబిల్లు పెట్టాలి

● ఆర్.కృష్ణయ్య



కాచిగూడ(హైదరాబాద్): బీసీలపట్ల బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే పార్లమెంట్‌లో బీసీబిల్లు పెట్టాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ అధ్యక్షతన శనివారం కాచిగూడలోని అభినందన్ గ్రాండ్ హోటల్‌లో జరిగిన బీసీ యువజన సంఘం సమావేశంలో ఆర్.కృష్ణయ్య మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో సీఎంగా బీసీ ముఖ్యమంత్రిని చేస్తామని ప్రకటించడం, బీసీలకు ఎక్కువ సీట్లు కేటాయించడం శాశ్వత పరిష్కారంకాదని, పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి, చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించినప్పుడే బీసీలకు న్యాయం జరుగుతుందన్నారు. బీసీబిల్లు పెట్టడానికి బీజేపీకి అవరోధాలు ఏమున్నాయని ఆయన ప్రశ్నించారు. బీసీలకు కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలని, ప్రతి ఏటా 2 లక్షల కోట్ల బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు చట్టసభలలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు పెట్టే అంశంపై విధాన ప్రకటన చేయాలన్నారు.

బర్రెలక్కకు ఓయూ అధ్యాపకులు, విద్యార్థుల మద్దతు

● రూ.లక్ష విరాళం అందజేత



ఓయూలో బర్రెలక్కకు మద్దతుగా వెళుతున్న కంచ ఐలయ్య తదితరులు

ఉస్మానియా యూనివర్సిటీ: కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థి బర్రెలక్క అలియాస్ శిరీషకు ఓయూ అధ్యాపకులు, విద్యార్థులు మద్దతు తెలిపారు. ఈ మేరకు శనివారం ఆర్ట్స్ కాలేజీ నుంచి 15 వాహనాల్లో కొల్లాపూర్‌కు తరలివెళ్లారు. బర్రెలక్కను కలిసి మద్దతు తెలిపి రూ.లక్ష విరాళం అందజేశారు. అనంతరం బర్రెలక్క విజిల్ గుర్తుకు ఓటువేయాలని రోజంతా ప్రచారం చేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ కంచ ఐలయ్య షెఫర్డ్, ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్, కొల్లూరి సత్యం, విద్యార్థి నేతలు నలిగంటి శరత్, జంగిలి దర్శన్, శ్వేత పాల్గొన్నారు.

రూ. వంద కోట్ల విలువైన మద్యం పట్టివేత

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల వేళ.. రాజకీయ పార్టీల మద్యం పంపిణీపైన ఎక్సైజ్ శాఖ ఉక్కుపాదం మోపింది. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు అక్రమంగా తరలిస్తున్న సుమారు రూ.వంద కోట్లకు పైగా విలువైన 36.02 కోట్ల లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ శాఖ తెలిపింది. ఈ నెల 24వ తేదీన ఒక్క రోజే రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన తనిఖీల్లో రూ.1,91,48,544 విలువైన 71,189.70 లీటర్ల మద్యం బాటిళ్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే 30.31 కిలోల ఎన్‌డీపీఎస్ (మాదక ద్రవ్యాలు)ను స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.7,57,750 ఉంటుందని చెప్పుతున్నారు. ఎన్నికల ప్రకటన వెలువడినప్పటి నుంచి ఇప్పటి వరకు 2,47,460 కిలోల ఎన్‌డీపీఎస్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దీని మొత్తం విలువ రూ.10,65,78,642 ఉంటుందని అధికారులు తెలిపారు. ఓటర్లను ప్రభావితం చేసేందుకు రాజకీయ పార్టీలు పెద్ద ఎత్తున మద్యం పంపిణీకి సన్నద్ధమవుతున్న దృష్ట్యా ఆబ్కారీ శాఖ అక్రమ మద్యం పంపిణీపైన నిఘాను కట్టుదిట్టం చేసింది. మరో నాలుగు రోజుల్లో ఎన్నికలు జరగనున్న దృష్ట్యా ఎక్సైజ్ కమిషనర్ జ్యోతి బుద్ధ ప్రకాశ్ శనివారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఇప్పటి వరకు మద్యం నియంత్రణకు చేపట్టిన చర్యలను సమీక్షించారు. అలాగే రానున్న నాలుగైదు రోజులు ఎంతో కీలకం కావడంతో మద్యం అక్రమ సరఫరాను అరికట్టేందుకు ఎక్సైజ్ సూపరింటెండెంట్లు, అసిస్టెంట్ సూపరింటెండ్లు, సీఐలు, ఎస్ఐలు, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాలతో సమావేశమయ్యారు. మరోవైపు రాష్ట్రంలో అక్రమంగా మద్యం పంపిణీపైన ప్రజలు తమకు సమాచారం ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

నివేదన పూలతో ప్రధానికి టీటీడీ జ్ఞాపిక

- టీటీడీ ఆలయాల్లో ఉపయోగించిన పూల పొడులతో శ్రీవారి చిత్రపటం
- 27న దర్శనం తర్వాత ప్రధానమంత్రికి అందించనున్న అధికారులు
- ఈ టెక్నాలజీతో దేశంలోనే ప్రథమ జ్ఞాపికగా రికార్డు

తిరుపతి రూరల్: తిరుమల తిరుపతి దేవస్థానం పరిధిలోని ఆలయాల్లో దేవతామూర్తులకు నివేదించిన పూలతో ప్రధానమంత్రి నరేంద్రమోదీకి టీటీడీ అరుదైన జ్ఞాపికను అందించనుంది. దేవుళ్లకు వినియోగించిన పవిత్రమైన పూలను ప్రత్యేక పద్ధతుల్లో వాటి రంగు, సువాసన చెక్కు చెదరకుండా ఎండబెట్టి ఇప్పటి వరకు శ్రీవారి, పద్మావతి అమ్మవార్ల చిత్రపటాలను తయారు చేస్తున్నారు. అయితే అందివచ్చిన సాంకేతిక పరిజ్ఞానంతో ఈసారి శ్రీవారి చిత్రపటాన్ని తయారు చేస్తున్నారు. దేశంలోనే పూల పొడులతో ఇలా చిత్రపటాలు చేయడం ఇదే ప్రథమం. ఈనెల 26, 27 తేదీల్లో శ్రీవారి సేవకు విచ్చేస్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ఈ సరికొత్త విధానంతో తయారు చేసిన శ్రీవారి చిత్రపటం జ్ఞాపికను అందించాలని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, ఈవో ధర్మారెడ్డి నిర్ణయించారు. ఈ మేరకు తిరుపతిలోని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన వర్సిటీకి చెందిన చీనీ, నిమ్మ పరిశోధన కేంద్రం అధిపతి డాక్టర్ రాచకుంట నాగరాజు ఆధ్వర్యంలో శ్రీవారి పుష్పప్రసాద తయారీ కేంద్రంలో జ్ఞాపిక పనులు నిర్వహించారు. ఈ టెక్నాలజీని ప్రధానమంత్రికి వివరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన వర్సిటీ భాగస్వామ్యంతో టీటీడీ శ్రీవారి పుష్పప్రసాదం పేరుతో ఇప్పటికే పూల రెమ్మలతో శ్రీవారి, అమ్మవారి చిత్రపటాలు, కీ చైన్లు, డాలర్స్‌ను తయారు చేసి భక్తులకు అందిస్తోంది. ప్రారంభించిన ఏడాదిలోనే దాదాపు రూ.1.20 కోట్ల ఉత్పత్తులను భక్తులకు అందించింది.



టీటీడీ ఆగమశాస్త్ర పండితులు అందించిన స్కెచ్ ఆధారంగా శ్రీవారి చిత్రపటాన్ని పూల పొడులతో తయారు చేస్తున్న శ్రీవారి పుష్పప్రసాద సిబ్బంది

ఏపీలో పారిశ్రామికోత్సాహం

రూ.2,400 కోట్ల విలువైన పలు యూనిట్లకు త్వరలో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు



సాక్షి, అమరావతి: ఏపీ ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో రాష్ట్రంలో కొత్త పరిశ్రమలు ఏర్పాటు చేయడంతో పాటు వేగంగా ఉత్పత్తి ప్రారంభించేలా పారిశ్రామికవేత్తలు అడుగులు వేస్తున్నారు. విశాఖ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సులో కుదుర్చుకున్న ఒప్పందాలతో పాటు ఇతర ప్రాజెక్టులను వేగంగా అమల్లోకి తీసుకువచ్చే విధంగా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. ఇందులో భాగంగా త్వరలో సుమారు రూ.2,400 కోట్ల విలువైన వివిధ ప్రాజెక్టులకు సంబంధించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా నిర్మాణ పనులకు భూమి పూజ, వాణిజ్య పరంగా ఉత్పత్తి ప్రారంభించడానికి పరిశ్రమల శాఖ రంగం సిద్ధం చేసింది. పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్, ఇంధన రంగాలకు చెందిన సుమారు 12కు పైగా ప్రాజెక్టులను సిద్ధం చేశారు. వీటి ద్వారా సుమారు 5,000 మందికి ప్రత్యక్షంగా ఉపాధి లభించనుంది. కర్నూలు జిల్లా ఓర్వకల్లు వద్ద రూ.280 కోట్లతో సిగాచీ ఇండస్ట్రీస్ ఫార్మా యూనిట్‌ను ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చింది. అక్కడే రూ.90 కోట్లతో ఆర్‌పీఎస్ ఇండస్ట్రీస్ న్యూట్రాస్యూటికల్స్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయనుంది. ఈ రెండు యూనిట్ల నిర్మాణ పనులను వర్చువల్‌గా ప్రారంభించనున్నట్లు పరిశ్రమల శాఖ అధికారులు వెల్లడించారు. నంద్యాల వద్ద రూ.550 కోట్లతో జేఎస్‌డబ్ల్యూ సిమెంట్ ఏర్పాటు చేసిన సిమెంట్ యూనిట్ వాణిజ్యపరంగా ఉత్పత్తిని ప్రారంభించడానికి సిద్ధమయ్యింది. వీటితో పాటు మరికొన్ని యూనిట్లను ప్రారంభించడానికి పరిశ్రమల శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు.

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

కాల్చి పడేసిన సిగరెట్టే బోట్ల దగ్ధానికి కారణం

● విశాఖ హార్బర్‌లో అగ్నిప్రమాదం కేసును ఛేదించిన పోలీసులు

దొండపర్తి (విశాఖ దక్షిణ): ఇద్దరు వ్యక్తుల బాధ్యతారాహిత్యం, కాల్చి పడేసిన సిగరెట్ విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో భారీ అగ్నిప్రమాదానికి కారణమైంది. 48 బోట్లను దగ్ధం చేసింది. రూ.కోట్ల నష్టాన్ని తెచ్చి పెట్టింది. వారిద్దరూ మద్యం తాగి, సగం కాల్చిన సిగరెట్‌ను బోటులో విసిరేయడం వల్లే అగ్నిప్రమాదం జరిగినట్లు నిర్ధారణైంది. సీసీ కెమెరాల దృశ్యాలు, లోతైన దర్యాప్తు ద్వారా వాసుపల్లి నాని (23) అలియాస్ దొంగ కోళ్ల, అతని మావయ్య అల్లిపల్లి సత్యం అలియాస్ పట్టా ఇందుకు కారణంగా పోలీసులు గుర్తించారు. శనివారం వారిద్దరినీ అరెస్టు చేసినట్లు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ తెలిపారు. ఈ నెల 19న నాని, అతని మావయ్య అల్లిపల్లి సత్యం రాత్రి 8.30కు అల్లిపిల్లి వెంకటేష్‌కు చెందిన 887 నంబరు బోటులోకి వెళ్లారు. లోపల గ్యాస్ స్టవ్‌పై ఎండు చేపలు గ్రిల్ చేసుకొని, మద్యం తాగారు. కొంత సేపటి తరువాత నాని సిగరెట్ సగం కాల్చి పక్కన ఉన్న ముస్నెం హరి సీతారామ్‌కు చెందిన 815 నంబరు బోటులో విసిరాడు. సిగరెట్ అందులోని నైలాన్ వలపై పడడంతో నెమ్మదిగా మంట రాజుకుంది. కొంత సేపటికి భారీగా పొగ, మంట రావడంతో వారిద్దరూ భయంతో అక్కడి నుంచి ఇళ్లకు వెళ్లిపోయారు. మరునాడు వేటకు వెళ్లేందుకు మత్స్యకారులు బోట్లలో సిలిండర్లు, భారీగా డీజిల్ సిద్ధం చేసుకున్నారు. వీటి కారణంగా మంటలు మరింత ఎగసిపడ్డాయి. సిలిండర్లు పేలడం, అదే సమయంలో తీవ్రమైన గాలుల కారణంగా మంటలు పక్కన ఉన్న బోట్లకు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో 30 బోట్లు పూర్తిగా దగ్ధమవగా.. 18 బోట్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. మొత్తంగా రూ.8.9 కోట్ల మేర నష్టం వాటిల్లింది.

ఏపీ గిరిజన విద్యార్థులకు అమెరికా పిలుపు

- రెండు ప్రతిష్టాత్మక కార్యక్రమాలకు ఆహ్వానం
- నానో టెక్నాలజీ సింపోజియం, 'సీఎస్‌డబ్ల్యూ–68'లో పాల్గొనాలని లేఖ

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ గిరిజన విద్యార్థులకు అరుదైన అవకాశం లభించింది. అమెరికాలో వచ్చే ఏడాది మార్చిలో నిర్వహించనున్న రెండు ప్రతిష్టాత్మక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఆహ్వానాలు అందాయి. మార్చి 5వ తేదీన వాషింగ్టన్‌లో నానో టెక్నాలజీ సింపోజియం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రతినిధులుగా ఆంధ్రప్రదేశ్ నుంచి పది మంది గిరిజన విద్యార్థులను తీసుకురావాలని ఐక్యరాజ్య సమితి (యూఎన్‌వో) స్పెషల్ స్టేటస్ మెంబర్ ఉన్నవ షకీన్‌కుమార్‌కు అమెరికాలోని నేషనల్ నానో టెక్నాలజీ కో–ఆర్డినేషన్ ఆఫీస్ డైరెక్టర్ బ్రాండెన్ బ్రో లేఖ రాశారు. నానో టెక్నాలజీపై పరిశోధనలు, ఫలితాలు వంటి అనేక అంశాలపై మాట్లాడేందుకు, అవగాహన పెంచుకునేందుకు ఈ సింపోజియం దోహదపడుతుందని పేర్కొన్నారు. అమెరికన్ ప్రెసిడెంట్ జో బైడెన్ సలహాదారు ఆరతి ప్రభాకర్, మాజీ ప్రెసిడెంట్ బిల్ క్లింటన్ సలహాదారు డాక్టర్ నీల్ లేన్ వంటి ప్రముఖులను గిరిజన విద్యార్థులు కలిసే అవకాశం ఉంటుందని ఆ లేఖలో పేర్కొనడం గమనార్హం.

'సీఎస్‌డబ్ల్యూ–68'కు ఆహ్వానం

వచ్చే ఏడాది మార్చి 11 నుంచి 22 వరకు అమెరికాలో నిర్వహించనున్న కమిషన్ ఆన్ ది స్టేటస్ ఆఫ్ ఉమెన్ 68వ వార్షికోత్సవం (సీఎస్‌డబ్ల్యూ–68)లో పాల్గొనేందుకు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పది మంది గిరిజన విద్యార్థుల బృందాన్ని పంపాలని మరో ఆహ్వానం కూడా అందింది. సీఎస్‌డబ్ల్యూ–68లో భాగంగా నిర్వహించే సమావేశాల్లో అంతర్జాతీయ ప్రమాణాలు, విధానాలు, సవాళ్లు, కార్యాచరణ వంటి అంశాలపై చర్చించనున్నారు.

రేపు బంగాళాఖాతంలో అల్పపీడనం!

సాక్షి, విశాఖపట్నం: దక్షిణ అండమాన్ సముద్రం, దానికి ఆనుకుని ఉన్న ఆగ్నేయ బంగాళాఖాతంలో సోమవారం అల్పపీడనం ఏర్పడనుంది. ఇది ఈ నెల 29వ తేదీ నాటికి పశ్చిమ వాయవ్య దిశగా కదిలి ఆగ్నేయ బంగాళాఖాతంలో వాయుగుండంగా బలపడనుంది. ప్రస్తుత అంచనాల ప్రకారం వాయుగుండం ప్రభావం ఏపీపై అంతగా ఉండబోదని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. రానున్న ఆరు రోజులు కోస్తాంధ్ర, రాయలసీమల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని పేర్కొంది. మరోవైపు వాయుగుండం తీవ్ర వాయుగుండానికే పరిమితమవుతుందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఆగ్నేయ బంగాళాఖాతంలో ప్రస్తుతం చలిగాలుల ప్రభావంతో సముద్ర ఉష్ణోగ్రతలు తక్కువగా ఉన్నాయని, అందువల్ల వాయుగుండం తుపానుగా మారే పరిస్థితులు లేవని చెబుతున్నారు. కానీ, ఒకటి, రెండు ప్రైవేటు వాతావరణ సంస్థలు మాత్రం తుపానుగా బలపడే అవకాశాలు లేకపోలేదని పేర్కొంటున్నాయి.

తాండూరులో ఐటీ దాడులు

- శ్రీ దుర్గ గ్రాండర్ లాడ్జిలో సోదాలు
- కింగ్స్ గ్రూప్ సంస్థకు చెందిన వ్యాపారి గదిలో రూ.24 లక్షలు స్వాధీనం
- అధికారికంగా వెల్లడించని అధికారులు
- ఉదయం నుంచి ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఇంటి గేట్ క్లోజ్
- హైదరాబాద్ పాతబస్తీలోనూ తనిఖీలు



తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఇంటి గేట్ మూసిన దృశ్యం

సాక్షి, హైదరాబాద్/ తాండూరు: అసెంబ్లీ బరిలో నిలిచిన ప్రధాన పార్టీల అభ్యర్థులపై ఐటీ అధికారులు దాడులు చేస్తున్నారంటూ రెండు రోజులుగా తాండూరులో కలకలం రేగింది. తాండూరు పట్టణంలోని దుర్గా గ్రాండర్ లాడ్జిలో నెల రోజులుగా ఉంటున్న కింగ్స్ గ్రూప్ సంస్థకు చెందిన షఫీ రూమ్‌లో శనివారం ఉదయం ఇన్‌కంటాక్స్ అధికారులు సోదాలు చేశారు. అతని వద్ద రూ.24 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారని సమాచారం. అయితే ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించలేదు. మరోవైపు కింగ్స్ గ్రూప్‌నకు చెందిన కార్యాలయాలు, ఇళ్లపై నగరంలో ఏకకాలంలో దాడులు చేశారు. భారీగా నగదు, బంగారం పట్టుబడినట్లు తెలిసింది. తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డికి షఫీ అప్తమిత్రుడు కావడంతో అసెంబ్లీ ఎన్నికల్లో అతన్ని గెలిపించేందుకు ముస్లిం వర్గాలతో కలిసి ప్రయత్నాలు చేస్తున్నారు.

ఎమ్మెల్యే ఇంటి గేట్ క్లోజ్..

తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఇంటి గేట్ ఉదయం 11 గంటల నుంచి ఐటీ అధికారులు మూసేశారు. ఇంట్లోకి బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలను సైతం అనుమతించలేదు. ఇంట్లోకి సామాన్య కార్యకర్తల్లా వచ్చి.. అనంతరం ఐటీ అధికారులమని ఐడీ కార్డులు చూపించారని పార్టీ శ్రేణులు అంటున్నాయి.

కాంగ్రెస్ అభ్యర్థి కార్యాలయాలపై కూడా..

డీసీసీబీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ తాండూరు అభ్యర్థి బుయ్యని మనోహర్‌రెడ్డి కార్యాలయాలపై, పరిశ్రమలపై రెండు రోజులుగా ఐటీ దాడులు జరిగాయని తాండూరులో ప్రచారం జరుగుతోంది. యాలాల మండలంలో మనోహర్‌రెడ్డి సోదరుడికి చెందిన ఆర్‌బీఎల్ పరిశ్రమలోనూ సోదాలు జరిగాయని చెబుతున్నారు. అయితే ఈ విషయాన్ని పరిశ్రమ నిర్వాహకులు కొట్టిపారేశారు. మరోవైపు మనోహర్ రెడ్డికి నగరంలో ఉన్న కార్యాలయాలపై ఐటీ సోదాలు జరిగాయి.

పాతబస్తీలోనూ ఐటీ సోదాలు..

హైదరాబాద్ పాతబస్తీలోని పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఐటీ తనిఖీలు కొనసాగాయి. ఓ పార్టీ అభ్యర్థికి కోట్లాది రూపాయలు అందిస్తున్నారనే సమాచారంతో కోహినూర్ డెవలపర్స్ రియల్ ఎస్టేట్ సంస్థ ఎండీ మాజిద్‌ఖాన్, ఫలక్‌నుమా కింగ్స్ ప్యాలెస్ ఫంక్షన్ హాల్ యజమాని షానవాజ్ ఇల్లు, కార్యాలయాల్లో తనిఖీలు చేసినట్టు సమాచారం. రాజేంద్రనగర్ శాస్త్రిపురం కింగ్స్ కాలనీ, ఫలక్‌నుమా సహా పాతబస్తీలోని ఏడు ప్రాంతాల్లో ఐటీ అధికారుల సోదాలు కొనసాగాయి. పలువురు హవాలా వ్యాపారుల ఇళ్లలోనూ సోదాలు కొనసాగినట్టు తెలిసింది. తాండూరు బీఆర్ఎస్ అభ్యర్థి పైలెట్ రోహిత్‌రెడ్డి బంధువులు, సన్నిహితులపైనా ఐటీ అధికారులు దృష్టి సారించారు. తాండూరు, హైదరాబాద్ మణికొండ పంచవటి కాలనీలోని రోహిత్‌రెడ్డి ఇళ్లలో సోదాలు చేసినట్టు సమాచారం. రోహిత్‌రెడ్డి సోదరుడు రితీష్‌రెడ్డి నివాసంలోనూ తనిఖీలు జరిగినట్టు తెలిసింది.

'మైనారిటీ కాలేజీల మూసివేత అవాస్తవం'

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో 41 మైనారిటీ ఇంజనీరింగ్ కాలేజీలు మూతపడ్డాయని జరుగుతున్న ప్రచారం అవాస్తవమని రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ అన్నారు. తెలంగాణ భవన్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. గతంలోనే 32 కాలేజీలు మూతపడగా, వీటిలో తొమ్మిది పునఃప్రారంభమయ్యాయని తెలిపారు. 2004కు ముందు ఉమ్మడి రాష్ట్రంలో 39 మైనారిటీ కాలేజీలు ఉండగా, కాంగ్రెస్ పాలనలో ఇక్కడ కేవలం రెండు కాలేజీలు కొత్తగా ఏర్పాటయ్యాయని వెల్లడించారు. రాష్ట్ర విభజన తర్వాత ఏపీ, బీహార్, పంజాబ్, మధ్యప్రదేశ్ విద్యార్థులు ఇక్కడి ఇంజనీరింగ్ కాలేజీల్లో చేరకపోవడం, కొందరు డిగ్రీ వైపు మొగ్గు చూపడంతోనే కొన్ని కాలేజీలు మూతపడ్డాయని చెప్పారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం ఊపందుకోవడం కూడా కాలేజీలు మూతపడటానికి ఒక కారణమని పేర్కొన్నారు. చారిత్రక కట్టడాల కూల్చివేతల విషయమై బీఆర్ఎస్ ప్రభుత్వంపై వస్తున్న విమర్శలను హోంమంత్రి కొట్టిపారేశారు. సచివాలయంలోనూ పాతమసీదు స్థానంలో రూ.5 కోట్లతో కొత్తదానిని నిర్మించామన్నారు. నగరంలోని పలుచోట్ల కూడా మసీదుల ధ్వంసం జరిగినట్లు వచ్చిన వార్తలను మంత్రి ఖండించారు.



జనగామ జిల్లా పాలకుర్తిలో జరిగిన కార్నర్‌మీటింగ్‌కు హాజరైన జనం. (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న హరీశ్‌రావు

రిస్క్ వద్దు.. కారు ముద్దు

- కేసీఆర్ చేతిలోనే తెలంగాణ సేఫ్
- కాంగ్రెస్‌ను నమ్మితే కష్టాలే
- రైతులను బిచ్చగాండ్లు అన్న రేవంత్‌కు ఓటుతో బుద్ధి చెప్పాలి
- యాదాద్రి భువనగిరి, ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో రోడ్‌షోలు,
- కార్నర్ మీటింగ్‌లలో మంత్రి హరీశ్

సాక్షి, యాదాద్రి, సాక్షిప్రతినిధి, వరంగల్/సాక్షి మహబూబాబాద్ /నెక్కొండ/బచ్చన్నపేట: కాంగ్రెస్‌కు ఓటు వేస్తే రిస్క్‌లో పడుతామని, సీఎం కేసీఆర్ చేతిలోనే తెలంగాణ సేఫ్‌గా ఉంటుందని మంత్రి తన్నీరు హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. శనివారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గం చీకటిమామిడిలో కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. భువనగిరి పట్టణంలో నిర్వహించిన రోడ్‌షోలో ప్రసంగించారు. 80 సీట్లు గెలిచి బీఆర్ఎస్ మూడో సారి అధికారంలోకి రాబోతుందని జోస్యం చెప్పారు. యాసంగిలో రైతు బంధు అమలు చేసేందుకు ఎన్నికల కమిషన్ అనుమతి ఇవ్వగానే కాంగ్రెస్ గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయని హరీశ్ అన్నారు. బ్యాంకులకు సెలవులు పూర్తికాగానే మంగళవారం రైతుల ఖాతాల్లో రైతు బంధు పడుతుందని చెప్పారు. కాంగ్రెస్‌కు చాన్స్ ఇస్తే ఆరు గ్యారంటీలకు బదులు, వాళ్లకు వాళ్లు తన్నుకుని ఆరుగురు ముఖ్యమంత్రులు అవుతారని ఎద్దేవా చేశారు. ఎన్నో మంచి పనులు చేసిన కేసీఆర్‌ను సాదుకుందామా, రాజకీయంగా సంపుకుందామో ప్రజలు తేల్చుకోవాలన్నారు. కార్యక్రమాల్లో మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, భువనగిరి, ఆలేరు బీఆర్ఎస్ అభ్యర్థులు పైళ్ల శేఖర్‌రెడ్డి, గొంగిడి సునీతా పాల్గొన్నారు.

కర్ణాటకలో కరెంటు బంద్ అయింది.

ఆరు గ్యారంటీలని కాంగ్రెస్ నేతలు ఊర్లపొంటి తిరుగుతున్నారు.. ఆరునెలల క్రితం కర్ణాటకకు పోయి ఐదు గ్యారంటీలిస్తామని అక్కడ రాహుల్ గాంధీ, ప్రియాంకగాంధీ చెప్పారు. నమ్మి ఓటేస్తే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అక్కడ ఉన్న కరెంట్ బందయ్యింది. ఐదు గ్యారంటీలను గాలికొదిలేసింది... హామీలిచ్చిన ప్రియాంక, రాహుల్‌లు ఆ రాష్ట్రానికి వెళ్లడం లేదు. అలాంటివాళ్ల తెలంగాణలో అధికారం ఇస్తే ఆరు గ్యారంటీలు అమలు చేస్తామంటే నమ్మాలా? 12 సార్లు రైతుబంధు ఇచ్చిన కేసీఆర్ కావాలా లేక మాట తప్పే కాంగ్రెస్ కావాలో ఆలోచించుకోవాలి'అని హరీశ్‌రావు అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని మహబూబాబాద్, నెక్కొండ, పాలకుర్తి, బచ్చన్నపేటలలో ఆయా నియోజకవర్గాల అభ్యర్థులు శంకర్‌నాయక్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, పల్లా రాజేశ్వర్‌రెడ్డిలను గెలిపించాలని కోరుతూ శనివారం రోడ్‌షోలు, కార్నర్‌మీటింగ్‌లలో ఆయన ప్రసంగించారు. పాలిచ్చే గేదెవంటి బీఆర్ఎస్ పార్టీకి కాకుండా పనిచేయని దున్నపోతు వంటి కాంగ్రెస్‌కు గడ్డి వేస్తే ఫలితం ఉండదు'అని అన్నారు.

ప్రాజెక్టులు రేవంత్ నెత్తిపై కట్టాలా

మూడు గంటల కరెంట్ చాలని చెప్పిన రేవంత్ ఇప్పుడు ప్రాజెక్టులు ఇసుకపై కట్టారని అనడం అయన అవగాహనా రాహిత్యానికి నిదర్శమని హరీశ్ ధ్వజమెత్తారు. నదులపై ప్రాజెక్టులు కడుతున్నప్పుడు ఇసుకపై కాకుండా రేవంత్ నెత్తిపై కట్టాలా అని అన్నారు. రైతులకు పెట్టుబడి సాయం రైతుబంధు అందిస్తుంటే.. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు బిచ్చం వేస్తుందని, రైతులను బిచ్చగాళ్లుగా మాట్లాడిన రేవంత్‌కు, కాంగ్రెస్ పార్టీకి ఓటు ద్వారా బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు. సోమవారం నుంచి రైతు ఖాతాల్లో డబ్బులు పడతాయని హరీశ్ చెప్పారు. డబ్బులు పడిన మెస్సేజీ శబ్దం టింగ్. టింగ్ మంటూ వస్తుందన్నారు. ఆ శబ్దం విన్న రైతులు ఆదే ఊపుతో 30వ తేదీ పోలింగ్ బూత్ వద్దకు వెళ్లి కారు గుర్తుపై ఓటు వేయాలని కోరారు. అనుమతి ఇస్తే రుణమాఫీ కూడా పూర్తి చేస్తామన్నారు.

ఒకే రోజు.. ఆరు జిల్లాలు.. ఏడు సభలు

హరీశ్‌రావు శనివారం ఒక్కరోజు ఆరు జిల్లాల్లో ఏడు నియోజకవర్గాల్లో రోడ్‌షోలు, స్ట్రీట్ కార్నర్ సమావేశాలు నిర్వహించి రికార్డు సృష్టించారు. ఒక్కరోజే మహబూబాబాద్, వరంగల్, పాలకుర్తి, జనగామ, సిద్దిపేట, భువనగిరి జిల్లాల్లో హెలికాప్టర్ ద్వారా సుడిగాలి పర్యటన చేశారు. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం హెలికాప్టర్‌లోనే చేశారు.

కర్ణాటకకు రండి... మేమేం చేస్తున్నామో చూపెడతాం

- అక్కడ పాలన సెక్రటేరియట్ నుంచి జరిగితే తెలంగాణలో ఫామ్‌హౌస్ నుంచి జరుగుతోంది
- మీడియాతో ముఖాముఖిలో కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్



సాక్షి, హైదరాబాద్: కర్ణాటకలో పాలన సెక్రటేరియట్ నుంచి జరుగుతుంటే తెలంగాణలో ఫామ్‌హౌస్ నుంచి జరుగుతోందని కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ వ్యాఖ్యానించారు. ''కేసీఆర్, కేటీఆర్ లేదా మంత్రులెవరైనా ఓ అరగంట కర్ణాటకకు వస్తే అక్కడ మేం ఏం చేస్తున్నామో చూపిస్తాం''అని స్పష్టం చేశారు. శనివారం నాడిక్కడ సీడబ్ల్యూసీ సభ్యుడు అజయ్‌కుమార్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్‌లతో కలిసి ఆయన విలేకరులతో ముఖాముఖి మాట్లాడారు. 'కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ తరఫున 136 మంది ఎమ్మెల్యేలు గెలిచిన తర్వాత కూడా బీజేపీ ఏదో చేద్దామనుకుంది. చాలా ప్రయత్నించింది. కానీ ఏం చేయలేకపోయింది. తెలంగాణలో కేసీఆర్ కూడా ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడంలో సిద్ధహస్తుడు. ఆయనకు అదో నిరంతర ప్రక్రియ. కర్ణాటకలో బీజేపీ చేసిన ప్రయత్నాన్ని ఇక్కడ చేయాలనుకుంటే అడ్డుకోవడానికి మేమున్నాం. అలాంటిది జరగకుండా చూసుకుంటాం.'అని పేర్కొన్నారు. తెలంగాణ ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపరిచేందుకు డబ్బు సంచులతో రాలేదని, తెలంగాణపై ప్రేమతో తాను ఇక్కడకు వచ్చానని, ఆయన వెల్లడించారు. ఇంకా డి.కె.శివకుమార్ ఏం చెప్పారంటే...

బెంగళూరు, హైదరాబాద్‌లు కవల పిల్లల్లాంటి నగరాలు

ఈ ఏడాది డిసెంబర్ 9న తెలంగాణ రాష్ట్ర కొత్త మంత్రివర్గ సమావేశం జరుగుతుంది. ఆ సమావేశంలోనే ఆరు గ్యారంటీలపై నిర్ణయం తీసుకుని అమలు చేస్తారు. కర్ణాటక, తెలంగాణకు చాలా తేడా ఉంటుంది. బెంగళూరు, హైదరాబాద్‌లను పోల్చవద్దు. అవి రెండూ దేశానికి కవల పిల్లల్లాంటి నగరాలు. ఇక్కడ అవినీతిని నియంత్రించగలిగితే అన్ని పథకాలనూ సజావుగా అమలు చేయొచ్చు. కర్ణాటకలో ఐదు గ్యారంటీలను మేం అమలు చేయడం లేదనడంలో వాస్తవం లేదు. నేను చెప్పేదాంట్లో ఏమాత్రం తప్పు ఉన్నా ఏ శిక్షకైనా సిద్ధంగా ఉంటా? అబద్ధాలు చెపుతున్న కేసీఆర్ సిద్ధమా?

ఎన్ని గెలుస్తామో.. త్వరలోనే చెప్తా


తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం మాత్రం ఖాయం. కానీ ఎన్ని స్థానాలు గెలుస్తుందనే విషయంపై ఇంకా హోంవర్క్ పూర్తి కాలేదు.. కర్ణాటకలో 136 గెలుస్తామని ముందే చెప్పా. మొదట 144 అన్నాను. కానీ ఆ తర్వాత కొన్ని చోట్ల పరిస్థితులు మారడంతో 136 అని చెప్పా. కచ్చితంగా అన్నే గెలిచాం. అంత కచ్చితంగా ఎలా చెప్పావని సోనియాగాంధీ కూడా నన్ను అడిగారు. తెలంగాణలో ఎన్ని గెలుస్తామన్నది కూడా త్వరలోనే చెప్తా.'అని డి.కె.శివకుమార్ అన్నారు.

రైతులకు సరిపడా విద్యుత్..

కర్ణాటక రైతులకు తగినంత విద్యుత్ ఇస్తున్నాం. కొందరికి 24 గంటలు, మరికొందరికి 5,6,7 గంటలు ఇస్తున్నాం. అది సరిపోతుంది. అయితే, ఎన్ని గంటలు విద్యుత్ ఇచ్చినా ఆ విద్యుత్ ఇస్తున్న పంపిణీ సంస్థలకు తెలంగాణ మాదిరిగా మేం రూపాయి కూడా బకాయి లేము. తెలంగాణ రాష్ట్రం రూ.16వేల కోట్ల విద్యుత్ బకాయిలు కట్టాలి. ఈ విషయాన్ని మేం చెప్పలేదు. కేంద్ర విద్యుత్ మంత్రి చెప్పారు. కేసీఆర్ అబద్ధాల కోరు. ఆయన మాటలు ఎవరూ నమ్మరు. కర్ణాటకకు చెందిన వేయి మంది కాదు లక్ష మంది నెంబర్లు ఇస్తాం. కావాలంటే మీడియా చెక్ చేసుకోవచ్చు.

ఎవరైనా సీఎం కావచ్చు...

కాంగ్రెస్‌లో పార్టీలో ఎమ్మెల్యేగా గెలిచిన ఎవరైనా ముఖ్యమంత్రి అయ్యే అవకాశం ఉంది. అయితే కాంగ్రెస్ పార్టీ సమష్టి నాయకత్వాన్ని నమ్ముతుంది. సీఎంను నిర్ణయించేందుకు ఒక పద్ధతి ఉంటుంది. మా పార్టీలో పవర్‌సెంటర్లు ఉండవు. హైకమాండ్ ఏం చెబితే అదే జరుగుతుంది. తెలంగాణలోనూ అదే జరుగుతుంది.


'గ్రామాల్లో సంపద పెరగాలి. పెరిగిన సంపద గ్రామీణ ప్రజలకే చెందాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 12+6+32 పేజీల ఆదివారం అనుబంధం · వెల: ₹ 7.00

సంపుటి: 16 · సంచిక: 245

ఆదివారం · 26-11-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'తేజస్'లో మోదీ

ప్రధాని నరేంద్ర మోదీ శనివారం బెంగళూరులో దేశీయంగా తయారైన తేలికపాటి యుద్ధ విమానం 'తేజస్'లో ప్రయాణించారు. 10 నిమిషాల పాటు చక్కర్లు కొట్టారు.

- వివరాలు 4లో

రాష్ట్రంలో బీజేపీ గాలి

అధికారం ఇస్తే హామీ ఇచ్చినట్టే బీసీని సీఎం చేస్తాం: మోదీ

- సామాజిక న్యాయం బీజేపీతోనే సాధ్యం... బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండూ ఒక్కటే
- కాంగ్రెస్‌కు ఓటేస్తే బీఆర్ఎస్ కార్బన్ సర్కార్‌కు ఓటేసినట్లే
- మీ వెంట నేను ఉంటా.. రాష్ట్ర అభివృద్ధికి సహకరిస్తానన్న ప్రధాని
- రాష్ట్రంలో బీజేపీకి అధికారం ఇవ్వాలని విజ్ఞప్తి
- కామారెడ్డి, మహేశ్వరం సకల జనుల సంకల్ప సభల్లో ప్రసంగం

సాక్షి, కామారెడ్డి/సాక్షి, రంగారెడ్డి జిల్లా: తెలంగాణ అంతటా బీజేపీ గాలి వీస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. రాష్ట్ర ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, బీఆర్ఎస్ నుంచి విముక్తి కోసం బీజేపీ వైపు ఆశగా చూస్తున్నారని అన్నారు. ఏడు దశాబ్దాల కాంగ్రెస్ నుంచి కూడా ప్రజలు విముక్తి కోరుకుంటున్నారని పేర్కొన్నారు. కామారెడ్డిలో సీఎం కేసీఆర్, పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డిలను ఓడించి వారికి గుణపాఠం చెప్పాలని కోరారు. తెలంగాణకు బీసీని సీఎం చేస్తామని చెబుతున్నామని, అధికారం అప్పగిస్తే చెప్పినట్లు బీసీని సీఎం చేసి తీరుతామని స్పష్టం చేశారు. బీసీనైన తనకు ప్రధానమంత్రి పదవి అవకాశం ఇచ్చింది బీజేపీయేనన్నారు. దళితుణ్ణి తెలంగాణ రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా చేస్తానన్న కేసీఆర్.. మోసం చేసి, సీఎం కుర్చీని కబ్జా చేశారన్నారు. సామాజిక న్యాయం బీజేపీతోనే సాధ్యమని చెప్పారు. శనివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో, రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం తుక్కుగూడలో నిర్వహించిన సకల జనుల సంకల్ప సభల్లో ఆయన మాట్లాడారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు మోసగాళ్లు

''కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు మోసగాళ్లు, అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారు. ఒకరినొకరు తిట్టుకుంటున్నారు. లోపల మాత్రం కలిసే ఉంటున్నారు. ఆ రెండూ ఒక్కటే. కుటుంబ, అవినీతి పార్టీలు. కాంగ్రెస్‌కు ఓటేస్తే బీఆర్ఎస్ కార్బన్ సర్కార్‌కు ఓటేసినట్లే. కేసీఆర్ చరిత్ర కాంగ్రెస్‌తోనే ప్రారంభమయ్యింది. 2004లో కేంద్ర మంత్రిగా ఎన్నికయ్యాడు. తెలంగాణ ఏర్పాటు తర్వాత కూడా అదే పార్టీ అధినేత వద్దకు వెళ్లాడు. కాంగ్రెస్‌లో గెలుపొందిన అభ్యర్థులు బీఆర్ఎస్‌లో మంత్రులయ్యారు. ఆ రెండు పార్టీలు ఒక్కటేనని చెప్పడానికి ఇదే నిదర్శనం. కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడితే బీఆర్ఎస్ మద్దతు తెలిపింది. బీజేపీ ఓ గిరిజన మహిళను రాష్ట్రపతిగా ఎన్నుకుంటే

మిగతా 2వ పేజీలో ▶


రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలో నిర్వహించిన సకల జనుల సంకల్ప సభలో అభివాదం చేస్తున్న మోదీ

కాంగ్రెస్‌కు ఓటేస్తే.. కేసీఆర్‌కు వేసినట్టే!



- మళ్లీ బీఆర్ఎస్‌కు అధికారం అప్పగించినట్టే..: అమిత్ షా
- బీజేపీకి ఓటేసి నిర్ణయాత్మక తీర్పు ఇవ్వాలని విజ్ఞప్తి

3లో

మమ్మల్ని ఎవరు గిల్లినా ఊరుకోం



- ఆరేళ్లుగా యూపీలో కర్ఫ్యూ లేదు: యోగి ఆదిత్యనాథ్
- బీజేపీని గెలిపిస్తే ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేస్తామని వెల్లడి

3లో

రాష్ట్రంలో బీజేపీకి పట్టం కట్టండి



- ఆ రెండు పార్టీలను ఇంటికి పంపండి: జేపీ నడ్డా
- గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ మోసానికి పాల్పడుతోందని ఫైర్

3లో

ఒక్కో ఓటునూ ఒడిసిపట్టండి



పోలింగ్ ముగిసేదాకా అప్రమత్తంగా ఉండండి

బీఆర్ఎస్ కీలక నేతలతో టెలికాన్ఫరెన్స్‌లో సీఎం కేసీఆర్

- గెలుపోటములపై మౌఖిక ప్రచారాలతో గందరగోళానికి గురికావద్దు
- తాజా సర్వేలన్నీ బీఆర్ఎస్‌కే అనుకూలం
- కేడర్ అంతా సర్వశక్తులూ ఒడ్డాలి
- ప్రతి గడపకు వెళ్లి బీఆర్ఎస్‌కు ఓటేసేలా ప్రయత్నించాలని సూచన
- క్షేత్రస్థాయిలో ప్రచారం, వ్యూహాల సమీక్ష, దిశానిర్దేశం
- ప్రతిపక్షాల జాతీయ నేతల ప్రచార ప్రభావంపై ఆరా

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల ప్రచారంతోపాటు పోలింగ్ ముగిసేదాకా పార్టీ యంత్రాంగమంతా అప్రమత్తంగా ఉండాలని.. క్షేత్రస్థాయిలో ఒక్కో ఓటును ఒడిసిపట్టాలని బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలకు ఆ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు స్పష్టం చేశారు. అన్ని స్థాయిల నేతలు, కార్యకర్తలు సర్వశక్తులూ ఒడ్డి పనిచేయాలని ఆదేశించారు. పార్టీ కేడర్ ప్రతీ గడపకూ వెళ్లాలని, బీఆర్ఎస్‌కే ఓటేసేలా ప్రయత్నం చేయాలని సూచించారు. ఈ నెల 28న ఎన్నికల ప్రచారం ముగుస్తున్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలో పార్టీ

మిగతా 2వ పేజీలో ▶

ఢిల్లీ లీడర్లకు కేసీఆర్ భయం



- హస్తినలోనూ తెలంగాణ జెండా పాతుతడని మోదీ, రాహుల్‌కు గుబులు
- అందుకే కామారెడ్డిలో కేసీఆర్‌ను ఓడించేందుకు కలసి కుట్రలు... సుస్థిరత కోసం బీఆర్ఎస్‌ను గెలిపించండి: కేటీఆర్

రాహుల్ రాజకీయ నిరుద్యోగి: కేటీఆర్

- యువతను రెచ్చగొట్టి చిచ్చుబెట్టాలని చూస్తున్నడు
- కాంగ్రెస్ పాలనలో ఇచ్చిన ఉద్యోగాలు 10వేలు మాత్రమే... హైదరాబాద్‌ను డ్రై జోన్‌గా మార్చింది కాంగ్రెస్ పార్టీయే

- వివరాలు 2లో



రాజస్తాన్‌లో 75% పోలింగ్

చెదురుమదురు ఘటనలు మినహా ఎన్నికలు ప్రశాంతం

- ఫతేపూర్‌లో రెండు వర్గాల ఘర్షణ.. జవానుకు గాయాలు
- దీగ్ జిల్లా కమన్ గ్రామంలో రాళ్లురువ్విన గుంపు.. 12 రౌండ్ల కాల్పులు
- వచ్చే నెల 3న ఓట్ల లెక్కింపు

4లో

ఆ మూడు పార్టీలూ ఒక్కటే

కాంగ్రెస్‌ను ఓడించేందుకు ఏకమయ్యాయి

బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎంను తరిమికొట్టాలి • ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పిలుపు



ఆమనగల్లు, బన్సీలాల్‌పేట్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని ఓడించేందుకు బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం ఒక్కటయ్యాయని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. తెలంగాణ ప్రజల ఆశలు, ఆశయాలు నెరవేరాలంటే ఆ మూడు పార్టీలను ప్రజలు తరిమికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఆమనగల్లు పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో శనివారం కల్వకుర్తి కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డికి మద్దతుగా నిర్వహించిన విజయభేరి సభకు పీసీసీ అధ్యక్షుడు ఎనుముల రేవంత్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణిక్‌రావు ఠాక్రే, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు

మిగతా 8వ పేజీలో ▶

బీఆర్ఎస్-కాంగ్రెస్ మధ్యే పోటీ



- బీజేపీ, ఎంఐఎం తెర వెనుక బీఆర్ఎస్‌కు సాయం చేస్తున్నాయి
- తెలంగాణతో మాది కుటుంబ బంధం.. ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి వస్తాం: రాహుల్

8లో

కాంగ్రెస్‌తోనే ప్రజల రాజ్యం



- బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం పార్టీలు ఒక్కటే: ప్రియాంకా గాంధీ
- మార్పు కావాలంటే కాంగ్రెస్ రావాలి... అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీల అమలు

8లో

క్లుప్తంగా...

అటు సీఎం.. ఇటు పీఎం..

- నిర్మల్ జిల్లాలో ఒకేరోజు కేసీఆర్, మోదీ పర్యటన
- జిల్లా కేంద్రంలో మోదీ.. ఖానాపూర్‌లో కేసీఆర్ సభలు

నిర్మల్: అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం కేసీఆర్ ఆదివారం నిర్మల్ జిల్లాలో పర్యటించనున్నారు. నిర్మల్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తరఫున జిల్లా కేంద్రంలో సాయంత్రం 3 గంటలకు నిర్వహించనున్న బహిరంగసభలో మోదీ పాల్గొననున్నారు. ఖానాపూర్ నియోజకవర్గ కేంద్రానికి మధ్యాహ్నం 12 గంటలకు కేసీఆర్ రానున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి జాన్సన్‌నాయక్ తరఫున నిర్వహించే ప్రజాఆశీర్వాద సభలో ఆయన ప్రసంగించనున్నారు. ఒకేరోజు సీఎం, పీఎం సభలు ఉండటంతో జిల్లా పోలీసులు బందోబస్తు ఏర్పాట్లలో తలమునకలయ్యారు.

అమిత్ షా అబద్ధాల షా..

ఎమ్మెల్సీ కవిత



కోరుట్ల: అమిత్ షా అబద్ధాల షా అని, ఆయనవన్నీ మోసపు మాటలేనని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. శనివారం జగిత్యాల జిల్లా కోరుట్లలో జరిగిన నంది, కార్గిల్, కోర్టు, గాంధీరోడ్, ఝాన్సీరోడ్, కల్లూర్‌రోడ్ కార్నర్ మీటింగ్‌ల్లో ఆమె మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటుకు అప్పగిస్తూ ప్రజాధనాన్ని దోచుకుంటోందని ఆరోపించారు. తెలంగాణలో అభివృద్ధిని చూసి ఓర్వలేక బీజేపీ నేతలు అబద్ధాలు చెప్పి ప్రజలను తప్పుదోవ పట్టించాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. తెలంగాణ ప్రజలు అమాయకులు కాదని, ఢిల్లీ గద్దలను ఎదిరించి రాష్ట్రాన్ని సాధించుకున్నామని ఆమె గుర్తుచేశారు. బీడీ కార్మికులకు జీవనభృతి అందించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనన్నారు. ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందిస్తూ ఇంటి పార్టీగా బీఆర్ఎస్‌కు గుర్తింపు ఉందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికార దాహంతో ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను మభ్యపెడుతోందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఊసేలేని పథకాలను ఇక్కడ అమలు చేస్తామని తప్పుడు వాగ్దానాలు చేయడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, ఎమ్మెల్సీ రమణ, కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య, జిల్లా రైతుబంధు అధ్యక్షుడు చీటి వెంకట్రావ్ తదితరులు పాల్గొన్నారు.



తుక్కుగూడలో శనివారం జరిగిన సకల జనుల సంకల్ప సభకు హాజరైన ప్రజలు

రాష్ట్రంలో బీజేపీ గాలి

▶ మొదటి పేజీ తరువాయి

బీఆర్ఎస్ ఆమెను ఓడించేందుకు కుట్ర పన్నింది. కాంగ్రెస్ వేల కోట్ల అవినీతికి పాల్పడింది. కేసీఆర్ కూడా అదే స్థాయిలో అవినీతికి పాల్పడ్డారు. ఇరిగేషన్ స్కీంను...ఇరిగేషన్ స్కాంగా మార్చారు. దళిత బంధును..ఎమ్మెల్యే బంధుగా మార్చేశారు. ఆ రెండు పార్టీలు ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు వ్యతిరేకులు. బీసీ సమాజాన్ని ఛిన్నాభిన్నం చేస్తున్నాయి..' అని మోదీ ఆరోపించారు.

మీ పిల్లల భవిష్యత్తుకు పని చేసేది బీజేపీయే

'హఠాత్తుగా టీఆర్ఎస్ బీఆర్ఎస్‌గా మారుతుంది. కాంగ్రెస్ ఆధ్వర్యంలోని యూపీఏ ఇండియా కూటమి అవుతుంది. పేర్లు మారినంత మాత్రాన వాళ్ల బుద్ధి మారదు. అవినీతిలో మునిగి తేలుతారు. వాళ్లు వాళ్ల పిల్లల కోసమే పనిచేస్తారు. బీజేపీ మాత్రమే మీ పిల్లల భవిష్యత్తు కోసం పనిచేస్తుంది. తెలంగాణలో పేదలు, రైతులు, మహిళలు, యువత, దళితులు, ఆదివాసీల ఆకాంక్షలను ప్రతిబింబించే విధంగా మేనిఫెస్టో రూపొందించింది. బీజేపీ చెప్పింది చేస్తుందన్న నమ్మకం ప్రజల్లో బలంగా ఉంది. 370 ఆర్టికల్, ట్రిపుల్ తలాక్ రద్దు, చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు, రైతులకు పంట ఉత్పత్తుల ధరల పెంపు, రామ మందిర నిర్మాణం వంటి హామీలన్నింటినీ నెరవేర్చాం. మాదిగ సమాజానికి న్యాయం చేయడానికి ముందుకు వచ్చాం. ఇప్పటికే కమిటీ ఏర్పాటు చేయడంతో పాటు సుప్రీంకోర్టులో కేసు విషయంపై ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించి సమీక్షించాం. గతంలో దేశం మొత్తం మీద బీజేపీకి ఇద్దరే ఎంపీలు ఉన్నపుడు అందులో ఒకరు తెలంగాణ నుంచే. అందుకే తెలంగాణ గడ్డ మీద బీజేపీకి ఎంతో అభిమానం..' అని ప్రధాని చెప్పారు.

ఓటమి భయంతోనే రెండుచోట్లా పోటీ

'తెలంగాణ యువత ఎక్కువగా ఉన్న రాష్ట్రం. అయితే ఇక్కడి ప్రభుత్వం యువతకు వ్యతిరేకంగా పనిచేస్తోంది. టీఎస్‌పీఎస్సీ ద్వారా ఉద్యోగ నియామకాల విషయంలో అన్యాయం చేసింది. విద్యారంగాన్ని విస్మరించింది. కాంగ్రెస్ వల్ల తెలంగాణలో వేలాది మంది యువత ప్రాణాలు కోల్పోయారు. ఓటమి భయంతోనే సీఎం కేసీఆర్, రేవంత్‌రెడ్డిలు రెండుచోట్ల పోటీ చేస్తున్నారు. వాళ్లిద్దరినీ ఓడించే అవకాశం కామారెడ్డి ప్రజలకు వచ్చింది. డిసెంబర్ 3న కేసీఆర్‌ను గద్దె దింపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు..' అని మోదీ అన్నారు.

మీ కల నెరవేర్చేది మోదీ సంకల్పమే..

'నేను కాశీ నగరానికి నాయకుడిని. మహేశ్వరం శివగంగా మందిర్‌కు ప్రసిద్ధి. ఈ గడ్డ మీద అడుగు పెట్టడం నా అదృష్టంగా భావిస్తున్నా. తెలంగాణ యువకుల్లారా నా మాట రాసి పెట్టుకోండి. రైతులు, యువకులు, కార్మికులు, దళితులు, ఆదివాసీలు, ప్రతి ఒక్కరికీ గ్యారంటీ ఇస్తున్నా. మీ కలలను నెరవేర్చేది మోదీ సంకల్పమే. చిన్నపాటి వర్షానికే బస్తీలు నీట మునుగుతున్నాయి. తాగునీరు లేక జనం అల్లాడుతున్నారు. బీజేపీకి సేవ చేసే అవకాశం ఇస్తే ఈ సమస్యలన్నింటికీ పరిష్కారం చూపిస్తా. తెలంగాణలో నిజాం సుల్తాన్‌లకు చోటు లేదు..' అని ప్రధాని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల వెంట తానుంటానని, తెలంగాణ అభివృద్ధికి సహకరిస్తానని, రాష్ట్రంలో బీజేపీకి అధికారం ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో జనసేన, బీజేపీ కలిసి పోటీ చేస్తున్నాయని, తెలంగాణలో మార్పు కోసం, అవినీతి పాలనను గద్దె దించేందుకు తెలంగాణ ప్రజానీకం కంకణం కట్టుకొని ముందుకు పోతోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చెప్పారు. బీజేపీ ఓబీసీ జాతీయ అధ్యక్షుడు జి లక్ష్మణ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి ప్రేమేందర్‌రెడ్డి, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, జుక్కల్, కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, నారాయణఖేడ్, మహేశ్వరం, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, ఇబ్రహీంపట్నం, షాద్‌నగర్ అభ్యర్థులు అరుణతార, కాటిపల్లి వెంకట రమణారెడ్డి, వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి, యెండల లక్ష్మీనారాయణ, సంగప్ప, అందెల శ్రీరాములు యాదవ్, రవికుమార్ యాదవ్, తోకల శ్రీనివాస్ రెడ్డి, నోముల దయానంద్ గౌడ్, అందె బాబయ్య తదితరులు పాల్గొన్నారు.

40 లక్షల మంది రైతులకు లబ్ధి

'బీఆర్ఎస్ పెద్దలకు డబ్బులు అవసరం ఉంటే సాగునీటి ప్రాజెక్టు అంటూ కొత్త పేరుతో అంచనాలు పెంచేసి దండుకుంటారు. తెలంగాణ అభివృద్ధి కోసం ఖర్చు చేయాల్సిన డబ్బులతో జేబులు నింపుకుంటారు. కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ సమ్మాన్ నిధితో నేరుగా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తోంది. తెలంగాణలో 40 లక్షల మందికి ప్రయోజనం కలుగుతుంది. రూ.2,800 నుంచి రూ.3 వేలకు ఇవ్వాల్సిన యూరియా బస్తాను బీజేపీ ప్రభుత్వం రైతులకు కేవలం రూ.3 వందలకే ఇస్తోంది. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసే విషయంలో కేంద్రం ఎవరినీ ఇబ్బంది పెట్టలేదు. తెలంగాణలో వానాకాలంలో అదనంగా 20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసింది. చెరకు పంటను ప్రోత్సహించేందుకు కృషి చేస్తోంది. హైదరాబాద్ చుట్టూ రీజినల్ రింగ్ రోడ్డును తీసుకొస్తున్నాం. బీజేపీ పేదలకు మరో ఐదేళ్లు ఉచితంగా బియ్యం అందిస్తుంది. వేగవంతమైన ప్రయాణానికి వందేభారత్ రైళ్లను ప్రారంభించాం. నారీ స్వశక్తి ద్వారా కోట్లాది మంది మహిళలకు న్యాయం చేస్తున్నాం..' అని తెలిపారు.



కామారెడ్డిలో శనివారం జరిగిన సకల జనుల సంకల్ప సభకు హాజరైన జనం..

రాజకీయ నిరుద్యోగి రాహుల్: కేటీఆర్

- యువతను రెచ్చగొట్టి చిచ్చుపెట్టాలని చూస్తున్నడు
- కాంగ్రెస్ పాలనలో ఇచ్చిన ఉద్యోగాలు 10వేలు మాత్రమే
- హైదరాబాద్‌ను ఫ్రీ జోన్‌గా మార్చింది కాంగ్రెస్ పార్టీయే

సాక్షి, హైదరాబాద్: రాజకీయ నిరుద్యోగంతో బాధపడుతున్న కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ యువతను రెచ్చగొట్టి చిచ్చు పెట్టాలని చూస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీ రామారావు ఆరోపించారు. ఉద్యోగాల కల్పన విషయంలో తాము వేసే ప్రశ్నలకు సమాధానం చెప్పే దమ్ము రాహుల్‌కి ఉందా అని సవాల్ చేశారు. ఈ మేరకు శనివారం కేటీ రామారావు ఒక ప్రకటన విడుదల చేశారు. దేశంలో గడిచిన పదేళ్లలో తెలంగాణ కంటే ఎక్కువ ఉద్యోగాలు కల్పించిన రాష్ట్రం ఏదైనా ఉంటే చూపించాలని డిమాండ్ చేశారు. తొమ్మిదిన్నరేండ్లలో 2.32 లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇచ్చి, 1.60లక్షల ఉద్యోగ నియామకాలు పూర్తి చేశామని, కాంగ్రెస్ పాలనలో 2004 -14 నడుమ తెలంగాణలో భర్తీ చేసిన ఉద్యోగాలు కేవలం 10,116 మాత్రమేనని పేర్కొన్నారు. జీవితంలో ఏనాడూ ఉద్యమాలు, ఉద్యోగాలు చేయని రాహుల్ గాంధీకి యువత ఆకాంక్షలు తెలియవని, ఉద్యోగార్థుల ఇబ్బందులు ఆయనకు అర్థం కావని నిందించారు. 95శాతం ఉద్యోగాలు స్థానికులకేనంటూ కొత్త జోనల్ వ్యవస్థను తాము నిబద్ధతతో తెచ్చామని, 1972లో ముల్కీ నిబంధనలను రద్దు చేసి స్థానికతకు సమాధి కట్టింది కాంగ్రెస్ పార్టీయేనని విమర్శించారు. ఆరు సూత్రాల పథకం, 610 జీవో, గిర్‌గ్లానీ నివేదికలు తుంగలో తొక్కి హైదరాబాద్‌ను ఫ్రీజోన్‌గా ప్రకటించి యువతకు దక్కాల్సిన ఉద్యోగాలను కొల్లగొట్టి తీరని అన్యాయం చేశారని కేటీఆర్ ధ్వజమెత్తారు.

సోనియాను రేవంత్ బలిదేవత అన్నారు

1952, 1969లో తెలంగాణ కోసం ఉద్యమించిన వారిని కాంగ్రెస్ పార్టీ తుపాకీ కాల్పులతో బలితీసుకుందని, మలిదశ ఉద్యమంలో పదేండ్లు కాలయాపన చేసి యువతీ యువకుల ఆత్మబలిదానాలకు కారణమైన సోనియాగాంధీని అప్పట్లో రేవంత్ రెడ్డి బలిదేవత అన్నారని కేటీఆర్ గుర్తు చేశారు. కర్ణాటకలో అధికారంలోకి వస్తే వంద రోజుల్లో రెండున్నర లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్ ఆరు నెలల్లో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రకటించిన జాబ్ కేలండర్ పచ్చి మోసమని, ఎన్నికల కోడ్ అమల్లో ఉండే 2024 మార్చి, ఏప్రిల్, మే నెలలో ఉద్యోగ నోటిఫికేషన్లు ఎలా సాధ్యమని కేటీఆర్ ప్రశ్నించారు.

ఢిల్లీ లీడర్లకు కేసీఆర్ భయం



కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండల కేంద్రంలో రోడ్‌షోలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

- హస్తినలోనూ తెలంగాణ జెండా పాతుతడని మోదీ, రాహుల్‌కు గుబులు
- అందుకే కామారెడ్డిలో కేసీఆర్‌ను ఓడించేందుకు కలసి కుట్రలు
- అడ్డగోలుగా పైసలతో లీడర్లను కొంటున్నరు.. కానీ ప్రజల్ని కొనలేరు
- మతవిద్వేషాలను రెచ్చగొట్టే బీజేపీకి గుణపాఠం చెప్పండి
- సుస్థిర ప్రభుత్వం కోసం బీఆర్ఎస్‌ను గెలిపించండి
- భిక్కనూరు, గోషామహల్, మలక్‌పేట రోడ్ షోలలో కేటీఆర్

సాక్షి, కామారెడ్డి/అబిడ్స్/మలక్‌పేట: 'కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి కాంగనే ఉత్తిగ ఊకుండడు... ఢిల్లీలోనూ తెలంగాణ జెండా పాతుతడని ఢిల్లీ లీడర్లు మోదీ, రాహుల్ గాంధీకి భయం పట్టుకుంది. అందుకే కామారెడ్డిలో కేసీఆర్‌ను ఖతంజెయ్యాలని (ఓడగొట్టాలని) ఇద్దరూ కలసి కుట్రలుజేస్తున్నరు. అడ్డగోలుగా పైసలు గుమ్మరించి లీడర్లను కొంటున్నరు. ఎందరిని కొంటరో కొననీ.. మిమ్మల్ని (ప్రజలను) మాత్రం కొనలేరు. ప్రజల మద్దతుతో కేసీఆర్ భారీ విజయం సాధిస్తడు'అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కె. తారక రామారావు జోస్యం చెప్పారు. మతవిద్వేషాలను రెచ్చగొట్టే బీజేపీకి గుణపాఠం చెప్పాలని... సుస్థిర ప్రభుత్వం కోసం మరోసారి బీఆర్ఎస్‌ను ఆశీర్వదించాలని కోరారు. శనివారం కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండల కేంద్రంతోపాటు హైదరాబాద్‌లోని గోషామహల్, మలక్‌పేట నియోజకవర్గాల పరిధిలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన రోడ్ షోలలో మంత్రి కేటీఆర్ ప్రసంగించారు.

గల్ఫ్ వలసపోయినోళ్లకు ప్రత్యేక ప్యాకేజీ...

బతుకుదెరువు కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లిన వారి కోసం ప్రత్యేక ప్యాకేజీ అమలు చేసి ఆదుకుంటామని కేటీఆర్ హామీ ఇచ్చారు. డిసెంబర్ 3 తరువాత మూడోసారి అధికారం చేపట్టగానే కొత్త పథకాలు, కొత్త రేషన్ కార్డులు, కొత్త పింఛన్లు అందిస్తామని చెప్పారు. రూ. 400కే గ్యాస్ సిలిండర్ అందిస్తామని, అసైన్డ్ భూములపై పూర్తి హక్కులు పట్టాదారులకే ఇస్తామని స్పష్టం చేశారు.

రేవంత్ కొడంగల్‌లో చెల్లని రూపాయి...

'2018 ఎన్నికల్లో కొడంగల్ ప్రజలు రేవంత్‌రెడ్డిని చిత్తుచిత్తుగా ఓడించిండ్రు. అసుంటి రేవంత్‌రెడ్డి కామారెడ్డికి వచ్చి సీఎం కేసీఆర్‌పై పోటీ చేస్తే ఇక్కడి ప్రజలు ఊకుంటరా.. తుక్కుతుక్కు ఓడగొడుతరు. అక్కడ చెల్లని రూపాయి ఇక్కడ చెల్లుతదా? అని కేటీఆర్ ప్రశ్నించారు.

కేసీఆర్ పాలనలో కరువు, కర్ఫ్యూ లేదు..

హైదరాబాద్ పాతబస్తీలో గతంలో కర్ఫ్యూలతో బంద్‌లు జరిగేవని... కానీ కేసీఆర్ పాలనలో కరువు, కర్ఫ్యూలు లేవని మంత్రి కేటీఆర్ గుర్తుచేశారు. హిందూ, ముస్లింలు అన్నదమ్ముల మాదిరిగా కలసి జీవిస్తున్నారన్నారు. అభివృద్ధే కులం, సంక్షేమమే మతంగా బీఆర్ఎస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు. మలక్‌పేట అంటే ఒకప్పుడు టీవీ టవర్ గుర్తుకు వచ్చేదని... ఇప్పుడు ఐటీ టవర్ ఐకాన్‌గా నిలుస్తోందన్నారు. ధూల్‌పేట కళాకారులను చైనాకు పంపి అంతర్జాతీయ స్థాయిలో శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తామని కేటీఆర్ హామీ ఇచ్చారు. బీజేపీ కేవలం మతాల పేరుతోనే రాజకీయాలు చేస్తుంది తప్ప అభివృద్ధి చేయడం ఆ పార్టీకి సాధ్యంకాదన్నారు.

ఇందిరమ్మ రాజ్యమంటే ఆకలి రాజ్యం..

'కాంగ్రెసోళ్లు ఇందిరమ్మ రాజ్యం తెస్తమంటున్నరు. నాకు తెలిసి ఇందిరమ్మ రాజ్యమంటే ఆకలి రాజ్యం.గంజినీళ్లు దొరకని రాజ్యం. అసుంటి దరిద్రపుగొట్టు, దుర్మార్గపు పాలన మనకు అవసరమా'అని కేటీఆర్ ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో 29 లక్షల మందికి రూ. 200 చొప్పున పింఛన్ ఇచ్చేవారని, తాము అధికారంలోకి వచ్చాక 46 లక్షల మందికి రూ. 2 వేల చొప్పున ఇస్తున్నామని, మూడోసారి అధికారంలోకి రాగానే పింఛన్ మొత్తాన్ని రూ. 5 వేలకు పెంచుకుంటూ వెళ్తామని చెప్పారు. 16 రాష్ట్రాల్లో బీడీ కార్మికులు ఉన్నా, ఎక్కడా జీవనభృతి ఇవ్వలేదని, మనం మాత్రమే ఇస్తున్నామని, బీడీ కార్మికుల పింఛన్ అర్హత కటాఫ్ తేదీని 2023కు పెంచి మిగిలిపోయిన వారందరికీ ఇస్తామని తెలిపారు. సన్నబియ్యం అందించడంతోపాటు 18 ఏళ్లు నిండిన మహిళలకు రూ. 3 వేల సాయం అందిస్తామని తెలిపారు.

మంత్రి కేటీఆర్‌కు ఈసీ నోటీసులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర మంత్రి, బీఆర్ఎస్ సిరిసిల్ల నియోజకవర్గ అభ్యర్థి కేటీఆర్‌కు కేంద్రం ఎన్నికల సంఘం (ఈసీ) నోటీసులు జారీ చేసింది. ఈ నెల 20న రాయదుర్గంలోని 'టీ-వర్క్స్'లో ఓ అధికారిక కార్యక్రమంలో పాల్గొని రాజకీయ ప్రచారం నిర్వహించడంపై వివరణ ఇవ్వాలని ఆదేశించింది. 'టీ-వర్క్స్' ప్రభుత్వ కార్యాలయమని, మంత్రి ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘించినట్టు ప్రాథమిక నిర్ధారణ జరిగిందని తెలిపింది. దీనిపై ఆదివారం మధ్యాహ్నం 3 గంటల్లోగా సంజాయిషీ ఇవ్వాల్సిందిగా కేటీఆర్‌ను ఈసీ ముఖ్య కార్యదర్శి అవినాశ్ కుమార్ ఆదేశించారు. ఈ మేరకు శనివారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. సంజాయిషీ ఇవ్వని పక్షంలో చెప్పడానికి ఏమీ లేదని భావించి చట్టంలోని నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

కోడ్ ఉల్లంఘనలు అడ్డుకోండి

ఎన్నికల ప్రధానాధికారికి ప్రధాన పార్టీలతో పాటు స్వతంత్రుల వినతి

సాక్షి , హైదరాబాద్: శాసనసభ ఎన్నికల ప్రచారంలో వివిధ పార్టీలు కోడ్ ఉల్లంఘనకు పాల్పడుతున్నాయని, దీనిపై తక్షణమే చర్యలు చేపట్టాలని ప్రత్యర్థి పార్టీల నేతలు, ఇద్దరు ఇండిపెండెంట్లు ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్‌కు శనివారం ఫిర్యాదు చేశారు. మల్కాజిగిరి కాంగ్రెస్ అభ్యర్థి మైనంపల్లి హన్మంతరావు కేటీఆర్‌పై చేసిన విమర్శలతో పాటు పలు అంశాలపై సీఈఓకు బీఆర్ఎస్ ఫిర్యాదు చేయగా, బీఆర్ఎస్ ఇస్తున్న ప్రకటనలపై కాంగ్రెస్, కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తున్న ప్రకటనలపై బీజేపీ పరస్పరం ఫిర్యాదు చేశాయి. బీఆర్ఎస్ లీగల్ టీం హెడ్ సోమా భరత్ సీఈఓను కలిసి కాంగ్రెస్ పార్టీ నిబంధనలు అతిక్రమిస్తోందని, కోడ్ ఉల్లంఘనకు పాల్పడుతోందని తెలిపారు. ఎల్లారెడ్డి సెగ్మెంట్లో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన నేతల కుటుంబ సభ్యుల ఖాతాల్లో లక్షల రూపాయలు జమచేశారని ఆరోపించారు. కర్ణాటక ప్రభుత్వం ఏర్పడిన 6 నెలలకే సర్కార్ సొమ్ముతో తెలంగాణలో ప్రకటనలు ఇస్తున్నారని, ప్రభుత్వ సొమ్ముతో ప్రకటనలు ఇవ్వడం కోడ్ ఉల్లంఘనకు పాల్పడినట్లేనని సీఈఓకు ఫిర్యాదు చేశారు. టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ నిరంజన్ సీఈవోను కలిసి బీఆర్ఎస్ ఇచ్చే ప్రకటనలు కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టకు భంగం కలిగించే విధంగా ఉన్నాయని ఫిర్యాదు చేశారు.

ఒక్కో ఓటునూ ఒడిసిపట్టండి

▶ మొదటి పేజీ తరువాయి


అభ్యర్థుల ప్రచార తీరుతెన్నులపై కేసీఆర్ శనివారం సుదీర్ఘంగా సమీక్షించారు. పార్టీ అభ్యర్థులు, ఇన్‌చార్జులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. పలువురితో ఫోన్లలో మాట్లాడారు.

సభ రద్దవడంతో..

శనివారం సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో జరగాల్సిన బీఆర్ఎస్ బహిరంగ సభ రద్దయిన నేపథ్యంలో.. కేసీఆర్ రోజంతా ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో సమీక్షలు నిర్వహించారు. సర్వేలు, నిఘా సంస్థల నివేదికలు, వివిధ మార్గాల నుంచి అందిన సమాచారాన్ని విశ్లేషించారు. నియోజకవర్గాల వారీగా ప్రచార తీరుతెన్నులు, అభ్యర్థుల పనితీరు, ఇతర పార్టీల స్థితిగతులపై పార్టీ నేతలతో చర్చించారు. గెలుపు అవకాశాల ఆధారంగా నియోజకవర్గాలను కేటగిరీలుగా వర్గీకరించి, మెరుగుపడాల్సిన నియోజకవర్గాల్లో చేపట్టాల్సిన దిద్దుబాటు చర్యలపై అభ్యర్థులు, నియోజకవర్గ ఇన్‌చార్జులకు దిశానిర్దేశం చేశారు. తీవ్ర పోటీ ఉన్న నియోజకవర్గాల ఇన్‌చార్జులకు ప్రత్యేక సూచనలు చేశారు. పార్టీ గెలుపోటములపై మౌఖిక ప్రచారాలతో గందరగోళానికి గురికావద్దని నేతలకు కేసీఆర్ స్పష్టం చేశారు. తాజా సర్వే ఫలితాలు పార్టీకి అనుకూలంగా ఉన్నాయని, ఆత్మవిశ్వాసంతో పనిచేయాలని సూచించారు. మూడోసారి అధికారంలోకి వస్తామని భరోసా ఇచ్చారు.

క్షేత్రస్థాయి పరిస్థితిపై పోస్ట్‌మార్టం

ఎన్నికల షెడ్యూల్ వెలువడిన తర్వాత గత నెల 15నుంచి ఇప్పటివరకు కేసీఆర్ 82 అసెంబ్లీ నియోజకవర్గాలపరిధిలో ప్రచారం పూర్తి చేశారు. పరేడ్ మైదానంలో సభ రద్దయిన నేపథ్యంలో హైదరాబాద్‌లోని ఎల్బీనగర్, కూకట్‌పల్లి, మేడ్చల్ లేక మల్కాజ్‌గిరి నియో జకవర్గాల పరిధిలో రోడ్ షోలు నిర్వహించాల ని శనివారం జరిగిన సమీక్షలో నిర్ణయించిన ట్టు సమాచారం. ప్రతిపక్షాల పోల్ మేనేజ్‌మెంట్ ప్రణాళికలు, పార్టీపరంగా అనుసరించాల్సిన పోల్ మేనేజ్‌మెంట్ వ్యూహాలపై నేతలకు దిశానిర్దేశం చేశారు. కాంగ్రెస్ అగ్రనేత లు రాహుల్, ప్రియాంక తదితరులు చేస్తున్న విమర్శలు, వాటిని తిప్పికొట్టాల్సిన తీరుపైనా సూచనలిచ్చారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మంత్రి హరీశ్‌రావుల రోడ్‌షోలకు వస్తున్న స్పందన, మేనిఫెస్టోలోని అంశాలు ఎంతమేర ప్రజల్లోకి వెళ్లాయన్న దానిపై ఆరా తీశారు. ప్రధాని మోదీ వరుసగా మూడు రోజులు రాష్ట్రంలో ప్రచారం చేస్తున్న నేపథ్యంలో.. ఆయా నియోజకవర్గాలపై ఎంతమేర ప్రభావం ఉంటుందనే కోణంలో సర్వే, కన్సల్టెన్సీ సంస్థల నుంచి నివేదిక కోరినట్టు సమాచారం.



సీటు బెల్ట్ చెడిపోయిందంటే ఇంజన్ చెక్ చేయాలంటావేంటయ్యా!

క్లుప్తంగా...

గెలిపిస్తే ప్రతి పేదకు డబుల్ బెడ్‌రూం ఇల్లు

- ఈటల రాజేందర్



ములుగు(గజ్వేల్): బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే అర్హులైన ప్రతి నిరుపేదకు డబుల్‌బెడ్‌రూం ఇల్లు నిర్మించి, వరికి రూ.3,100 మద్దతు ధర ఇస్తామని గజ్వేల్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ హామీ ఇచ్చారు. దీంతో ఎకరానికి రూ.25 వేలు అదనంగా లాభం చేకూరుతుందని తెలిపారు. సిద్దిపేట జిల్లా ములుగు మండలం బండమైలారం, కొత్తూరు, బస్వాపూర్, కొక్కొండ, సింగన్నగూడ, నర్సాపూర్, తున్కిబొల్లారం, బహిలంపూర్, ఆర్‌అండ్‌ఆర్ కాలనీ, క్షీరసాగర్, అన్నసాగర్ తదితర గ్రామాల్లో శనివారం రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ.. కేసీఆర్‌కు ఓటేసి గెలిపించిన పాపానికి మన భూములు సైతం గుంజుకుంటున్నారని ఆరోపించారు. మళ్లీ ఓటేస్తే ఊళ్లకు ఊళ్లే మాయం చేస్తారని ధ్వజమెత్తారు. ఆ పూటకు తినే బిర్యానీ కావాలా?, మందు సీసా కావాలా?, మన ఊరు మనకు ఉండాలా అన్నది ఓటర్లు ఆలోచించాలని కోరారు. ఒక ఇంట్లో ఇద్దరు వృద్ధులున్నా ఇద్దరికీ పింఛన్లు అందిస్తామని భరోసా ఇచ్చారు. పేద మహిళలకు 4 సిలిండర్లు ఉచితంగా ఇవ్వడంతోపాటు ప్రజలకు ఉచిత వైద్యం అందిస్తామన్నారు.

హామీలేవీ అమలు కాలేదు

ఎంపీ మనోజ్ తివారీ



సాక్షి, హైదరాబాద్: 'ఢిల్లీ లిక్కర్ స్కాంకు ఇక్కడే బీజం పడింది. ఈ కేసులో ఇప్పటికే ముగ్గురు అరెస్టు అయ్యారు. అవినీతికి పాల్పడిన వారెవరూ తప్పించుకోలేరు. ఎమ్మెల్సీ కవిత, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ కూడా జైలుకు వెళ్తారు'అని బీజేపీ ఎంపీ మనోజ్ తివారీ వ్యాఖ్యానించారు. శనివారం ఇక్కడ ఆయన మీడియాతో మాట్లాడుతూ తెలంగాణలో తాను అనేక ప్రాంతాల్లో పర్యటించినప్పుడు లక్ష ఉద్యోగాలు ఎక్కడా అని యువత అడుగుతున్నారని చెప్పారు. నిరుద్యోగ భృతి, కేజీ టు పీజీ ఉచితవిద్య, 7 లక్షల మందికి డబుల్ బెడ్రూం ఇళ్ల వంటి హామీలు అమలు చేయలేదని విమర్శించారు.

నిశ్శబ్ద విప్లవం మొదలైంది: జీవీఎల్

తెలంగాణను సీఎం కేసీఆర్ రాజకీయాల కోసం వాడుకొని దగా చేశారని బీజేపీ ఎంపీ జీవీఎల్ నర్సింహారావు మండిపడ్డారు. 'ధరణి పేరుతో దొరికిందల్లా దోచుకున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో అవినీతి చేశారు'అని ఆరోపించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రధాని మోదీ చెప్పిందే చేస్తారని, బీసీ సీఎం నినాదంతో ఇక్కడ నిశ్శబ్ద విప్లవం మొదలైందని, ఈ ఎన్నికల్లో అనూహ్య ఫలితాలు వస్తాయని అన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి దమ్ముంటే బీసీ సీఎం ప్రకటన చేయాలని సవాల్ విసిరారు.

కాంగ్రెస్‌కు ఓటేస్తే.. కేసీఆర్‌కు వేసినట్టే!

- మళ్లీ బీఆర్ఎస్‌కు అధికారం అప్పగించినట్టే..: ప్రెస్‌మీట్‌లో అమిత్ షా
- కాంగ్రెస్ ఎమ్మెల్యేలను గెలిపిస్తే వెళ్లి బీఆర్ఎస్‌లో చేరారు
- బీజేపీని గెలిపిస్తేనే అమరవీరుల ఆకాంక్షలు నెరవేరుతాయి
- తెలంగాణను అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తాం
- రాష్ట్రంలో ఒక్కసారి బీజేపీకి అవకాశం ఇవ్వాలి
- కమలం పువ్వు గుర్తుకు ఓటేసి నిర్ణయాత్మక తీర్పు ఇవ్వాలని విజ్ఞప్తి



మీడియాతో మాట్లాడుతున్న అమిత్ షా

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే అది కేసీఆర్‌కు వేసినట్టేనని, బీఆర్ఎస్‌కు అధికారం అప్పగించినట్టేనని బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు. గతంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలను గెలిపిస్తే వెళ్లి బీఆర్ఎస్‌లో చేరారని, గత పదేళ్లలో అంతా కలసి అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. ఈ అవినీతిపై విచారణ జరిపిస్తామని, దోచుకున్న సొమ్మును వసూలు చేస్తామని పేర్కొన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండు పార్టీలకు ఎలాంటి ప్రజాస్వామ్య విలువలు లేవని, వాటికి కుటుంబ పాలనే సర్వస్వమని విమర్శించారు. బీఆర్ఎస్–బీజేపీ మధ్య పొత్తు ఏర్పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కేంద్రంలో, రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వాలతో డబుల్ ఇంజిన్ సర్కారు వస్తే తెలంగాణ అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. శనివారం కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జి ప్రకాశ్ జవదేకర్, ఇతర నేతలతో కలసి అమిత్ షా మీడియాతో మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

''పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అవినీతి, అక్రమాలు, కుంభకోణాలు మినహా చేసిందేమీ లేదు. మిషన్ భగీరథ, పాస్‌పోర్ట్ స్కాం, మియాపూర్ భూముల అక్రమాల్లో వందల కోట్ల కుంభకోణం, ఔటర్‌రింగ్‌రోడ్డు టెండర్ల స్కాం, కాళేశ్వరం ప్రాజెక్టు, ఢిల్లీ మద్యం స్కాం, గ్రానైట్ కుంభకోణం .. ఇలా ఎన్నో రూపాల్లో అవినీతి జరిగింది. కాగ్ నివేదిక ప్రకారం మిషన్ కాకతీయలో రూ.22వేల కోట్లు ఖర్చు చేసినా 65 శాతమే పనులు పూర్తయ్యాయి. దళితబంధు, డబుల్ బెడ్రూం స్కీంలలో దళితుల నుంచి కమీషన్లు దండుకున్న చరిత్ర బీఆర్ఎస్ నేతలది.

విచారణ చేసి జైలుకు పంపుతాం

బీఆర్ఎస్ సర్కార్ అవినీతిపై కేంద్ర ప్రభుత్వ పరిధిలోని అంశాలపై ప్రస్తుతం విచారణ సాగుతోంది. తెలంగాణలో బీజేపీ సర్కార్ ఏర్పడగానే ఒక్కొక్క అవినీతి ఆరోపణపై విచారణ జరిపి, దోషులుగా తేలిన ప్రతీ ఒక్కరిని కటకటాల వెనక్కి పంపిస్తాం. హైదరాబాద్‌లో రోహింగ్యాల చొరబాటు, ఇక్కడ ఆశ్రయం పొంది ఓటర్ కార్డులు పొందడంపై ఎన్ఐఏ విచారణ సాగుతోంది. దీనిపై కుట్రను ఎన్ఐఏ భగ్నం చేసింది. పదిరోజుల క్రితమే కేంద్రానికి నివేదిక ఇచ్చింది. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ అవినీతి సొమ్ముతో ఎన్నికల వాతావరణాన్ని కలుషితం చేసేందుకు ప్రయత్నిస్తున్నాయి. ప్రలోభాల కోసం కర్ణాటక నుంచి, ఇతర రూపాల్లో వస్తున్న అక్రమ డబ్బు విషయంలో ఏజెన్సీలు, ఈసీ తగిన చర్యలు తీసుకుంటున్నాయి.

కేసీఆర్‌ను మార్చాలంటూ కాంగ్రెస్‌కు ఓటేస్తే..

కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచీ తెలంగాణ విరోధిగా నిలిచింది. సుదీర్ఘ పాలనలో తెలంగాణను అణచివేసింది. ఉమ్మడి ఏపీలో నాటి సీఎం టి.అంజయ్యను తీవ్రంగా అవమానించింది. మాజీ ప్రధాని పీవీ నరసింహారావును అవమానించిన తీరు తెలంగాణ ప్రజల మనస్సులో నాటుకుపోయింది. 2009లో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ప్రకటించి వెనక్కితగ్గి దాదాపు 1,500 మంది ఆత్మబలిదానాలకు కాంగ్రెస్ కారణమైంది. ప్రజలు మార్పు కోరుకుంటున్నారు. కానీ కాంగ్రెస్‌కు ఓటు వేసినా, ఒవైసీలకు ఓటు వేసినా బీఆర్ఎస్‌కు, కేసీఆర్‌కు పడ్డట్టే. గతంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలను గెలిపిస్తే వెళ్లి బీఆర్ఎస్‌లో చేరిపోయారు. బీఆర్ఎస్‌ను గెలిపిస్తే అవినీతి తప్ప మరేమీ చేయలేదు. గత పదేళ్లలో అంతా కలసి అవినీతికి పాల్పడ్డారు. తెలంగాణలో ప్రజల ఆకాంక్షలు తీరాలంటే బీజేపీని గెలిపించాలి.

ప్రస్తుత పథకాలేవీ ఆపబోం..

తెలంగాణతోపాటు దేశ భవిష్యత్తును నిర్ణయించే ఈ ఎన్నికల్లో చైతన్యవంతమైన ఇక్కడి ఓటర్లు ప్రధాని మోదీ నేతృత్వంలోని బీజేపీకి అండగా నిలుస్తారని, డబుల్ ఇంజిన్ సర్కార్‌ను తీసుకొస్తారని మాకు పూర్తి విశ్వాసం ఉంది. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుంది. ఎన్నికల ఫలితాలు వెలువడ్డాక బీజేపీ ఎమ్మెల్యేలు సమావేశమై బీసీ నేతను సీఎంను ఎన్నుకుంటారు. ప్రస్తుతం అమలవుతున్న పథకాలేవీ మేం ఆపబోం. రాష్ట్రంలో బీజేపీ గెలిస్తే తొలి కేబినెట్ భేటీలోనే పెట్రోల్, డీజిల్‌లపై వ్యాట్‌ను తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంటాం. బీఆర్ఎస్ సర్కార్ ముస్లింలకు ఇస్తున్న 4 శాతం రిజర్వేషన్లను రద్దు చేసి ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు వాటిని సర్దుబాటు చేస్తాం. ఎస్సీ వర్గీకరణకు చర్యలు తీసుకుంటాం. ప్రజలు రాష్ట్రంలో ఒక్కసారి బీజేపీకి అవకాశం ఇవ్వాలి..''అని అమిత్ షా విజ్ఞప్తి చేశారు.

బీజేపీ ప్రచార సరళిపై అమిత్ షా ఆరా!

- పార్టీ నేతలతో సమీక్షించిన కేంద్ర హోంమంత్రి
- ప్రచారం విషయంలో నాయకులకు అభినందన
- బూత్ స్థాయి యంత్రాంగం చురుగ్గా ఉండాలని సూచన

సాక్షి, హైదరాబాద్: తాను పాల్గొన్న ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో బీజేపీ పట్ల ప్రజల్లో మద్దతు పెరుగుతున్నట్టు కనిపించిందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్యానించినట్టు తెలుస్తోంది. కేంద్రంలో మోదీ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల పట్ల ప్రజలు ఆకర్షితులవుతున్నారని, రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వ తొమ్మిదిన్నరేళ్ల పాలనలో హామీల అమలులో వైఫల్యాల పట్ల ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారనే విషయం తన దృష్టికి వచ్చినట్టు పార్టీనేతలకు తెలిపారని సమాచారం. రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ జాతీయ, రాష్ట్రనేతల ఆధ్వర్యంలో సాగుతున్న ప్రచార సరళి స్థానికంగా ప్రజల దృష్టిని ఆకర్షించేలా ఉందని అమిత్ షా అభినందించినట్టు తెలిసింది. పోలింగ్ జరిగే వరకు బూత్ స్థాయిల్లో పార్టీ యంత్రాంగం, ఆయా కమిటీలు చురుగ్గా వ్యవహరించాలని, బీజేపీ అనుకూల ఓటర్లు పూర్తిస్థాయిలో ఓటింగ్‌లో పాల్గొనేలా చూడాలని, తొలిసారి ఓటేస్తున్న యువ ఓటర్లు, యువత ఓట్లు బీజేపీకి అనుకూలంగా పడే అవకాశమున్నందున, ఆ విషయంలోనూ జాగ్రత్తలు తీసుకోవాలని అమిత్ షా సూచించినట్టు తెలిసింది. ప్రస్తుతం రాష్ట్రంలో పార్టీపరంగా సాగుతున్న ప్రచార సరళి, పార్టీ అభ్యర్థులు పోటీలో ఉన్నచోట్ల ప్రజల్లో మద్దతు ఎలా ఉంది, గట్టిపోటీ నెలకొన్న నియోజకవర్గాల్లో విజయం సాధించేందుకు అనుసరించాల్సిన వ్యూహాలు, ఇతర అంశాలను అమిత్‌షా సమీక్షించారు. శనివారం కత్రియా మీడియా సెంటర్‌లో కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జి ప్రకాశ్ జవదేకర్, రాష్ట్రనేతలు డా.ఎస్. ప్రకాశ్‌రెడ్డి, కృష్ణసాగర్ రావు, ఎన్వీసుభాష్, ఇతర నాయకులతో అమిత్ షా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గుజరాత్‌లో తన సోదరికి ఊపిరితిత్తుల మార్పిడి శస్త్రచికిత్స జరిగిన విషయాన్ని అక్కడున్న వారికి షా తెలియజేశారు. శస్త్రచికిత్సకు సంబంధించి ప్రధానమంత్రి సహాయనిధి (పీఎం రిలీఫ్ ఫండ్) నుంచి కూడా సహాయం అందినట్టు ఆయన చెప్పారని పార్టీ నాయకులు తెలిపారు. పీఎంఆర్ఎఫ్ కింద మంచి సదుపాయాలు ఉన్నాయని, వాటిని తెలంగాణ ప్రజలు కూడా ఉపయోగించుకోవచ్చునని షా వెల్లడించారు.

రాష్ట్రంలో బీజేపీకి పట్టం కట్టండి

- ఆ రెండు పార్టీలను ఇంటికి పంపండి
- గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ మళ్లీ మోసానికి పాల్పడుతోంది
- కేంద్ర పథకాలు రాష్ట్రంలో అమలు కాక రైతులు భారీగా నష్టపోయారు
- దేశ సుస్థిరత బీజేపీతోనే సాధ్యం
- హుజూర్‌నగర్, హైదరాబాద్ ప్రచార కార్యక్రమాల్లో జేపీ నడ్డా



హుజూర్‌నగర్/చిలకలగూడ/ముషీరాబాద్: తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ అవినీతి, కుటుంబ పార్టీలని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆరోపించారు. ఆ రెండు పార్టీలు రాష్ట్రాన్ని భ్రష్టుపట్టిస్తుండటంతో అభివృద్ధి పూర్తిగా ఆగిపోయిందని విమర్శించారు. అందువల్ల ఆ పార్టీలను ఇంటికి పంపి బీజేపీకి పట్టం కట్టాలని ప్రజలను కోరారు. శనివారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో బీజేపీ సకల జనుల విజయ సంకల్ప సభతోపాటు హైదరాబాద్‌లోని చిలకలగూడ, వారాసిగూడ, ముషీరాబాద్‌లలో చేపట్టిన రోడ్ షోలో ఆయన ప్రసంగించారు. సకలజనులు ఏకమై కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ ఒక కుటుంబం చేతిలో బందీ కావడం బాధాకరమని వ్యాఖ్యానించారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధి కోసం ఎన్నో నిధులు పంపిస్తుంటే.. తెలంగాణ ప్రభుత్వం ఈ నిధులను దుర్వినియోగం చేస్తోందని నడ్డా ఆరోపించారు. ధరణి పోర్టల్ తెచ్చి నిరుపేదల అసైన్డ్ భూములను అందులో నమోదు చేయలేదని, ధరలు పెరిగాక వాటిని గుంజుకునేందుకు ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంచనాలు పెంచి కేసీఆర్ దోపిడీ చేశారని ఆరోపణలు గుప్పించారు. దళితబంధు పథకం సొమ్మును లబ్ధిదారులకు అందించేందుకు ఎమ్మెల్యేలు 30 శాతం లంచాలు తీసుకుంటున్నారని స్వయంగా కేసీఆర్ చెప్పారని ఆయన గుర్తుచేశారు. పీఎం ఫసల్ బీమా యోజన, గ్రామీణ్ ఆవాజ్ యోజనను రాష్ట్రంలో అమలు చేయకపోవడం వల్ల రైతులకు రూ. వేలల్లో నష్టం జరిగిందని నడ్డా పేర్కొన్నారు.

కాంగ్రెస్ హయాంలో ఎన్నో స్కామ్‌లు...

కాంగ్రెస్ అంటే అవినీతికి నిలువుటద్దమని, కాంగ్రెస్ హయాంలో అనేక స్కామ్‌లు జరిగాయని నడ్డా ఆరోపించారు. అటువంటి పార్టీని, నాయకులను నమ్మొద్దని, గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ పార్టీ ప్రజలను మరోమారు మోసం చేసేందుకు సిద్ధమైందని ఆయన దుయ్యబట్టారు.

'డబుల్ ఇంజిన్'తో మరింత అభివృద్ధి..

మోదీ పాలనలో ఒక్క స్కామ్ కూడా జరగలేదని నడ్డా చెప్పారు. దేశ సుస్థిరత, సమగ్రత, ప్రజాసంక్షేమం బీజేపీతోనే సాధ్యమన్నారు. తెలంగాణలో బీజేపీని గెలిపిస్తే డబుల్ ఇంజిన్ సర్కార్‌తో రాష్ట్రం మరింత అభివృద్ధి సాధిస్తుందని పేర్కొన్నారు. యువతకు, మహిళలకు, రైతులకు మేలు కలగాలంటే అది బీజేపీతోనే సాధ్యమవుతుందన్నారు.

ఏడాదికి నాలుగు సిలిండర్లు ఫ్రీ..

తెలంగాణలో బీజేపీని గెలిపిస్తే బీసీని సీఎం చేస్తామని, ఏటా ఉచితంగా 4 గ్యాస్ సిలిండర్లు, వరి క్వింటాల్‌కు రూ. 3,100 మద్దతు ధర ఇస్తామని, ఎరువులకు సబ్సిడీ పెంచుతామని నడ్డా హామీ ఇచ్చారు. పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గిస్తామని, ఖాళీగా ఉన్న ఉద్యోగాలను పారదర్శకంగా 6 నెలల్లోగా భర్తీ చేస్తామని, ప్రధాన మంత్రి ఆయుష్మాన్ భారత్ కింద రూ. 5 లక్షల బీమాను రూ. 10 లక్షలకు పెంచుతామని చెప్పారు. తెలంగాణ విమోచన దినాన్ని అధికారికంగా నిర్వహిస్తామన్నారు.

సబ్బండ వర్గాల ఉద్యమాన్ని మింగేశారు

- ప్రత్యేక తెలంగాణ పోరాటానికి సారథిగా ప్రకటించుకున్నారు
- రాష్ట్రం వచ్చిన తర్వాత నిజమైన ఉద్యమకారుల పరిస్థితి దయనీయంగా మారింది
- సీఎం కేసీఆర్‌కు మరో బహిరంగలేఖ రాసిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: ''సబ్బండ వర్గాల'ఉద్యమాన్ని స్వార్థంతో మింగేసిన కేసీఆర్ ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి సారథిగా తనను తాను ప్రకటించుకున్నారని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి విమర్శించారు. 'తెలంగాణ ఉద్యమంలో మీ స్వార్థాన్ని గురించి రాస్తే.. పెద్ద గ్రంథాలే తయారవుతాయి'అని నిందించారు. శనివారం సీఎం కేసీఆర్‌కు కిషన్‌రెడ్డి మూడో బహిరంగ లేఖ సంధించారు. ''జలదృశ్యం'వేదికగా గాంధేయవాది కొండాలక్ష్మణ్ బాపూజీను ఉపయోగించుకున్నారు. తర్వాత బాపూజీ పరిస్థితి ఏమైందో అందరికీ తెలుసు. మీతోపాటు తొలి అడుగులు వేసిన గాదె ఇన్నయ్య, విజయరామారావు, రవీంద్రనాయక్, మేచినేని కిషన్‌రావు వంటి నాయకులెందరినో విజయవంతంగా పక్కకు తప్పించడం మీకున్న ప్రత్యేక నైపుణ్యానికి ఒక ఉదాహరణ. తెలంగాణ జాతిపితగా ప్రజల గుండెల్లో ఉన్న ఆచార్య జయశంకర్ సార్ వంటి తెలంగాణవాది భుజాల మీద ఎక్కి మేధావులను ముగ్గులోకి లాగారు. ఓడ ఎక్కేదాక ఓడమల్లన్న, ఒడ్డుచేరినాంక బోడ మల్లన్న'అనే సామెత మీకు సరిగ్గా నప్పుతుంది'అని ఆ లేఖలో ఆరోపించారు. ఢిల్లీకి వెళ్లి కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకుల వద్ద నక్క వినయాలు ప్రదర్శించి సానుభూతి పొందేందుకు ప్రయత్నించారని ధ్వజమెత్తారు. 'సెంటిమెంటును వాడుకుని ఎన్నికల్లో గెలవడం మీకు తెలిసినంతగా మరెవరికీ తెలియదని చెప్పడంలో అనుమానం అక్కర్లేదు''అని ఎద్దేవా చేశారు.

ప్రజలకు ఇప్పుడిప్పుడే అర్థమవుతున్నాయి

'ఆలె నరేంద్ర, దేవేందర్ గౌడ్ వంటి నాయకులను మీతో కలుపుకోవడం ద్వారా వారికి అస్తిత్వం లేకుండా చేయడం, మీ పనైపోయిన తర్వాత వారిని పక్కకు జరిపేయడం మీ ప్రత్యేకత. మీ చేతిలో మోసపోయిన వారిలో ఎక్కువమంది వెనుకబడిన వర్గాల వారే. ధర్నాలు, దీక్షలు, వంటావార్పు, రాస్తారోకోలు, రైల్ రోకోలు, సాగరహారం, సకల జనుల సమ్మె, మిలియన్ మార్చ్ వంటివన్నీ ప్రజలు చేస్తుంటే.. 'గాలికిపోయే పిండి కృష్ణార్పణం 'అన్నట్లు..'చివర్లో మీరు, మీ కుటుంబసభ్యులే గెలిపించామన్నట్లు ఫోజులివ్వడం.. వంటివన్నీ తెలంగాణ ప్రజలకు ఇప్పుడిప్పుడే అర్థమవుతున్నాయని ఆ లేఖలో కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. 'తెలుగుదేశం, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉద్యమకారులను ఉరికించి కొడుతుంటే.. దిక్కుమొక్కులేని ఉద్యమాన్ని.. ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు, విశ్వవిద్యాలయాల విద్యార్థులు, కులసంఘాలు, మేధావులు, జర్నలిస్టులు.. అక్కున చేర్చుకుని తమ ఉద్యమంగా ముందుకు తీసుకెళ్లారు. కానీ రాష్ట్రం సాధించిన తర్వాత వారందరి పరిస్థితి దయనీయంగా మారింది'అని ఆవేదన వ్యక్తం చేశారు. 'రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తూ.. మీ కుటుంబ ఆలోచనలే సర్వస్వంగా వ్యవహరిస్తున్న మీకు, మీ పార్టీకి రానున్న ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు సరైన బుద్ధి చెబుతారు'అని కిషన్‌రెడ్డి హెచ్చరించారు.

మమ్మల్ని ఎవరు గిల్లినా ఊరుకోం

- ఆరేళ్లుగా ఉత్తరప్రదేశ్‌లో కర్ఫ్యూ లేదు
- బీజేపీని గెలిపిస్తే ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేస్తాం
- ఆ ఫలాలను వెనుకబడిన వర్గాలకు పంచుతాం
- డబుల్ ఇంజిన్ సర్కారుతోనే అభివృద్ధి పరుగులు
- వేములవాడ, కాగజ్‌నగర్ సభలు, హైదరాబాద్ రోడ్ షోలలో యూపీ సీఎం యోగి



వేములవాడ/సాక్షి, ఆసిఫాబాద్/రాంగోపాల్ పేట్/అబిడ్స్: 'మమ్మల్ని ఎవరు గిల్లినా ఊరుకొనేది లేదు'అని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ స్పష్టం చేశారు. ప్రస్తుతం తెలంగాణలో ఎలాంటి పరిస్థితులు ఉన్నాయో 2017కు ముందు యూపీలోనూ అలానే ఉండేవని... మాఫియా, గూండాగిరీ, దాదాగిరీ, కబ్జాలు కొనసాగేవని చెప్పారు. అయితే యూపీ ప్రజలు కుటుంబ పాలనకు తెరదించి బీజేపీకి పట్టం కట్టడంతో ఇప్పుడు అవన్నీ బంద్ అయ్యాయన్నారు. ఇప్పుడు తమ రాష్ట్రంలో ఎవరైనా గూండాగిరీ, మాఫియా నడిపిస్తే బుల్డోజర్లతో బుద్ధి చెబుతున్నామని పేర్కొన్నారు. బీజేపీ డబుల్ ఇంజిన్ సర్కార్‌తో ఇప్పటి వరకు తమ రాష్ట్రంలో ఒక్క రోజూ కర్ఫ్యూ పెట్టలేదని చెప్పారు. అలాగే అభివృద్ధి, ఆదాయంలోనూ యూపీ సర్‌ప్లస్‌లో కొనసాగుతోందన్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లలో రామరాజ్య స్థాపన విజయ సంకల్ప సభలతోపాటు హైదరాబాద్‌లోని సనత్‌నగర్, గోషామహల్ నియోజకవర్గాల పరిధిలో నిర్వహించిన రోడ్ షోలలో యోగి ఆదిత్యనాథ్ ప్రసంగించారు.

హైదరాబాద్ పేరు మారుస్తాం...

యూపీలో ఐదేళ్లలో 6 లక్షల ఉద్యోగాలు కల్పించామని, మరో 4 లక్షలు కల్పించబోతున్నామని యోగి ఆదిత్యనాథ్ తెలిపారు. తెలంగాణలోనూ డబుల్ ఇంజిన్ సర్కారు కోసం బీజేపీని గెలిపిస్తే ప్రజలకు అన్ని విధాలా రక్షణ కల్పించి రాష్ట్రాన్ని వేగంగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ భాగ్యనగరాన్ని హైదరాబాద్‌గా మార్చిందని... తాము అధికారంలోకి వస్తే చార్మినార్‌లోని భాగ్యలక్ష్మీ మాత పేరుపై హైదరాబాద్ పేరును భాగ్యనగరంగా మారుస్తామని తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్ చెట్టపట్టాలేసుకొని అభివృద్ధిని విస్మరిస్తున్నాయని... ఈ మూడు పార్టీల్లో ఎవరికి ఓటు వేసినా మిగతా ఇద్దరికీ చెందుతుందని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో కల్వకుంట్ల కుటుంబం, కేసీఆర్ బంధువులు మాత్రమే రాజ్యాధికారం చెలాయిస్తున్నారని దుయ్యబట్టారు. నీళ్లు, నిధులు, నియామకాల డిమాండ్‌తో ఏర్పడిన రాష్ట్రంలో అధికారం చేపట్టిన బీఆర్ఎస్ ఆ డిమాండ్లేవీ నెరవేర్చలేకపోయిందని విమర్శించారు.

అధికారికంగా 'విమోచనం'..

బీజేపీని గెలిపిస్తే ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేసి ఆ ఫలాలను వెనకబడిన వర్గాలకు అందేలా చర్యలు తీసుకుంటామని యోగీ ఆదిత్యనాథ్ హామీ ఇచ్చారు. ఎంఐఎంకు భయపడే సీఎం కేసీఆర్ తెలంగాణ విమోచన దినోత్సవాన్ని నిర్వహించడం లేదని ఆరోపించారు. బీజేపీ అధికారంలోకి రాగానే ఘనంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. యూపీలో బీఎస్పీ ఒక్క సీటే గెలుచుకుందని... ఇక్కడ ఆ పార్టీని ప్రజలు నమ్మొద్దన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉంటే రామమందిరం కట్టించేదా? కోవిడ్ వ్యాక్సిన్ ఇచ్చేదా? అని ఆయన ప్రశ్నించారు. తమ పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు.

బీజేపీని గెలిపిస్తే రైతు రాజ్యం

కరీంనగర్ బీజేపీ అభ్యర్థి బండి సంజయ్



ఎలగందులలో స్థానిక నేతలు బహూకరించిన తల్వార్‌ను చూపుతున్న బండి సంజయ్

కొత్తపల్లి(కరీంనగర్): బీజేపీని గెలిపిస్తే రైతు రాజ్యాన్ని తీసుకొస్తామని కరీంనగర్ బీజేపీ అభ్యర్థి, జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ హామీ ఇచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం ఎలగందుల, ఖాజీపూర్, నాగులమల్యాల, బద్దిపల్లి గ్రామాలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వం వ్యవసాయ యాంత్రీకరణ, ఇన్‌పుట్ రాయితీ సహా అన్ని రాయితీలను నిలిపివేసి రైతుల ఉసురు తీస్తోందని మండిపడ్డారు. మోదీ ప్రభుత్వం యూరియా పేరుతో రెండు పంటలకు కలిపి ఏటా రూ.12 వేలతోపాటు డీఏపీ, ఇతర ఎరువుల రాయితీ పేరుతో ఎకరానికి రూ.18 వేలు చెల్లిస్తోందని చెప్పారు. కిసాన్ సమ్మాన్ నిధి పేరుతో ఎకరాకు రూ.6 వేలు బ్యాంకులో జమ చేస్తోందని, ఈ లెక్కన రైతులకు మోదీ ప్రభుత్వం రూ.24 వేలు సాయం చేస్తుంటే.. కేసీఆర్ ప్రభుత్వం అన్ని రాయితీలు నిలిపివేసి రైతు బంధు పేరుతో రూ.10 వేలు మాత్రమే ఇస్తోందని వివరించారు. బీజేపీ అధికారంలోకి వస్తే వరికి కనీస మద్దతు ధర క్వింటాకు రూ.3100లు చెల్లిస్తామని, ఏటా ఉచితంగా 4 గ్యాస్ సిలిండర్లు అందజేస్తామని హామీ ఇచ్చారు. తాను ప్రజా సమస్యలపై పోరాడుతున్నానని యువకులు, ఉద్యోగులు, రైతులు, విద్యార్థుల కోసం.. పోరాడినందుకు తనపై 74 కేసులు పెట్టారని చెప్పారు. అదే బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులపై ఉన్నవి భూ కబ్జా కేసులని బండి గుర్తు చేశారు.

బీజేపీతోనే అవినీతి రహిత పాలన

- రాష్ట్రంలో అధికారంలోకి వస్తే పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గిస్తాం: అమిత్ షా
- 2.5 లక్షల ఉద్యోగాలను పారదర్శకంగా భర్తీ చేస్తాం
- బీసీని సీఎం చేస్తాం.. ఎస్సీ వర్గీకరణ చేపడతాం
- విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తాం
- ఉచితంగా అయోధ్య రాముడి దర్శనం కల్పిస్తామని హామీ



చౌటుప్పల్ రోడ్‌షోలో అభివాదం చేస్తున్న కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, హాజరైన బీజేపీ శ్రేణులు

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/చౌటుప్పల్/పటాన్‌చెరు/బంజారాహిల్స్ (హైదరాబాద్): రాష్ట్రంలో బీజేపీతోనే అవినీతి రహిత పాలన అందుతుందని.. కేంద్రంలో, రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్లు ఏర్పడితే అభివృద్ధి జరుగుతుందని బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు. బీఆర్ఎస్ సర్కారు పదేళ్ల పాలనలో భారీగా అవినీతికి పాల్పడిందని ఆరోపించారు. తాము అధికారంలోకి రాగానే పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గిస్తామని, 2.5 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని ప్రకటించారు. శనివారం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కొల్లాపూర్, సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులలో నిర్వహించిన సకల జనుల విజయ సంకల్ప సభల్లో, యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్, హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో నిర్వహించిన రోడ్ షోలలో అమిత్ షా మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

''బీఆర్ఎస్ సర్కారు నిరుద్యోగులను మోసం చేసింది. కేసీఆర్ హయాంలో 14కుపైగా ఉద్యోగ పరీక్షల పేపర్లు లీకయ్యాయి. ఉద్యోగాలు లేక యువత ఆత్మహత్యలకు పాల్పడుతోంది. బీజేపీ ప్రభుత్వం వస్తే పేపర్ లీకేజీలపై విచారణ జరిపి దోషులను జైలుకు పంపుతాం. అంతేకాదు 2.5 లక్షల ఉద్యోగాలను పారదర్శకంగా భర్తీ చేస్తాం. కేసీఆర్‌కు ఇక్కడి యువతపై ప్రేమ లేదు. కానీ ఒక్క యువకుడు.. కేటీఆర్‌ను సీఎం చేయడంపైనే ఆయన ధ్యాస అంతా ఉంది. బీఆర్ఎస్ అంటే భ్రష్టాచార్ రాక్షస సమితి. చాలా ప్రాజెక్టుల్లో అవినీతికి పాల్పడింది. బీఆర్ఎస్ కారు స్టీరింగ్ ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ చేతిలో ఉంది. ఎంఐఎంకు భయపడి కేసీఆర్ హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని జరపడం లేదు. బీజేపీ ప్రభుత్వం వస్తే.. తెలంగాణకు ఎంఐఎం చేతిలోంచి విముక్తి కల్పిస్తాం. విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తాం.

కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌లోకే..

తెలంగాణ ప్రజలు కాంగ్రెస్‌కు ఎట్టి పరిస్థితుల్లో ఓట్లు వేయొద్దు. వాళ్లకు ఓటేసి ఎమ్మెల్యేలుగా గెలిపిస్తే బీఆర్ఎస్‌లోకి వెళ్తారు. కాంగ్రెస్ ఇప్పటి ఎమ్మెల్యే అభ్యర్థి రేపటి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అవుతారు. అదే బీజేపీకి ఓట్లు వేస్తే బీఆర్ఎస్‌కు బదులు తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటవుతుంది. రాష్ట్రంలో అవినీతి అక్రమాలకు తావులేని పాలన అందిస్తాం. ఉజ్వల లబ్ధిదారులకు ఏటా నాలుగు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తాం. వాల్మీకి, బోయ, మాదాసి కురువలను కేసీఆర్ విస్మరించారు. బీజేపీ తరఫున ముఖ్యమంత్రి బీసీయే. మా ప్రభుత్వం రాగానే వాల్మీకి, బోయ, మాదాసి కురువలకు న్యాయం చేస్తాం. ఎస్సీ వర్గీకరణను త్వరలో పూర్తి చేస్తాం. రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గిస్తాం.

యూరప్ మార్కెట్‌కు కొల్లాపూర్ మామిడి

కొల్లాపూర్ మామిడి రైతులను కేసీఆర్ ప్రభుత్వం పట్టించుకోలేదు. బీజేపీ అధికారంలోకి రాగానే మామిడి ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేసి.. కొల్లాపూర్ మామిడిని యూరప్ మార్కెట్‌కు తీసుకెళ్తాం.

అయోధ్య రాముడి దర్శనం కల్పిస్తాం

కాంగ్రెస్ పార్టీ అయోధ్యలో రామ మందిర నిర్మాణానికి అడ్డు తగిలింది. అదే ప్రధాని మోదీ రామమందిర నిర్మాణం చేపట్టారు. జనవరి 22న అయోధ్యలో ప్రాణప్రతిష్ఠ జరుగుతుంది. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రాగానే ఇక్కడి ప్రజలకు విడతల వారీగా ఉచితంగా రామమందిర దర్శనం కల్పిస్తాం..'' అని అమిత్ షా తెలిపారు.

రాహుల్‌యాన్.. 20 సార్లు ఫెయిల్

మోదీ ప్రభుత్వం చంద్రయాన్‌తో చంద్రుడిపై జాతీయ జెండాను రెపరెపలాడించింది. కానీ కాంగ్రెస్ పార్టీ పదేపదే రాహుల్‌యాన్ లాంచ్ చేయాలని చూస్తోంది. 20 ఏళ్ల నుంచి 20సార్లు రాహుల్ యాన్‌ను ప్రవేశపెడితే అన్నీ ఫెయిల్ అయ్యాయి.

నివాస ప్రాంతాల్లో పరిశ్రమ సబబేనా?

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

సాక్షి, హైదరాబాద్: నివాస ప్రాంతాల్లో పరిశ్రమల నిర్వహణను ఎలా సమర్థించుకుంటారు.. ఏదైనా నిబంధన ఉంటే తెలపండంటూ.. ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణలోగా కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశాలు జారీ చేస్తూ విచారణను డిసెంబర్ 14కు వాయిదా వేసింది. హైదరాబాద్ అజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియాలో దాదాపు 136 ఎకరాల భూమిని లీజుకు తీసుకున్న కొందరు ఆ భూమిని సబ్–లీజుకు ఇచ్చారని, దీనిపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని, సదరు లీజు రద్దుకు ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తూ చిక్కడపల్లి నివాసి సి.కుమార్ రాసిన లేఖను హైకోర్టులో పిల్‌గా విచారణకు స్వీకరించింది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం విచారణ చేపట్టింది.

క్లుప్తంగా...

తుది'దశ'లో ఆదిత్య ఎల్1

తిరువనంతపురం: సూర్యుడి సంబంధ అంశాలపై మరింత లోతైన అధ్యయనం కోసం ఇస్రో ప్రయోగించిన ఆదిత్య ఎల్–1 వ్యోమనౌక త్వరలోనే దాని ఎల్–1 పాయింట్‌లోకి చేరుకోనుందని ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ వెల్లడించారు. తొలి సౌండింగ్ రాకెట్‌ను ప్రయోగించి 60 ఏళ్లు పూర్తయిన సందర్భంగా తిరువనంతపురంలోని విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్(వీఎస్ఎస్‌సీ)లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా సోమనాథ్ మాట్లాడారు. 'ఆదిత్య తన దిశలో దూసుకుపోతోంది. ఇది దాదాపు తన తుదిదశకు చేరుకుంది. ఎల్–1 పాయింట్‌లోకి దానిని చేర్చేందుకు సన్నాహక కార్యక్రమాలు చేపడుతున్నాం. వచ్చే ఏడాది జనవరి ఏడో తేదీకల్లా ఎల్–1లోకి ప్రవేశపెట్టేందుకు ప్రణాళికలు సిద్ధంచేశాం'' అని చెప్పారు.

ఢిల్లీలో 25 స్వైన్ కేసులు

సాక్షి, న్యూఢిల్లీ: వాయు కాలుష్యంతో తల్లడిల్లుతున్న దేశ రాజధాని ఢిల్లీలో స్వైన్ ఫ్లూ కేసులు పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. తాజాగా ఢిల్లీలో శనివారం ఒక్క రోజే 25 స్వైన్‌ఫ్లూ కేసులు నమోదైనట్లు నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ వెల్లడించింది. వీటితో కలుపుకుని ఈ ఏడాదిలో ఇప్పటి వరకు నమోదైన కేసులు 153కు చేరాయని పేర్కొంది. స్వైన్ ఫ్లూతో పాటు ఇన్‌ఫ్లూయెంజా (హెచ్3ఎన్2) కేసులు కూడా పెరగడంపై వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది రోగుల్లో న్యుమోనియా ఇన్ఫెక్షన్ కూడా కనిపిస్తోందని చెబుతున్నారు.

కీవ్‌పై భారీగా డ్రోన్ల దాడి

కీవ్: ఉక్రెయిన్ రాజధాని కీవ్‌పైకి రష్యా భారీ స్థాయిలో డ్రోన్ల దాడికి పాల్పడింది. 2022లో తమపై దురాక్రమణ మొదలయ్యాక రష్యా పాల్పడిన అతిపెద్ద డ్రోన్ దాడిగా ఉక్రెయిన్ మిలటరీ పేర్కొంది. శనివారం ఉదయం రాజధానితోపాటు చుట్టుపక్కల ప్రాంతాలపైకి రష్యా ప్రయోగించిన 75 ఇరాన్ తయారీ షహీద్ డ్రోన్లలో 66 డ్రోన్లను కూల్చివేసినట్లు తెలిపింది. వేకువజామున 4 గంటలకు మొదలై దాదాపు ఆరు గంటలపాటు కొనసాగిన ఈ దాడుల్లో పలు భవనాలు ధ్వంసం కాగా 11 ఏళ్ల బాలుడు సహా అయిదుగురు పౌరులు గాయపడ్డారు.

విపక్ష ఎంపీల ఐఫోన్లకు అలర్టులు...

భారత్‌కు యాపిల్ బృందం

న్యూఢిల్లీ: దిగ్గజ ఐటీ కంపెనీ యాపిల్ సైబర్ సెక్యూరిటీ ప్రతినిధులు త్వరలో భారత్‌కు రానున్నారు. గత నెలలో కాంగ్రెస్ చీఫ్ ఖర్గే సహా పలువురు ప్రతిపక్ష పార్టీల నేతల ఐఫోన్లలో వార్నింగ్ నోటిఫికేషన్లు ప్రత్యక్షమవడంతో తీవ్ర దుమారం రేగిన తెలిసిందే. కేంద్ర ప్రభుత్వమే తమ ఫోన్లను హ్యాక్ చేయిస్తోందంటూ వారు ఆరోపణలు చేశారు. ఈ వ్యవహారంపై కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీ శాఖ ఆధ్వర్యంలోని సీఈఆర్‌టీ–ఐఎన్(కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీం) యాపిల్ సంస్థకు నోటీసులిచ్చింది. భారత్‌లోని యాపిల్ సంస్థ ప్రతినిధులు సీఈఆర్‌టీ–ఐఎన్ నిపుణులను కలుసుకున్నారు. అయితే, ఈ సమస్య వారి సామర్థ్యానికి మించినదని తేలింది. దీంతో త్వరలోనే అమెరికా నుంచి యాపిల్ సైబర్ సెక్యూరిటీ ప్రతినిధుల బృందం ఇక్కడికి రానుందని ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీ శాఖ సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ వివరించారు.

ఒడిశాలో రోడ్డుప్రమాదం

ఆరుగురు మృతి, ఏడుగురికి గాయాలు

మల్కన్‌గిరి: ఒడిశాలో శనివారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఆరుగురు చనిపోగా మరో ఏడుగురు గాయాలపాలయ్యారు. ఒడిశాలోని మల్కన్ గిరి జిల్లా కలిమెల సమితిలోని హంతాల్‌గూడ ఘాట్ రోడ్డులో శనివారం సిమెంట్, ఇనుప రాడ్లతో వెళ్తున్న టిప్పర్ అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో టిప్పర్‌లో లోడుపై కూర్చున్న ఆరుగురు కూలీలు మృత్యువాత పడ్డారు. మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. మృతులు నవరంగ్‌పూర్ జిల్లా వాసులు.

2న అఖిల పక్ష భేటీ

న్యూఢిల్లీ: పార్లమెంట్ శీతాకాల సమావేశాలు వచ్చే నెల 4వ తేదీ నుంచి ప్రారంభం కానుండగా 2వ తేదీన అఖిల పక్ష సమావేశాన్ని కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. సెషన్‌కు ఒక రోజు ముందుగా అఖిల పక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయడం ఆనవాయితీ. కానీ, ఈసారి రెండు రోజులు ముందుగా ఈ భేటీని ఏర్పాటు చేసింది. డిసెంబర్ 4న మొదలై 22వ తేదీ వరకు సమావేశాలు కొనసాగనున్నాయి.

రాహుల్, ప్రియాంకా గాంధీలపై ఈసీకి బీజేపీ ఫిర్యాదు

న్యూఢిల్లీ: రాజస్తాన్‌లో ఎన్నికల వేళ ప్రచార గడువు ముగిశాక కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ వాద్రా 'ఎక్స్'లో పెట్టిన పోస్టులు ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని బీజేపీ పేర్కొంది. వీరిద్దరి సోషల్ మీడియా ఖాతాలను సస్పెండ్ చేయడం వంటి చర్యలు తీసుకోవాలంటూ ఆ పార్టీ శనివారం ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. శనివారం కాంగ్రెస్‌ను గెలిపించాలంటూ ఆ పార్టీ ఇచ్చిన హామీలను గుర్తు చేస్తూ 'ఎక్స్'లో.. 'రాజస్తాన్ ఉచిత వైద్యాన్ని ఎంపిక చేసుకుంటుంది. రాజస్తాన్ సబ్సిడీ సిలిండర్‌ను ఎంచుకుంటుంది. రాజస్తాన్ వడ్డీ లేని వ్యవసాయ రుణాన్ని కోరుకుంటుంది. రాజస్తాన్ ఇంగ్లిష్ విద్యను ఎంపిక చేసుకుంటుంది. రాజస్తాన్ పాత పింఛను విధానాన్నే కోరుకుంటుంది. రాజస్తాన్ కుల గణనకు ఎంచుకుంటుంది'అని రాహుల్ పేర్కొన్నారు. 'మీ ఓటు హక్కుల కోసం...' అంటూ కాంగ్రెస్ ఎన్నికల హామీలను ప్రియాంకా ఎక్స్‌లో జాబితాగా ఇచ్చారు.



తేజస్‌లో మోదీ



సాక్షి బెంగళూరు: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శనివారం బెంగళూరులోని హిందూస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హాల్)కు విచ్చేసిన సందర్భంగా దేశీయంగా తయారైన తేలికపాటి యుద్ధ విమానం తేజస్‌లో ప్రయాణించారు. యుద్ధ విమానంలో దేశ ప్రధాని ప్రయాణించడం ఇటీవలి కాలంలో ఇదే తొలిసారి కావడం విశేషం. శనివారం ఉదయం 9.30 గంటలకు ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో బెంగళూరులోని హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హాల్)కు చెందిన తయారీ యూనిట్‌కు ప్రధాని నరేంద్ర మోదీ వచ్చారు. పైలట్ యూనిఫామ్ ధరించి తేజస్ యుద్ధ విమానంలో సుమారు 10 నిమిషాల పాటు ప్రయాణించారు. తన యుద్ధవిమాన ప్రయాణం తాలూకు ఫొటోలు, వీడియోలను ఆ తర్వాత ప్రధాని మోదీ తన సామాజిక మాధ్యమ 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు. 'తేజస్‌లో ప్రయాణం విజయవంతంగా పూర్తయింది. ఈ ప్రయాణ అనుభవం భారతదేశ దేశీయ సామర్థ్యాలపై నా నమ్మకాన్ని మరింతగా పెంచింది. దేశీయ టెక్నాలజీ, వైమానిక సత్తా, కృషి, అంకితభావం చూస్తే గర్వంగా ఉంది. స్వావలంబనలో ప్రపంచంలోని ఏ దేశంతోనూ భారత్ తీసిపోదు. భారతీయులుగా మనందరం ఈ విషయంలో భారత వాయుసేన, డీఆర్‌డీవో, హాల్‌ను అభినందించాల్సిందే'' అని మోదీ ట్వీట్ చేశారు. విమాన ప్రయాణం తర్వాత హాల్‌లోని తయారీ కేంద్రం పనితీరును ఆయన స్వయంగా పర్యవేక్షించారు.

రాజస్తాన్‌లో 75% పోలింగ్

చెదురుమదురు ఘటనలు మినహా ఎన్నికలు ప్రశాంతం

జైపూర్

రాజస్తాన్ అసెంబ్లీకి శనివారం జరిగిన ఎన్నికల్లో 75 శాతం పోలింగ్ నమోదైంది. చెదురుమదురు ఘటనలు మినహా మొత్తమ్మీద ప్రశాంతంగా పోలింగ్ ముగిసిందని అధికారులు తెలిపారు. పోలింగ్ బూత్‌ల నుంచి పూర్తి స్థాయిలో సమాచారం అందాక తుది పోలింగ్ గణాంకాలను వెల్లడిస్తామని చీఫ్ ఎలక్టోరల్ అధికారి ప్రవీణ్ గుప్తా అన్నారు. 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 74.06% పోలింగ్ నమోదైంది. ఈ దఫా కనీసం ప్రతి నియోజకవర్గంలో 75 శాతం పోలింగ్‌ను ఎన్నికల కమిషన్ లక్ష్యంగా పెట్టుకుంది. రాష్ట్ర అసెంబ్లీలోని 200 సీట్లకుగాను 199 స్థానాలకు పోలింగ్ జరిపారు. ఓటర్ల సంఖ్య 5.25 కోట్లు. మొత్తం 51వేల పోలింగ్ బూత్‌లలో ఉదయం 7 గంటలకు మొదలైన పోలింగ్, సాయంత్రం 6 గంటలతో ముగిసింది. అప్పటికే క్యూల్లో ఉన్న వారు ఓటు వేసేందుకు అవకాశమిచ్చినట్లు అధికారులు చెప్పారు. సాయంత్రం 5 గంటల సమయానికి 68.2శాతం పోలింగ్ నమోదైంది. అత్యధికంగా జైసల్మీర్, ఆ తర్వాత హనుమాన్‌గఢ్, ధోల్‌పూర్ జిల్లాల్లో భారీ పోలింగ్ నమోదైనట్లు సీఈవో గుప్తా తెలిపారు. కాంగ్రెస్ అభ్యర్థి ఆకస్మిక మృతితో శ్రీగంగానగర్ జిల్లాలోని కరణ్‌పూర్ నియోజకవర్గం ఎన్నిక వాయిదా పడిన విషయం తెలిసిందే. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ మధ్యే ప్రధాన పోటీ నెలకొంది. భద్రత కోసం 1.70 లక్షల మంది భద్రతా సిబ్బందిని రంగంలోకి దించారు. శనివారం ఉదయం ఓటు హక్కు మొదటగా వినియోగించుకున్న ప్రముఖుల్లో సీఎం అశోక్ గెహ్లోత్, కేంద్రమంత్రులు గజేంద్ర సింగ్ షెకావత్, కైలాశ్ చౌదరి, మాజీ సీఎం వసుంధరా రాజె, మాజీ డిప్యూటీ సీఎం సచిన్ పైలట్ తదితరులున్నారు. గెహ్లోత్, షెకావత్ జోథ్‌పూర్‌లో, చౌదరి బలోత్రాలో, రాజె ఝులావర్‌లో, పైలట్ జైపూర్‌లోనూ ఓటేశారు. ఓట్ల లెక్కింపు డిసెంబర్ 3న ఉంటుంది.



బీవర్ జిల్లా సెంద్రా గ్రామంలోని పోలింగ్ బూత్ వద్ద ఓటేసేందుకు క్యూలో నిలబడిన మహిళలు

స్వల్ప ఘటనలు..

దీగ్ జిల్లా కమన్ గ్రామంలో రాళ్లు రువ్వుకున్న ఘటనలో పోలీస్ అధికారి సహా ఇద్దరు గాయపడ్డారు. 'గుమికూడిన గుంపును చెదరగొట్టేందుకు పోలీసులు 12 రౌండ్ల కాల్పులు జరిపారు. కొన్ని నిమిషాలపాటు పోలింగ్‌కు అంతరాయం ఏర్పడింది'అని దీగ్ జిల్లా ఎస్పీ చెప్పారు. సికార్ జిల్లా ఫతేపూర్‌లో రెండు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. రాళ్లు రువ్వడంతో ఒక జవాను గాయపడ్డారు. ఈ ఘటనకు సంబంధించి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ చెప్పారు. ధోల్‌పూర్ బారి నియోజకవర్గంలోని ఓ బూత్ వద్ద పోలింగ్ ఏజెంట్, మరో వ్యక్తికి మధ్య జరిగిన గొడవతో పోలింగ్ కొద్దిసేపు నిలిచిపోయినట్లు కలెక్టర్ అనిల్ కుమార్ చెప్పారు. టోంక్ జిల్లా ఉనియారాలో 40 మంది వ్యక్తులు పోలింగ్ బూత్‌లోకి ప్రవేశించేందుకు యత్నించగా అడ్డుకున్నట్లు ఎస్పీ రాజశ్రీ రాజ్ చెప్పారు. సుమేర్‌పూర్ స్థానం బీజేపీ అభ్యర్థి తరఫు ఏజెంట్ శాంతి లాల్, ఉదయ్‌పూర్‌లో సత్యేంద్ర అరోరా(62) అనే ఓటరు పోలింగ్ బూత్‌ల వద్దే గుండెపోటుతో చనిపోయారు. కొద్ది చోట్ల రీపోలింగ్ చేపట్టే విషయంలో పరిశీలకుల నివేదిక అందాక నిర్ణయం తీసుకుంటామని సీఈవో గుప్తా వివరించారు. పోలింగ్ ప్రక్రియ నిలిచిపోయినట్లు సమాచారం లేదన్నారు. కొన్ని బూత్‌లలో ఈవీఎంలు మొరాయించినట్లు ఫిర్యాదులు వచ్చినా అవి చాలా తక్కువగానే ఉన్నాయని చెప్పారు. ప్రత్యేకించి యువ ఓటర్ల కోసం పోలింగ్ బూత్‌ల వద్ద సెల్ఫీ పాయింట్లను ఏర్పాటు చేశారు.



సచిన్ పైలట్



వసుంధరా రాజె



ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోత్

డ్రిల్లింగ్‌కు భారీ అవాంతరం

- పూర్తిగా దెబ్బతిన్న ఆగర్ డ్రిల్లింగ్ మెషీన్ బ్లేడ్లు
- ఇక మాన్యువల్ డ్రిల్లింగ్ తప్పదేమో!
- కార్మికులు ఇంకొన్ని రోజులు లోపలే గడపాల్సిన పరిస్థితి

ఉత్తరకాశీ/న్యూఢిల్లీ: ఒకటి రెండు రోజుల్లో కార్మికులు సొరంగం నుంచి బయటకొస్తారన్న ఆశలకు గండి పడింది. ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశీ జిల్లా సిల్‌క్యారా సొరంగం కూలిన ఘటనలో చిక్కుకున్న 41 మంది కార్మికులను కాపాడేందుకు చేస్తున్న ఆగర్ మెషీన్ డ్రిల్లింగ్‌ను నిలిపేశారు. శిథిలాల్లో ఉన్న ఇనుప కడ్డీలు డ్రిల్లింగ్ మెషీన్ బ్లేడ్లను నాశనం చేయడమే ఇందుకు అసలు కారణం. సొరంగం అంతర్గత నిర్మాణంలో వాడిన ఇనుప కడ్డీలు సొరంగం కూలాక శిథిలాల్లో చిందరవందరగా పడి ఆగర్ మెషీన్ ముందుకు కదలకుండా అడ్డుపడుతున్నాయి. దీంతో డ్రిలింగ్ వేళ మెషీన్ బ్లేడ్లన్నీ ధ్వంసమయ్యాయి. డ్రిల్లింగ్ ప్లాన్‌ను పక్కనబెట్టి ఇక మాన్యువల్‌గా తవ్వాలని అధికారులు ప్రాథమిక అంచనాకొచ్చారు. ఇంకా దాదాపు 12 మీటర్లమేర శిథిలాల గుట్టను తొలగించాల్సి ఉంది. ''ఇదంతా తొలగించి కార్మికులను బయటకు తెచ్చేందుకు ఇంకొన్ని రోజులు/వారాలు పట్టొచ్చు' అంటూ జాతీయ విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థ సభ్యుడు, మాజీ లెఫ్టినెంట్ జనరల్ సయ్యద్ అతా హస్నాయిన్ చేసిన మీడియా ప్రకటన కార్మికుల కుటుంబాల్లో భయాందోళనలు పెంచేసింది. క్రిస్మస్ పండుగ లోపు కార్మికులను రక్షిస్తామంటూ అంతర్జాతీయ టన్నెలింగ్ నిపుణుడు ఆర్నాల్డ్ డిక్స్ చెప్పడంచూస్తుంటే ఈ మొత్తం ప్రక్రియకు నెలరోజులు పట్టేట్టు ఉందని తెలుస్తోంది. 'మరో ప్రత్యామ్నాయ ప్రణాళిక సిద్ధంగా ఉంది. కొండ పైనుంచి నిట్టనిలువునా డ్రిల్లింగ్ వచ్చే 24–36 గంటల్లో మొదలెడతాం'' అని సయ్యద్ చెప్పారు. '25 మీటర్ల డ్రిల్లింగ్ పనులు పూర్తిచేసేందుకు హైదరాబాద్ నుంచి ప్లాస్మా కట్టర్‌ను తెప్పిస్తున్నాం' అని ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామీ ఘటనాస్థలిలో చెప్పారు. డ్రిల్లింగ్‌ను నిలిపేయడంతో డ్రిల్లింగ్ చోటుదాకా వెళ్లి తాజా పరిస్థితిని ధామీ పర్యవేక్షించారు.

లోపలికి ల్యాండ్‌లైన్, ఘటనాస్థలిలో టెలిఫోన్ ఎక్స్ఛేంజ్

ప్రస్తుతానికి కార్మికులు క్షేమంగా ఉన్నారు. అయితే లోపల ఉన్న కార్మికుల మానసిక స్థైర్యం దెబ్బతినకుండా ఉండేందుకు సహాయకంగా లూడో వంటి బోర్డ్ ఆట వస్తువులతోపాటు మొబైల్ ఫోన్లను పంపించారు. నిరంతరం మాట్లాడేందుకు వీలుగా 'ల్యాండ్‌లైన్'ను పంపుతున్నారు. ఇప్పటికే ఘటనాస్థలిలో టెలిఫోన్ ఎక్స్ఛేంజ్‌ను బీఎస్ఎన్ఎల్ ఏర్పాటుచేసింది. అక్కడి పరిస్థితిని ప్రత్యక్షంగా చూసేందుకు ఎండోస్కోపిక్ కెమెరాను వాడుతున్నారు.





హమాస్ చెర నుంచి తిరిగొచ్చిన భార్యబిడ్డలతో అషెర్, 9 ఏళ్ల కుమారునితో అవీ

కన్నలూ, నన్ను మిస్సయ్యారా!?

జెరుసలేం/టెల్ అవీవ్: శుక్రవారం రాత్రి వేళ. ఇజ్రాయెల్‌లోని ష్నెయిడర్ పిల్లల ఆస్పత్రి. ప్రధాన ద్వారమంతటా భావోద్వేగ పరిస్థితులు నెలకొని ఉన్నాయి. 57 ఏళ్ల అవీ జిబ్రీ చాలాసేపటి నుంచి ఎంతో ఆత్రుతతో, ఉద్వేగంతో అటూ ఇటూ తిరుగుతున్నాడు. మాటిమాటికీ ప్రధాన ద్వారం కేసి చూస్తూ గడుపుతున్నాడు. ఎట్టకేలకు అతని ఎదురుచూపులు ముగిశాయి. తొమ్మిదేళ్ల చిన్నారి ఒహద్ అతని వైపు మెరుపు వేగంతో పరుగెత్తుకొచ్చాడు. వస్తూనే, 'నాన్నా!' అంటూ గట్టిగా కరుచుకుపోయాడు. ఆ క్షణాన వారి ఆనందానికి అంతు లేకుండా పోయింది. ఆ వెనకే అవీ భార్య, తల్లి కూడా వచ్చి అతన్ని అమాంతం వాటేసుకున్నారు! ఆ పక్కనే ఉన్న 38 ఏళ్ల అషెర్‌దీ అతని పరిస్థితే! తన భార్య డొరాన్, కూతుళ్లు అవివ్ (4), రజ్ (2) ఆస్పత్రి ప్రాంగణంలో రెడ్ క్రాస్ వాహనం దిగీ దిగగానే వారి దగ్గరికి పరుగులు తీశాడు. ముగ్గురినీ బిగ్గరగా వాటేసుకున్నాడు. తనను చూసిన ఆనందంలో కేరింతలు కొడుతున్న కూతుళ్లను పదేపదే ఆప్యాయంగా తడిమి చూసుకుంటూ కన్నీటిపర్యంతమయ్యాడు. ''కన్నలూ, నన్ను మిస్సయ్యారా? నన్నే తలచుకుంటూ బాధ పడ్డారు కదూ!'' అంటూ కూతుళ్లపై ముద్దుల వర్షం కురిపించాడు.

49 రోజుల హమాస్ నిర్బంధం నుంచి తొలి విడతలో విడుదలైన 13 మంది ఇజ్రాయెల్ బందీలు తమవారిని కలుసుకున్న సందర్భంలో కనిపించిన భావోద్వేగ సన్నివేశాలివి. వీటికి సంబంధించి ఆస్పత్రి విడుదల చేసిన వీడియోలు వైరల్‌గా మారాయి. అక్టోబర్ 7 నాటి మెరుపు దాడిలో వీరంతా హమాస్ మిలిటెంట్లకు బందీలుగా చిక్కారు. చిన్నారి ఒహద్ హమాస్ చెరలోనే తొమ్మిదో పుట్టినరోజు చేసుకోవడం విశేషం! ఆ రోజు ఇజ్రాయెల్ అంతా అతని పుట్టినరోజు వేడుకలు జరిపి సంఘీభావం ప్రకటించింది! ఒహద్‌తో పాటే అతని తల్లి, నాయనమ్మ విడుదలైనా తాతయ్య హమాస్ చెరలోనే ఉన్నాడు. ఎమిలియా అలోనీ అనే ఐదేళ్ల చిన్నారి కూడా తల్లితో పాటు విడుదలైంది. తమకోసం ఆత్రుతగా ఎదురు చూస్తున్న నాయనమ్మను కలుసుకుని ఆనందంలో మునిగిపోయింది.

తిరుగుబాటు గళానికి స్వేచ్ఛ

రమల్లా: ఆమె పేరు మారా. పాలస్తీనా యువతి. వయసు 24 ఏళ్లు. కానీ ఎదిగే దశలో అత్యంత కీలకమైన 8 ఏళ్లు ఇజ్రాయెల్ చెరలో జైలు గోడల నడుమ గడిపింది! వందేళ్లకు సరిపడా అనుభవాలు చవిచూసింది. టీనేజీలో అత్యంత అవసమైన అమ్మ ఆసరా కోసం ఎంతగానో అంగలార్చింది. అలాగని ధైర్యం మాత్రం కోల్పోలేదు. ఉత్తర ఇజ్రాయెల్‌లో తనను ఉంచిన డామన్ జైల్లోని పాలస్తీనా మహిళలు, మైనర్ల తరఫున గళమెత్తింది. చూస్తుండగానే ఇజ్రాయెల్, పాలస్తీనా మధ్య కీలక రాజకీయాంశంగా కూడా మారిపోయింది. దాంతో అక్టోబర్ 7న హమాస్ మెరుపుదాడి అనంతరం ముందు జాగ్రత్త చర్యగా మారాను మరో జైలుకు మార్చి ఇతరులతో కలిసే అవకాశం లేకుండా ఒంటరిగా ఉంచింది ఇజ్రాయెల్ ప్రభుత్వం! బందీల పరస్పర విడుదలలో భాగంగా శుక్రవారం ఇజ్రాయెల్ వదిలిపెట్టిన 39 మంది పాలస్తీనియన్లలో ఆమె కూడా ఉంది. లాంఛనాలన్నీ పూర్తై ఎట్టకేలకు శుక్రవారం రాత్రి విడుదలై రమల్లా చేరింది. తల్లి సౌసన్ అప్పటికే అక్కడ ఆమె కోసం క్షణమో యుగంగా ఎదురు చూస్తోంది. కూతురు వాహనం దిగుతూనే పరుగెత్తుకెళ్లి ఆప్యాయంగా హృదయానికి హత్తుకుంది. ఎనిమిదేళ్ల ఎడబాటును తలచుకుంటూ వారిద్దరూ కన్నీటి పర్యంతమయ్యారు. తల్లీకూతుళ్ల కలయికను చూసిన వాళ్లందరిలోనూ హర్షాతిరేకాలు పెల్లుబికాయి. ''నేను చెప్పలేదూ! నా కూతురు పోరాటాలతో రాటుదేలి అంతర్గత సౌందర్యంతో మెరిసిపోతోంది'' అని పాలస్తీనా మీడియాతో చెబుతూ మురిసిపోయింది సౌసన్.

స్కూలుకు వెళ్తుండగా...

మారా స్వస్థలం ఇజ్రాయెల్ నిర్బంధంలో ఉన్న తూర్పు జెరూసలేం. కొద్ది దూరంలోని స్కూలుకు వెళ్లే క్రమంలో తూర్పు, పశ్చిమ జెరూసలేం మధ్య ఉన్న ఎక్స్‌ప్రెస్ వేను దాటాల్సి వచ్చేది. 2015 అక్టోబర్లో 16 ఏళ్ల టీనేజర్‌గా స్కూలుకు వెళ్తుండగా ఎక్స్‌ప్రెస్ వే మీద ఇజ్రాయెల్ సైన్యం ఆమెపై కాల్పులకు దిగింది. గాయాలతో పడున్న మారాను అరెస్టు చేసింది. ఇజ్రాయెలీ సైనికాధికారిని పొడిచేందుకు ప్రయత్నించిందన్న అభియోగాలపై ఎనిమిదిన్నరేళ్ల జైలు శిక్ష పడింది. చేతిని తూట్లు పొడిచిన 12 తూటా గాయాలు శాశ్వతంగా అవిటిగా మార్చేశాయి. జైల్లో రోజులు అత్యంత దుర్భరంగా గడిచాయి. ముఖ్యంగా ఓ టీనేజర్‌గా తల్లి తోడు అత్యంత అవసరమైన తొలి రోజులు!'' అని తల్లి చేతులను గట్టిగా పట్టుకుంటూ గుర్తు చేసుకుంది మారా. కష్టాన్నైనా తట్టుకునే శక్తిని కూడా ఇచ్చాయని చెప్పుకొచ్చింది.



8 ఏళ్ల తర్వాత తల్లి చెంతకు మారా (ఎడమ)

బర్త్‌డేకు దుబాయ్ తీసుకెళ్లలేదని

భర్తను గుద్ది చంపేసింది

పుణె: తన పుట్టినరోజును పురస్కరించుకుని దుబాయ్‌కు తీసుకెళ్లి వేడుక చేయలేదనే వీరావేశంతో భర్తను భార్య పిడిగుద్దులు కురిపించి చంపేసిన ఘటన మహారాష్ట్రలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పుణెకు చెందిన 38 ఏళ్ల నిఖిల్ ఖన్నా వాన్‌వాడియా ప్రాంతంలో వ్యాపారం చేస్తుండేవారు. అతనికి 36 ఏళ్ల భార్య రేణుక ఉంది. ఆమె పుట్టినరోజు సెప్టెంబర్ 18. అదే రోజున తనను దుబాయ్‌కు తీసుకెళ్లి పుట్టినరోజు వేడుక జరపాలని పట్టుబట్టింది. అందుకు భర్త ససేమిరా అన్నాడు. ఈ నెల ఐదో తేదీన వీరి వివాహ వార్షికోత్సం జరిగింది. ఆ రోజూ తనకేమైనా ప్రత్యేక బహుమతులు ఇస్తాడేమో అని ఆశపడి భంగపడింది. ఢిల్లీలోని తన బంధువుల వేడుకలకూ వెళ్లాలని భావించినా అదీ నెరవేరలేదు. ఒకదాని వెంట మరొకటి ఏ ఒక్క ఆశ తీరకపోవడంతో నవంబర్ 24వ తేదీన భర్తతో వాగ్వాదానికి దిగింది. తీవ్ర వాదులాట సందర్భంగా వీరావేశంతో భర్త ముఖంపై పిడిగుద్దులు కురిపించింది. దీంతో ముక్కు నుంచి రక్తం కారుతూ అతను అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. భార్యాభర్త ఘర్షణ పడుతున్న విషయం తెల్సి ఇరుగుపొరుగు వారు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి భర్తను వెంటనే దగ్గర్లోని ససూన్ జనరల్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆస్పత్రికి తీసుకొచ్చేలోపే ఆయన ప్రాణం పోయిందని వైద్యులు ధృవీకరించారు.

సౌమ్యా విశ్వనాథన్ హత్య కేసు..

నలుగురు దోషులకు జీవిత ఖైదు

న్యూఢిల్లీ: 2008 నాటి టీవీ జర్నలిస్ట్ సౌమ్యా విశ్వనాథన్ హత్య కేసులో నలుగురు దోషులకు కోర్టు జీవిత ఖైదు విధించింది. మరో దోషికి మూడేళ్ల జైలు శిక్ష విధించింది. రవి కపూర్, అమిత్ శుక్లా, బల్జీత్ మాలిక్, అజయ్ కుమార్ అనే దోషులకు జీవిత ఖైదు, అయిదో దోషి అజయ్ సేథికి మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ అడిషనల్ సెషన్స్ కోర్టు జడ్జి రవీంద్ర కుమార్ పాండే శనివారం తీర్పు వెలువరించారు. దీంతోపాటు, మొదటి నలుగురికి రూ.1.25 లక్షల చొప్పున, అయిదో దోషికి రూ.7.25 లక్షల జరిమానా కూడా విధించారు. జరిమానా మొత్తం రూ.12 లక్షలను మృతురాలి కుటుంబానికి అందజేయాలని పేర్కొన్నారు. ఢిల్లీలోని ప్రముఖ ఇంగ్లిష్ వార్తా చానెల్‌లో సౌమ్యా విశ్వనాథన్ జర్నలిస్టుగా పనిచేసేవారు. 2008 సెప్టెంబర్ 30న రాత్రి కొందరు దుండగులు ఆఫీసు నుంచి కారులో నెల్సన్ మండేలా మార్గ్ గుండా ఇంటికి వెళ్తుండగా వెంబడించారు. రవి కపూర్ తన దేశవాళీ తుపాకీతో సౌమ్యపై కాల్పులకు దిగాడు. ఈ కాల్పుల్లో ఆమె ప్రాణాలు కోల్పోయారు. అనంతరం ఆమె వద్ద ఉన్న వస్తువులను దోచుకుని, తమ కారులో పరారయ్యారు. అనంతరం పోలీసులు వారి కారును స్వాధీనం చేసుకుని, అయిదుగురినీ అదుపులోకి తీసుకున్నారు. ఇది అత్యంత అరుదైన ఘటన కాదని భావించినందునే దోషులకు మరణ శిక్ష విధించాలన్న వినతిని తిరస్కరించినట్లు జడ్జి పాండే వివరించారు.

సీఎం బఘేల్‌కు డబ్బు పంపలేదు

- మహాదేవ్ బెట్టింగ్ యాప్ కేసులో నన్ను ఇరికించారు
- ఈడీ వాంగ్మూలంపై మాట మార్చిన కొరియర్

రాయ్‌పూర్: మహదేవ్ బెట్టింగ్ యాప్ కేసులో ఇటీవల ఈడీ అరెస్ట్‌చేసిన నగదు కొరియర్ ఆసిమ్ దాస్ తాజాగా మాటమార్చాడు. బెట్టింగ్ యాప్ ప్రమోటర్లు ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి భూపేశ్ బఘేల్‌కు రూ.508 కోట్ల నగదు పంపించారని విచారణలో అతడు అంగీకరించాడని ఈడీ వెల్లడించడం తెల్సిందే. ఆసిమ్ తన లాయర్ షోయబ్ అల్వీ ద్వారా మరో వాంగ్మూలమిస్తూ ఈడీ డైరెక్టర్, ప్రధాని కార్యాలయానికి లేఖ రాశారు. ''ఈ కేసులో నన్ను బలిపశువును చేస్తున్నారు. వాస్తవానికి సీఎం బఘేల్‌సహా ఏ రాజకీయనేతకూ నేను డబ్బులు అందజేయలేదు. ఈడీ అధికారులు ఇంగ్లిష్‌లో ఉన్న వాంగ్మూలంపై బలవంతంగా నా సంతకం చేయించుకున్నారు. నాకు ఇంగ్లిష్ రాదు. ఎవరో వచ్చి డబ్బు సంచులు కారులో పెట్టి వెళ్లిపోయాడు. డబ్బుతో నేను హోటల్‌రూమ్‌కి వెళ్లగానే ఈడీ అధికారులొచ్చి అరెస్ట్‌చేశారు. కేసులో నన్ను కావాలనే ఇరికించారని నాకప్పుడు అర్థమైంది'' అని దాస్ వివరించారు.

నిలిచిన బందీల విడుదల!

జెరుసలేం: ఇజ్రాయెల్–హమాస్ బందీల విడుదల ఒప్పందానికి రెండో రోజే అవాంతరం ఎదురైంది. శనివారం దాదాపు 14 మంది ఇజ్రాయెలీలను వదిలేయాల్సిన హమాస్ అడ్డం తిరిగింది. గాజాకు అత్యవసర సాయం అందడంలో ఆలస్యంపై కినుక వహించింది. ఒప్పందంలో భాగంగా గాజాకు మరింత సాయాన్ని అనుమతించేందుకు ఇజ్రాయెల్ అంగీకరించడం తెలిసిందే. ఆ మేరకు గత రెండు రోజుల్లో 340కి పైగా ట్రక్కులు ఈజిప్టు వైపు నుంచి రఫా క్రాసింగ్ దాటాయి. కానీ ఇప్పటికీ అవి గాజాకు చేరుకోకపోవడంపై హమాస్ ఆగ్రహంగా ఉంది. వాటన్నింటినీ అనుమతించడంతో పాటు మరింత సాయం కూడా అందాల్సిందేనని పట్టుబడుతోంది. అప్పటిదాకా బందీలను వదిలేది లేదని చెప్పడంతో గందరగోళం నెలకొంది. అయితే గాజాలోకి వెళ్తున్న ట్రక్కులన్నింటినీ క్షుణ్నంగా తనిఖీ చేసి గానీ పోనిచ్చేది లేదని ఇజ్రాయెల్ సైన్యం చెబుతోంది. దానికి సమయం పడుతోంది తప్ప మరేమీ లేదని చెప్పింది. ఈ నేపథ్యంలో కాస్త ఆలస్యమైనా ఒప్పందం మేరకు బందీల విడుదల ప్రక్రియ కొనసాగుతుందని ఇజ్రాయెల్ విశ్వాసం వెలిబుచ్చింది. ఇజ్రాయెల్–హమాస్ మధ్య బుధవారం నాలుగు రోజుల కాల్పుల విరామణ ఒప్పందం కుదరడం తెలిసిందే. అందులో భాగంగా 50 మంది ఇజ్రాయెలీ బందీల విడుదలకు హమాస్, ప్రతిగా 150 మంది పాలస్తీనియా ఖైదీలను వదిలేసేందుకు ఇజ్రాయెల్ అంగీకరించాయి. గాజాకు మరింత అత్యవసర సాయాన్ని అనుమతించేదుకు కూడా ఇజ్రాయెల్ ఒప్పుకుంది. శుక్రవారం తొలి రోజు 24 మందిని హమాస్, 39 మంది పాలస్తీనియన్లను ఇజ్రాయెల్ విడుదల చేశాయి. శనివారం 14 మందిని వదిలేయనున్నట్టు హమాస్ ప్రకటించింది. 42 మంది పాలస్తీనియన్లను విడుదల చేస్తామని ఇజ్రాయెల్ ప్రకటించింది.

కొచ్చిన్ వర్సిటీలో తొక్కిసలాట...

నలుగురు విద్యార్థుల దుర్మరణం

కొచ్చి: కేరళలోని కొచ్చిన్ యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో ఘోరం జరిగింది. వర్సిటీ టెక్ ఫెస్ట్‌లో భాగంగా శనివారం రాత్రి జరిగిన సంగీత విభావరిలో భారీ తొక్కిసలాట చోటుచేసుకుంది. ఈ దుర్ఘటనలో నలుగురు విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. వారిలో ఇద్దరు అమ్మాయిలు కాగా ఇద్దరు అబ్బాయిలు. మరో 64 మందికి విద్యార్థులు పైగా గాయపడ్డారు. నలుగురి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్టు చెబుతున్నారు.

వర్షం, మెట్లే కారణం!

సంగీత విభావరి వర్సిటీ ఓపెన్ ఎయిర్ ఆడిటోరియంలో ఏర్పాటైంది. ప్రఖ్యాత నేపథ్య గాయని నికితా గాంధీ తదితరులు రావడంతో ఏకంగా 2 వేల మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. దాంతో ప్రాంగణమంతా కిక్కిరిసిపోయింది. విభావరి ఊపులో ఉండగా ఉన్నట్టుండి వర్షం కురవడంతో వెనక వైపున్న వాళ్లంతా తల దాచుకునేందుకు ముందుకు తోసుకొచ్చారు. ఆ తాకిడిని తాళలేక వేదిక ముందున్న వాళ్లంతా బయటికి పరుగులు తీశారు. అదే సమయంలో బయట తడుస్తున్న వాళ్లు కూడా లోనికి తోసుకొచ్చారు. దాంతో తీవ్ర గందరగోళం నెలకొంది. ఆడిటోరియంలోకి వచ్చేందుకు, వెళ్లేందుకు ఒకటే ద్వారం ఉండటంతో చూస్తుండగానే అక్కడ తోపులాట పెరిగిపోయింది. పలువురు విద్యార్థులు ఎత్తయిన మెట్ల మీది నుంచి పడిపోయారు. వారిని మిగతా వారు తొక్కుకుంటూ పరుగులు తీయడంతో పలువురు తీవ్ర గాయాల పాలయ్యారు. ఆరుగురి పరిస్థితి విషమించడంతో హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. వారిలో నలుగురు అప్పటికే మరణించినట్టు వైద్యులు ధ్రువీకరించారు. దారుణంపై కేరళ సీఎం పినరాయి విజయన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇద్దరు మంత్రులను వెంటనే వర్సిటీకి పంపించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాల్సిందిగా ఆదేశించారు. ఉదంతంపై లోతుగా దర్యాప్తు జరిపిస్తామని ప్రకటించారు. విద్యార్థులు భారీగా రావడం, ఆకస్మిక వర్షమే ప్రమాదానికి దారి తీసినట్టు వర్సిటీ వీసీ డాక్టర్ శంకరన్ అభిప్రాయపడ్డారు.

సాక్షి కరీంనగర్

ఆదివారం | 26 | నవంబర్ | 2023



పోలింగ్ బూత్ పరిశీలన

చిగురుమామిడి: ఇందుర్తి పోలింగ్ బూత్‌ను ఎన్నికల అబ్జర్వర్ సోనం ఫిన్నింగ్స్ భాటియా పరిశీలించారు. పోలింగ్ బూత్‌లో తాగునీరు, విద్యుత్ సౌకర్యంపై ఆరా తీశారు. ఎస్సై రాజేశ్ ఉన్నారు.

మద్యం దుకాణాల మూసివేత

కరీంనగర్‌క్రైం: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా జిల్లావ్యాప్తంగా మద్యం దుకాణాలు, బార్లు మూడ్రోజుల పాటు మూసివేయనున్నారు. ఈ మేరకు కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. 28వ తేదీ సాయంత్రం 5గంటల నుంచి 30వ తేదీ సాయంత్రం వరకు, ఫలితాలు వెలువడే డిసెంబర్ మూడో తేదీన ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తయ్యే వరకు మద్యం దుకాణాలు మూసివేయనున్నట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ పి.శ్రీనివాసరావు తెలిపారు.

గరిష్టం/కనిష్టం
30.0/22.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చలి తీవ్రత పెరుగుతుంది. రాత్రి చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు



కరీంనగర్ అర్బన్: ఈ నెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ ఆడిటోరియంలో సెక్టోరల్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రతీ సెక్టోరల్ అధికారి పరిధిలో పదినుంచి పదిహేను పోలింగ్ కేంద్రాలు ఉంటాయని, వారికి కేటాయించిన పోలింగ్‌కేంద్రాలను కనీసం మూడుసార్లయినా సందర్శించి అవసరమైన వసతులు ఉండేలా చూసుకోవాలని తెలిపారు. వివిధ పార్టీలవారితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. ఎపిక్ కార్డులు, ఓటరు స్లిప్పుల పంపిణీ చివరి దశకు చేరుకుందన్నారు. పోస్టల్ బ్యాలెట్ కోసం సమర్థవంతంగా చర్యలు తీసుకుంటున్నామని, ఇప్పటివరకు కరీంనగర్‌లో 176, చొప్పదండి 162, మానకొండూరు 368, హుజూరాబాద్‌లో 261 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు.

ఎగ్జిట్ పోల్స్‌పై నిషేధం

పోలింగ్‌కు 48 గంటల ముందు నుంచి జిల్లాలో డ్రైడే తూచ తప్పకుండా పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కమిషన్ నిబంధన ప్రకారం పోలింగ్ ముగింపు సమయానికి 48 గంటల ముందు నుంచి నవంబర్ 28 సాయంత్రం 5గంటల నుంచి సైలెన్స్ పిరియడ్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. సైలెన్స్ పిరియడ్‌లో ఏలాంటి సర్వేలు, ఒపినియన్ పోల్స్, నాయకుల ఇంటర్వ్యూ, ఎన్నికల చర్చలు, ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసే వార్తలను మీడియాలో ప్రసారం చేయడానికి వీలులేదని వివరించారు. నవంబర్ 30న పత్రికలలో ఎన్నికలకు సంబంధించిన ప్రకటనల జారీ కోసం ముందస్తుగా ఎంసీఎంసీ అనుమతి తీసుకోవాలని అన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



విద్యానగర్(కరీంనగర్): చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్ అన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా శనివారం కరీంనగర్‌లోని ప్రభుత్వ వెనుకబడిన తరగతుల కళాశాల వసతి గృహం, షెడ్యూల్డ్ కులాల కళాశాల బాలికల వసతి గృహాన్ని సందర్శించారు. రాజ్యాంగం బాలికలకు కల్పిస్తున్న హక్కుల గురించి, వివిధ చట్టాలకు సంబంధించిన బాధితుల నష్టపరిహారం, బాల్య వివాహాల నిరోధక చట్టం, బాలికలపై లైంగికవేధింపులను ఎదుర్కొవడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మానవ అక్రమ రవాణా తదితర చట్టాలపై అవగాహన కల్పించారు. లీగల్ ఎడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ తణుకు మహేశ్, వార్డెన్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా తెలంగాణ రావాలి




అభివాదం చేస్తున్న రాహుల్ గాంధీ



కాంగ్రెస్ సభకు హాజరైన ప్రజలు

- కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించండి
- వేములవాడలో రాహుల్‌గాంధీ

వేములవాడ: 1200 మంది బలిదానాలు చేసుకుంటే వచ్చిన తెలంగాణ.. కల్వకుంట్ల కుటుంబం కబంధ హస్తాల్లో బందీ అయ్యిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ అన్నారు. దొరల తెలంగాణ పోయి.. ప్రజా తెలంగాణ రావాలన్నారు. వేములవాడలో శనివారం నిర్వహించిన ఎన్నికల బహిరంగసభలో రాహుల్‌గాంధీ మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే ఆరు గ్యారంటీల అమలు బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు. మహాలక్ష్మి, రైతుభరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇల్లు, ఆరోగ్య వికాసం పథకాలను పక్కాగా అమలు చేస్తామని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజల కళలను నాశనం చేసిందని, విద్యార్థుల భవిష్యత్‌ను పక్కనపెట్టిందని విమర్శించారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను దృష్టిలో ఉంచుకుని మెనిఫెస్టో విడుదల చేశామన్నారు. పదేళ్లుగా కేసీఆర్ ప్రభుత్వం చేసిన అవినీతి డబ్బులను బయటకు తీసి ప్రజలకు పంచుతామన్నారు. దేశ సంపదను ప్రధాని మోదీ తన స్నేహితులకు దోచిపెడుతుంటే.. రాష్ట్రంలో కేసీఆర్ ఆయన కుటుంబం కోసం పనిచేస్తున్నారని ఆరోపించారు.



ఒక్కసారి అవకాశం ఇవ్వండి

ఒక్కసారి ఓట్లు వేసి గెలిపిస్తే వేములవాడ నియోజకవర్గ ప్రజల సేవ చేసుకుంటానని ఆ పార్టీ అభ్యర్థి ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే ప్రజల కష్టాలు తీరుతాయన్నారు. – ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ అభ్యర్థి

జనసంద్రమైన వేములవాడ

ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ రాకతో వేములవాడ జనసంద్రమైంది. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి పెద్ద ఎత్తున జనం తరలిరావడంతో బైపాస్‌రోడ్డు జనజాతరలా మారింది. వేములవాడకు వచ్చే దారులు కాంగ్రెస్ జెండాలతో నిండిపోయాయి.

డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే అభివృద్ధి



మాట్లాడుతున్న యోగి ఆదిత్యనాథ్



బహిరంగ సభకు హాజరైన ప్రజలు



అభివాదం చేస్తున్న నాయకులు

- వేములవాడకు వికాస్ సేవలు అవసరం
- యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్

వేములవాడ: డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే అభివృద్ధి సాధ్యమని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ పేర్కొన్నారు. వేములవాడలో శనివారం నిర్వహించిన ఎన్నికల బహిరంగ సభలో మాట్లాడారు. వేములవాడకు వికాస్‌రావు సేవలు అవసరమని, భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సీనియర్ నాయకుడు సీహెచ్.విద్యాసాగర్ రావు తనయుడిగా, విద్యావంతుడిగా, వైద్యుడిగా ఈ ప్రాంతానికి ఎంతో సేవ చేస్తున్న డాక్టర్ వికాస్‌రావును గెలిపించాలని కోరారు. వికాస్‌రావును గెలిపిస్తే అయోధ్య రాం మందిరం ప్రారంభోత్సవానికి వేములవాడ వాసులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయిస్తానని ప్రకటించారు. అనంతరం జైశ్రీరామ్ నినాదాలతో హోరెత్తించారు.

ప్రజాసేవ కోసమే రాజకీయాల్లోకి..

ప్రజాసేవ కోసమే రాజకీయాల్లోకి వచ్చానని, తనను గెలిపిస్తే వేములవాడను అభివృద్ధి చేసి చూపిస్తానని బీజేపీ అభ్యర్థి డాక్టర్ వికాస్‌రావు పేర్కొన్నారు. యువతకు ఉపాధిమార్గాలు చూపుతానని హామీ ఇచ్చారు. మహిళలు ఇబ్బందులు పడకుండా సౌకర్యాలు కల్పిస్తానన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఎక్కువ నిధులు తీసుకొచ్చి రాజన్న ఆలయాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలుపుతానన్నారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, భారీ ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లలు దాటిన చైతన్యం

ఓటేసేందుకు వచ్చిన ప్రవాసీలు

- ఎక్కడున్నా మనసంతా ఇక్కడే..
- అమెరికా, న్యూజిలాండ్ నుంచి స్వస్థలానికి
- ప్రతీసారి ఓటేస్తాం అంటున్న ఎన్నారైలు



కరీంనగర్ అర్బన్: ఏ దేశమేగినా ఎక్కడున్నా ఓటే తమ అభిమతమని చాటుతున్నారీ యువత. ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగమే తమ నినాదమని ధీమాగా చెబుతున్నారు. బాల్య వయసులో పాఠ్యాంశంలోని అంశాలు, యువ వయసులో జిల్లా, రాష్ట్ర, జాతీయ రాజకీయాలను గమనిస్తున్న సదరు యువత ఓటెత్తుతామని అంటున్నారు. ఒక్కొక్కరు ఒక్కో దేశంలో ఉపాధి పొందుతున్నారు. ఏళ్లుగా అక్కడే స్థిరపడగా.. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలొచ్చాయంటే స్వదేశీబాట పడుతున్నారు. జిల్లా నుంచి వేల సంఖ్యలో అమెరికా, స్విట్జర్లాండ్, లండన్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, రష్యా తదితర దేశాల్లో ఉపాధి పొందుతున్నారు. సదరు దేశాల్లో ఓటు ప్రాధాన్యమెక్కువ. ఓటేయకుంటే శిక్షలున్న సంగతి తెలిసిందే. అసెంబ్లీ ఎన్నికల క్రమంలో వందల మంది కరీంనగర్‌కు చేరుకోగా.. ఓటేసేందుకు మేమొచ్చాం.. మీరు ఓటేసేందుకు వస్తారుగా అంటూ సహచర స్నేహితులను చైతన్యపరుస్తున్నారు. ఈ సందర్భంగా వారి వాయిస్ వినిపించారు.

ఓటుపై మమకారంతో..



కరీంనగర్‌లోని విద్యానగర్‌కు చెందిన కె.కీర్తన కొన్నేళ్లుగా అమెరికాలోని పెన్సుల్‌వెనియా ప్రాంతంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తోంది. ఓటు హక్కు పొందిన నుంచి ఏ ఎన్నికలు వచ్చినా ఓటేస్తోంది. ఎన్నికలు వచ్చాయంటే చాలు.. ముందస్తుగా ప్రణాళిక రూపొందించుకొని కరీంనగర్ వచ్చేస్తోంది. రాజ్యాంగాన్ని గౌరవిస్తూ ఓటు హక్కును వినియోగించుకుంటేనే సార్థకత చేకూరుతుందంటోంది కీర్తన.

అమెరికాలో వైద్యవిద్య



ఎంబీబీఎస్ పూర్తి చేసిన డా.ప్రియాంక ఎండీ విద్య కోసం అమెరికా వెళ్లాల్సి ఉండగా.. తన ప్రయాణాన్ని వాయిదా వేసుకుంది. ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఇక్కడే ఉండాలని నిర్ణయించుకుంది. ప్రజాస్వామ్యం కల్పించిన ఓటు హక్కు వినియోగించుకునేలా తన మిత్రులను చైతన్యపరుస్తోంది. అన్ని పార్టీల అభ్యర్థుల గురించి నిశితంగా పరిశీలిస్తున్నానని, సమర్థునికే ఓటేస్తానని చెబుతోంది డాక్టర్ ప్రియాంక.

రాజకీయాలంటే ఆసక్తి



అమెరికాలోని పెన్సుల్‌వెనియా ప్రాంతంలో స్థిరపడిన ఉనుకొండ రాజీవ్‌కు మూర్‌ది నగరంలోని విద్యానగర్. సాఫ్ట్‌వేర్ రంగంలో రాణిస్తున్నాడు. కంపెనీ అమెరికాలో అవకాశం కల్పించగా.. తన ప్రతిభతో అక్కడే స్థిరపడ్డాడు. ఎన్నికలొచ్చాయంటే రాష్ట్ర రాజకీయాలపై ఆసక్తి చూపుతుంటాడు. ఆయా పార్టీల మేనిఫెస్టోలు, అభ్యర్థుల నేర చరిత్ర తదితర వివరాలను ఆరా తీస్తూనే ప్రచార సరళిని పరిశీలిస్తుంటాడు. తీరా పోలింగ్ సమయానికి భారత్ రావడం.. ఓటేయడం ప్రతీసారి చేస్తుంటానని, ఇటీవలే మన దేశానికి వచ్చానని చెబుతున్నారు రాజీవ్.

బాధ్యతగా భావించి..



ఓటును బాధ్యతనుకుంటేనే శ్రేయస్కరమంటున్నారు విద్యానగర్‌కు చెందిన బుట్టం శ్రీజ. న్యూజిలాండ్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా చేస్తోంది. దూర ప్రాంతంలో ఉన్నా.. ఓటేయడం బాధ్యతగా భావిస్తోంది. అందుకే ఖర్చులకు వెరవకుండా తొలిసారి అసెంబ్లీ ఎన్నికల్లో ఓటేస్తోంది. ఓటరు కార్డు పొందడం భారత్‌లో సులువని, అదే న్యూజిలాండ్‌లో కష్టమని, నిబంధనలు కఠినంగా ఉంటాయని చెబుతోంది. ఒకసారి ఓటు హక్కు పొందాక ఓటేయకుంటే జరిమానాలుంటాయని వివరించింది.

ఓటుతోనే మన భవిత



నగరంలోని విజయపురికాలనీకి చెందిన తోట సందీప్ 8సంవత్సరాలుగా అమెరికాలోని జార్జియాలో ఉపాధి పొందుతున్నారు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా చేస్తున్నాడు. రెండేళ్లకోసారి భారత్ వస్తుండగా.. ఎన్నికల సమయంలో మాత్రం తన షెడ్యూల్‌ను ఓటేసేలా మలుచుకుంటున్నాడు. ఇప్పటివరకు ప్రతి ఎన్నికలో ఓటేశానని చెబుతున్న సందీప్.. ఓటుతోనే భవిత ఉంటుందని.. ఓటును నిర్లక్ష్యం చేయొద్దని చెబుతున్నాడు.

ఓటు వజ్రాయుధం



సుపరిపాలన కావాలన్నా.. రాచరిక పరిపాలన పోవాలన్నా ఓటే వజ్రాయుధమంటున్నారు కడారి ప్రేమ్‌కుమార్. విద్యానగర్‌కు చెందిన ప్రేమ్ కొన్నేళ్లుగా న్యూజిలాండ్‌లోని అక్లాండ్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. గతంలో ఆస్ట్రేలియాలోనూ కంపెనీ బాధ్యతలు నిర్వహించారు. ఎన్నికలొచ్చాయంటే చాలు.. ఇక్కడి స్నేహితులకు ఫోన్ చేసి ఓటేయాలని చైతన్యం కల్పించడం, పోలింగ్‌కు వారం రోజుల ముందే భారత్ వస్తుంటానని చెబుతున్నారు.

అందుబాటులో ఉంటా.. అండగా ఉండండి

- సంజయ్ పెద్ద దొంగ.. శ్రీనివాస్ రౌడీషీటర్
- బావుపేటలో ఎన్నికల ప్రచారంలో మంత్రి గంగుల కమలాకర్



బావుపేటలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ కార్యకర్తలు



మాట్లాడుతున్న మంత్రి గంగుల కమలాకర్



కమలాకర్‌కు స్వాగతం పలుకుతున్న మహిళలు

కొత్తపల్లి(కరీంనగర్)/కరీంనగర్: కరీంనగర్ నియోజకవర్గ ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉండటం వల్లే మూడుసార్లు ఆశీర్వదించి అసెంబ్లీకి పంపారని, మరోసారి గెలిపిస్తే రుణపడి ఉంటానని బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. శనివారం కొత్తపల్లి మండలం బావుపేటలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బండి సంజయ్ పెద్ద దొంగ అని.. శ్రీనివాస్ రౌడీ షీటర్ అని మండిపడ్డారు. ఎన్నికలు రాగానే మాయమాటలు చెప్పేందుకు పెద్ద దొంగ వస్తున్నాడని, ఎంపీగా గెలిపిస్తే నాలుగున్నర ఏళ్లుగా పత్తా లేకుండా పోయిన సంజయ్ ఒక్క గ్రామానికి రూపాయి నిధులు తెచ్చింది లేదని అన్నారు. 32 కేసులున్న భూకబ్జాదారు కాంగ్రెస్ అభ్యర్థి శ్రీనివాస్ అని, అతన్ని గెలిపిస్తే భూములన్నీ కబ్జా చేస్తాడని తెలిపారు. ఎంపీపీ పిల్లి శ్రీలతమహేశ్, జెడ్పీటీసీ పిట్టల కరుణ, ఏఎంసీ చైర్మన్ రెడ్డవేణి మధు తదితరులు పాల్గొన్నారు. నగరంలోని 48,49,52,12 డివిజన్లలో మేయర్ వై.సునీల్‌రావుతో కలసి గంగుల ప్రచారం నిర్వహించారు. ఎంపీగా బండి సంజయ్ నగర అభివృద్ధిని పట్టించుకోలేదని అన్నారు. కరీంనగర్ అభివృద్ధిని చూసి మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. తెల్లరేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి సన్నబియ్యం ఇస్తామని తెలిపారు. కార్పొరేటర్లు తోటరాములు, అఖిల్ ఫెరోజ్ కో–ఆప్షన్ సభ్యులు పుట్ట నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

సంజయ్ నివేదిక అబద్ధాల పుట్ట

కరీంనగర్ అభివృద్ధిపై బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ విడుదల చేసిన నివేదిక అబద్ధాల పుట్ట అని మేయర్ యాదగిరి సునీల్ రావు అన్నారు. కరీంనగర్‌లో శనివారం ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో మాట్లాడుతూ.. కరీంనగర్ అభివృద్ధిపై రంగురంగుల బుక్‌లెట్ విడుదల చేసే దానిపై ఉన్న శ్రద్ధ ఒక ఎంపీగా బండి సంజయ్‌కి అభివృద్ధి మీద ఉంటే బాగుండేదని ఎద్దేవా చేశారు. నగరపాలక సంస్థకు రూ.90లక్షల ఎంపీ ల్యాడ్స్ రాగా.. అవీ బీజేపీ కార్పొరేటర్లకు మాత్రమే ఇచ్చారని అన్నారు. అవి కాకుండా కేంద్రం ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి అయినా తెచ్చిఉంటే బహిరంగా ఆధారాలు చూపాలని సవాల్ విసిరారు. కరీంనగర్ అభివృద్ధి అంటే మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. ప్రజల చేతిలో బండి సంజయ్‌కి ఓటమి తప్పదన్నారు. కార్పొరేటర్లు గంట కల్యాణి, బండారి వేణు, నేతికుంట యాదయ్య, చాడగొండ బుచ్చిరెడ్డి, కంసాల శ్రీనివాస్, దిండిగాల మహేశ్, అర్ష కిరణ్మయి, ఎడ్ల సరిత, కొండపల్లి సరిత, కచ్చు రవి తదితరులు పాల్గొన్నారు.

వీరుడు కావాలా? కబ్జా కోరులు కావాలా?

- ప్రజల కోసమే నా జీవితం.. పోరాడితే నాపై 74 కేసులు
- కొత్తపల్లి మండలంలో ఎన్నికల ప్రచారంలో ఎంపీ బండి సంజయ్



కొత్తపల్లి మండలం ఎలగందులలో బండి సంజయ్ ప్రచారం, హాజరైన ప్రజలు



మాట్లాడుతున్న ఎంపీ బండి సంజయ్



సంజయ్‌తో కరచాలనం చేస్తున్న మహిళలు

కొత్తపల్లి(కరీంనగర్)/కరీంనగర్/కరీంనగర్‌రూరల్: కుటుంబాన్ని వదిలి ప్రజల కోసం పోరాటం చేసే వీరుడు కావాలో.. భూ కబ్జాలకు పాల్పడేవారు కావాలో ప్రజలు ఆలోచించాలని కరీంనగర్ బీజేపీ అభ్యర్థి, జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ విజ్ఞప్తి చేశారు. కొత్తపల్లి మండలం ఎలగందుల, ఖాజీపూర్, నాగులమల్యాల, బద్దిపల్లి గ్రామాల్లో శనివారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బండి మాట్లాడుతూ.. సబ్సిడీలన్నీ బంద్ చేసి కేసీఆర్ ప్రభుత్వం రైతుల ఉసురు తీస్తోందని మండిపడ్డారు. ప్రజల కోసం అనేక పోరాటాలు చేసి తన జీవితాన్నే ధారపోశానని, 74 కేసులు ఎదుర్కొంటున్నానని అన్నారు. ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు ఏం చేస్తున్నరో ప్రజలకు వివరించి ఓట్లడగాలన్నారు. గంగుల కమలాకర్ అధికారంలో ఉండి ఏమీ చేయలేక, తనపై అవినీతి ఆరోపణలు చేయడమే పనిగా పెట్టుకున్నారని ఆక్షేపించారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ అభ్యర్థులది భూకబ్జాల చరిత్ర అని, వాళ్లపై కబ్జాలు, ఫోర్జరీలు, అక్రమ సంపాదన, ఐటీ కేసులు ఉన్నాయని, ఎన్నికలైపోగానే వాళ్లిద్దరూ ఒక్కటై రాజీ చేసుకుంటారని ఆరోపించారు. ప్రజలందరూ పువ్వు గుర్తుపై ఓటేయించాలని కోరారు. అంతకుముందు కరీంనగర్ రైల్వేస్టేషన్‌లో హమాలీ కార్మికులతో సమావేశం అయ్యారు. ఇరుకుల్ల, ఎలబోతారంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రైల్వే హమాలీలకు స్వయంగా బీమా ప్రీమియం చెల్లిస్తానన్నారు. ధాన్యంలో తాలు పేరిట క్వింటాల్‌కు ఐదారు కిలోలను రైసుమిల్లర్లు కోత పెడుతున్నప్పటికీ మంత్రి గంగుల కమలాకర్ పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. తెలంగాణ ప్రజల రాత మారాలంటే బీజేపీకే ఓటేసి గెలిపించాలని కోరారు.

ప్రధాని మోదీ సభకు ఏర్పాట్లు

ఈనెల 27న ప్రధానమంత్రి హోదాలో నరేంద్ర మోదీ తొలిసారి కరీంనగర్ వస్తుండటంతో పార్టీ శ్రేణులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యాయి. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ ఎస్సారార్ కళాశాల మైదానాన్ని సందర్శించారు. సభ ఏర్పాట్లను పరిశీలించారు. పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సీహెచ్.విఠల్, మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్ల రమేశ్ తదితరులతో కలిసి మీడియాతో మాట్లాడుతూ... తొలిసారి ప్రధాని హోదాలో మోదీ వస్తున్న నేపథ్యంలో బహిరంగసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ప్రతీ గ్రామం, మండలం నుంచి భారీ ఎత్తున ప్రజలను తరలించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

క్లుప్తంగా

రెనె హాస్పిటల్‌కు ఈహెచ్‌ఎస్ అనుమతి



కరీంనగర్‌టౌన్: రెనె హాస్పిటల్‌కు ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్(ఈహెచ్‌ఎస్) అనుమతి లభించింది. ఈ సందర్భంగా ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ బంగారి స్వామిని టీఎస్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందూరి రాజిరెడ్డి, సంఘం బాధ్యులు శనివారం ఆస్పత్రిలో కలిసి అభినందించారు. కార్యక్రమంలో టీఎస్‌టీయూ బాధ్యులు బండ నరసింహారెడ్డి, పాలోజి రవీందర్, కాలువ లక్ష్మణ్, ఆర్.సీతారాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సత్యనారాయణ, అన్నాడి లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'అల్ఫోర్స్'లో ముందస్తు కార్తీక పౌర్ణమి



రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట అల్ఫోర్స్ పాఠశాలలో శనివారం ముందస్తు కార్తీక పౌర్ణమి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను జరిపారు. గురునానక్ జయంతి నిర్వహించారు. విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మద్యం పట్టివేత



కరీంనగర్ క్రైం: అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ తాతాజీ తెలిపారు. నవీన్‌కుమార్ అనే వ్యక్తి శనివారం బైక్‌పై మద్యం తరలిస్తుండగా కరీంనగర్‌లోని మంచిర్యాల చౌరస్తా ఏరియాలో పట్టుకున్నామని అన్నారు. రూ.25,000 విలువైన మద్యం బాటిళ్లు, బైక్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అతనిపై కేసు నమోదు చేశామన్నారు. ఎస్‌ఐ రూప, సిబ్బంది రవికుమార్, జగన్, మహేశ్ ఉన్నారు.

వ్యక్తికి జరిమానా

చిగురుమామిడి: మండలంలోని సుందరగిరికి చెందిన కాశవేణి సమ్మయ్యకు తహసీల్దార్ నరేందర్ రూ.50 వేల జరిమానా విధించారు. వివరాల్లోకి వెళ్తే.. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గత నెల 17న సమ్మయ్యను పోలీసులు తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. గతంలో చేసిన తప్పులు మళ్లీ చేస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించి, వదిలేశారు. అయినా అతనిలో మార్పు రాలేదు, అదే నెల 31న మరో నేరం చేశాడు. దీంతో సమ్మయ్యపై పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. శనివారం మళ్లీ తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేయగా జరిమానా విధించారు. ఆరు నెలల వరకు అతని ప్రవర్తనపై నిఘా ఉంచాలని ఆదేశించినట్లు ఎస్‌ఐ రాజేశ్ తెలిపారు.

సీసీఐ పత్తి కొనుగోళ్లు

జమ్మికుంట: స్థానిక వ్యవసాయ పత్తి మార్కెట్ పరిధిలోని మిల్లుల్లో సీసీఐ శనివారం 48.40 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసింది. ముగ్గురు రైతులు నేరుగా పత్తిని విక్రయించేందుకు తీసుకురాగా క్వింటాల్‌కు గరిష్ఠ ధర రూ.6,950, మోడల్ ధర రూ.6,809, కనిష్ఠ ధర రూ.6,739 పలికింది. కొనుగోళ్లను మార్కెట్ కార్యదర్శి గుగులోతు రెడ్డినాయక్ పర్యవేక్షించారు.

పోస్టల్ బ్యాలెట్ గందరగోళం

- దరఖాస్తు చేసినా జాబితాలో లేని పేర్లు
- ఎన్నికల విధుల్లో ఉండేవారికి ఓటేసే సౌకర్యమేది?
- విధుల కేటాయింపు ఆలస్యం.. ఆపై ఓటుకు దూరం



కరీంనగర్‌లో బారులుతీరిన ఉద్యోగులు



చొప్పదండి: బ్యాలెట్ కోసం వచ్చిన ఉద్యోగులు

కరీంనగర్ అర్బన్/చొప్పదండి: పోస్టల్ బ్యాలెట్ గందరగోళానికి దారితీస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటేద్దామని ఆశించిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు విధులను ఆలస్యంగా కేటాయించారన్న ఆరోపణలున్నాయి. పలువురు శిక్షణ సమయంలోనే ఫాం–12 ద్వారా దరఖాస్తు సమర్పించినా జాబితాలో పేర్లు నమోదు కాలేదని అంటున్నారు. ఈ క్రమంలో పోస్టల్ బ్యాలెట్ ఓటు వేసేందుకు అవకాశం ఇస్తారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు కరీంనగర్, చొప్పదండి ఆర్వో కార్యాలయాల వద్దకు ఉద్యోగులు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. ఎలాంటి ఏర్పాట్లు లేవని అంటున్నారు. అదనపు కౌంటర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 5 వేల మందికి పైగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులుగా, ఇతర సహాయక సిబ్బందిగా విధులు కేటాయించారు. వీరంతా ఈ నెల 30న జరిగే పోలింగ్ విధుల్లో ఉండనున్నారు. అయితే, చాలా మంది ఉపాధ్యాయులు తమకు బ్యాలెట్ ఇవ్వడం లేదని, అధికారులను సంప్రదించినా స్పందించడం లేదని వాపోతున్నారు.

వేర్వేరు నియోజకవర్గాల్లో విధులు

కరీంనగర్‌లో ఉండే ఉద్యోగ, ఉపాధ్యాయులకు హుజూరాబాద్, చొప్పదండి, మానకొండూరు, వేములవాడ, సిరిసిల్ల, జగిత్యాల ప్రాంతాలకు కేటాయించారు. వీరిలో పలువురికి వారం రోజుల క్రితం ఆర్డర్ కాపీలు చేరగా మరికొందరికి రెండు, మూడు రోజుల క్రితమే విధులు కేటాయించారని చెబుతున్నారు. దీంతో పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేయలేని పరిస్థితి నెలకొంది. జీవో 317 కింద దాదాపు 70 మంది ఇతర జిల్లాలకు గతంలో బదిలీపై వెళ్లారు. వారంతా పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకున్నా ఇప్పటివరకు బ్యాలెట్ అందలేదు.

ఇతర జిల్లాలవాసులదీ అదే తీరు

కరీంనగర్ జిల్లాలో జగిత్యాల, మంచిర్యాల జిల్లాల వాసులు ఉద్యోగ, ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారు. వారికి కరీంనగర్, హుజూరాబాద్ నియోజకవర్గాల్లో విధులు కేటాయించగా.. పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకున్నా అందలేదు. కొందరికి అందినా దాన్ని ఎక్కడ అందజేయాలో సమాచారం లేదు. ఇప్పటికే రెండుసార్లు ఫాం–12ని పూరించి, అధికారులకు అందజేసినా పోస్టల్ బ్యాలెట్ అందలేదని ఉపాధ్యాయులు వాపోతున్నారు. ఎన్నికల విధుల్లో ఉన్న ప్రతీ ఒక్కరికి ఓటు వేసే అవకాశం కల్పించాలని కోరుతున్నారు.

సెలవు పెట్టుకొని మరీ వస్తున్నారు..

రిటర్నింగ్ కార్యాలయంలో సాయంత్రం అయిదు గంటల తర్వాత పోస్టల్ బ్యాలెట్ తీసుకోవడానికి ఎన్నికల అధికారులు నిరాకరిస్తున్నారు. దీంతో ఉద్యోగులు ఒక పూట సెలవు పెట్టుకొని మరీ వస్తున్నారు. దీంతో సాయంత్రం పూట రద్దీ ఎక్కువగా ఉంటోంది. తీరా లిస్టులో పేరు కనిపించకపోవడంతో వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మూడు, నాలుగు రోజుల నుంచి ఆఫీస్ చుట్టూ ప్రదక్షిణలు చేసినా ఇప్పటికీ పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోలేదని చొప్పదండి నియోజకవర్గానికి చెందిన పలువురు ఉద్యోగులు వాపోతున్నారు. రాత్రి 8 గంటల వరకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పష్టత ఇవ్వక పోవడంతో స్థానిక అధికారులు చేతులెత్తేస్తున్నారు. శనివారం కరీంనగర్‌లో రాత్రి 12 గంటల వరకు పోస్టల్ బ్యాలెట్ కొనసాగింది.

గడువు పొడిగించాలి

సప్తగిరికాలనీ(కరీంనగర్): ఎన్నికల విధుల్లో పాల్గొననున్న టీచర్లందరికీ పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే అవకాశం కల్పించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రాములు కోరారు. శనివారం పాఠశాల సమయం ముగిసిన తర్వాత పలువురు టీచర్లు కరీంనగర్ ఆర్వో కార్యాలయానికి రాగా సంబంధిత అధికారులు సాయంత్రం 5 గంటల వరకే గడువు ముగిసిందని నిరాకరించారని తెలిపారు. ఎలాంటి ముందస్తు సూచన చేయకుండా గడువు ముగించడం సరికాదని, వెంటనే పొడిగించాలన్నారు.

ఎట్లా ఉంది? ఏం కావాలి?

- పోలింగ్ సమీపిస్తుండటంతో మారిన ప్రచార వ్యూహం
- చేరికలు తగ్గించి ఓటరును ప్రసన్నం చేసుకునేందుకే ప్రియారిటీ
- ఓటరు జాబితా ఆధారంగా లెక్కలు తీస్తూ ముందుకు
- పోల్ మేనేజ్‌మెంట్‌పై ఫోకస్ చేస్తున్న అభ్యర్థులు



'తమ్మీ మీ ఊళ్లో గాలి ఎటు వీస్తుంది? ఓటర్లు ఏమనుకుంటున్నరు? మనమీద ఎవ్వరైనా నారాజ్‌గా ఉన్నార? ఉంటే చెప్పు. వాళ్లను మనవైపు తిప్పుకోవాలంటే ఏంచేయాలో చెప్పు. వారికి ఏం కావాలో తెలుసుకుని చెప్తే అన్నీసెట్ చేద్దాం. వాళ్ల కుల, యువజన సంఘం లీడర్లను పట్టుకుని నా దగ్గరికి తీసుకరా. వారితో సాయంత్రం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించు. దేనికీ తగ్గొద్దు. కచ్చితంగా మనం గెలవాలె' అని ప్రధాన పార్టీల నేతలు ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు తాయిలాలతో ఎర వేస్తున్నారు.

ఒక్కో పోలింగ్ కేంద్రంలో 800 నుంచి 1,000మంది వరకు ఓటర్లు ఉంటారు. 800మంది ఉంటే అందులో 350మందిని తమవైపు తిప్పుకుంటే గెలుపొందవచ్చు. ఇప్పటికే నియమించిన బూత్ కమిటీలను యాక్టివ్ చేసిన నేత.. వివిధ పథకాల ద్వారా లబ్ధిపొందిన వారు ఎందరు? తమ పార్టీ ఎవరు? పక్క పార్టీ వారికి ఓట్లు వేసేవారు ఎవరు? తటస్థ ఓటర్లు ఎవరు? అనే వివరాలు సేకరిస్తున్నారు. అందులోంచి ఎంపిక చేసుకున్న 350మందికి పోలింగ్ ముందు రోజు నోటు చేరేలా పకడ్బందీ ప్రణాళిక రచిస్తున్నారు. 60మంది ఓటర్లకు ఓ ఇన్‌చార్జిని నియమించి, రోజూ వారిని కలిసి తమ పార్టీకే ఓటు వేయాలని అభ్యర్థించేలా ప్రచారం చేస్తున్నారు. ఇలా ప్రచారం చేసే బూత్‌స్థాయి నాయకులకు ధావత్ కింద రూ.5వేలు ముట్టజెబుతున్నారు.

సాక్షి, పెద్దపల్లి: ఆత్మీయ సమ్మేళనాలు, ఇంటింటా ప్రచారాలు, భారీ బహిరంగ సభలతో ఉమ్మడి జిల్లాలో ఎన్నికల ప్రచారం తారస్థాయికి చేరింది. నిన్నా మొన్నటి దాకా చేరికలకు ప్రాధాన్యం ఇచ్చిన నేతలు.. ప్రచారానికి మూడు రోజుల గడువే ఉండడంతో పోలింగ్ కేంద్రాల వారీగా లెక్కలు తీస్తూ గుంపగుత్తగా ఓట్లు రాబట్టేలా ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో పట్టు సాధించేందుకు అనుచరులతో కలిసి వ్యూహాలు అమలు చేస్తున్నారు.

వివిధ వర్గాలతో ఆత్మీయ సమావేశాలు

ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే బూత్‌స్థాయిలో మద్యం ఏరులై పారుతోంది. కుల, యువజన సంఘాలు, ఆర్‌ఎంపీలు, లారీ అసోసియేషన్‌లు, ఆటో డ్రైవర్లు, పింఛన్‌దారులు, కార్మికులు.. ఇలా ప్రతీ సంఘాన్ని ప్రసన్నం చేసుకునేలా కీలక నేతలకు బాధ్యతలు అప్పగించారు. ఆయా వర్గాలతో ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తున్నారు. కోరుకున్న వారికి ప్రత్యేక పార్టీలు ఇస్తూ పోలింగ్ నాటికి అంతా చక్కబెట్టుకునేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు.

పోల్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి

సభలు, ర్యాలీలు, ప్రచారం ఎలా కొనసాగినా.. ప్రచార సమయం ముగిసిన తర్వాత పోల్ మేనేజ్‌మెంట్ ఎన్నికల్లో విజయానికి కీలకం. ఉమ్మడి జిల్లాలో గత ఎన్నికల్లో కొందరు నేతలు ప్రచారం ఎలా నిర్వహించినా.. పోల్ మేనేజ్‌మెంట్ పక్కాగా అమలుచేసి విజయం సాధించారు. మరికొందరు ప్రచారం హోరెత్తించి పోల్ మేనేజ్‌మెంట్‌లో విఫలమై ఓడిన సందర్భాలు ఉన్నాయి. గత అనుభవాలతో అన్నిపార్టీల నేతలు ఓటరుకు తాయిలాలు నేరుగా అందించటంతోపాటు, పోలింగ్‌కేంద్రానికి తీసుకెళ్లి ఓటు వేయించే దాకా పక్కా ప్రణాళికతో అప్రమత్తంగా ఉంటున్నారు. ఇవన్నీ సాఫీగా సాగేలా కమిటీలు నియమించి, నమ్మకమైన నేతలు, బంధువులకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

31 దేశాల్లో 'ఓటు' తప్పనిసరి

- వేయకుంటే జరిమానా, ప్రభుత్వ సాయం నిలిపివేత
- ఓటుహక్కూ తొలగింపు



కరీంనగర్ అర్బన్: మన దేశంలో కొన్నిచోట్ల 60 శాతం ఓటింగ్ జరిగితే గొప్పగా చెప్పుకునే పరిస్థితి ఉంది. అందుకే దీన్ని హక్కుగా చూడకుండా బాధ్యతగా తీసుకోవాలని ఎన్నికల సంఘం సూచిస్తోంది. ఓటు వేయడాన్ని తప్పనిసరి చేయాలన్న డిమాండ్ కూడా ప్రజాస్వామ్యవాదుల నుంచి బలంగా వినిపిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా 31 దేశాల్లో ఓటు వేయడం తప్పనిసరి. వేయకుంటే కొన్ని దేశాలు జరిమానా విధిస్తుండగా, మరికొన్ని ప్రభుత్వ సాయాన్ని, సదుపాయాలను నిలిపివేస్తున్నాయి. ఇంకొన్ని దేశాల్లోనైతే అలాంటి వారికి ఏకంగా ఓటు హక్కును తొలగించేస్తున్నారు. ఎందుకు ఓటు వేయలేకపోయారో సరైన కారణం చూపితే గానీ మళ్లీ ఆ హక్కును కల్పించరు. తప్పనిసరిగా ఓటు వేయాల్సిన దేశాల్లో బెల్జియం, అమెరికా, ఆస్ట్రేలియా, ఆస్ట్రియా, అర్జెంటీనా, బొలీవియా, ఉక్రెయిన్, బ్రెజిల్, ఈజిప్టు, గ్రీస్, ఇటలీ, మెక్సికో, ఫిలిప్పీన్స్, సింగపూర్, థాయిలాండ్, టర్కీ, స్విట్జర్లాండ్, న్యూజిలాండ్ తదితరాలు ఉన్నాయి.

బెల్జియం : 10 వేల యూరోల వరకు జరిమానా

ఈ దేశంలో ఓటరు జాబితాలో పేరు ఉండి, వరుసగా నాలుగుసార్లు ఓటెయ్యకపోతే.. పదేళ్ల వరకు ఓటుహక్కు తొలగిస్తారు. మొదటిసారి ఓటు వేయకపోతే 2 వేల నుంచి 4 వేల యూరోల వరకు, రెండోసారి 10 వేల యూరోల వరకు జరిమానా విధిస్తారు. పైగా సర్కారు ఉద్యోగావకాశాలు, పథకాలు, సదుపాయాల్లో ప్రాధాన్యం తగ్గిస్తారు. ఎన్నికలు జరిగిన వారం రోజుల్లో సంబంధిత ఓటర్లపై చర్యలు తీసుకుంటారు.

అమెరికా : ఎన్నికల రోజు సెలవు ఉండదు

ఇక్కడ ఓటు వేయడంపై ఎలాంటి ఆంక్షలూ లేవు. అయినా ఇక్కడ 85 శాతం వరకు ఓటింగ్ నమోదవుతుంది. పోలింగ్ రోజు సెలవు ఉండదు. ఉద్యోగులు, ప్రజలు ఉదయం 7 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు తమ ఓటుహక్కు వినియోగించుకోవచ్చు. ఓటు విలువ పట్ల అమెరికన్లలో చైతన్యం ఎక్కువ.

బొలీవియా : గుర్తింపు కార్డు ఉంటేనే సౌకర్యాలు

ఈ దేశంలో ఓటు వేసినవారికి గుర్తింపు కార్డు జారీ చేస్తారు. అది ఉన్నవారికే ప్రభుత్వ సౌకర్యాలను కల్పిస్తారు. రేషన్, విద్యుత్, తాగునీటి వసతి పొందాలంటే ఈ కార్డును సంబంధిత అధికారులకు చూపించాల్సిందే. ప్రభుత్వ ఉద్యోగులు ఓటు వేయకపోతే.. వేతనాలు సరిగా అందవు. చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

ఆస్ట్రేలియా : వారం రోజుల్లో విచారణ

ఇక్కడ అర్హులైన ప్రతిఒక్కరూ తమ పేరును ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలి. ఎన్నికల రోజున వీరంతా తప్పకుండా ఓటు వేయాలి. వేయకుంటే జరిమానా విధిస్తారు. ఎన్నికలు జరిగిన వారంలోగా విచారణ చేపట్టి, అపరాధ రుసుము ఎంతన్నది నిర్ణయిస్తారు. ఇక్కడ 96 శాతం ఓటింగ్ నమోదవుతుంది. ఎన్నికలకు చాలా ముందు నుంచే ఓటు హక్కు వినియోగంపై ప్రభుత్వం చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తుంది.

ఇక్కడా తప్పనిసరి చేయాలి..

ఎన్నికలు ప్రగతికి బాటలు వేస్తాయి. మంచి ప్రభుత్వం రావడానికి దోహదపడతాయి. అందుకే అయిదేళ్లకోసారి ఎలక్షన్ కమిషన్ ఎన్నికలు నిర్వహిస్తోంది. అయితే, చాలా ప్రాంతాల్లో అర్హులైన అనేక మంది వివిధ కారణాలతో తమ ఓటుహక్కు వినియోగించుకోవడం లేదు. వందశాతం లక్ష్యంగా ఎన్నికల సంఘం అధికారులు కృషి చేస్తున్నారు. అర్హులైన ప్రతీ ఓటరు ఓటు వేసేలా ప్రచారం, ఓటరు చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మన దగ్గర కూడా ఓటు వేయడం తప్పనిసరి చేయాలి. ఇతర దేశాల తరహా ప్రత్యేక చట్టాలను తీసుకురావాలని ప్రజాస్వామ్యవాదులు అంటున్నారు.

గ్రీస్ : డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్టు రద్దు

ఇక్కడ ఓటు వేయకపోతే డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్టు రద్దవుతాయి. లేదంటే వాటి మంజూరును నిలిపివేస్తారు. ఓటు వేయకపోవడానికి గల కారణాలను అధికారులకు ఆధారాలతో చూపించాల్సి ఉంటుంది. వారు పూర్తిస్థాయిలో సంతృప్తి చెందితేనే మళ్లీ ఓటుహక్కు పునరుద్ధరిస్తారు. ప్రభుత్వం నుంచి పొందే సౌకర్యాలపై ఆంక్షలు విధిస్తారు.

సింగపూర్ : పేరు తొలగిస్తారు

అభివృద్ధికి మారుపేరుగా నిలిచే సింగపూర్‌లో ఓటు వేయడం తప్పనిసరి. వేయనివారి పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగిస్తారు. ఓటు వేయకపోవడానికి గల కారణానికి ఆధారాలను అధికారులకు చూపిస్తే పునరుద్ధరిస్తారు. ఎక్కువ మంది ప్రజలు కోరుకునే ప్రభుత్వం అధికారంలోకి రావడం వల్లే సింగపూర్ అభివృద్ధిలో ముందుందన్న వాదనలున్నాయి.

ప్రధాని సహకారంతోనే కాళేశ్వరం అవినీతి

- తెలంగాణతో లాభపడింది కేసీఆర్ కుటుంబమే
- మాజీ ఎంపీ వి.హనుమంతరావు

కరీంనగర్ కార్పొరేషన్: ప్రధాని నరేంద్రమోదీ సహకారంతోనే సీఎం కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతికి పాల్పడ్డారని రాజ్యసభ మాజీ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వి.హనుమంతరావు ఆరోపించారు. అదే లేకపోతే ఆయనపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ అభ్యర్థి పురుమల్ల శ్రీనివాస్‌కు మద్దతుగా శనివారం కరీంనగర్‌లో ప్రచారం నిర్వహించారు. టవర్ సర్కిల్‌లోని దుకాణాల వద్దకు వెళ్లి, వ్యాపారులను ఓటు అభ్యర్థించారు. అనంతరం నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. 1,200 మంది తెలంగాణ యువత ప్రాణత్యాగాలకు చలించిపోయిన సోనియా గాంధీ ప్రత్యేక రాష్ట్రం ఇచ్చారని తెలిపారు. తెలంగాణతో లాభపడింది కేసీఆర్ కుటుంబమేనని మండిపడ్డారు. రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చి, ప్రజలపై ఆర్థికభారం మోపుతున్నారని అన్నారు. పేదల సంక్షేమం గురించి ఆలోచించే పార్టీ కాంగ్రెస్ మాత్రమేనన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించింది కాంగ్రెస్సేనని గుర్తు చేశారు. ప్రధాని మోదీ బీసీ కుల గణన ఎందుకు చేపట్టడం లేదో చెప్పాలన్నారు. రాష్ట్ర ప్రజలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికే కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను తీసుకువచ్చిందని తెలిపారు. ఈ ఎన్నికల్లో పురుమల్ల శ్రీనివాస్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ టి.సంతోష్‌కుమార్, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, పీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్ కుమార్, వెన్న రాజమల్లయ్య, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పడాల రాహుల్, అసెంబ్లీ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్దుల్ రెహమాన్, మాజీ కార్పొరేటర్ కట్ల సతీశ్, నాయకులు పాల్గొన్నారు.

జైలును సందర్శించిన డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి



మాట్లాడుతున్న డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి వెంకటేశ్

కరీంనగర్‌క్రైం: కరీంనగర్‌లోని జైలును జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి కె.వెంకటేశ్ శనివారం సందర్శించారు. ఖైదీల యోగక్షేమాలను, భోజనం, వసతి, న్యాయసేవ, ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జైలులో క్యాంటీన్, ఆస్పత్రిలను పరిశీలించారు. ఖైదీలతో మాట్లాడుతూ.. పోక్సో, ఎన్‌డీపీఎస్, గృహహింస చట్టాలపై అవగాహన కల్పించారు. మహిళా జైలును సందర్శించి, ఖైదీలకు కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. ప్రైవేట్ లాయర్‌ను పెట్టుకునే స్తోమత లేని ఖైదీలకు ప్రభుత్వ లాయర్‌ను నియమిస్తామన్నారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ జి.సమ్మయ్య, జైలర్లు పి.శ్రీనివాస్, బి.రమేశ్, డిప్యూటీ జైలర్లు ఎస్.సుధాకర్‌రెడ్డి, ఎల్.రమేశ్, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ లాయర్ ఎ.శ్రీనివాస్, తణుకు మహేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

'బీబీఏ రిటైలింగ్'కు ఉజ్వల భవిష్యత్తు



ప్రొ.రాజేందర్‌సింగ్‌ను సన్మానిస్తున్న లెక్చరర్లు

కరీంనగర్ సిటీ: బీబీఏ రిటైలింగ్‌లో ప్రవేశం పొందిన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కళాశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ ప్రొ.రాజేందర్‌సింగ్ అన్నారు. కరీంనగర్‌లోని ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాలలో శనివారం బీబీఏ రిటైలింగ్ కోర్సులో ప్రవేశం పొందిన విద్యార్థులకు ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీబీఏ రిటైలింగ్ విద్యార్థులకు వారంలో మూడు రోజులు చదువు, మూడు రోజులు పరిశ్రమల్లో శిక్షణ ఇప్పించనున్నామని తెలిపారు. ఇందుకోసం విద్యార్థులకు తగిన పారితోషకం లభిస్తుందని, కోర్సు పూర్తయిన తర్వాత వారి కాళ్లపై వారు నిలబడతారని అన్నారు. అమెరికా వంటి అభివృద్ధి చెందిన దేశాల్లో ఇలాంటి కోర్సులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం శ్రీ చైతన్య, వాగేశ్వరి డిగ్రీ కళాశాలలను సందర్శించారు. కార్యక్రమంలో ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, కామర్స్ విభాగాధిపతి, వైస్ ప్రిన్సిపాల్ టి.రాజయ్య, వైస్ ప్రిన్సిపాల్ ప్రమోద్, సురేందర్ రెడ్డి, రాష్ట్ర జీసీజీటీఏ ప్రధాన కార్యదర్శి ఏవో కామరాజు, రవి సీసీఈ ఆఫీస్ హైదరాబాద్, కళాశాల టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



ప్రేమ్‌సాగర్‌రెడ్డి (ఫైల్)

రామడుగు: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఎస్‌ఐ తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. వెదిర గ్రామానికి చెందిన రాల్లబండి ప్రేమ్‌సాగర్‌రెడ్డి(45) శనివారం తన స్నేహితుడు, ముత్యం శ్రీనివాస్‌తో కలిసి కరీంనగర్ నుంచి వెదిరకు బైక్‌పై వెళ్తున్నాడు. రామడుగు మండలంలోని దేశరాజ్‌పల్లి శివారులో ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు టైరు ప్రేమ్‌సాగర్‌రెడ్డి తలపైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. శ్రీనివాస్‌కు స్వల్ప గాయాలయ్యాయి. మృతునికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. ఈ ఘటనతో రహదారిపై వాహనాలు భారీగా నిలిచిపోయి, వాహనదారులు ఇబ్బందిపడ్డారు. మృతదేహాన్ని పోలీసులు కరీంనగర్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి, ట్రాఫిక్ క్లియర్ చేశారు.

బ్రిడ్జి పైనుంచి పడి వ్యక్తికి తీవ్ర గాయాలు

రామడుగు: ద్విచక్రవాహనం అదుపుతప్పి పడిపోయిన ఘటనలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. చొప్పదండి మండల కేంద్రానికి చెందిన శంకరయ్య శనివారం సాయంత్రం ద్విచక్రవాహనంపై చొప్పదండి నుంచి కొత్తపల్లికి వెళ్తున్నాడు. మోతె సమీపంలో వాహనం బ్రిడ్జి పైనుంచి కిందపడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు 108కు సమాచారం అందించడంతో సిబ్బంది వేణుగోపాల్, రాజు సంఘటన స్థలానికి చేరుకున్నారు. శంకరయ్యను కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు.

ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం



తిమ్మాపూర్: నేదునూరులో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి, ఓ ఇల్లు పూర్తి దగ్ధమైంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన ఎలగందుల సలవ్వ, ఆమె కుమారుడికి మతిస్థిమితం సరిగా లేదు. శనివారం ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించి, వారి ఇల్లు పూర్తిగా కాలిపోయింది. ఈ ప్రమాదంలో రూ.లక్ష వరకు ఆస్తినష్టం జరిగిందని స్థానికులు తెలిపారు. సర్పంచ్ వడ్లూరి శంకర్ ఫైర్ సిబ్బందికి ఫోన్ చేయడంతో వచ్చి, మంటలు ఆర్పివేశారు. ఇల్లు కాలిపోయి, దిక్కుతోచని స్థితిలో ఉన్న ఆ తల్లీకుమారుడిని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

వ్యక్తి ఆత్మహత్య

ధర్మపురి: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి రాయపట్నం గోదావరినదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై దత్తాత్రి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నాగారం గ్రామానికి చెందిన ఆకుల రమేశ్ (36) కొంతకాలం పాటు జీవనోపాధికి ముంబాయ్ వెళ్లాడు. అక్కడ మద్యానికి బానిసై తిరిగి ఇంటికి వచ్చాడు. ఆర్థిక పరిస్థితులు బాగా లేకపోవడంతో అతిగా మద్యం తాగి ఈనెల 24న ఇంటినుంచి వెళ్లిపోయాడు. పరిసర ప్రాంతాల్లో కుటుంబ సభ్యులు వెతుకుతుండగా శనివారం రాయపట్నం గోదావరినదిలో మృతదేహం లభించింది. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు. రమేశ్ తండ్రి ఎల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎన్నికలు ఎప్పుడు రద్దు చేస్తారంటే..

కరీంనగర్ అర్బన్: ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951 సెక్షన్ 58ఏ ప్రకారం పోలింగ్ జరుగుతున్నప్పుడు ఓట్ల లెక్కింపు జరిగినా, డబ్బుతో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు పార్టీలు, అభ్యర్థులు ప్రయత్నించినా.. ఆ ఎన్నికలను రద్దు చేసే అధికారం ఎన్నికల సంఘానికి ఉంది. ఏదైనా ఎన్నికను రద్దు చేయాలంటే రాజ్యాంగంలోని 324 అధికరణ, జనరల్ క్లాజెస్ యాక్ట్ 1897లోని సెక్షన్ 21 ప్రకారం.. రాష్ట్రపతికి ఎన్నికల సంఘం సిఫార్సు చేస్తుంది. దాన్ని రాష్ట్రపతి పరిశీలించి, ఆమోదిస్తే ఆ ఎన్నిక రద్దవుతుంది.

తమిళనాడులో మూడుసార్లు..

- 2016లో తమిళనాడు శాసనసభ ఎన్నికల సమయంలో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు డబ్బు పంచుతున్నారన్న కారణంతో అరవకురిచి, తంజావూరు నియోజకవర్గాల్లో ఎన్నికలను ఎలక్షన్ కమిషన్ రద్దు చేసింది.
- అప్పటి తమిళనాడు ముఖ్యమంత్రి జయలలిత మరణానంతరం 2017లో ఆర్కేనగర్ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికలో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు డబ్బులు పంచుతున్నారని ఆ ఎన్నికను ఎలక్షన్ కమిషన్ రద్దు చేసింది.
- 2019లో తమిళనాడులోని వేలూరు లోక్‌సభ నియోజకవర్గంలో డబ్బులు పంపిణీ చేస్తున్నారని ఆ ఎన్నికను ఈసీ రద్దు చేసింది. డబ్బు పంపిణీ కారణంగా దేశంలో రద్దయిన తొలి లోక్‌సభ నియోజకవర్గ ఎన్నిక ఇదే.

నలుగురి బైండోవర్

జమ్మికుంట(హుజూరాబాద్): నలుగురు వ్యక్తులను శనివారం తహసీల్దార్ రజని ఎదుట బైండోవర్ చేసినట్లు జమ్మికుంట పట్టణ సీఐ రమేశ్ తెలిపారు. ఎన్నికల నియమావళిలో భాగంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా జమ్మికుంట మండలంలోని పలు గ్రామాలకు చెందిన వివిధ పార్టీల నాయకులను బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు.

ఓటు తిరిగి పొందొచ్చు (మీకు తెలుసా?)

కరీంనగర్ అర్బన్: ఎన్నికల్లో దొంగ ఓట్లు వేయడం సర్వసాధారణం. పోలింగ్ సమయంలో ఏజెంట్లు అప్రమత్తంగా లేకపోతే ప్రత్యర్థి పార్టీలకు చెందిన కార్యకర్తలు అవతలి వ్యక్తుల ఓటును వేసి, వెళ్లడం చూస్తుంటాం. అపరిచితులు వేసిన మన ఓటును అంగీకరించి, సరేలే అని తిరిగి రావాల్సిన పనిలేదు. మన ఓటును తిరిగి పొందేందుకు ఎన్నికల సంఘం సెక్షన్ 49 పీ ద్వారా అవకాశం కల్పిస్తోంది. గతంలో విడుదలైన సర్కార్ సినిమాలోనూ దీనిని ప్రస్తావించారు.

ఇలా చేయాలి..

ఓటును మరొకరు వేసినట్లు గుర్తిస్తే వెంటనే సంబంధిత పోలింగ్ కేంద్రంలో ఛాలెంజ్ ఓటును నమోదు చేసుకోవచ్చు. పోలింగ్ సమయంలో మన ఓటును ఎవరైనా అంతకుముందే వేసినట్లు గుర్తిస్తే సంబంధిత పోలింగ్ కేంద్రానికి వెళ్లి, ఆ ఓటును తీసేయమని అధికారులను కోరే అవకాశాన్ని సెక్షన్ 49పీ పౌరులకు కల్పిస్తుంది. రూ.5ను అక్కడి ప్రిసైడింగ్ అధికారికి చెల్లించి, ఓటును నమోదు చేయాలని కోరాలి. వారు బాధితుల గుర్తింపు కార్డును పరిశీలించి, అనుమతి ఇస్తారు. మొత్తం ఓట్లలో అదనపు ఓటుగా ప్రత్యేకంగా గుర్తిస్తూ ఈ ఓటును కలిపి లెక్కించకుండా దాచి ఉంచుతారు. ఓట్ల లెక్కింపు సమయంలో బ్యాలెట్‌పై మనం వేసిన ఓటును చివరలో లెక్కిస్తారు. గెలుపోటముల్లో అవసరాన్ని బట్టి దాన్ని అప్పుడు పరిగణలోకి తీసుకుంటారు.






కార్తీక సందడి

కార్తీక మాసం పురస్కరించుకొని శనివారం నగరంలోని మార్కెట్ రోడ్డు వేంకటేశ్వరాలయంలో భక్తుల సందడి నెలకొంది. భక్తులు ఎక్కువ సంఖ్యలో హాజరై అర్చనలు, అభిషేకాలు చేశారు. దీపాలు వెలిగించారు. కార్యక్రమలలో ఈవో ఉడుతల వెంకన్న, ధర్మకర్తలు చకిలం శ్రీనివాస్, చకిలం గంగాధర్, సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.
- కరీంనగర్‌కల్చరల్

బాధ్యతగా ఓటేద్దాం

- ఓటు వేయడంలో నిర్లక్ష్యం వద్దు
- 'సాక్షి'తో పలువురు కవుల అభిప్రాయాలు

సాక్షి పీపుల్స్ ఎజెండా

కరీంనగర్‌కల్చరల్: ఓటు అంటే మీట నొక్కడం కాదు.. ఆ ఒక్క రోజు నిర్లక్ష్యం చేస్తే ఐదేళ్ల శాపంగా మారుతుంది. ప్రతీ ఒక్కరం ఓటు వేయడం సామాజిక బాధ్యతగా స్వీకరించాలి. ఓటు వేసి ప్రజాస్వామ్యానికి పెద్దపీట వేయలి. ఓటు వేయడంలో నిర్లక్ష్యం, నిర్లిప్తత తగదు. ఒక చిన్న కుండ కొనాలంటేనే ఆలోచిస్తాం.. అలాంటిది ఐదేళ్ల మన పాలకులు ఎలా ఉండాలో ఎంతో జాగ్రత్తగా గమనించి ప్రగతికి బాటలు వేసే వారిని ఎన్నుకునే అవకాశాన్ని అందిపుచ్చుకోవాలి. నోటుతో ఓటును కొని సీటు ఎక్కి కోట్లకు పడగలెత్తే నేతలకు ఓటు ద్వారా బుద్ధి చెప్పేందుకు ఇదో మహా సదావకాశం. ఈనేపథ్యంలో ఏ విధమైన ప్రలోభాలకు లొంగకుండా సరైన నాయకుడిని ఎన్నుకుందామని నగరంలోని పలువురు కవులు పేర్కొన్నారు. ఈనెల 30న జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా నగరంలోని పలువురు కవులను 'సాక్షి' పలకరించగా తమ అభిప్రాయాలను వెల్లడించారు.

ఓటు.. ఓ వరం



ఐదేళ్లకోసారి మన భవితను మార్చుకునేందుకు ఓటు రాజ్యాంగం ప్రసాదించిన ఓ వరం. ప్రజాహితునికి పట్టం కట్టి ప్రగతికి శ్రీకారం చుట్టేందుకు గొప్ప ఆయుధం. నోటుతో ఓటును కొని సీటు నెక్కి కోట్లకు పడగలెత్తే నేతలకు ఓటు ద్వారా బుద్ధి చెప్పేందుకు అవకాశం. ఏ విధమైన ప్రలోభాలకు లొంగక సరైన నాయకుడిని ఎన్నుకుందాం. పవిత్రమైన ఓటును సద్వినియోగం చేసుకొని మన తల రాతను మనమే మార్చుకుందాం.
– ధాస్యం సేనాధిపతి, ప్రముఖ కవి, విమర్శకుడు

ఓటు హక్కు పవిత్రమైనది



మద్యం సీసాకో, పచ్చ నోటుకో ఓటును అమ్ముకోవద్దు. కులం, మతానికి ఓటును తాకట్టు పెట్టొద్దు. ఓటును దుర్వినియోగం చేసుకోవద్దు. ఓటు వేయడం మరువకూడదు. ఓటుహక్కును అందరూ విధిగా వినియోగించుకోవాలి. భారత రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కు పరమ పవిత్రమైనది. ఓటు ఆయుధాన్ని ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా సరిగా ప్రయోగించాలి. ఓటు ద్వారా స్వాతంత్ర్య సమరయోధులు కలలుగన్న సమ సమాజ భారతాన్ని నిర్మించాలి.
– కూకట్ల తిరుపతి, కవి, రచయిత

సూటి చూసి ఓటు వేయాలి



ఓటు సూటి చూసి ఎవరికి వేయాలనో ఎంచుకొని వారికే వేయాలి. ఓటు వేసేటప్పుడు అభ్యర్థిని చూడాలి. తాను ప్రాతినిధ్యం వహించే పార్టీని చూడాలి. ఆ పార్టీ చెప్పిందే చేస్తుందా, నమ్మించేందుకు అబద్ధాలు ఆడుతుందా? అనే దృష్టి నీకు కలిగి ఉండాలి. ఓటు నీ హృదయం లాంటిది. ఉత్తమ సమాజాన్ని సృష్టించే వారికి దానిని అందిస్తేనే ఒక పవిత్ర కార్యం నెరవేర్చినట్లు. ఏదో నిరాసక్తత ఆవహించి భ్రమలకు లోనై వారికి ఓటేస్తే ఇక నీ పని అయిపోయినట్టే.
– అన్నవరం దేవేందర్, కవి, రచయిత

సేవ చేసే వారిని ఎన్నుకోవాలి



మనం ఓటు వేయకుండా, మంచి వారిని ఎన్నుకో కుండా వ్యవస్థను తిట్టుకుంటూ ఉండడం సరైన విధానం కాదు. దేశానికి మంచి పాలకులు కావా లంటే ఓటరు విచక్షణతతో ఆలోచించి కుల, ప్రాంత, మత, వర్ణ బేధాలు ఎంచకుండా దేశానికి సేవ చేసే దేశభక్తి కలిగిన నాయకులను ఎన్నుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ శక్తి కేవలం ఓటుకు మాత్రమే ఉంది. అందుకే ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్య పరిరక్షణలో మనవంతు బాధ్యతను నెరవేర్చుదాం.
– గాజుల రవీందర్, అధ్యక్షుడు, జాతీయ సాహిత్య పరిషత్

బుల్లెట్ కన్నా శక్తివంతమైనది బ్యాలెట్



ప్రజాస్వామ్య సౌధానికి పునాది ఓటు. బుల్లెట్ కన్నా శక్తివంతమైనది బ్యాలెట్. దేశం నాకేమిచ్చింది అని కాకుండా దేశానికి నేనేమిచ్చాను అన్న భావనతో ఎన్నికల్లో పాల్గొని పవిత్రమైన ఓటు హక్కును ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలి. కరిగిపోతే తెలుస్తుంది కొవ్వొత్తి విలువ. ఓటు వేస్తే తెలుస్తుంది ప్రజాస్వామ్య విలువ. అందుకే బాధ్యత కలిగిన పౌరులందరూ తప్పనిసరిగా ఓటు వేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలి.
– వైరాగ్యం ప్రభాకర్, కవి, రచయిత, విమర్శకుడు

ప్రలోభాలకు లొంగద్దు



ప్రజాస్వామ్యంలో ప్రజలే పాలకులు. మెజారిటీ ప్రజల ఓటు హక్కుతో ప్రభుత్వం అధికారంలోకి వస్తుంది. పాలకులను నిర్ణయించుకునే అధికారం ప్రజలకు రాజ్యాంగం ఓటు ద్వారా కల్పించింది. పౌరులు ప్రలోభాలకు, ఒత్తిడులకు లొంగకుండా ఓటు వేసి ప్రజా ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలి.
– కందుకూరి అంజయ్య, కవి

అభివృద్ధి, సంక్షేమానికి కాంగ్రెస్ గ్యారంటీ

- నాకు ఒక్క అవకాశం ఇవ్వండి
- కరీంనగర్ కాంగ్రెస్ అభ్యర్థి 'పురుమల్ల'



ప్రచారం చేస్తున్న పురమల్ల శ్రీనివాస్

కరీంనగర్ కార్పొరేషన్: అభివృద్ధి, సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ గ్యారంటీ అని, ఈ ఎన్నికల్లో తనకు ఒక్క అవకాశం ఇవ్వాలని కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి పురుమల్ల శ్రీనివాస్ ప్రజలను అభ్యర్థించారు. శనివారం నగరంలోని పలు డివిజన్లలో మాజీ ఎంపీ వి.హన్మంతరావుతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ పార్టీ అమలు చేయనున్న ఆరు గ్యారంటీ పథకాలను వివరించారు. బలవంతులకు.. బలహీనుడినైన తనకు నడుమ ఈ ఎన్నిక జరుగుతోందన్నారు. నగరంలో అభివృద్ధి పేరిట కోట్ల రూపాయల అవినీతి జరిగిందని తెలిపారు. ఓటమి భయంతో ఉన్న బీఆర్ఎస్ నాయకులు ఎంతకైనా తెగించేందుకు సిద్ధంగా ఉన్నారని, కాని ప్రజలు కాంగ్రెస్ వైపున్నారని అన్నారు. తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీ రుణాన్ని ఈ ఎన్నికల్లో చేతిగుర్తుకు ఓటు వేయడం ద్వారా తీర్చుకోవాలని కోరారు. తాము అధికారంలోకి వచ్చాక ఏ జాబ్‌కు ఎప్పుడు నోటిఫికేషన్ విడుదల చేస్తామని ముందుగానే తేదీలు కూడా ప్రకటించిన పార్టీ కాంగ్రెస్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ మాటలతో మభ్యపెట్టేది కాదని, చేతలతో చేసి చూపించేదని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్సీ టి.సంతోష్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, నాయకులు వైద్యుల అంజన్‌కుమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన టేల భూమయ్య

మాజీ కార్పొరేటర్ పడిశెట్టి (టేల) భూమయ్య కాంగ్రెస్ పార్టీలో చేరారు. కోతిరాంపూర్‌లో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ అభ్యర్థి పురుమల్ల శ్రీనివాస్ పార్టీ కండువా కప్పి భూమయ్యను కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు.

ఇంటి వద్ద ఓటింగ్ సక్సెస్



చేగుర్తిలో ఓటు వేస్తున్న వృద్ధుడు

కరీంనగర్‌రూరల్: ఎన్నికల కమిషన్ తొలిసారిగా తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రవేశపెట్టిన ఇంటి వద్ద ఓటింగ్ విధానం విజయవంతమైంది. కరీంనగర్ నియోజకవర్గంలో మూడురోజుల నుంచి నిర్వహిస్తున్న ఇంటివద్ద ఓటింగ్ శనివారం ముగిసింది. చివరిరోజు ఐదుగురు వృద్ధులు, ఎనిమిది మంది దివ్యాంగులు ఓటు వేశారు. నియోజకవర్గంలో వయోవృద్ధులు 5,283, దివ్యాంగులు 4,090 మంది ఉన్నారు. ఇంటివద్ద ఓటు వేసేందుకు 12డీ దరఖాస్తులు కేవలం199 మాత్రమే వచ్చాయి. వీటిలో వృద్ధులు 131, దివ్యాంగులు68 మంది ఉన్నారు. వీళ్లందరి నుంచి ఓటు వేయించేందుకు మొత్తం 9 బృందాలను ఏర్పాటు చేశారు. ఈనెల 23, 24, 25 తేదీల్లో హోం ఓటింగ్‌కు అవకాశం కల్పించారు. మూడు రోజుల్లో 121మంది వృద్ధులు, 60 మంది దివ్యాంగులు ఓటుహక్కు వినియోగించుకున్నారని ఎన్నికల సహాయ అధికారి నవీన్ తెలిపారు. హోం ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకున్న వారిలో ఇద్దరు వృద్ధులు మృతిచెందగా మిగతా 16మంది వివిధ కారణాలతో అందుబాటులో లేకపోవడంతో ఓటు వేయలేదని వివరించారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

- రూరల్ ఏసీపీ కరుణాకర్‌రావు
- బొమ్మకల్‌లో పోలీస్ సాయుధ బలగాల కవాతు



బొమ్మకల్‌లో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం బొమ్మకల్‌లో శనివారం పోలీస్, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్, సీఆర్‌పీఎఫ్ సాయుధ బలగాలతో కవాతు నిర్వహించారు. రామాలయం వద్ద రూరల్ ఏసీపీ టి.కరుణాకర్‌రావు జెండా ఊపి కవాతు ప్రారంభించారు. గ్రామంలోని ప్రధానవీధుల్లో కవాతు నిర్వహించిన అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఏసీపీ మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న దృష్ట్యా నిబంధనలకు వ్యతిరేకంగా ప్రవర్తిస్తే చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈనెల 30న జరిగే పోలింగ్‌కు ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐలు ఎ.ప్రదీప్‌కుమార్, ఇంద్రాసేనారెడ్డి, రవికుమార్, ఎస్సై రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కరపత్రం ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

సప్తగిరికాలనీ(కరీంనగర్): ఈనెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఓట్ల కోసం వచ్చే రాజకీయ నాయకులను సమస్యలపై ప్రశ్నించాలని, నిలదీయాలని కోరుతూ పౌర హక్కుల సంఘం తెలంగాణ ఆధ్వర్యంలో రూపొందించిన కరపత్రాన్ని శనివారం నగరంలోని కోర్టు చౌరస్తాలో పౌరహక్కుల సంఘం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పౌర హక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మాదన కుమారస్వామి, శ్రీపతి రాజగోపాల్, నార వినోద్, బాలసాని రాజయ్య, మార్వాడి సుదర్శన్, సతీశ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

చరిత్ర, సంస్కృతులను అధ్యయనం చేయాలి



విద్యానగర్(కరీంనగర్): చరిత్ర, సంస్కృతులను అధ్యయనం చేయాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రభుత్వ వారసత్వ సహాయ సంచాలకుడు నాయిని సాగర్ అన్నారు. శనివారం కరీంనగర్ గాంధీ మ్యూజియంలో నిర్వహించిన వారసత్వ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. వారసత్వ కట్టడాలు, పురావస్తు సంస్కృతులను పరిరక్షిస్తూ భవిష్యత్ తరాలకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సారార్ కాలేజీ చరిత్ర విభాగాధిపతి సుధాకర్, చరిత్రకారులు సంకెపల్లి నాగేంద్రశర్మ, జాతీయ యువజన అవార్డు గ్రహీత, న్యాయవాది కిరణ్‌కుమార్, యువ ప్రాక్ చరిత్రకారులు సముద్రాల సునీల్, వరంగల్ సీనియర్ చరిత్రకారులు కుమారస్వామి, చరిత్ర ఉపన్యాసకులు రాంకిషన్, రాజేందర్ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ రవితేజ, కార్యాలయ సహాయకులు ఎండీ.గౌస్, విజ్ఞాన్ పాఠశాల ఉపాధ్యాయుడు రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

కొత్తపల్లి: కొత్తపల్లి మండలం ఖాజీపూర్ గ్రామానికి చెందిన వెంగళ చిన్నకొండయ్య రైతుకు చెందిన గేదె శనివారం ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. ప్రభుత్వం సహాయం చేసి ఆదుకోవాలని బాధితుడు విజ్ఞప్తి చేశారు.

3న లక్ష దీపోత్సవం

విద్యానగర్(కరీంనగర్): కార్తీక మాసంలో భాగంగా కరీంనగర్ మండలం నగునూర్‌లోని శ్రీదుర్గాభవానీ ఆలయంలో డిసెంబర్ 2 శనివారం ఉదయం సామూహిక సత్యనారాయణ వ్రతాలు, ఆదివారం సాయంత్రం లక్షదీపోత్సవం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మాధికారి, వేదపండుతులు పురాణం మహేశ్వర శర్మ తెలిపారు. 3న సాయంత్రం కార్తీక మాస ప్రయోక్త చతుష్షష్టిపూజలు, దీపా సంకల్పం, దీపారాధన, మహా మంగళహారతి అనంతరం దీపోత్సవం జరుగుతుందని అన్నారు. లక్ష దీపోత్సవ కార్యక్రమంలో భక్తులు భాగస్వాములై అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు. పూర్తి వివరాలకు 8367234123 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న అధ్యాపకులు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం నగునూరులోని సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో శనివారం రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి ప్రిన్సిపాల్ డి.శ్రీహరి పూలమాల వేసి నివాళి అర్పించారు. భారత రాజ్యాంగం, పరిరక్షణ, హక్కులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థినులు నిర్వహించిన మాక్ పార్లమెంట్, స్కిట్, డ్యాన్స్ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సమత, ఎన్ఎస్ఎస్ పీవో లావణ్యతో పాటు అధ్యాపకులు పాల్గొన్నారు.

'పిల్లల కోసం' కార్యక్రమానికి ఎస్సారార్ వలంటీర్లు



పాల్గొన్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

కరీంనగర్ సిటీ: ప్రాథమిక స్థాయి విద్యలో గుణాత్మకమైన మార్పు తీసుకవచ్చేందుకు చేపట్టిన 'పిల్లల కోసం' కార్యక్రమంలో భాగంగా శనివారం ఎస్సారార్ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లు వారికి కేటాయించిన ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. పాఠశాలల్లోసరిగా చదవడం, రాయడం రాని 15 మంది విద్యార్థులను దత్తత తీసుకొని స్నేహపూర్వకమైన బోధన చేపట్టడాన్ని ప్రారంభించారు. 3, 4, 5వ తరగతి విద్యార్థులకు చేపట్టాల్సిన బోధనను ఆటపాటలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సారార్ కాలేజీ ప్రిన్సిపాల్ కె.రామకృష్ణ 'పిల్లల కోసం' కార్యక్రమం కోసం కృషి చేస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, అధికారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నోడల్ అధికారిగా వ్యవహరిస్తున్న కళాశాల వైస్ ప్రిన్సిపాల్ టి.రాజయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు వి.వరప్రసాద్, డీడీ.నాయుడు, బి.సురేశ్‌కుమార్, బి.చంద్రమౌళి, బి.శారద, జిల్లా విద్యాధికారి కార్యాలయ సీఎంవో ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞానం పెంచేందుకు ఆటల పోటీలు



ఆటల్లో మెళకువలు నేర్పుతున్న పీఈటీ లక్ష్మణ్

కొత్తపల్లి: కొత్తపల్లి మండలం బావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాల్గో శనివారం నో బ్యాగ్ డేను పురస్కరించుకొని విద్యార్థులకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించారు. ఆటలు, భాషా క్రీడలు, అబాకస్, సుడో, సైన్స్ ముచ్చట్లు, సాంస్కృతిక కార్యక్రమాలు, సంప్రదాయ ఆటల పోటీలు నిర్వహించి విద్యార్థుల్లో నూతనోత్సాహాన్ని నింపారు. పిల్లల్లో విజ్ఞానం, పోటీతత్వం పెంపొందించేందుకు పలు కార్యక్రమాలు దోహదపడతాయని హెచ్ఎం కట్ట వెంకటేశ్వర్లు తెలిపారు. ఉపాధ్యాయులు వాసంతి, శివకుమార్, రాజేంద్రప్రసాద్, హరికృష్ణశర్మ, లక్ష్మణ్, సంతోష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'ఓటర్స్ ఫ్లాష్‌మాబ్'




కొత్తపల్లి: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ప్రాముఖ్యతను ప్రచారం చేసేందుకు కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈటెక్నో స్కూల్ విద్యార్థులు శనివారం కరీంనగర్‌లోని తెలంగాణచౌక్‌లో నిర్వహించిన ఓటర్స్ ఫ్లాష్‌మాబ్ ఆకట్టుకుంది. సుమారు 250 మంది విద్యార్థులు సాంప్రదాయ దుస్తుల్లో చేసిన నృత్యాలు అలరించాయి. ఓటు హక్కు వినియోగిద్దాం..ప్రగతిని సాదిద్దాం..అంటూ నినాదాలు చేస్తూ 18 ఏళ్ల నిండిన బాధ్యతాయుతమైన పౌరులంతా ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ వి.నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు చాలా విలువైందని, 18 ఏళ్లు నిండిన ప్రతీఒక్కరు ఓటు హక్కును సద్వినియోగం చేసుకొని సమర్థవంతమైన సుస్థిర ప్రభుత్వాలను ఎన్నుకునేందుకు దోహదపడాలని అన్నారు. ఈనెల 30న జరిగే శాసనసభ ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఓటు వేసి ప్రజాస్వామ్య పరిరక్షణకు కృషి చేయాలని తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాటి వైభవానికి ప్రతీక పురావస్తు వస్తువులు



పురావస్తు వస్తువులను పరిశీలిస్తున్న విద్యార్థులు

కరీంనగర్ సిటీ: నాటి వైభవానికి, సంస్కృతి, నాగరికతకు ప్రతీక పురావస్తు వస్తువులని ఎస్సారార్ డిగ్రీ, పీజీ కాలేజీ చరిత్ర విభాగం అధ్యాపకులు అన్నారు. శనివారం కళాశాల విద్యార్థులను కరీంనగర్‌లోని మ్యూజియం వద్దకు తీసుకెళ్లి ఈ ప్రాంత ప్రాచీన పాలకులు వినియోగించిన పనిముట్లు, పాత్రలు, ఆయుధాలపై కల్పించారు. పురావస్తు శాఖ చేపట్టిన తవ్వకాల ద్వారా పురాతన పనిముట్లు, పాత్రలు తదితరాలను వెలికితీసినట్లు వివరించారు. ధూళికట్ట వద్ద ఉన్న బౌద్ధస్తూపాలు, బౌద్ధమత ప్రాబల్యంతో పాటు కరీంనగర్ జిల్లా గొప్ప చరిత్ర, సంస్కృతిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలువురు చరిత్ర విభాగం అధ్యాపకులు మాట్లాడుతూ శాతవాహనులు కోటి లింగాల నుంచి జిల్లాను తమ రాజధాని నగరంగా చేసుకున్నారని అన్నారు. ఆ రోజుల్లో రవాణా కోసం గోదావరి నదిని ఉపయోగించుకున్నట్లు తెలిపారు. జిల్లాలోని నగునూర్, మొలంగూరు, రామగిరి కోటలు తదితర అనేక ప్రాంతాల్లో కాకతీయ సామ్రాజ్యం గొప్ప చరిత్ర, వారి ఆలయాలు, కోటలపై వివరించారు.

'కేజీబీవీ'లో మాక్ ఎలక్షన్స్



సప్తగిరికాలనీ(కరీంనగర్): నగరంలోని కస్తూరిబా గాంధీ విద్యాలయంలో విద్యార్థులు తరగతి గది విద్యాబోధన కాకుండా సహపాఠ్య కార్యక్రమంలో పాల్గొనాలనే ఉద్దేశంతో శనివారం నో బ్యాగ్ డే నిర్వహించారు. విద్యార్థులకు మాక్ ఎలక్షన్స్ ఏర్పాటు చేసి ఎన్నికలు, ఓటుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ డి.శ్రీలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకలు ప్రారంభం



కరీంనగర్ కల్చరల్: ప్రపంచవ్యాప్తంగా జరుపుకునే క్రిస్మస్ వేడుకలు శనివారం కరీంనగర్‌లోని సీఎస్ఐ వేస్లీ కేతిడ్రల్ చర్చిలో ప్రారంభమయ్యాయి. ప్రపంచమంతా నవంబర్ 25న ప్రీ క్రిస్మస్ సెలెబ్రేషన్‌తో ఒకనెల ముందుగా క్రిస్మస్ వేడుకలు మొదలవుతాయి. కేతిడ్రల్ చర్చిలో సంబరాలు మిన్నంటాయి. క్రిస్మస్ డ్రామా ప్రదర్శనలు అలరించారు. చైర్మన్ ఆర్.పాల్ కొమ్మాలు క్రిస్మస్ సందేశాన్ని వినిపించారు. కార్యక్రమంలో సెక్రెటరీ, ట్రెజరర్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

క్లుప్తంగా...

మిత్రపక్షాల గెలుపు ఖాయం

- కాంగ్రెస్, సీపీఐ నేతలు మహేశ్‌గౌడ్, చాడ ధీమా

సాక్షి, హైదరాబాద్: ఈసారి ఎన్నికల్లో తమ కూటమి గెలుపు ఖాయమని కాంగ్రెస్, సీపీఐ, టీజేఎస్ నేతలు ధీమా వ్యక్తం చేశారు. గాంధీభవన్‌లో శనివారం కాంగ్రెస్ మిత్రపక్షాల సమన్వయకమిటీ నేతలు మహేశ్‌కుమార్‌గౌడ్ (కాంగ్రెస్), చాడా వెంకట్‌రెడ్డి(సీపీఐ), ప్రొఫెసర్ పి.ఎల్. విశ్వేశ్వరరావు(టీజేఎస్)లు విలేకరులతో మాట్లాడుతూ తమ కూటమి ప్రచారానికి పెద్ద ఎత్తున ప్రజా స్పందన వస్తోందని చెప్పారు. మిత్రపక్షాల కలయికతో బీఆర్‌ఎస్‌ను ఓడిస్తున్నామని చెప్పారు. నియంత పాలన నుంచి తెలంగాణను విడిపించేందుకు రాష్ట్రంలోని 118 నియోజకవర్గాల్లో కాంగ్రెస్, కొత్తగూడెంలో సీపీఐ అభ్యర్థులను గెలిపించాలని వారు కోరారు.

ఈసారి కాంగ్రెస్‌కే పట్టం కడుతున్నారు

- కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



నల్లగొండ: ఈసారి తెలంగాణ ప్రజలు కాంగ్రెస్‌కే పట్టం కడుతున్నారని, సీఎం కేసీఆర్ ప్రగతి భవన్ ఖాళీ చేసి ఫాంహౌస్‌కు పరిమితమయ్యే రోజులు దగ్గర పడ్డాయని నల్లగొండ కాంగ్రెస్ అభ్యర్థి, కాంగ్రెస్ పార్టీ స్టార్ క్యాంపెయినర్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి జోస్యం చెప్పారు. తెలంగాణకు కాపలా కుక్కలా ఉంటానన్న కేసీఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాత దోచుకుంటున్నారన్నారు. నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని మర్రిగూడ, ఆర్జాలబావి, చర్లపల్లితో పాటు పలు గ్రామాల్లో ఆయన శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాలు భర్తీ చేయడంలో పూర్తిగా విఫలమైందని, ఏ పరీక్షలు పెట్టినా పేపర్ లీకేజీలు తప్ప ఉద్యోగాల భర్తీ అయింది లేదన్నారు. ఇసుకలో మేడిగడ్డ ప్రాజెక్టు కట్టి కేసీఆర్ ప్రపంచంలోనే పెద్ద ప్రాజెక్టు అని చెప్పుకున్నాడని ఎద్దేవా చేశారు. నల్లగొండను దత్తత తీసుకుని రెండేళ్ల తర్వాత వచ్చి ఒక్క రోడ్డు వేసి నాలుగు జంక్షన్లు కట్టారే తప్ప దత్తత హామీ నెరవేరలేదన్నారు. కేసీఆర్ మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని పిలుపునిచ్చారు.

కాంగ్రెస్‌ను గెలిపించాలి

- ఏఐసీసీ కోశాధికారి అజయ్ మాకెన్



సాక్షి, హైదరాబాద్: అన్ని వర్గాలను మోసగించిన బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ఓడించి..రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావాలని ఏఐసీసీ కోశాధికారి అజయ్ మాకెన్ కోరారు. రాష్ట్రంలో విద్యుత్ వ్యవస్థలను బీఆర్‌ఎస్ విధ్వంసం చేసిందని ఆయన ఆరోపించారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఖజానాను ఖాళీ చేయడమే లక్ష్యంగా పెట్టుకున్న బీఆర్‌ఎస్.. రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచి విద్యుత్ సంస్థలను దివాళా తీయించిందన్నారు. డిస్కంలతో పాటు జెన్‌కోను రూ.52వేల కోట్ల అప్పుల ఊబిలోకి నెట్టిందని, లాభాల్లో ఉన్న సింగరేణి నష్టాల్లో కూరుకుపోవడానికి కారణమైందన్నారు. రాష్ట్రంలో ప్రతి వ్యక్తిపై రూ.1.3 లక్షల అప్పు మోపిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం తెలంగాణ ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసిందన్నారు. సంక్షేమ పథకాల అమలు, మౌలిక సదుపాయాల కల్పనలో నిధుల కోత విధించిందని పేర్కొన్నారు. ద్రవోల్బణం ఎక్కువగా ఉన్న రాష్ట్రం తెలంగాణేనని మాకెన్ స్పష్టం చేశారు.

కాంగ్రెస్‌తోనే ప్రజల రాజ్యం

అమ్మ చెప్పింది

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం ఎందరో పోరాటం చేశారు. అమరులయ్యారు. నేను తెలంగాణకు వస్తున్న సందర్భంగా తన సందేశం ఇవ్వాలని అమ్మ (సోనియాగాంధీ) చెప్పింది. 'తెలంగాణ ప్రజలకు ఒక కల ఉంది. బలమైన కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడటం ద్వారా అవి నిజమవుతాయి' అని అమ్మ చెప్పింది.

24 గంటలు కరెంట్ ఇస్తాం

అరగంటలో ఇక్కడ (మధిర సభ) మూడుసార్లు కరెంట్ పోయింది. కాంగ్రెస్ ప్రభుత్వంలో అలా ఉండదు. 24 గంటలు కరెంటు ఇస్తాం. ఇందిరమ్మ ఇంటి కోసం స్థలం ఇస్తాం. ఇల్లు కట్టుకోవడానికి రూ.5లక్షలు ఇస్తాం. తెలంగాణ అమరవీరుల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం కల్పిస్తాం. రైతులకు ఎకరాకు రూ.15వేలు సాయం, వ్యవసాయ కుటుంబానికి రూ.12వేలు ఇస్తాం. ప్రతీ క్వింటాల్ వడ్ల కు రూ.500 బోనస్ ఇస్తాం. మహిళల ఖాతాల్లో నెలకు రూ.2,500 జమ చేస్తాం. బస్సులో ఉచిత ప్రయాణం కల్పిస్తాం, సిలిండర్ రూ.500కే ఇస్తాం. గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల విద్యుత్ ఉచితంగా ఇస్తాం. సింగరేణిని ప్రైవేటీకరణను అడ్డుకుని, అధికారంలోకి రాగానే సత్తుపల్లిని జిల్లాగా ప్రకటిస్తాం.

బీఆర్‌ఎస్, బీజేపీ, ఎంఐఎం ఒక్కటే: ప్రియాంకా గాంధీ

- రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌కు బీజేపీ.. ఢిల్లీలో బీజేపీకి బీఆర్‌ఎస్ మద్దతు
- మార్పు కావాలంటే కాంగ్రెస్ రావాలి
- మధిరలో విజయభేరి సభ, ఖమ్మం, పాలేరు, సత్తుపల్లి నియోజకవర్గాల్లో రోడ్‌షోలు





ఖమ్మం రోడ్డు షోలో గిరిజన మహిళలతో కలిసి నృత్యం చేస్తున్న ప్రియాంకాగాంధీ చిత్రంలో పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: కాంగ్రెస్ పార్టీ మాత్రమే తెలంగాణలో ప్రజల రాజ్యాన్ని ఏర్పాటు చేస్తుందని, ఇందిరమ్మ రాజ్యం వస్తుందని ఆ పార్టీ అగ్రనేత ప్రియాంకాగాంధీ పేర్కొన్నారు. బీజేపీ తెలంగాణలో లేదని, కేవలం బీఆర్‌ఎస్‌కు మద్దతు ఇవ్వడానికే వస్తోందని.. ఇందుకు బదులుగా బీఆర్‌ఎస్ ఢిల్లీలో మద్దతు ఇస్తోందని ఆరోపించారు. ఎంఐఎం వీరికి అంటకాగుతోందని విమర్శించారు. బీఆర్‌ఎస్, బీజేపీ, ఎంఐఎం మూడు పార్టీలు ఒక్కటేనని.. అంతా రాహుల్‌గాంధీ మీద ఆరోపణలు చేస్తారని చెప్పారు. ప్రజలంతా ఓటు విలువను అర్థం చేసుకోవాలని, కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. శనివారం ఉమ్మడి ఖమ్మం జిల్లా పాలేరు, ఖమ్మం, సత్తుపల్లి నియోజకవర్గాల్లో రోడ్డు షోలలో, మధిరలో నిర్వహించిన విజయభేరి సభలో ప్రియాంకాగాంధీ ప్రసంగించారు. వివరాలు ఆమె మాటల్లోనే.. ''రాహుల్ గాంధీ కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు భారత్ జోడో యాత్ర చేపడితే.. తెలంగాణలో భట్టి విక్రమార్క పాదయాత్ర చేశారు. ప్రజల ఇబ్బందులు, బాధలను తెలుసుకుని వాటి పరిష్కారం కోసం పోరాడటమే వారి లక్ష్యం. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలు, రైతుల బాధలు పట్టించుకోలేదు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అమలు చేస్తాం.

అన్నింటికన్నా ప్రజలే ముఖ్యం

ప్రజలే ప్రధానమని, వారికన్నా పైస్థాయి నాయకులెవరూ ఉండరని మహాత్మాగాంధీ, కాంగ్రెస్ నేతలు శాస్త్రి, ఇందిర, రాజీవ్, సోనియా, మన్మోహన్‌సింగ్ వంటివారు ఆలోచించారు. కానీ కేసీఆర్, మోదీ ఈ విషయాన్ని పట్టించుకోలేదు. కేసీఆర్ రుణమాఫీ చేయలేదు. రైతుల పంటకు సరైన ధర దక్కడం లేదు. నిత్యావసరాల ధరలు పెరిగి ప్రజలు బాధపడుతున్నారు. పోరాడి తెచ్చుకున్న తెలంగాణలో పదేళ్ల తర్వాత కూడా లక్షలాది మంది నిరుద్యోగులు ఉన్నారు. కేవలం కేసీఆర్ కుటుంబ సభ్యులే మంత్రులయ్యారు. వ్యాపారులయ్యారు. రాష్ట్ర సంపదను ఏలుతున్నారు. ప్రాజెక్టుల్లో భారీగా అవినీతి జరిగింది. బీఆర్‌ఎస్ నేతలకు వందల ఎకరాల్లో ఫామ్‌హౌజ్‌లున్నాయి. వాటిలోంచి బయటికి రారు. ప్రజల సమస్యలను పరిష్కరించరు.

సంపదను ప్రజలకు పంచుతాం

పదేళ్లుగా ఏలుతున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించింది. కాంగ్రెస్ ప్రభుత్వాలు ఉన్నచోట ఉద్యోగాలు ఇవ్వడమే కాకుండా సంపదను ప్రజలకు పంచాం. ఇక్కడ భారీ మెజారిటీతో వచ్చే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తెచ్చుకోండి. అందరికీ ఇళ్లు ఇచ్చే, ఉద్యోగాలు వచ్చే, యువత ఆర్థికంగా తమ కాళ్ల మీద బతికేలా తోడ్పాటు అందించే, రైతులకు మద్దతుగా నిలిచే ప్రభుత్వాన్ని తెచ్చుకోండి. మార్పు కావాలంటే కాంగ్రెస్ రావాల్సిందే..'' అని ప్రియాంకాగాంధీ పిలుపునిచ్చారు. ప్రియాంక రోడ్‌షో నిర్వహిస్తున్న సమయంలో గిరిజన మహిళలు సంప్రదాయ దుస్తులు, బిందెలతో నాట్యం చేస్తూ స్వాగతం పలికారు. వారిని ఆమె ప్రచారరథంపైకి పిలిచి కలసి నృత్యం చేశారు. ఈ సభలు, రోడ్‌షోలలో మధిర, పాలేరు, ఖమ్మం, సత్తుపల్లి కాంగ్రెస్ అభ్యర్థులు మల్లు భట్టివిక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, మట్టా రాగమయి, నాయకులు రోహిత్ చౌదరి, పోరిక బలరాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలేవీ నెరవేర్చలేదు

- రైతుబంధుకు అనుమతి తెచ్చుకున్నారు.. దళితబంధుపై కేసీఆర్‌కు వివక్ష ఎందుకు?
- జుక్కల్ ఎన్నికల ప్రచారంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఫైర్



నిజాంసాగర్ (జుక్కల్): ప్రాజెక్టుల పేరుతో రూ.లక్ష కోట్ల అవినీతి, హైదరాబాద్‌లో పదివేల ఎకరాల భూ కబ్జాలు చేసిన సీఎం కేసీఆర్‌కు ఇందిరమ్మ రాజ్యంలో చర్లపల్లి జైలులో డబుల్ బెడ్‌రూం ఇల్లు కట్టిస్తామని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఘాటుగా విమర్శించారు. పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లలు కట్టిస్తామని చెప్పిన కేసీఆర్ కుటుంబం తెలంగాణను దగాచేసి రూ.కోట్లు దోచుకుందని మండిపడ్డారు. కేసీఆర్‌తో పాటు ఆయన కూతురు, కుమారుడు, అల్లుడు జైలుకు వెళ్లడం ఖాయమని అన్నారు. ఇచ్చిన హామీలేవీ నెరవేర్చలేదని, బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేదలకు ఇళ్లు కట్టించలేదని, ఇంటికో ఉద్యోగం ఇవ్వలేదని ఆయన ధ్వజమెత్తారు. కేజీ టు పీజీ ఉచిత విద్య, ముస్లిం మైనారిటీలు, గిరిజనులకు రిజర్వేషన్లు ఇవ్వలేదని విమర్శించారు. కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజక వర్గంలోని బిచ్కుంద మండల కేంద్రంలో శనివారం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి లక్ష్మీకాంతరావుకు మద్దతుగా బహిరంగ సభ నిర్వహించారు. ఇందులో పాల్గొన్న రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ, సీఎం కేసీఆర్ పాలనపై మండిపడ్డారు. రాష్ట్రంలో అత్యంత దోపిడీ దొంగలు ఎవరైనా ఉన్నారంటే అది కేసీఆర్ కుటుంబమేనని అన్నారు. ఓటు ద్వారా కేసీఆర్‌కు గొయ్యితవ్వి బొందపెడదామని ప్రజలకు పిలుపునిచ్చారు. కేసీఆర్ అనే ఒక బక్కోడిని ఓడించేందుకు కాంగ్రెస్ వాళ్లు గుంపులు గుంపులుగా వస్తున్నారని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. బక్కోడికి కావలసింది బుక్కెడు బువ్వ, రెండు పెగ్గులు కాగా రూ. లక్షల కోట్లు అవితికి పాల్పడిన కేసీఆర్‌ను ఇంటికి సాగనంపుదామని ప్రజలను రేవంత్ కోరారు. కేసీఆర్ ధనిక రాష్ట్రాన్ని దివాలా తీయించారని, నిరుద్యోగ యువకులు ఆత్మబలిదానాలు చేసుకున్నా.. పట్టించుకోలేదని, రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేయలేదని ధ్వజమెత్తారు. టీఎస్‌పీఎస్సీ గ్రూపు పరీక్షల ప్రశ్నపత్రాలను జిరాక్స్ సెంటర్లలో అమ్ముకొన్న కేసీఆర్, తెలంగాణ చరిత్రలో ద్రోహిగా నిలుస్తారన్నారు. ఓట్ల కోసం రైతుబంధుకు ఎన్నికల కమిషన్ నుంచి అనుమతి తెచ్చుకొని రైతుల ఖాతాలో డబ్బులు వేస్తే తమకేమి ఇబ్బంది లేదని, కానీ దళిత బంధుకు ఎన్నికల కమిషన్ నుంచి ఎందుకు అనుమతి తీసుకురాలేదో కేసీఆర్ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. 'కేసీఆర్ దళిత ద్రోహిగా మిగులుతారు, దళిత బంధు, బీసీ, మైనారిటీ బంధు పథకాలకు అనుమతి తీసుకురాని కేసీఆర్ దిష్టిబొమ్మలను ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా దహనం చేయాలని రేవంత్ పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ సురేశ్ షెట్కార్ ఇతర నాయకులు పాల్గొన్నారు.

పోటీ చేయని స్థానాల్లో కాంగ్రెస్‌కే మద్దతు!

- సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి వెల్లడి
- హంగ్ వస్తే బీఆర్‌ఎస్‌కు బీజేపీ మద్దతిస్తుంది..
- చంద్రబాబుపై కేసులో నిజానిజాలు కోర్టులోనే తేలుతాయని వ్యాఖ్య



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు సీపీఎం మద్దతు ప్రకటించింది. తెలంగాణలో తాము పోటీ చేయని నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌కు ఓటేయాలని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పిలుపునిచ్చారు. బీజేపీకి వ్యతిరేకంగా కాంగ్రెస్‌కు ఓటేస్తామని, బీజేపీని ఓడించడమే తమ లక్ష్యమన్నారు. శనివారం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్, హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్‌ల ఆధ్వర్యంలో జరిగిన 'మీట్ ది మీడియా' కార్యక్రమంలో సీతారాం ఏచూరి మాట్లాడారు. తెలంగాణలో హంగ్ వస్తే కూడా సీపీఎం మద్దతు కాంగ్రెస్‌కేనన్నారు. సీపీఎం పోటీ చేయని చోట ఎవరికి మద్దతు ఇస్తారన్న దానిపై పార్టీ కేంద్ర కమిటీ వైఖరి ఒకరకంగా, రాష్ట్ర కమిటీ వైఖరి ఒకరకంగా ఉందన్న ప్రశ్నపై ఆయన పై విధంగా సమాధానం ఇచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌కు, బీఆర్‌ఎస్‌కు మధ్యే ప్రధాన పోటీ ఉందన్నారు. తాము బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీలకు వ్యతిరేకంగా ఎన్నికల బరిలోకి దిగామని, ఆ ప్రకారమే ప్రచారం కొనసాగుతోందన్నారు. రాష్ట్రంలో హంగ్ పరిస్థితి వస్తే బీఆర్‌ఎస్‌కు బీజేపీ మద్దతు ఇస్తుందని కూడా ఆయన సంచలన వ్యాఖ్య చేశారు. 19 స్థానాల్లో పోటీ చేయడం వల్ల బీఆర్‌ఎస్‌కు సీపీఎం బీ టీం అన్న విమర్శకు ఆయన సమాధానమిస్తూ, కాంగ్రెస్ సహా లౌకిక శక్తులతో కలిసి పోటీ చేయాలని ప్రయత్నించామని, కానీ సాధ్యం కాలేదన్నారు. తమది ఏ టీం అని... అదే యాంటీ బీజేపీ టీమ్ అని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌తో పొత్తు కుదిరివుంటే బాగుండేదన్నారు. తెలంగాణలో సీపీఎం ఒంటరిగా బరిలో ఉన్నా నష్టం లేదనే భావనలో కాంగ్రెస్ ఉందన్నారు. సీపీఎం ఖమ్మం జిల్లాలో పోటీ చేయకుండా పొత్తులు అనేదానికి అర్థంలేదన్నారు.

4 రాష్ట్రాల్లో బీజేపీకి గడ్డుపరిస్థితి...

మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మిజోరం, రాజస్తాన్‌లలో బీజేపీ గెలవడం కష్టంగానే ఉందని ఏచూరి అన్నారు. తెలంగాణలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లు ఎవరికి వారు తాము గెలుస్తామన్న ధీమాతో ఉన్నారన్నారు. ఎలక్షన్ కమిషన్, ఈడీ, సీబీఐలు బీజేపీ చేతిలో బందీ అయ్యాయని ఆరోపించారు. బీజేపీకి ఎక్కడ తక్కువ సీట్లు వచ్చినా ఈడీ, సీబీఐ ద్వారా ఎలాగో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని విమర్శించారు. తాము ఎన్నికల రాజకీయంలో వెనుకబడ్డామని, ప్రజా ఉద్యమాల్లో మాత్రం ముందున్నామన్నారు. కాగా, చంద్రబాబు అరెస్టుపై అడిగిన ప్రశ్న కు ఏచూరి సమాధానమిస్తూ, 'చంద్రబాబు అరెస్ట్‌ను ఖండించాం. ఆ కేసులో అనేకమంది ఉన్నారు. వాస్తవమేంటనేది కోర్టు ముందుకు వచ్చినప్పుడు ఆ కేసు వ్యవహారం బయట పడుతుంది. అప్పుడు నిజానిజాలు వెలుగుచూస్తాయి' అన్నారు.

ఆ మూడు పార్టీలూ ఒక్కటే

▶ మొదటి పేజీ తరువాయి

చల్లా వంశీచంద్‌రెడ్డి, కర్ణాటక విద్యాశాఖ మంత్రి సుధాకర్‌రెడ్డితో కలిసి ఖర్గే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఖర్గే మాట్లాడుతూ.. ప్రజల ఆకాంక్షల మేరకు పదేళ్ల కితమే సోనియాగాంధీ తెలంగాణ ఇచ్చినా.. ఇంకా వారి ఆశలు నెరవేరలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తేనే వారి ఆశలు, ఆశయాలు నెరవేరుతాయని చెప్పారు. ప్రధాని మోదీ, సీఎం కేసీఆర్ ఇద్దరూ అబద్ధాల కోరులేనని, తోడుదొంగలని ధ్వజమెత్తారు. వారిద్దరి మధ్య అనేక విషయాల్లో చీకటి ఒప్పందం సాగుతోందని ఆరోపించారు. కేసీఆర్ పాలనలో పేదల జీవనం దుర్భరంగా మారితే, కేంద్రంలో మోదీ హయాంలో నిత్యావసరాలతో పాటు పెట్రోలు, డీజిల్ ధరలు భారీగా పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. మోదీ కేవలం అదానీ లాంటి బడా వ్యాపారస్తులకు మాత్రమే మేలుచేస్తూ పేదలను పట్టించుకోలేదని మండిపడ్డారు. మిగులు బడ్జెట్ ఉన్న తెలంగాణను కేసీఆర్ అప్పుల పాలు చేశారని ఆరోపించారు.

కేసీఆర్ దిష్టిబొమ్మల దహనానికి రేవంత్ పిలుపు

దళితబంధు, బీసీబంధు, మైనార్టీబంధు ఇవ్వని సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మల దహనం కార్యక్రమాలను ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించాలని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. రైతుబంధు నిధులు వేయడానికి ఎన్నికల సంఘం నుంచి అనుమతి తీసుకున్న కేసీఆర్, దళితబంధు, బీసీబంధు, మైనార్టీబంధు నిధులు ఇవ్వడానికి ఎందుకు అనుమతి తీసుకోలేదని ప్రశ్నించారు. సభలో ఏఐసీసీ కార్యదర్శి నాజిర్ హుస్సేన్, సందీప్, పరిశీలకుడు మోహన్‌జీ, బిహార్ సీఎల్‌పీ నాయకుడు షకీల్ అహ్మద్ ఖాన్, మాజీ ఎంపీ మల్లురవి, జిల్లా పార్టీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

బతుకులు బాగుపడాలంటే కాంగ్రెస్ రావాలి

హైదరాబాద్ వచ్చిన ప్రతిసారీ ప్రధాని, హోంమంత్రి కేసీఆర్ అవినీతి గురించి మాట్లాడతారని, అయితే ఆయనపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడాన్ని ప్రజలు అర్థం చేసుకోవాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే సూచించారు. ఢిల్లీ లిక్కర్ స్కాంలో అనేక మందిని అరెస్టు చేసిన మోదీ ప్రభుత్వం కవితను ఎందుకు అరెస్టు చేయలేదని ప్రశ్నించారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ చాచానెహ్రూనగర్‌లో శనివారం జరిగిన రోడ్ షోలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రజల బతుకులు బాగుపడాలంటే రాష్ట్రంలో కాంగ్రెస్ రావాలన్నారు. పార్టీ అధికారంలోకి రాగానే 6 గ్యారంటీలను అమలు చేస్తామని హామీనిచ్చారు. సనత్‌నగర్ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ కోట నీలిమ, టీపీసీసీ పరిశీలకులు మాణిక్‌రావు ఠాక్రే తదితరులు పాల్గొన్నారు.

పీవీపై కాంగ్రెస్‌ది కపటప్రేమ

- ఎమ్మెల్సీ వాణీదేవి, మేయర్ విజయలక్ష్మి ప్రెస్‌మీట్

సాక్షి, హైదరాబాద్: దివంగత మాజీ ప్రధాని పీవీ నర్సింహారావుపై కాంగ్రెస్ కపటప్రేమ చూపిస్తోందని, రాజీవ్‌గాంధీ మరణం తర్వాత మైనారిటీలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఐదేళ్ల పాటు నడిపి దేశంలో ఆర్థిక సంస్కరణలకు పునాది వేసిన ఆయనను ఏనాడూ పట్టించుకోలేదని ఎమ్మెల్సీ, పీవీ కూతురు సురభి వాణీదేవి విమర్శించారు. చివరిశ్వాస వరకు కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేసిన పీవీ నర్సింహారావు ఒక శక్తి అని పేర్కొన్నారు. గ్రేటర్ హైదరాబాద్ మేయర్ విజయలక్ష్మి గద్వాల్‌తో కలిసి శనివారం తెలంగాణ భవన్‌లో వాణీదేవి మీడియాతో మాట్లాడారు. మరణానంతరం కూడా పీవీపై ప్రపంచ దేశాలు సానుభూతి చూపించినా నాడు కాంగ్రెస్‌కు గుర్తుకు రాని ఆయన సేవల్ని ఇప్పుడు ప్రస్తావించడాన్ని తప్పుబట్టారు. కేసీఆర్ ఉద్యమం వల్లే తెలంగాణ సిద్ధించి రాష్ట్రంలో సుస్థిరపాలన, అభివృద్ధి జరుగుతోందన్నారు. ఎన్నికల సమయంలోనే కాంగ్రెస్‌కు పీవీ గుర్తుకు వస్తున్నారని మేయర్ విజయలక్ష్మి గద్వాల్ విమర్శించారు. దేశానికే ఆభరణంలాంటి పీవీకి కాంగ్రెస్ ప్రభుత్వం భారతరత్న ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. దివంగత మాజీ ప్రధాని విగ్రహం, అసెంబ్లీలో చిత్రపటం ఏర్పాటుతో పాటు ఆయనను గౌరవించింది సీఎం కేసీఆర్ మాత్రమేనన్నారు.

'స్కాంగ్రెస్' ప్రకటనను తొలగించాలి

కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశం

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీని 'స్కాంగ్రెస్'గా పేర్కొంటూ బీఆర్‌ఎస్ పార్టీ ఓ ఆంగ్ల పత్రికకు జారీ చేసిన ప్రకటనను తక్షణమే పత్రిక ఈ-పేపర్ నుంచి తొలగించాలని కేంద్ర ఎన్నికల సంఘం శనివారం ఆదేశించింది. మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ(ఎంసీఎంసీ) నుంచి అనుమతి తీసుకోకుండా ఈ ప్రకటన జారీ చేశారని నిర్ధారణ కావడంతో ఈ నిర్ణయం తీసుకుంది. కాంగ్రెస్ పార్టీ చేసిన ఫిర్యాదుపై ఈ మేరకు ఈసీ చర్యలు తీసుకున్నట్టు అధికారులు తెలియజేశారు. రాజకీయ పార్టీలు పత్రికలకు జారీ చేసే ప్రకటనలను ముందుగా ఎంసీఎంసీ కమిటీ పరిశీలనకు సమర్పించాల్సి ఉంటుంది. ఎన్నికల ప్రవర్తన నియమావళికి అనుగుణంగా ప్రకటన ఉందా? లేదా? పరిశీలించి అవసరమైతే మార్పులను ఎంసీఎంసీ కమిటీ సూచిస్తుంది. ఎంసీఎంసీ ఆమోదించిన ప్రకటనలను మాత్రమే మీడియాకు జారీ చేయాల్సి ఉంటుంది.

బీఆర్‌ఎస్–కాంగ్రెస్ మధ్యే పోటీ

బీజేపీ, ఎంఐఎం తెరవెనుక బీఆర్‌ఎస్‌కు సాయం చేస్తున్నాయి

- వేములవాడ, బోధన్, ఆదిలాబాద్ సభల్లో రాహుల్‌గాంధీ
- తెలంగాణతో మాది కుటుంబ బంధం
- అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి వస్తాం
- కాంగ్రెస్ అధికారంలోకి వస్తే తొలిరోజే చట్టాలుగా ఆరు గ్యారంటీలు

మోదీకి కలలో కూడా నా ఆలోచనే

ప్రధాని మోదీకి నిరంతరం నా ఆలోచనలే. చివరికి కలలో కూడా నా గురించే ఆలోచిస్తున్నారు. కోర్టుకు వెళ్లి నా పార్లమెంట్ సభ్యత్వం రద్దు చేయించారు. ఇల్లు కూడా లాక్కున్నారు. అయినా భయపడలేదు.



ఆదిలాబాద్‌లో రాహుల్ సభకు హాజరైన జనం

సాక్షి ప్రతినిధి, కరీంనగర్/సాక్షి ప్రతినిధి, నిజామాబాద్/సాక్షి, ఆదిలాబాద్: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ మధ్యే పోటీ అని.. బీజేపీ, ఎంఐఎం తెరవెనుక బీఆర్‌ఎస్‌కు సాయం చేస్తున్నాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. తెలంగాణలో బీఆర్‌ఎస్‌ను, కేంద్రంలో బీజేపీని గద్దెదింపుతామని.. ఆ దిశగా కేసీఆర్‌ను ఓడించడం తమ తొలి అడుగు అవుతుందని చెప్పారు. తమ ప్రభుత్వం ఏర్పాటైన తొలిరోజే ఆరు గ్యారంటీలను ఆరు చట్టాలుగా మారుస్తామని హామీ ఇచ్చారు. శనివారం సిరిసిల్ల జిల్లా వేములవాడ, నిజామాబాద్ జిల్లా బోధన్, ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన కాంగ్రెస్ విజయభేరి సభల్లో రాహుల్ గాంధీ మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే.. ''తెలంగాణతో మాది రాజకీయ బంధం కాదు. కుటుంబ బంధం. నాడు విపత్కర పరిస్థితుల్లో తెలంగాణ ప్రజలు ఇందిరాగాంధీకి అండగా నిలిచారు. పార్టీకి నష్టం జరుగుతుందని తెలిసి కూడా సోనియాగాంధీ తెలంగాణ ఇచ్చారు. ఇది రాజకీయ నిర్ణయం కాదు. కేవలం తెలంగాణ ప్రజలు కన్న కలలను నెరవేర్చేందుకే ఇచ్చారు. కానీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కేసీఆర్ ప్రభుత్వం విచ్చలవిడి అవినీతికి పాల్పడింది. ఒక్క కాళేశ్వరం ప్రాజెక్టులోనే రూ.లక్ష కోట్ల కుంభకోణం జరిగింది. కేసీఆర్ ప్రభుత్వంలో దోపిడీదారులు మంత్రులుగా ఉన్నారు. ధరణి పోర్టల్ ద్వారా ప్రభుత్వ, పేదల భూములను దోపిడీ చేశారు. మళ్లీ బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తే పేదల భూములన్నీ కబ్జా చేస్తారు. దేశంలో రెవెన్యూ, ఆర్థికం, నీటిపారుదల వంటి కీలకశాఖలన్నీ ఒకే కుటుంబం చేతిలో ఉన్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమే.

ఆ ముగ్గురూ మిత్రులే..

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందన్న విషయం కేసీఆర్‌కు, బీజేపీ, ఎంఐఎంలకు కూడా తెలుసు. బీఆర్‌ఎస్, బీజేపీ, ఎంఐఎం ముగ్గురు మిత్రులే. ఒకదానికొకటి సహకరించుకుంటాయి. కాంగ్రెస్ గెలవ వద్దన్నది ఈ మూడు పార్టీల లక్ష్యం. వారికి వ్యతిరేకం కాబట్టే నాపై సీబీఐ, ఈడీ, ఐటీ దాడులతో వేధిస్తున్నారు. 24 కేసులు పెట్టారు. బీజేపీకి అనుకూలంగా ఉన్న బీఆర్‌ఎస్, ఎంఐఎంలపై ఎలాంటి కేసులు ఉండవు. దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా, కేడర్ లేకున్నా ఎంఐఎం పోటీచేస్తూ కాంగ్రెస్ ఓటు బ్యాంకును చీల్చుతోంది.

కాంగ్రెస్ ఏం చేసిందో కనిపించట్లేదా?

కాంగ్రెస్ పార్టీ ఏం చేసిందని కేసీఆర్, బీఆర్‌ఎస్ నాయకులు అంటున్నారు. కేసీఆర్ చదువుకున్న పాఠశాల, కళాశాల, యూనివర్సిటీ సైతం కాంగ్రెస్ హయాంలో కట్టినవే. హైదరాబాద్‌లో మెట్రో రైలు, ఔటర్ రింగ్‌రోడ్, ఎయిర్‌పోర్టులు కట్టినది, ఐటీ రంగాన్ని అభివృద్ధి చేసింది కాంగ్రెస్ ప్రభుత్వాలే.

కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించండి

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే జాబ్ క్యాలెండర్ ప్రకారం రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తాం. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తాం. 24 గంటల కరెంటు ఇస్తాం. మహిళలకు ప్రతీ నెలా రూ.2,500 ఖాతాలో వేస్తాం, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అందిస్తాం. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద రూ.5లక్షల ఆర్థిక సాయం, వృద్ధులకు పింఛన్ రూ.4 వేలు, ఉద్యమకారులకు 250 గజాల ఇంటి జాగా అందజేస్తాం. కాళేశ్వరం ప్రాజెక్టులో మింగిన అవినీతి సొమ్మును కేసీఆర్ నుంచి వసూలు చేస్తా. అవినీతి పాలన పోవాలంటే కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలి..' అని రాహుల్ గాంధీ కోరారు.

నిరుద్యోగం ఎందుకుంది?

యువకులతో రాహుల్ మాటా ముచ్చట



ముషీరాబాద్ (హైదరాబాద్): ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం నగరంలో పర్యటించిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ అశోక్‌నగర్‌లోని సిటీ సెంట్రల్ లైబ్రరీ సందర్శించారు. సమీపంలోని చాయ్ బండి వద్ద నిరుద్యోగులు, విద్యార్థులతో భేటీ అయ్యారు. ఈ విషయం తెలియడంతో మరింత మంది నిరుద్యోగులు అక్కడకు చేరుకున్నారు. వారితో కలిసి కూర్చున్న రాహుల్ రాత్రి 8.20 నుంచి 40 నిమిషాల పాటు మాట్లాడారు. ఇటీవల ఆత్మహత్య చేసుకుని మరణించిన నిరుద్యోగ యువతి ప్రవల్లిక గురించి ఆరా తీశారు. పలువురు విద్యార్థుల వ్యక్తిగత సమాచారం అడిగి తెలుసుకున్నారు. ఎవరు? ఎక్కడ నుంచి వచ్చారు? తల్లిదండ్రుల వివరాలు కూడా అడిగారు. యువకులు పడుతున్న ఇబ్బందులు, ఉద్యోగ ప్రకటనల గురించి వాకబు చేశారు. 'ఇప్పటిదాకా 18 నోటిఫికేషన్లు ఇచ్చారు కానీ అందులో 14 రద్దయ్యాయి..' అని వారు జవాబిచ్చారు. 'మీ కోరిక మేరకు మేం తెలంగాణ ఇచ్చాం కదా.. అయినా నిరుద్యోగం ఇంకా తీవ్రంగా ఎందుకు ఉంది?' అంటూ రాహుల్ ప్రశ్నించారు. దీంతో ప్రభుత్వంలోని అధికారులే పేపర్ల లీక్‌లకు పాల్పడుతున్నారని, పోటీ పరీక్షల ప్రశ్నపత్రాలు అమ్ముకుంటున్నారని నిరుద్యోగులు బదులిచ్చారు. గ్రూప్ 2ని ఇప్పటికి 2 సార్లు రద్దు చేశారని వివరించారు. కాగా రాష్ట్రంలో తాము అధికారంలోకి రాగానే 2 లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేస్తామని రాహుల్ వారికి హామీ ఇచ్చారు. సిటీ సెంట్రల్ లైబ్రరీ నుంచి క్రాస్‌రోడ్స్‌లోని బావార్చి హోటల్‌కు రాహుల్ మరో 10 మంది సహచరులతో కలిసి వచ్చారు. అక్కడ మటన్ జంబో బిర్యానీ, రోస్టెడ్ చికెన్ ఫ్రై, చికెన్ 65 డ్రై, చికెన్ టిక్కా, చిల్లీ పన్నీర్, పన్నీర్ 65, మిక్స్‌డ్ వెజ్, రుమాలీ రోటీ, ఫ్రెష్ లైమ్ సోడా ఆర్డర్ ఇచ్చారు. మొత్తం రూ.5,280 బిల్ చెల్లించారు.

నిరుద్యోగుల ఆవేదన కదిలించింది

నిరుద్యోగులు, విద్యార్థులతో మాటా ముచ్చట అనంతరం ఎక్స్ (ట్విటర్) ద్వారా రాహుల్‌గాంధీ ఆవేదన వ్యక్తం చేశారు. 'హైదరాబాద్‌లో పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతోన్న యువతను కలిశాను. వారి ఆవేదన నన్ను కలచివేసింది. కేసీఆర్ పదేళ్ల పాలనలో తెలంగాణ యువతకు న్యాయం జరగలేదు. నోటిఫికేషన్లు లేక, కోర్టు కేసులతో, పేపర్ లీకులతో 30 లక్షల మంది యువత నష్టపోయారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే జాబ్ క్యాలెండర్‌ను అమలు చేస్తాం.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.

ఆదివారం 26-11-2023

సత్యమేవ జయతే


సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 12+6+32 పేజీల ఆదివారం అనుబంధం వెల: ₹ 7.00

సంపుటి: 16
సంచిక: 245

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL





ప్రభుత్వ నియామకాలు **స్వాహా!**

కాళేశ్వరం ప్రాజెక్టుతో రూ. లక్ష కోట్లు **స్వాహా!**

GO 111తో ₹1.4 లక్షల కోట్లు **స్వాహా!**

ధరణి పోర్టల్‌తో 50,000 ఎకరాల భూములు **స్వాహా!**

₹25,000 కోట్ల BC సంక్షేమ నిధులు **స్వాహా!**

ORR ప్రాజెక్ట్ అమ్మకంతో ₹22,000 కోట్లు **స్వాహా!**



మిషన్ భగీరథతో ₹21,000 కోట్లు **స్వాహా!**

దళితులకు 3 ఎకరాల భూమి **స్వాహా!**

డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు **స్వాహా!**

పంచాయతీ నిధులు **స్వాహా!**

నిరుద్యోగ భృతి **స్వాహా!**

మన ఊరు, మన బడి నిధులు **స్వాహా!**

మద్యం లైసెన్సులతో వందల కోట్లు **స్వాహా!**

తాడిచెర్ల బొగ్గు క్షేత్రాలతో ₹16,000 కోట్లు **స్వాహా!**

కోకాపేట భూములు **స్వాహా!**

పదేండ్లలో **₹10 లక్షల కోట్లు స్వాహా!**

ఈ దోపిడీని అంతం చేయకపోతే
మన భవిష్యత్తే స్వాహా!

తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌ను గెలిపిద్దాం. చెయ్యి గుర్తుకే ఓటేద్దాం!





మహాలక్ష్మి
మహిళలకు ప్రతి నెలా ₹2500
₹500కే గ్యాస్ సిలిండర్
ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం

రైతు భరోసా
ప్రతి ఏటా రైతులకు, కౌలు రైతులకు
ఎకరానికి ₹15000
వ్యవసాయ కూలీలకు ₹12000
వరి పంటకు ₹500 బోనస్

గృహజ్యోతి
ప్రతి కుటుంబానికి
200 యూనిట్ల
ఉచిత విద్యుత్

ఇందిరమ్మ ఇండ్లు
ఇల్లు లేని వారికి
ఇంటి స్థలం మరియు ₹5 లక్షలు
ఉద్యమకారులకు
250చ.గ. ఇంటి స్థలం

యువవికాసం
విద్యార్థులకు ₹5 లక్షల
విద్యా భరోసా కార్డు
ప్రతి మండలంలో తెలంగాణ
ఇంటర్నేషనల్ స్కూల్స్

చేయూత
₹4000 నెలవారీ పింఛను
₹10 లక్షల
రాజీవ్ ఆరోగ్యశ్రీ బీమా

దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టిన వానియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను.
– క్రైస్తవ ధర్మం

పేదల సాధికారతపై ఉచిత పత్రిక ఉక్రోషం!

సూర్యుడు తూర్పు దిక్కుననే ఉదయించును. ఇది ఒక నిత్య సత్యం. పేద ప్రజల సాధికారతను పెత్తందార్లు అంగీకరించరు. ఇది కూడా అటువంటిదే. అనుదిన సత్యమే. నిత్యం ఉషోదయంతో సత్యం నినదించుగాక... ఈ సుభాషితాన్ని 'ఈనాడు' పత్రికవాళ్లు అప్పుడెప్పుడో బ్రాండ్ క్యాంపెయిన్‌కు వాడుకున్నట్టు గుర్తు. ఇప్పుడు పైన చెప్పిన రెండో సత్యాన్ని నిలబెట్టడం కోసం ఆ పత్రిక యాజమాన్యం 'త్యాగాలకు' కూడా సిద్ధమైంది. ఇంటింటికీ ఉచితంగా పత్రికను పంపిణీ చేసే కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్‌లో 'ఈనాడు' శ్రీకారం చుట్టింది.



'సత్యం నినదించు గాక' అనే క్యాంపెయిన్‌ను 'ఈనాడు' చాలాకాలం కిందటే నిలిపివేసింది. చంద్రబాబు–యెల్లో కూటమి అండ్ సన్స్ ప్రయోజనాలకు అనుగుణంగా నిత్యం అసత్యాలను అచ్చొత్తడమే పనిగా పెట్టుకొన్నందున ఆ క్యాంపెయిన్‌ను కొనసాగించడానికి వాళ్లకే సిగ్గేసింది కాబోలు. ఏదో సినిమాలో మెడలో రుద్రాక్ష మాల ఉన్నంత వరకూ అల్లు అర్జున్ నాన్‌వయలెంట్‌గా ఉండిపోతాడు. ఫైటింగ్ చేయాల్సి వచ్చినప్పుడు ఆ మాలను తీసి పక్కన పెడతాడు. ఈ తీసుకోవడం, వేసుకోవడం గొడవంతా ఎందుకని 'ఈనాడు' వాళ్లు సత్యం నినదించుగాక అనే క్యాంపెయిన్ను శాశ్వతంగా నిద్రపుచ్చారు.

ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల సమయం సమీపిస్తున్నకొద్దీ అసత్య కథనాల వంటకాన్ని 'ఈనాడు' భారీగా పెంచేసింది. పేజీకో పొయ్యి చొప్పున వెలిగించి నిత్యాగ్నిహోత్రాన్ని నిర్వహిస్తున్నది. అసత్య కథనాలతో అధికార పక్షం మీద బురద జల్లడానికే అది పరిమితం కాలేదు. మానవ నాగరికత వికాసానికి మోకాలొడ్డే సాహసం చేస్తున్నది. ప్రజాస్వామ్య పరిణతి ప్రస్థానాన్ని వెక్కిరించే విదూషక పాత్రను పోషిస్తున్నది. అరచేతిని అడ్డుపెట్టి సూర్యకాంతిని ఆపాలనే తింగరి చేష్టకు తెగబడుతున్నది. కష్టజీవులు తలపెట్టిన సాధికారత యజ్ఞంపై మారీచ మాయలు ప్రయోగిస్తున్నది.

మహిళలూ – పేదవర్గాల సాధికారత అనేది ఈ దేశ రాజ్యాంగం ఇచ్చిన హామీ. ఈ హామీని అమలుపరచడంలో విఫలమైన ప్రభుత్వాధినేతలందరూ ఈ విషయంలో దోషులే. ఎటువంటి వివక్ష లేకుండా అందరికీ సమాన హక్కులూ, సమాన అవకాశాలూ కల్పించడం ద్వారానే క్రమంగా సాధికారత సాధ్యమవుతుంది. ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల ఈ క్రమం నెమ్మదించింది. ఇన్నాళ్లకు ఇప్పుడొక రాష్ట్ర ప్రభుత్వం దాని వేగాన్ని పెంచే పని ప్రారంభించింది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి భారత రాజ్యాంగం ఆశయాల మేరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల ప్రజలకు, అన్నివర్గాల మహిళలకు ఒక్కొక్కటిగా ఆర్థిక రాజకీయ సాంఘిక హోదాలను కట్టబెడుతూ వెళుతున్నారు.

ఈ అవకాశాలను ఉపయోగించుకొని సాధికారత పథంలో పరుగు తీయాలన్న లక్ష్యంతో రాష్ట్రంలో సామాజిక సాధికార యాత్ర పేరుతో ఒక జన జాగృత కార్యక్రమానికి వారు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వాళ్లు భుజాన వేసుకున్న మాట నిజమే. ఆ పార్టీ ప్రభుత్వమే, ఆ పార్టీ అధినేతే స్వయంగా పేదవర్గాల సాధికారతను ఒక పవిత్ర లక్ష్యంగా పరిగణిస్తున్నప్పుడు అదే పార్టీ ఈ కార్యక్రమానికి ముందు నడవడం అసహజమేమీ కాదు. వెనుకబడిన వర్గాలను వెన్నెముక వర్గంగా మలిచే కార్యక్రమం వల్ల పాలక పార్టీ పలుకుబడి మరింత పెరుగుతుందనడం కూడా వాస్తవమే. ఈ ఒక్క కారణం చాలదా యెల్లో మీడియా కళ్లు మంటెక్కడానికి! దానికి తోడు శ్రామిక వర్గాల సాధికారతను సిద్ధాంతపరంగానే చంద్రబాబు కూటమి వ్యతిరేకిస్తున్నది.

> పేద వర్గాల ప్రజలు సాధికారతను సంతరించుకోవడానికి ఉపయోగపడే ప్రతి కార్యక్రమం మీదా చంద్రబాబు – యెల్లో ముఠా దాడులు చేస్తూనే వస్తున్నది. సాధికారత కార్యక్రమాన్ని ఒక ఉద్యమంగా మలిచి ప్రజలను చైతన్యం చేయడానికి సిద్ధమవగానే 'ఈనాడు' పత్రిక అన్ని విలువల్నీ వదిలేసింది. దిగంబరంగా నిలబడింది. చివరకు ఉచిత పత్రిక అవతారమెత్తింది. 'సాక్షి' చదివే పాఠకులందరికీ ఫ్రీగా పత్రికను పంచడం మొదలుపెట్టింది. ఇది తొలి దశ. క్రమంగా పాఠకులందరికీ పంచడానికి సిద్ధమవుతున్నది. ఇప్పటికే 'ఈనాడు' పాఠకులుగా వున్నవారు వచ్చేనెల బిల్లు కట్టే పరిస్థితి లేదు. పక్కింట్లో ఫ్రీగా వేస్తున్నప్పుడు తాను మాత్రం ఎందుకు బిల్లు కట్టాలి. చివరికి ఫ్రీగా పేపర్ వేయించుకోవడానికి కూడా నెలకు రెండు ప్రియా పచ్చడి సీసాలు గిఫ్టుగా ఇవ్వాల్సిన దుస్థితిలోకి మన ఉచిత పత్రిక కూరుకుపోవచ్చు. స్వర్ణోత్సవ సంవత్సరంలోకి అడుగిడిన వేళ ఈ విషాదం దాని స్వయంకృతం.
>
> సామాజిక సాధికారత యాత్ర మొదలవగానే ఫ్రీ పేపర్ కార్యక్రమాన్ని ఈ పత్రిక ప్రారంభించింది. ఈ కార్యక్రమం వల్ల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మరింత బలపడుతుందనేది ఒక కారణం కావచ్చు. అసలు కారణం పేదల, మహిళల సాధికారతకు యెల్లో కూటమి వ్యతిరేకమన్న విషయం గతంలో అనేక మార్లు రుజువైంది. బీసీలు జడ్జీలుగా పనికిరారని కేంద్ర న్యాయశాఖకు లేఖ రాసిన వారెవరు? చంద్రబాబు. ఎస్సీలుగా పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా అని ఈసడించుకున్న వారెవరు? చంద్రబాబు.

కబుర్లు ఏవైనా చెప్పవచ్చు. ఆచరణ ఏమిటన్నదే కీలకం. వైఎస్ జగన్ ప్రభుత్వం చేపట్టిన సాధికారతకు బాటలు వేసే ప్రతి కార్యక్రమాన్ని చంద్రబాబు పార్టీ – యెల్లో మీడియా తీవ్రంగా వ్యతిరేకించాయి. పేద పిల్లలకు ఇంగ్లిషు మీడియం విద్యాబోధనను వ్యతిరేకించాయి. ఇప్పటికీ అభాసుపాలు చేయడానికి, విఫలం చేయడానికి ప్రయత్నిస్తున్నాయి. మహిళల పేరు మీద సొంత ఇల్లు కట్టించే కార్య క్రమాన్ని వ్యతిరేకించాయి. కోర్టు మెట్లెక్కాయి. అమరావతి శాసన రాజధాని పరిధిలో బలహీనవర్గాల ప్రజలకు ఇళ్ల పట్టాలిస్తే ఘోరమైన, క్రూరమైన అపచారం జరిగినట్టు గావుకేకలు పెట్టాయి. బాబు గార్లు ఉండాల్సిన చోట బడుగులు నివసించడమేమిటని వాదించాయి. కుల భ్రష్టమైపోతారట, మైలపడిపోతారట! ఇదే విషయాన్ని పాలిష్ చేసి చెప్పారు. జనాభా సమతుల్యత దెబ్బతింటుందని! కోర్టులో కూడా ఇదే వాదన చేశాయి.

పేదింటి ఆడబిడ్డల చదువు మధ్యలో ఆగిపోకుండా, బాల్య వివాహాల రుగ్మతను రూపుమాపే విధంగా పెళ్లి కానుకల కార్యక్రమాన్ని డిజైన్ చేస్తే కూడా ఈ కూటమి మండిపడింది. కారణం ఆడపిల్లల మీద అభిమానం కాదు. వారి అభివృద్ధి మీద ద్వేషం. అమ్మ ఒడి, చేయూత, ఆసరా వంటి కార్యక్రమాలను ఎద్దేవా చేశారు. ఇలాగైతే ఈ రాష్ట్రం దివాళా తీస్తుందని శాపనార్థాలు పెట్టారు. ఖర్చు చేయడానికి ప్రజల చేతిలో డబ్బులుంచాలని అభిజిత్ బెనర్జీ వంటి ఆర్థిక వేత్తలు చెప్పినా మన యెల్లో కూటమికి తలకెక్కలేదు. జనం సొమ్ముతో సొంత వ్యాపారాలు చేసుకునే మన 'చీ'ట్ ఫండ్ ముఠాకు అభిజిత్ ముఖర్జీలు, అమర్త్యసేన్‌లతో ఏం పని? చివరకు ఆర్థిక వేత్తలు చెప్పిందే నిజమైంది. జీఎస్‌డీపీ గ్రోత్ రేట్‌లో ఏపీ అగ్రగామిగా నిలబడింది. ఆర్థిక వ్యవస్థ పటిష్ఠమవడంతో పాటు లక్షలాది పేద కుటుంబాల ఆత్మగౌరవం పెరిగింది. ఆత్మ విశ్వాసం ఇనుమడించింది.

పేద వర్గాల ప్రజలు సాధికారతను సంతరించుకోవడానికి ఉపయోగపడే ప్రతి కార్యక్రమం మీదా చంద్రబాబు – యెల్లో ముఠా దాడులు చేస్తూనే వస్తున్నది. సాధికారత కార్యక్రమాన్ని ఒక ఉద్యమంగా మలిచి ప్రజలను చైతన్యం చేయడానికి సిద్ధమవగానే 'ఈనాడు' పత్రిక అన్ని విలువల్నీ వదిలేసింది. దిగంబరంగా నిలబడింది. చివరకు ఉచిత పత్రిక అవతారమెత్తింది. 'సాక్షి' చదివే పాఠకులందరికీ ఫ్రీగా పత్రికను పంచడం మొదలుపెట్టింది. ఇది తొలి దశ. క్రమంగా పాఠకులందరికీ పంచడానికి సిద్ధమవుతున్నది. ఇప్పటికే 'ఈనాడు' పాఠకులుగా వున్నవారు వచ్చేనెల బిల్లు కట్టే పరిస్థితి లేదు. పక్కింట్లో ఫ్రీగా వేస్తున్నప్పుడు తాను మాత్రం ఎందుకు బిల్లు కట్టాలి. చివరికి ఫ్రీగా పేపర్ వేయించుకోవడానికి కూడా నెలకు రెండు ప్రియా పచ్చడి సీసాలు గిఫ్టుగా ఇవ్వాల్సిన దుఃస్థితిలోకి మన ఉచిత పత్రిక కూరుకొనిపోవచ్చు. స్వర్ణోత్సవ సంవత్సరంలోకి అడుగిడిన వేళ ఈ విషాదం దాని స్వయంకృతం.

సామాజిక సాధికారత యాత్ర మొదలవగానే ఫ్రీ పేపర్ కార్యక్రమాన్ని ఈ పత్రిక ప్రారంభించింది. ఈ కార్యక్రమం వల్ల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మరింత బలపడుతుందనేది ఒక కారణం కావచ్చు. అసలు కారణం పేదల, మహిళల సాధికారతకు యెల్లో కూటమి వ్యతిరేకమన్న విషయం గతంలో అనేక మార్లు రుజువైంది. బీసీలు జడ్జీలుగా పనికిరారని కేంద్ర న్యాయశాఖకు లేఖ రాసిన వారెవరు? చంద్రబాబు. ఎస్సీలుగా పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా అని ఈసడించుకున్న వారెవరు? చంద్రబాబు. దళితులు... మీకెందుకురా అధికారాలు, రాజకీయాలు... అవన్నీ మేం చూసుకుంటామని బోధించిన వారెవరు? బాబు శిష్యపరమాణువు చింతమనేని ప్రభాకర్. కోడలు మగపిల్లాడిని కంటానంటే అత్త వద్దంటుందా అని మీడియా సమావేశంలోనే ప్రవచించిన వారెవరు? చంద్రబాబు. మహిళా అధికారి పట్ల వందలాదిమంది సాక్షిగా దుశ్శాసనుడిలా ప్రవర్తించింది ఎవరు? చంద్రబాబు శిష్య పరమాణువు చింతమనేని ప్రభాకర్.

బీసీల తోకలు కత్తిరిస్తానని బెదిరించిందెవరు? చంద్రబాబునాయుడు. ఎస్సీ పిల్లలు శుభ్రంగా ఉండరు, స్నానాలు చెయ్యరని తిట్టిపోసిందెవరు? చంద్రబాబు కొనుగోలు చేసిన ఆదినారాయణరెడ్డి. ముస్లిం మైనారిటీలకూ, గిరిజనులకూ మంత్రి పదవి లేకుండా చేసిందెవరు? చంద్రబాబు నాయుడు. రాజ్యాంగబద్ధమైన గిరిజన సలహా మండలి ఏర్పాటును అటకెక్కించిందెవరు? చంద్రబాబు నాయుడు. ఈ రకమైన దుర్నీతిని ప్రశ్నించకుండా, ప్రస్తావించకుండా, ఎండ గట్టకుండా ఆమోదముద్ర వేసిన ప్రముఖ పత్రికారాజము ఏది? మన ఉచిత పత్రిక, దాని తోకపత్రిక. ఇటువంటి ముఠా ప్రజా సాధికారతను ఏ రకంగా సహిస్తుంది?

రాష్ట్రంలోని మూడు ప్రాంతాల్లో రోజూ వేలాదిమంది బహుజనులు సాధికారత కోసం నినదిస్తూ ప్రదర్శనలు చేస్తున్నారు. సభల్లో సగటున ఇరవై నుంచి పాతికవేల మంది చొప్పున మూడు ప్రాంతాల్లో ప్రజలు పాల్గొంటున్నారు. ఉష్ట్ర పక్షికి భయం వేసినప్పుడు దాని తలను ఇసుకలో దాచేస్తుందట! అప్పుడేమీ కనపడదు. భయం తగ్గిన తర్వాత మళ్లీ బయటకు తీస్తుంది. ఉచిత పత్రికకు కూడా అటువంటి భయమేదో ఉన్నట్టుంది. బాటలు నడిచీ, పేటలు కడచీ, కోటలన్నిటినీ దాటుకుంటూ వచ్చే శ్రామిక జనాన్ని చూస్తే భయం. అందుకే సభ ప్రారంభం కాకముందూ, ముగిసిన తర్వాత ఫోటోలు తీసి అచ్చేసుకొని సంబర పడుతున్నది. ఉష్ట్రపక్షి మాదిరిగా ఉచిత పత్రిక దాని తలను ఎక్కడో దాచుకుంటే నిజం దాగుతుందా? ఎన్నో టీవీ చానెళ్లు, పత్రికలు అసలు విషయాన్ని చూపెడుతున్నాయి కదా! అయినా సరే – నవ్విపోదురు గాక నాకేటి సిగ్గు!

✧




జనతంత్రం

వర్ధెల్లి మురళి

కృత్రిమ గాలులు పనిచేస్తాయా?

ఇంకో నాలుగు రోజులు మాత్రమే! ఈనెల 30న తెలంగాణ రాష్ట్రం మూడో సర్కార్ ఎన్నికకు రంగం సిద్ధం చేసుకుంటున్నది. మూడో అసెంబ్లీ ఎన్నిక ముక్కోణపు పోటీగా మారడం విశేషం. ఎన్నికలన్న తర్వాత సర్వేలు, ప్రజాభిప్రాయ నాడీ జ్యోతిష్యాలు, 'గాలి' వేగాన్ని అంచనా వేసి చెప్పడాలు... ఇటువంటివన్నీ షరా మామూలే! ఒకదానికొకటి పొంతన లేకుండా రకరకాల సర్వే ఫలితాలు ఇప్పటికే వెల్లడయ్యాయి. ఇలా పొంతన లేకపోడానికి కారణం... ఇందులో కొన్ని 'ఉద్దేశపూర్వకమైనవి' కావడమే!



అన్ని రకాల సర్వే ఫలితాలను క్రోడీకరిస్తే, ఒక మూడు అంశాలు నిగ్గుతేలుతున్నాయి. ఒకటి – ఈసారి అధికార పార్టీ బీఆర్ఎస్ గట్టి పోటీని ఎదుర్కొంటున్నది. కొన్ని జిల్లాల్లో పాత బలాన్ని కాపాడుకున్నట్లు కనిపిస్తున్నా కొన్ని జిల్లాల్లో బలహీన పడినట్టు స్పష్టమవుతున్నది. రెండు – కాంగ్రెస్ పార్టీ గతంతో పోలిస్తే పుంజుకున్నది. అయితే ఈ పరిణామం కొన్ని ప్రాంతాలకే పరిమితం. రాష్ట్రవ్యాప్తంగా కనిపించడం లేదు. మూడు – బీసీ ముఖ్యమంత్రి ప్రకటన తర్వాత బీజేపీ పరిస్థితి గణనీయంగా మెరుగుపడింది. ఇదే ప్రకటన ఒక రెండు మూడు నెలల ముందు చేసి ఉన్నట్లయితే ఆ పార్టీ పరిస్థితి ఇంకా మెరుగ్గా ఉండేదన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

రాష్ట్రాన్ని భౌగోళికంగా విభజించి చెప్పవలసి వచ్చినప్పుడు ఉత్తర, దక్షిణ తెలంగాణలుగా చెప్పడం రివాజు. కానీ ఇప్పటి రాజకీయ పరిస్థితికి ఆ విభజన నప్పడం లేదు. రాష్ట్రానికి పడ మటి దిక్కున ఉన్న గ్రేటర్ హైదరాబాద్ (24), మెదక్ (10), నిజామాబాద్ (9) ప్రాంతాల్లోని అసెంబ్లీ స్థానాల్లో ఇప్పటికీ బీఆర్ఎస్ బలంగానే కనిపిస్తున్నది. మొత్తం సీట్లు 43. ఇందులో ఆనవాయితీగా మజ్లిస్ గెలిచే సీట్లు 7 తీస్తే మిగిలినవి 36. ఇందులో అత్యధిక సీట్లలో బీఆర్ఎస్ బలంగా ఉంటుందనీ, రెండో స్థానం కోసం బీజేపీ నుంచి కాంగ్రెస్ గట్టి పోటీ ఎదుర్కోవచ్చనీ క్షేత్రస్థాయి పరిశీలనలో తెలుస్తున్నది.

ఖమ్మం జిల్లాను ఉత్తర తెలంగాణగానూ, నల్లగొండను దక్షిణ తెలంగాణను పరిగణిస్తుంటారు. సరిహద్దు జిల్లాలైన ఈ రెండింటినీ కలిపి తూర్పు తెలంగాణగా భావించవచ్చు. ఈ రెండు ఉమ్మడి జిల్లాల్లో కలిపి 22 సీట్లున్నాయి. ఇక్కడ మెజారిటీ సీట్లలో కాంగ్రెస్‌కు అనుకూల వాతావరణం ఉన్నదని చెబుతున్నారు. బీజేపీ పరిస్థితి అట్లా కాదు. వాయవ్య దిక్కు ఎంట్రీ పాయింట్లో (ముధోల్, ఆదిలాబాద్, బోథ్, నిర్మల్, ఆర్మూర్, కోరుట్ల) బలంగా కనిపిస్తూ రాష్ట్రవ్యాప్తంగా అక్కడక్కడా పాకెట్ల మాదిరిగా విస్తరించింది.

బీఆర్ఎస్ స్థావరంలో 36 సీట్లు ఉండటమే గాక రెండో స్థానం కోసం బీజేపీ నుంచి గట్టి పోటీని కూడా కాంగ్రెస్ ఎదుర్కోవలసి ఉన్నది. ఇందుకు విరుద్ధంగా కాంగ్రెస్ స్థావరంలోని 22 సీట్లలో బీఆర్ఎస్ కచ్చితంగా గెలవగలిగే సీట్లు ఆరున్నాయి. మరో ఆరు సీట్లలో నువ్వా నేనా అనే పరిస్థితులున్నాయి. ఇది అధికార పార్టీకి సానుకూల అంశం. ఈ స్థావరాల నుంచి బయల్దేరి ఉమ్మడి జిల్లాలైన మహబూబ్‌నగర్, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో సీట్ల కోసం మూడు పార్టీలు వేటాడవలసి ఉన్నది. ఆదిలాబాద్ జిల్లాపై మూడు పార్టీలకూ భారీగానే ఆశలున్నాయి. గాలివాటం ఎటువైపున్నా మూడు పార్టీలు కూడా కచ్చితంగా బోణీ కొట్టే అవకాశం ఉన్నది. బొగ్గు బెల్ట్‌లో కాంగ్రెస్ బలంగా ఉన్నదనీ, మిగిలిన ప్రాంతాల్లో బీఆర్ఎస్, బీజేపీలకు అవకాశాలున్నాయనీ స్థానిక విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సిర్పూర్‌లో బీఎస్పీ అభ్యర్థి కూడా బలంగా కనిపిస్తున్నారు.

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మూడు సీట్లు గెలుస్తామన్న నమ్మకంతో బీజేపీ నాయకులు పనిచేస్తున్నారు. పెద్దపల్లి బీఎస్పీ అభ్యర్థి దాసరి ఉషకు కూడా రాష్ట్రవ్యాప్త గుర్తింపు లభించింది. రెండు ప్రధాన పార్టీల తరఫున రెడ్డి, వెలమ కులాలకు చెందిన ఇద్దరు బడా బాబులు హోరాహోరీ తలపడుతున్న చోట ఐఐటీ గ్రాడ్యుయేట్, పాతికేళ్ల పద్మశాలి యువతి గెలిస్తే బాగుండను కునే వాళ్లు రాష్ట్రవ్యాప్తంగా చాలామందే ఉన్నారు. ఇటువంటి కలలు ఫలించాలంటే మన ప్రజాస్వామ్యంలో చాలా పరిణతి రావాలి. ఇప్పటి నుంచి ప్రయత్నిస్తే గదా ఏదో ఒకరోజు ఆ నవయుగం ఆవిష్కృతమయ్యేది. నిజానికి ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సంస్థాగతంగా బీఆర్ఎస్ చాలా బలంగా ఉన్నది. అయినా కాంగ్రెస్ పార్టీ బాగా పుంజుకున్నట్టు జరుగు తున్న ప్రచారం నేపథ్యంలో ఈ జిల్లాను హోరాహోరీ పోటీ కోటాలో వేయాల్సి వస్తున్నది.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో కూడా రెండు మూడు సీట్లలో సంచలనం సృష్టిస్తామని బీజేపీ నాయకత్వం చెప్పుకొస్తున్నది. అందుకు అనుగుణంగానే చాప కింద నీరు మాదిరిగా పార్టీ శ్రేణులు పనిచేస్తున్నాయి. జిల్లాలో ప్రత్యేక ఆకర్షణ పాలకుర్తి నియోజ కవర్గం. ఇక్కడి నుంచి రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకరరావు బీఆర్ఎస్ తరఫున పోటీ చేస్తున్నారు. ఓటమి ఎరగకుండా అనేక పోరాటాల్లో గెలిచిన వార్ వెటరన్ ఎర్రబెల్లి. కానీ ఈసారి ఒక పాతికేళ్ల యువతితో హోరాహోరీ పోటీని ఎదుర్కొంటున్నట్టు వార్తలు వస్తున్నాయి. అమెరికాలో చదువుకొని వచ్చిన యశస్విని రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థిగా మంత్రికి గట్టి పోటీని ఇస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా ఇప్పుడు రాజకీయ కురుక్షేత్రాన్ని తలపిస్తున్నది.

> అన్ని రకాల సర్వే ఫలితాలను క్రోడీకరిస్తే, ఒక మూడు అంశాలు నిగ్గుతేలుతున్నాయి. ఒకటి – ఈసారి అధికార పార్టీ బీఆర్ఎస్ గట్టి పోటీని ఎదుర్కొంటున్నది. కొన్ని జిల్లాల్లో పాత బలాన్ని కాపాడుకున్నట్లు కనిపిస్తున్నా కొన్ని జిల్లాల్లో బలహీనపడినట్టు స్పష్టమవుతున్నది. రెండు – కాంగ్రెస్ పార్టీ గతంతో పోలిస్తే పుంజుకున్నది. అయితే ఈ పరిణామం కొన్ని ప్రాంతాలకే పరిమితం. రాష్ట్రవ్యాప్తంగా కనిపించడం లేదు. మూడు – బీసీ ముఖ్య మంత్రి ప్రకటన తర్వాత బీజేపీ పరిస్థితి గణనీయంగా మెరుగుపడింది. ఇదే ప్రకటన ఒక రెండు మూడు నెలల ముందు చేసి ఉన్నట్లయితే ఆ పార్టీ పరిస్థితి ఇంకా మెరుగ్గా ఉండేదన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది.
>
> రాష్ట్రాన్ని భౌగోళికంగా విభజించి చెప్పవలసి వచ్చినప్పుడు ఉత్తర, దక్షిణ తెలంగాణలుగా చెప్పడం రివాజు. కానీ ఇప్పటి రాజకీయ పరిస్థితికి ఆ విభజన నప్పడం లేదు. రాష్ట్రానికి పడమటి దిక్కున ఉన్న గ్రేటర్ హైదరాబాద్ (24), మెదక్ (10), నిజామాబాద్ (9) ప్రాంతాల్లోని అసెంబ్లీ స్థానాల్లో ఇప్పటికీ బీఆర్ఎస్ బలంగానే కనిపిస్తున్నది. మొత్తం సీట్లు 43. ఇందులో ఆనవాయితీగా మజ్లిస్ గెలిచే సీట్లు 7 తీస్తే మిగిలినవి 36. ఇందులో అత్యధిక సీట్లలో బీఆర్ఎస్ బలంగా ఉంటుందని, రెండో స్థానం కోసం బీజేపీ నుంచి కాంగ్రెస్ గట్టి పోటీ ఎదుర్కోవచ్చనీ క్షేత్రస్థాయి పరిశీలనలో తెలుస్తున్నది.

పద్నాలుగు నియోజకవర్గాలున్న ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రస్తుతం టాప్ ట్రెండింగ్‌లో కొల్లాపూర్ నియోజకవర్గం ఉన్నది. రెడ్డి, వెలమ వర్గాలకు చెందిన ఇద్దరు దొరలు అక్కడ తలపడుతున్నందుకు కాదు. ఒక నిరుపేద దళిత యువతి... పేరు కర్నె శిరీషా అలియాస్ బర్రెలక్క. అక్కడ బరిగీసి నిలబడింది. ఏ పార్టీ అండ లేదు. ఇండిపెండెంట్‌గానే! పుట్టెడు పేదరికం కారణంగా చిన్న టిఫిన్ సెంటర్ నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్న తల్లికి అండగా ఉంటూ ఓపెన్ యూని వర్సిటీ ద్వారా డిగ్రీ పూర్తి చేసింది. ఉద్యోగ ప్రయత్నాలు ఫలించలేదు. నాలుగు బర్రెలు కొనుక్కొని పోషిస్తూ సోషల్ మీడియా ద్వారా బర్రెలక్క పేరుతో ప్రజా జీవితంలోకి ఎంట్రీ ఇచ్చింది.

నిరుద్యోగ యువత తరఫున తాను నిరసనను వ్యక్తం చేయడానికి ఎన్నికలను ఒక సాధనంగా మలుచుకోవాలని నామినేషన్ వేసింది. ఈమె పోస్ట్ చేసిన వీడియోలు ఇప్పుడు దేశవ్యాప్తంగా సంచలనం రేకెత్తిస్తున్నాయి. రాష్ట్రం నలుమూలల నుంచి యువతీ యువకులు తండోపతండాలుగా కొల్లాపూర్‌కు వెళ్లి బర్రెలక్కకు మద్దతును ప్రకటిస్తున్నారు. దీనర్థం అక్కడ బర్రెలక్క గెలుస్తుందని కాదు. అంత ఆశలేదు. ఒకవేళ కొల్లాపూర్ ప్రజల్లో హఠాత్తుగా ఏదో ఒక నవ చైతన్యం ప్రవేశించి బర్రెలక్క గెలిస్తే అదొక యుద్ధ ప్రకటనే! నోట్ల కట్టల ప్రజాస్వామ్యానికి రోజులు దగ్గర పడినట్టే!

ఉమ్మడి పాలమూరులో బీజేపీ మూడు సీట్లపై ఆశలు పెట్టుకున్నది. కర్ణాటక సరిహద్దుల్లోని ఒక నియోజకవర్గాన్ని, గతంలో రెండుసార్లు గట్టి పోటీ ఇచ్చిన మరో నియోజక వర్గాన్ని ఖాయంగా గెలుస్తామని ఆ పార్టీవారు చెబుతున్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు రెండూ ఈ జిల్లాలో మెజారిటీ సీట్లు గెలుస్తామని ఢంకా బజాయించి చెబుతున్నాయి. ప్రభుత్వ వ్యతిరేక పవనం బాగా బలంగా ఉంటే తప్ప బీఆర్ఎస్ ఆధిక్యాన్ని తగ్గించడం ఈ జిల్లాలో సాధ్యం కాకపోవచ్చు.

బీఆర్ఎస్‌ను ఓడించి అధికారంలోకి ఖాయంగా వస్తామని చెప్పుకుంటున్న కాంగ్రెస్ పార్టీ అందుకు దోహదపడే కారణ మేమిటో స్పష్టంగా చెప్పలేకపోయింది. ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత కారణమా? లేక కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోను చూసి జనం మురిసిపోతున్నారనుకోవడమా? ప్రభుత్వ వ్యతిరేకతే కారణమైతే కాంగ్రెస్‌కే జనం ఎందుకు ఓట్లేయాలి? బీజేపీ రూపంలో మరో ప్రత్యామ్నాయం కూడా ఉన్నది కదా! పైగా బీసీ ముఖ్యమంత్రిని ఇస్తామని బీజేపీ చేసిన వాగ్దానం మెజారిటీ రాష్ట్ర ప్రజలను ఆకర్షి స్తున్నప్పుడు కాంగ్రెస్‌నే ప్రత్యామ్నాయంగా ఎందుకు ఎంచుకోవాలి?

కాంగ్రెస్ మేనిఫెస్టో పట్ల సానుకూలత పెల్లుబకడానికి అందులో ఏమున్నది? కేసీఆర్ అమలు చేస్తున్న కార్యక్రమాలనే కొంచెం అటూ ఇటూ మార్చి అచ్చేశారు. ఆయన ఇస్తున్న డబ్బుల కంటే ఎక్కువ ముట్ట చెబుతామని చెప్పారు. కాలానుగుణంగా ఎవరైనా ఈ పెంపుదల చేయాల్సిందే. అంతకుమించిన మౌలికమైన మార్పుల ప్రతిపాదన ఈ మేనిఫెస్టోలో ఏమీ లేదు. అంతకంటే బీజేపీ చెప్పిన బీసీ ముఖ్యమంత్రే వ్యవస్థలో ఒక గుణాత్మకమైన మార్పును సూచించే హామీ అవుతుంది. కనుక కాంగ్రెస్ చేసిన వాగ్దానాలకు అనుగుణంగా ప్రజాస్పందన ఉన్నదనేది అవాస్తవం. ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఉన్నదని అనుకుంటే ప్రతిపక్షానికి జరిగే లబ్ధిలో బీజేపీ కూడా కచ్చితంగా భాగస్వామి అవుతుంది. ఆ పార్టీ చెబుతున్నట్టు రాబోయే ప్రభుత్వ ఏర్పాటులో కీలక పాత్ర పోషిస్తుంది. ప్రభుత్వ వ్యతిరేకత ఒక ప్రభంజనంలా లేకుండా సాధారణ స్థాయిలోనే ఉంటే బీఆర్ఎస్ పార్టీ సింగిల్ లార్జెస్ట్ పార్టీగా అవతరించే అవకాశాలే ఉంటాయి.

పదేళ్లు అధికారంలో ఉన్న ప్రభుత్వంపై ఎంతోకొంత వ్యతిరేకత వ్యక్తమవడం సర్వసాధారణం. కానీ తెలంగాణలో ఇప్పుడు ప్రచార మవుతున్నంత తీవ్రస్థాయిలో ఉన్నదా అనేది సందేహాస్పదం. అంత తీవ్ర వ్యతిరేకతకు తగిన ప్రాతిపదిక లేదు. ఇప్పుడు అందుతున్న సమాచారం మేరకు హైదరాబాద్‌లో వ్యాపార ప్రయోజనాలున్న కొందరు కోటీశ్వరులు గత కొంతకాలంగా కేసీఆర్ ప్రభుత్వాన్ని తప్పించే ఉపాయాలను అన్వేషిస్తున్నారు. సలహాలు – సంప్రతింపుల కోసం యెల్లో మీడియా పెద్దలను కూడా తరచూ కలుస్తున్నట్టు ఇప్పుడిప్పుడే వార్తలు బయటకొస్తున్నాయి. ఈ వ్యవహారానికి అందుబాటులో ఉండి మార్గదర్శనం చేయడం కోసమే చంద్రబాబు లేని జబ్బులు తెచ్చుకొని మెడికల్ బెయిల్ సంపాదించారన్నది నిర్ద్వంద్వంగా రూఢి అవుతున్నది. ఆయన రహస్య భేటీలు నిరాఘాటంగా జరిగిపోతున్నాయి.

ఈ మొత్తం స్కీములో భాగంగానే తెలంగాణ రాజకీయ వాతావరణంలోకి కృత్రిమ పవనాలను ప్రవేశ పెట్టినట్టు తెలుస్తున్నది. కొన్ని సర్వే సంస్థలను వశపరచుకొని అనుకూలమైన రిపోర్టులను ప్రచారంలో పెట్టారు. సరికొత్త ఎత్తుగడగా రూమర్ స్ప్రెడర్‌లను (వదంతుల వ్యాపకులను) రంగంలోకి దించారు. సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ దగ్గర ఈ రూమర్ స్ప్రెడర్స్ తమ వృత్తి నైపుణ్యాలను ప్రదర్శించారు. కాంగ్రెస్ పార్టీ వేవ్ రాబోతున్నదని, ప్రజల్లో ప్రభుత్వ వ్యతిరేకత తీవ్రంగా ఉన్నదని సోషల్ మీడియా ప్రచారానికి ఆజ్యం పోశారు. దసరా సెలవులను కూడా ఈ ప్రయోజనానికి వాడు కున్నారు. ఈ ప్రభుత్వం కొనసాగితే పిల్లలకు ఉద్యోగాలు రావనే ప్రచారం విస్తృతంగా చేశారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఈ వ్యతిరేక ప్రచారాలను అధికార వర్గాలు గానీ, అధికార పార్టీ కార్యకర్తలు గానీ పసిగట్టలేకపోయారు.


ఒక స్వార్థ వ్యాపార – రాజకీయ ముఠా రూమర్ స్ప్రెడర్స్‌నూ, సోషల్ మీడియా సైన్యాన్నీ రంగంలోకి దించి బీజేపీ సింగిల్ డిజిట్ దాటదనీ, ప్రభుత్వ వ్యతిరేకత తీవ్రంగా ఉన్నదనీ గత రెండు మాసాలుగా పెద్దఎత్తున ప్రచారంలో పెట్టింది. ఇప్పుడు కాంగ్రెస్‌కు అనుకూలంగా గాలి వీస్తున్నదనే ప్రచారాన్ని మొదలు పెట్టారు. ఈ కృత్రిమ 'గాలుల' ప్రభావం ప్రజల మీద ఏ మేరకు పడిందనే విషయం మరో వారం రోజుల్లో వెలువడే ఎన్నికల ఫలితాలతో తేలిపోతుంది. ఎన్నికల ఫలితాలను హైజాక్ చేయడానికి ఈ ముఠా ఇంత తీవ్రంగా ఎందుకు ప్రయత్నిస్తున్నదో, ఇన్ని వ్యయ ప్రయాసలకు ఎందుకోర్చుకుంటున్నదో ప్రజలు తెలుసుకోవలసిన అవసరం ఉన్నది.

vardhelli1959@gmail.com

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీక మాసం, తిథి: శు.చతుర్దశి ప.3.09 వరకు, తదుపరి పౌర్ణమి, నక్షత్రం: భరణి ప.2.10 వరకు, తదుపరి కృత్తిక, వర్జ్యం: రా.2.00 నుండి 3.32 వరకు, దుర్ముహూర్తం: ప.3.55 నుండి 4.43 వరకు, అమృతఘడియలు: ఉ.9.32 నుండి 11.03 వరకు, కార్తీక పౌర్ణమి; రాహుకాలం: సా.4.30 నుంచి 6.00 వరకు, యమగండం: ప.12.00 నుంచి 1.30 వరకు, సూర్యోదయం: 6.14, సూర్యాస్తమయం: 5.20.

ఆదివారం 26-11-2023


'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'

సత్యమేవ జయతే
సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 12+6+32 పేజీల ఆదివారం అనుబంధం వెల: ₹ 7.00

సంపుటి: 16 సంచిక: 245

SIMULTANEOUSLY PRINTED AT NIZAMABAD | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



పేదల సాధికారతపై ఉచిత పత్రిక ఉక్రోషం!



సూర్యుడు తూర్పు దిక్కుననే ఉదయించును. ఇది ఒక నిత్య సత్యం. పేద ప్రజల సాధికారతను పెత్తందార్లు అంగీకరించరు. ఇది కూడా అటువంటిదే. అనుదిన సత్యమే. నిత్యం ఉషోదయంతో సత్యం నినదించుగాక... ఈ సుభాషితాన్ని 'ఈనాడు' పత్రికవాళ్లు అప్పుడెప్పుడో బ్రాండ్ క్యాంపెయిన్‌కు వాడుకున్నట్టు గుర్తు. ఇప్పుడు పైన చెప్పిన రెండో సత్యాన్ని నిలబెట్టడం కోసం ఆ పత్రిక యాజమాన్యం 'త్యాగాలకు' కూడా సిద్ధమైంది. ఇంటింటికీ ఉచితంగా పత్రికను పంపిణీ చేసే కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్‌లో 'ఈనాడు' శ్రీకారం చుట్టింది.

'సత్యం నినదించు గాక' అనే క్యాంపెయిన్‌ను 'ఈనాడు' చాలాకాలం కిందటే నిలిపివేసింది. చంద్రబాబు–యెల్లో కూటమి అండ్ సన్స్ ప్రయోజనాలకు అనుగుణంగా నిత్యం అసత్యాలను అచ్చొత్తడమే పనిగా పెట్టుకొన్నందున ఆ క్యాంపెయిన్‌ను కొనసాగించడానికి వాళ్లకే సిగ్గేసింది కాబోలు. ఏదో సినిమాలో మెడలో రుద్రాక్ష మాల ఉన్నంత వరకూ అల్లు అర్జున్ నాన్‌వయలెంట్‌గా ఉండిపోతాడు. ఫైటింగ్ చేయాల్సి వచ్చినప్పుడు ఆ మాలను తీసి పక్కన పెడతాడు. ఈ తీసుకోవడం, వేసుకోవడం గొడవంతా ఎందుకని 'ఈనాడు' వాళ్లు సత్యం నినదించుగాక అనే క్యాంపెయిన్ను శాశ్వతంగా నిద్రపుచ్చారు.

ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల సమయం సమీపిస్తున్నకొద్దీ అసత్య కథనాల వంటకాన్ని 'ఈనాడు' భారీగా పెంచేసింది. పేజీకో పొయ్యి చొప్పున వెలిగించి నిత్యాగ్నిహోత్రాన్ని నిర్వహిస్తున్నది. అసత్య కథనాలతో అధికార పక్షం మీద బురద జల్లడానికే అది పరిమితం కాలేదు. మానవ నాగరికత వికాసానికి మోకాలొడ్డే సాహసం చేస్తున్నది. ప్రజాస్వామ్య పరిణతి ప్రస్థానాన్ని వెక్కిరించే విదూషక పాత్రను పోషిస్తున్నది. అరచేతిని అడ్డుపెట్టి సూర్యకాంతిని ఆపాలనే తింగరి చేష్టకు తెగబడుతున్నది. కష్టజీవులు తలపెట్టిన సాధికారత యజ్ఞంపై మారీచ మాయలు ప్రయోగిస్తున్నది.

మహిళలూ – పేదవర్గాల సాధికారత అనేది ఈ దేశ రాజ్యాంగం ఇచ్చిన హామీ. ఈ హామీని అమలుపరచడంలో విఫలమైన ప్రభుత్వాధినేతలందరూ ఈ విషయంలో దోషులే. ఎటువంటి వివక్ష లేకుండా అందరికీ సమాన హక్కులూ, సమాన అవకాశాలూ కల్పించడం ద్వారానే క్రమంగా సాధికారత సాధ్యమవుతుంది. ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల ఈ క్రమం నెమ్మదించింది. ఇన్నాళ్లకు ఇప్పుడొక రాష్ట్ర ప్రభుత్వం దాని వేగాన్ని పెంచే పని ప్రారంభించింది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి భారత రాజ్యాంగం ఆశయాల మేరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల ప్రజలకు, అన్నివర్గాల మహిళలకు ఒక్కొక్కటిగా ఆర్థిక రాజకీయ సాంఘిక హోదాలను కట్టబెడుతూ వెళుతున్నారు.

ఈ అవకాశాలను ఉపయోగించుకొని సాధికారత పథంలో పరుగు తీయాలన్న లక్ష్యంతో రాష్ట్రంలో సామాజిక సాధికార యాత్ర పేరుతో ఒక జన జాగృత కార్యక్రమానికి వారు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వాళ్లు భుజాన వేసుకున్న మాట నిజమే. ఆ పార్టీ ప్రభుత్వమే, ఆ పార్టీ అధినేతే స్వయంగా పేదవర్గాల సాధికారతను ఒక పవిత్ర లక్ష్యంగా పరిగణిస్తున్నప్పుడు అదే పార్టీ ఈ కార్యక్రమానికి ముందు నడవడం అసహజమేమీ కాదు. వెనుకబడిన వర్గాలను వెన్నెముక వర్గంగా మలిచే కార్యక్రమం వల్ల పాలక పార్టీ పలుకుబడి మరింత పెరుగుతుందనడం కూడా వాస్తవమే. ఈ ఒక్క కారణం చాలదా యెల్లో మీడియా కళ్లు మంటెక్కడానికి! దానికి తోడు శ్రామిక వర్గాల సాధికారతను సిద్ధాంతపరంగానే చంద్రబాబు కూటమి వ్యతిరేకిస్తున్నది.

కబుర్లు ఏవైనా చెప్పవచ్చు. ఆచరణ ఏమిటన్నదే కీలకం. వైఎస్ జగన్ ప్రభుత్వం చేపట్టిన సాధికారతకు బాటలు వేసే ప్రతి కార్యక్రమాన్ని చంద్రబాబు పార్టీ – యెల్లో మీడియా తీవ్రంగా వ్యతిరేకించాయి. పేద పిల్లలకు ఇంగ్లీషు మీడియం విద్యాబోధనను వ్యతిరేకించాయి. ఇప్పటికీ అభాసుపాలు చేయడానికి, విఫలం చేయడానికి ప్రయత్నిస్తున్నాయి. మహిళల పేరు మీద సొంత ఇల్లు కట్టించే కార్య క్రమాన్ని వ్యతిరేకించాయి. కోర్టు మెట్లెక్కాయి. అమరావతి శాసన రాజధాని పరిధిలో బలహీనవర్గాల ప్రజలకు ఇళ్ల పట్టాలిస్తే ఘోరమైన, క్రూరమైన అపచారం జరిగినట్టు గావుకేకలు పెట్టాయి. బాబు గార్లు ఉండాల్సిన చోట బడుగులు నివసించడమేమిటని వాదించాయి. కుల భ్రష్టమైపోతారట, మైలపడిపోతారట! ఇదే విషయాన్ని పాలిష్ చేసి చెప్పారు. జనాభా సమతుల్యత దెబ్బతింటుందని! కోర్టులో కూడా ఇదే వాదన చేశాయి.

పేదింటి ఆడబిడ్డల చదువు మధ్యలో ఆగిపోకుండా, బాల్య వివాహాల రుగ్మతను రూపుమాపే విధంగా పెళ్లి కానుకల కార్యక్రమాన్ని డిజైన్ చేస్తే కూడా ఈ కూటమి మండిపడింది. కారణం ఆడపిల్లల మీద అభిమానం కాదు. వారి అభివృద్ధి మీద ద్వేషం. అమ్మ ఒడి, చేయూత, ఆసరా వంటి కార్యక్రమాలను ఎద్దేవా చేశారు. ఇలాగైతే ఈ రాష్ట్రం దివాళా తీస్తుందని శాపనార్థాలు పెట్టారు. ఖర్చు చేయడానికి ప్రజల చేతిలో డబ్బులుంచాలని అభిజిత్ బెనర్జీ వంటి ఆర్థిక వేత్తలు చెప్పినా మన యెల్లో కూటమికి తలకెక్కలేదు. జనం సొమ్ముతో సొంత వ్యాపారాలు చేసుకునే మన 'చీ'ట్ ఫండ్ ముఠాకు అభిజిత్ ముఖర్జీలు, అమర్త్యసేన్‌లతో ఏం పని? చివరకు ఆర్థిక వేత్తలు చెప్పిందే నిజమైంది. జీఎస్‌డీపీ గ్రోత్ రేట్‌లో ఏపీ అగ్రగామిగా నిలబడింది. ఆర్థిక వ్యవస్థ పటిష్ఠమవడంతో పాటు లక్షలాది పేద కుటుంబాల ఆత్మగౌరవం పెరిగింది. ఆత్మవిశ్వాసం ఇనుమడించింది.

పేద వర్గాల ప్రజలు సాధికారతను సంతరించుకోవడానికి ఉపయోగపడే ప్రతి కార్యక్రమం మీదా చంద్రబాబు – యెల్లో ముఠా దాడులు చేస్తూనే వస్తున్నది. సాధికారత కార్యక్రమాన్ని ఒక ఉద్యమంగా మలిచి ప్రజలను చైతన్యం చేయడానికి సిద్ధమవగానే 'ఈనాడు' పత్రిక అన్ని విలువల్నీ వదిలేసింది. దిగంబరంగా నిలబడింది. చివరకు ఉచిత పత్రిక అవతారమెత్తింది. 'సాక్షి' చదివే పాఠకులందరికీ ఫ్రీగా పత్రికను పంచడం మొదలుపెట్టింది. ఇది తొలి దశ. క్రమంగా పాఠకులందరికీ పంచడానికి సిద్ధమవుతున్నది. ఇప్పటికే 'ఈనాడు' పాఠకులుగా వున్నవారు వచ్చేనెల బిల్లు కట్టే పరిస్థితి లేదు. పక్కింట్లో ఫ్రీగా వేస్తున్నప్పుడు తాను మాత్రం ఎందుకు బిల్లు కట్టాలి. చివరికి ఫ్రీగా పేపర్ వేయించుకోవడానికి కూడా నెలకు రెండు ప్రియా పచ్చడి సీసాలు గిఫ్టుగా ఇవ్వాల్సిన దుఃస్థితిలోకి మన ఉచిత పత్రిక కూరుకొనిపోవచ్చు. స్వర్ణోత్సవ సంవత్సరంలోకి అడుగిడిన వేళ ఈ విషాదం దాని స్వయంకృతం.

సామాజిక సాధికారత యాత్ర మొదలవగానే ఫ్రీ పేపర్ కార్యక్రమాన్ని ఈ పత్రిక ప్రారంభించింది. ఈ కార్యక్రమం వల్ల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మరింత బలపడుతుందనేది ఒక కారణం కావచ్చు. అసలు కారణం పేదల, మహిళల సాధికారతకు యెల్లో కూటమి వ్యతిరేకమన్న విషయం గతంలో అనేక మార్లు రుజువైంది. బీసీలు జడ్జీలుగా పనికిరారని కేంద్ర న్యాయశాఖకు లేఖ రాసిన వారెవరు? చంద్రబాబు. ఎస్సీలుగా పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా అని ఈసడించుకున్న వారెవరు? చంద్రబాబు. దళితులు... మీకెందుకురా అధికారాలు, రాజకీయాలు... అవన్నీ మేం చూసుకుంటామని బోధించిన వారెవరు? బాబు శిష్యపరమాణువు చింతమనేని ప్రభాకర్. కోడలు మగపిల్లాడిని కంటానంటే అత్త వద్దంటుందా అని మీడియా సమావేశంలోనే ప్రవచించిన వారెవరు? చంద్రబాబు. మహిళా అధికారి పట్ల వందలాదిమంది సాక్షిగా దుశ్శాసనుడిలా ప్రవర్తించింది ఎవరు? చంద్రబాబు శిష్య పరమాణువు చింతమనేని ప్రభాకర్.

బీసీల తోకలు కత్తిరిస్తానని బెదిరించిందెవరు? చంద్రబాబునాయుడు. ఎస్సీ పిల్లలు శుభ్రంగా ఉండరు, స్నానాలు చెయ్యరని తిట్టిపోసిందెవరు? చంద్రబాబు కొనుగోలు చేసిన ఆదినారాయణరెడ్డి. ముస్లిం మైనారిటీలకూ, గిరిజనులకూ మంత్రి పదవి లేకుండా చేసిందెవరు? చంద్రబాబు నాయుడు. రాజ్యాంగబద్ధమైన గిరిజన సలహా మండలి ఏర్పాటును అటకెక్కించిందెవరు? చంద్రబాబు నాయుడు. ఈ రకమైన దుర్నీతిని ప్రశ్నించకుండా, ప్రస్తావించకుండా, ఎండ గట్టకుండా ఆమోదముద్ర వేసిన ప్రముఖ పత్రికారాజము ఏది? మన ఉచిత పత్రిక, దాని తోకపత్రిక. ఇటువంటి ముఠా ప్రజా సాధికారతను ఏ రకంగా సహిస్తుంది?

రాష్ట్రంలోని మూడు ప్రాంతాల్లో రోజూ వేలాదిమంది బహుజనులు సాధికారత కోసం నినదిస్తూ ప్రదర్శనలు చేస్తున్నారు. సభల్లో సగటున ఇరవై నుంచి పాతికవేల మంది చొప్పున మూడు ప్రాంతాల్లో ప్రజలు పాల్గొంటున్నారు. ఉష్ట్ర పక్షికి భయం వేసినప్పుడు దాని తలను ఇసుకలో దాచేస్తుందట! అప్పుడేమీ కనపడదు. భయం తగ్గిన తర్వాత మళ్లీ బయటకు తీస్తుంది. ఉచిత పత్రికకు కూడా అటువంటి భయమేదో ఉన్నట్టుంది. బాటలు నడిచీ, పేటలు కడచీ, కోటలన్నిటినీ దాటుకుంటూ వచ్చే శ్రామిక జనాన్ని చూస్తే భయం. అందుకే సభ ప్రారంభం కాకముందూ, ముగిసిన తర్వాత ఫోటోలు తీసి అచ్చేసుకొని సంబర పడుతున్నది. ఉష్ట్రపక్షి మాదిరిగా ఉచిత పత్రిక దాని తలను ఎక్కడో దాచుకుంటే నిజం దాగుతుందా? ఎన్నో టీవీ చానెళ్లు, పత్రికలు అసలు విషయాన్ని చూపెడుతున్నాయి కదా! అయినా సరే – నవ్విపోదురు గాక నాకేటి సిగ్గు!


పేద వర్గాల ప్రజలు సాధికారతను సంతరించుకోవడానికి ఉపయోగపడే ప్రతి కార్యక్రమం మీదా చంద్రబాబు – యెల్లో ముఠా దాడులు చేస్తూనే వస్తున్నది. సాధికారత కార్యక్రమాన్ని ఒక ఉద్యమంగా మలిచి ప్రజలను చైతన్యం చేయడానికి సిద్ధమవగానే 'ఈనాడు' పత్రిక అన్ని విలువల్నీ వదిలేసింది. దిగంబరంగా నిలబడింది. చివరకు ఉచిత పత్రిక అవతారమెత్తింది. 'సాక్షి' చదివే పాఠకులందరికీ ఫ్రీగా పత్రికను పంచడం మొదలుపెట్టింది. ఇది తొలి దశ. క్రమంగా పాఠకులందరికీ పంచడానికి సిద్ధమవుతున్నది. ఇప్పటికే 'ఈనాడు' పాఠకులుగా వున్నవారు వచ్చేనెల బిల్లు కట్టే పరిస్థితి లేదు. పక్కింట్లో ఫ్రీగా వేస్తున్నప్పుడు తాను మాత్రం ఎందుకు బిల్లు కట్టాలి. చివరికి ఫ్రీగా పేపర్ వేయించుకోవడానికి కూడా నెలకు రెండు ప్రియా పచ్చడి సీసాలు గిఫ్టుగా ఇవ్వాల్సిన దుస్థితిలోకి మన ఉచిత పత్రిక కూరుకొనిపోవచ్చు. స్వర్ణోత్సవ సంవత్సరంలోకి అడుగిడిన వేళ ఈ విషాదం దాని స్వయంకృతం.
సామాజిక సాధికారత యాత్ర మొదలవగానే ఫ్రీ పేపర్ కార్యక్రమాన్ని ఈ పత్రిక ప్రారంభించింది. ఈ కార్యక్రమం వల్ల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మరింత బలపడుతుందనేది ఒక కారణం కావచ్చు. అసలు కారణం పేదల, మహిళల సాధికారతకు యెల్లో కూటమి వ్యతిరేకమన్న విషయం గతంలో అనేక మార్లు రుజువైంది. బీసీలు జడ్జీలుగా పనికిరారని కేంద్ర న్యాయశాఖకు లేఖ రాసిన వారెవరు? చంద్రబాబు. ఎస్సీలుగా పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా అని ఈసడించుకున్న వారెవరు? చంద్రబాబు.



జనతంత్రం

వర్ధెల్లి మురళి

కృత్రిమ గాలులు పనిచేస్తాయా?



ఇంకో నాలుగు రోజులు మాత్రమే! ఈనెల 30న తెలంగాణ రాష్ట్రం మూడో సర్కార్ ఎన్నికకు రంగం సిద్ధం చేసుకుంటున్నది. మూడో అసెంబ్లీ ఎన్నిక ముక్కోణపు పోటీగా మారడం విశేషం. ఎన్నికలన్న తర్వాత సర్వేలు, ప్రజాభిప్రాయ నాడీ జ్యోతిష్యాలు, 'గాలి' వేగాన్ని అంచనా వేసి చెప్పడాలు... ఇటువంటివన్నీ షరా మామూలే! ఒకదానికొకటి పొంతన లేకుండా రకరకాల సర్వే ఫలితాలు ఇప్పటికే వెల్లడయ్యాయి. ఇలా పొంతన లేకపోడానికి కారణం... ఇందులో కొన్ని 'ఉద్దేశపూర్వకమైనవి' కావడమే!

అన్ని రకాల సర్వే ఫలితాలను క్రోడీకరిస్తే, ఒక మూడు అంశాలు నిగ్గుతేలుతున్నాయి. ఒకటి – ఈసారి అధికార పార్టీ బీఆర్‌ఎస్ గట్టి పోటీని ఎదుర్కొంటున్నది. కొన్ని జిల్లాల్లో పాత బలాన్ని కాపాడుకున్నట్లు కనిపిస్తున్నా కొన్ని జిల్లాల్లో బలహీన పడినట్టు స్పష్టమవుతున్నది. రెండు – కాంగ్రెస్ పార్టీ గతంతో పోలిస్తే పుంజుకున్నది. అయితే ఈ పరిణామం కొన్ని ప్రాంతాలకే పరిమితం. రాష్ట్రవ్యాప్తంగా కనిపించడం లేదు. మూడు – బీసీ ముఖ్యమంత్రి ప్రకటన తర్వాత బీజేపీ పరిస్థితి గణనీయంగా మెరుగుపడింది. ఇదే ప్రకటన ఒక రెండు మూడు నెలల ముందు చేసి ఉన్నట్లయితే ఆ పార్టీ పరిస్థితి ఇంకా మెరుగ్గా ఉండేదన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

రాష్ట్రాన్ని భౌగోళికంగా విభజించి చెప్పవలసి వచ్చినప్పుడు ఉత్తర, దక్షిణ తెలంగాణలుగా చెప్పడం రివాజు. కానీ ఇప్పటి రాజకీయ పరిస్థితికి ఆ విభజన నప్పడం లేదు. రాష్ట్రానికి పడ మటి దిక్కున ఉన్న గ్రేటర్ హైదరాబాద్ (24), మెదక్ (10), నిజామాబాద్ (9) ప్రాంతాల్లోని అసెంబ్లీ స్థానాల్లో ఇప్పటికీ బీఆర్‌ఎస్ బలంగానే కనిపిస్తున్నది. మొత్తం సీట్లు 43. ఇందులో ఆనవాయితీగా మజ్లిస్ గెలిచే సీట్లు 7 తీస్తే మిగిలినవి 36. ఇందులో అత్యధిక సీట్లలో బీఆర్‌ఎస్ బలంగా ఉంటుందనీ, రెండో స్థానం కోసం బీజేపీ నుంచి కాంగ్రెస్ గట్టి పోటీ ఎదుర్కోవచ్చనీ క్షేత్రస్థాయి పరిశీలనలో తెలుస్తున్నది.

ఖమ్మం జిల్లాను ఉత్తర తెలంగాణగానూ, నల్లగొండను దక్షిణ తెలంగాణను పరిగణిస్తుంటారు. సరిహద్దు జిల్లాలైన ఈ రెండింటినీ కలిపి తూర్పు తెలంగాణగా భావించవచ్చు. ఈ రెండు ఉమ్మడి జిల్లాల్లో కలిపి 22 సీట్లున్నాయి. ఇక్కడ మెజారిటీ సీట్లలో కాంగ్రెస్‌కు అనుకూల వాతావరణం ఉన్నదని చెబుతున్నారు. బీజేపీ పరిస్థితి అట్లా కాదు. వాయవ్య దిక్కు ఎంట్రీ పాయింట్లో (ముధోల్, ఆదిలాబాద్, బోథ్, నిర్మల్, ఆర్మూర్, కోరుట్ల) బలంగా కనిపిస్తూ రాష్ట్రవ్యాప్తంగా అక్కడక్కడా పాకెట్ల మాదిరిగా విస్తరించింది.

బీఆర్‌ఎస్ స్థావరంలో 36 సీట్లు ఉండటమే గాక రెండో స్థానం కోసం బీజేపీ నుంచి గట్టి పోటీని కూడా కాంగ్రెస్ ఎదుర్కోవలసి ఉన్నది. ఇందుకు విరుద్ధంగా కాంగ్రెస్ స్థావరంలోని 22 సీట్లలో బీఆర్‌ఎస్ కచ్చితంగా గెలవగలిగే సీట్లు ఆరున్నాయి. మరో ఆరు సీట్లలో నువ్వా నేనా అనే పరిస్థితులున్నాయి. ఇది అధికార పార్టీకి సానుకూల అంశం. ఈ స్థావరాల నుంచి బయల్దేరి ఉమ్మడి జిల్లాలైన మహబూబ్‌నగర్, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో సీట్ల కోసం మూడు పార్టీలు వేటాడవలసి ఉన్నది. ఆదిలాబాద్ జిల్లాపై మూడు పార్టీలకూ భారీగానే ఆశలున్నాయి. గాలివాటం ఎటువైపున్నా మూడు పార్టీలు కూడా కచ్చితంగా బోణీ కొట్టే అవకాశం ఉన్నది. బొగ్గు బెల్ట్‌లో కాంగ్రెస్ బలంగా ఉన్నదనీ, మిగిలిన ప్రాంతాల్లో బీఆర్‌ఎస్, బీజేపీలకు అవకాశాలున్నాయనీ స్థానిక విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సిర్పూర్‌లో బీఎస్పీ అభ్యర్థి కూడా బలంగా కనిపిస్తున్నారు.

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మూడు సీట్లు గెలుస్తామన్న నమ్మకంతో బీజేపీ నాయకులు పనిచేస్తున్నారు. పెద్దపల్లి బీఎస్పీ అభ్యర్థి దాసరి ఉషకు కూడా రాష్ట్రవ్యాప్త గుర్తింపు లభించింది. రెండు ప్రధాన పార్టీల తరఫున రెడ్డి, వెలమ కులాలకు చెందిన ఇద్దరు బడా బాబులు హోరాహోరీ తలపడుతున్న చోట ఐఐటీ గ్రాడ్యుయేట్, పాతికేళ్ల పద్మశాలి యువతి గెలిస్తే బాగుండను కునే వాళ్లు రాష్ట్రవ్యాప్తంగా చాలామందే ఉన్నారు. ఇటువంటి కలలు ఫలించాలంటే మన ప్రజాస్వామ్యంలో చాలా పరిణతి రావాలి. ఇప్పటి నుంచి ప్రయత్నిస్తే గదా ఏదో ఒకరోజు ఆ నవయుగం ఆవిష్కృతమయ్యేది. నిజానికి ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సంస్థాగతంగా బీఆర్‌ఎస్ చాలా బలంగా ఉన్నది. అయినా కాంగ్రెస్ పార్టీ బాగా పుంజుకున్నట్టు జరుగు తున్న ప్రచారం నేపథ్యంలో ఈ జిల్లాను హోరాహోరీ పోటీ కోటాలో వేయాల్సి వస్తున్నది.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో కూడా రెండు మూడు సీట్లలో సంచలనం సృష్టిస్తామని బీజేపీ నాయకత్వం చెప్పుకొస్తున్నది. అందుకు అనుగుణంగానే చాప కింద నీరు మాదిరిగా పార్టీ శ్రేణులు పనిచేస్తున్నాయి. జిల్లాలో ప్రత్యేక ఆకర్షణ పాలకుర్తి నియోజ కవర్గం. ఇక్కడి నుంచి రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకరరావు బీఆర్‌ఎస్ తరఫున పోటీ చేస్తున్నారు. ఓటమి ఎరగకుండా అనేక పోరాటాల్లో గెలిచిన వార్ వెటరన్ ఎర్రబెల్లి. కానీ ఈసారి ఒక పాతికేళ్ల యువతితో హోరాహోరీ పోటీని ఎదుర్కొంటున్నట్టు వార్తలు వస్తున్నాయి. అమెరికాలో చదువుకొని వచ్చిన యశస్విని రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థిగా మంత్రికి గట్టి పోటీని ఇస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా ఇప్పుడు రాజకీయ కురుక్షేత్రాన్ని తలపిస్తున్నది.

పద్నాలుగు నియోజకవర్గాలున్న ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రస్తుతం టాప్ ట్రెండింగ్‌లో కొల్లాపూర్ నియోజకవర్గం ఉన్నది. రెడ్డి, వెలమ వర్గాలకు చెందిన ఇద్దరు దొరలు అక్కడ తలపడుతున్నందుకు కాదు. ఒక నిరుపేద దళిత యువతి... పేరు కర్నె శిరీషా అలియాస్ బర్రెలక్క. అక్కడ బరిగీసి నిలబడింది. ఏ పార్టీ అండ లేదు. ఇండిపెండెంట్‌గానే! పుట్టెడు పేదరికం కారణంగా చిన్న టిఫిన్ సెంటర్ నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్న తల్లికి అండగా ఉంటూ ఓపెన్ యూని వర్సిటీ ద్వారా డిగ్రీ పూర్తి చేసింది. ఉద్యోగ ప్రయత్నాలు ఫలించలేదు. నాలుగు బర్రెలు కొనుక్కొని పోషిస్తూ సోషల్ మీడియా ద్వారా బర్రెలక్క పేరుతో ప్రజా జీవితంలోకి ఎంట్రీ ఇచ్చింది.

నిరుద్యోగ యువత తరఫున తాను నిరసనను వ్యక్తం చేయడానికి ఎన్నికలను ఒక సాధనంగా మలుచుకోవాలని నామినేషన్ వేసింది. ఈమె పోస్ట్ చేసిన వీడియోలు ఇప్పుడు దేశవ్యాప్తంగా సంచలనం రేకెత్తిస్తున్నాయి. రాష్ట్రం నలుమూలల నుంచి యువతీ యువకులు తండోపతండాలుగా కొల్లాపూర్‌కు వెళ్లి బర్రెలక్కకు మద్దతును ప్రకటిస్తున్నారు. దీనర్థం అక్కడ బర్రెలక్క గెలుస్తుందని కాదు. అంత ఆశలేదు. ఒకవేళ కొల్లాపూర్ ప్రజల్లో హఠాత్తుగా ఏదో ఒక నవ చైతన్యం ప్రవేశించి బర్రెలక్క గెలిస్తే అదొక యుద్ధ ప్రకటనే! నోట్ల కట్టల ప్రజాస్వామ్యానికి రోజులు దగ్గర పడినట్టే!

ఉమ్మడి పాలమూరులో బీజేపీ మూడు సీట్లపై ఆశలు పెట్టుకున్నది. కర్ణాటక సరిహద్దుల్లోని ఒక నియోజకవర్గాన్ని, గతంలో రెండుసార్లు గట్టి పోటీ ఇచ్చిన మరో నియోజక వర్గాన్ని ఖాయంగా గెలుస్తామని ఆ పార్టీవారు చెబుతున్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు రెండూ ఈ జిల్లాలో మెజారిటీ సీట్లు గెలుస్తామని ఢంకా బజాయించి చెబుతున్నాయి. ప్రభుత్వ వ్యతిరేక పవనం బాగా బలంగా ఉంటే తప్ప బీఆర్‌ఎస్ ఆధిక్యాన్ని తగ్గించడం ఈ జిల్లాలో సాధ్యం కాకపోవచ్చు.

బీఆర్‌ఎస్‌ను ఓడించి అధికారంలోకి ఖాయంగా వస్తామని చెప్పుకుంటున్న కాంగ్రెస్ పార్టీ అందుకు దోహదపడే కారణ మేమిటో స్పష్టంగా చెప్పలేకపోయింది. ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత కారణమా? లేక కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోను చూసి జనం మురిసిపోతున్నారనుకోవడమా? ప్రభుత్వ వ్యతిరేకతే కారణమైతే కాంగ్రెస్‌కే జనం ఎందుకు ఓట్లేయాలి? బీజేపీ రూపంలో మరో ప్రత్యామ్నాయం కూడా ఉన్నది కదా! పైగా బీసీ ముఖ్యమంత్రిని ఇస్తామని బీజేపీ చేసిన వాగ్దానం మెజారిటీ రాష్ట్ర ప్రజలను ఆకర్షి స్తున్నప్పుడు కాంగ్రెస్‌నే ప్రత్యామ్నాయంగా ఎందుకు ఎంచుకోవాలి?

కాంగ్రెస్ మేనిఫెస్టో పట్ల సానుకూలత పెల్లుబకడానికి అందులో ఏమున్నది? కేసీఆర్ అమలు చేస్తున్న కార్యక్రమాలనే కొంచెం అటూ ఇటూ మార్చి అచ్చేశారు. ఆయన ఇస్తున్న డబ్బుల కంటే ఎక్కువ ముట్ట చెబుతామని చెప్పారు. కాలానుగుణంగా ఎవరైనా ఈ పెంపుదల చేయాల్సిందే. అంతకుమించిన మౌలికమైన మార్పుల ప్రతిపాదన ఈ మేనిఫెస్టోలో ఏమీ లేదు. అంతకంటే బీజేపీ చెప్పిన బీసీ ముఖ్యమంత్రే వ్యవస్థలో ఒక గుణాత్మకమైన మార్పును సూచించే హామీ అవుతుంది. కనుక కాంగ్రెస్ చేసిన వాగ్దానాలకు అనుగుణంగా ప్రజాస్పందన ఉన్నదనేది అవాస్తవం. ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఉన్నదని అనుకుంటే ప్రతిపక్షానికి జరిగే లబ్ధిలో బీజేపీ కూడా కచ్చితంగా భాగస్వామి అవుతుంది. ఆ పార్టీ చెబుతున్నట్టు రాబోయే ప్రభుత్వ ఏర్పాటులో కీలక పాత్ర పోషిస్తుంది. ప్రభుత్వ వ్యతిరేకత ఒక ప్రభంజనంలా లేకుండా సాధారణ స్థాయిలోనే ఉంటే బీఆర్‌ఎస్ పార్టీ సింగిల్ లార్జెస్ట్ పార్టీగా అవతరించే అవకాశాలే ఉంటాయి.

పదేళ్ల అధికారంలో ఉన్న ప్రభుత్వంపై ఎంతోకొంత వ్యతిరేకత వ్యక్తమవడం సర్వసాధారణం. కానీ తెలంగాణలో ఇప్పుడు ప్రచార మవుతున్నంత తీవ్రస్థాయిలో ఉన్నదా అనేది సందేహాస్పదం. అంత తీవ్ర వ్యతిరేకతకు తగిన ప్రాతిపదిక లేదు. ఇప్పుడు అందుతున్న సమాచారం మేరకు హైదరాబాద్‌లో వ్యాపార ప్రయోజనాలున్న కొందరు కోటీశ్వరులు గత కొంతకాలంగా కేసీఆర్ ప్రభుత్వాన్ని తప్పించే ఉపాయాలను అన్వేషిస్తున్నారు. సలహాలు – సంప్రతింపుల కోసం యెల్లో మీడియా పెద్దలను కూడా తరచూ కలుస్తున్నట్టు ఇప్పుడిప్పుడే వార్తలు బయటకొస్తున్నాయి. ఈ వ్యవహారానికి అందుబాటులో ఉండి మార్గదర్శనం చేయడం కోసమే చంద్రబాబు లేని జబ్బులు తెచ్చుకొని మెడికల్ బెయిల్ సంపాదించారన్నది నిర్ద్వంద్వంగా రూఢి అవుతున్నది. ఆయన రహస్య భేటీలు నిరాఘాటంగా జరిగిపోతున్నాయి.

ఈ మొత్తం స్కీములో భాగంగానే తెలంగాణ రాజకీయ వాతావరణంలోకి కృత్రిమ పవనాలను ప్రవేశపెట్టినట్టు తెలుస్తున్నది. కొన్ని సర్వే సంస్థలను వశపరచుకొని అనుకూలమైన రిపోర్టులను ప్రచారంలో పెట్టారు. సరికొత్త ఎత్తుగడగా రూమర్ స్ప్రెడర్‌లను (వదంతుల వ్యాపకులను) రంగంలోకి దించారు. సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ దగ్గర ఈ రూమర్ స్ప్రెడర్స్ తమ వృత్తి నైపుణ్యాలను ప్రదర్శించారు. కాంగ్రెస్ పార్టీ వేవ్ రాబోతున్నదని, ప్రజల్లో ప్రభుత్వ వ్యతిరేకత తీవ్రంగా ఉన్నదని సోషల్ మీడియా ప్రచారానికి ఆజ్యం పోశారు. దసరా సెలవులను కూడా ఈ ప్రయోజనానికి వాడు కున్నారు. ఈ ప్రభుత్వం కొనసాగితే పిల్లలకు ఉద్యోగాలు రావనే ప్రచారం విస్తృతంగా చేశారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఈ వ్యతిరేక ప్రచారాలను అధికార వర్గాలు గానీ, అధికార పార్టీ కార్యకర్తలు గానీ పసిగట్టలేకపోయారు.

ఒక స్వార్థ వ్యాపార – రాజకీయ ముఠా రూమర్ స్ప్రెడర్స్‌నూ, సోషల్ మీడియా సైన్యాన్నీ రంగంలోకి దించి బీజేపీ సింగిల్ డిజిట్ దాటదనీ, ప్రభుత్వ వ్యతిరేకత తీవ్రంగా ఉన్నదనీ గత రెండు మాసాలుగా పెద్దఎత్తున ప్రచారంలో పెట్టింది. ఇప్పుడు కాంగ్రెస్‌కు అనుకూలంగా గాలి వీస్తున్నదనే ప్రచారాన్ని మొదలుపెట్టారు. ఈ కృత్రిమ 'గాలుల' ప్రభావం ప్రజల మీద ఏ మేరకు పడిందనే విషయం మరో వారం రోజుల్లో వెలువడే ఎన్నికల ఫలితాలతో తేలిపోతుంది. ఎన్నికల ఫలితాలను హైజాక్ చేయడానికి ఈ ముఠా ఇంత తీవ్రంగా ఎందుకు ప్రయత్నిస్తున్నదో, ఇన్ని వ్యయ ప్రయాసలకు ఎందుకోర్చుకుంటున్నదో ప్రజలు తెలుసుకోవలసిన అవసరం ఉన్నది.

vardhelli1959@gmail.com

అన్ని రకాల సర్వే ఫలితాలను క్రోడీకరిస్తే, ఒక మూడు అంశాలు నిగ్గుతేలుతున్నాయి. ఒకటి – ఈసారి అధికార పార్టీ బీఆర్‌ఎస్ గట్టి పోటీని ఎదుర్కొంటున్నది. కొన్ని జిల్లాల్లో పాత బలాన్ని కాపాడుకున్నట్లు కనిపిస్తున్నా కొన్ని జిల్లాల్లో బలహీనపడినట్టు స్పష్టమవుతున్నది. రెండు – కాంగ్రెస్ పార్టీ గతంతో పోలిస్తే పుంజుకున్నది. అయితే ఈ పరిణామం కొన్ని ప్రాంతాలకే పరిమితం. రాష్ట్రవ్యాప్తంగా కనిపించడం లేదు. మూడు – బీసీ ముఖ్య మంత్రి ప్రకటన తర్వాత బీజేపీ పరిస్థితి గణనీయంగా మెరుగుపడింది. ఇదే ప్రకటన ఒక రెండు మూడు నెలల ముందు చేసి ఉన్నట్లయితే ఆ పార్టీ పరిస్థితి ఇంకా మెరుగ్గా ఉండేదన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది.
రాష్ట్రాన్ని భౌగోళికంగా విభజించి చెప్పవలసి వచ్చినప్పుడు ఉత్తర, దక్షిణ తెలంగాణలుగా చెప్పడం రివాజు. కానీ ఇప్పటి రాజకీయ పరిస్థితికి ఆ విభజన నప్పడం లేదు. రాష్ట్రానికి పడమటి దిక్కున ఉన్న గ్రేటర్ హైదరాబాద్ (24), మెదక్ (10), నిజామాబాద్ (9) ప్రాంతాల్లోని అసెంబ్లీ స్థానాల్లో ఇప్పటికీ బీఆర్‌ఎస్ బలంగానే కనిపిస్తున్నది. మొత్తం సీట్లు 43. ఇందులో ఆనవాయితీగా మజ్లిస్ గెలిచే సీట్లు 7 తీస్తే మిగిలినవి 36. ఇందులో అత్యధిక సీట్లలో బీఆర్‌ఎస్ బలంగా ఉంటుందని, రెండో స్థానం కోసం బీజేపీ నుంచి కాంగ్రెస్ గట్టి పోటీ ఎదుర్కోవచ్చనీ క్షేత్రస్థాయి పరిశీలనలో తెలుస్తున్నది.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీక మాసం, తిథి: శు.చతుర్దశి ప.3.09 వరకు, తదుపరి పౌర్ణమి, నక్షత్రం: భరణి ప.2.10 వరకు, తదుపరి కృత్తిక, వర్జ్యం: రా.2.00 నుండి 3.32 వరకు, దుర్ముహూర్తం: ప.3.55 నుండి 4.43 వరకు, అమృతఘడియలు: ఉ.9.32 నుండి 11.03 వరకు, కార్తీక పౌర్ణమి; రాహుకాలం: సా.4.30 నుంచి 6.00 వరకు, యమగండం: ప.12.00 నుంచి 1.30 వరకు, సూర్యోదయం: 6.14, సూర్యాస్తమయం: 5.20.





వైరల్

కళాపూర్ణోదయం



తమిళనాడులోని కోవిల్‌పట్టి అనే చిన్న పట్టణం అద్భుత చిత్రకారులకు నెలవు. క్యాలెండర్‌లు, మ్యాగజైన్‌లు, బుక్ కవర్‌లు, ఇన్విటేషన్‌లు, గ్రీటింగ్‌కార్డ్స్... మొదలైన వాటికి వేసిన అద్భుత పెయింటింగ్‌లు గత కాల జ్ఞాపకాలుగానే మిగిలిపోయాయి. ఆ చిత్రకారుల గురించి నామమాత్రంగా కూడా తెలియకుండా పోయింది. దీన్ని దృష్టిలో పెట్టుకొని 'కోవిల్‌పట్టి: ది టౌన్ దట్ 'పేపర్డ్' ఇండియా' పేరుతో ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నారు. వీటికి సంబంధించిన అద్భుత పెయింటింగ్‌లు నెట్‌లో చక్కర్లు కొడుతూ 'ఆహా' అనిపిస్తున్నాయి.

97 నుంచి 77 కట్ చేస్తే... ఆ కరేజ్ ఇలా ఉంటుంది!

97 సంవత్సరాల వయసులో రెండు అడుగులు వేగంగా వేయాలంటేనే కష్టం. అలాంటిది 'పారా మోటరింగ్ అడ్వెంచర్' చేస్తే... మహారాష్ట్రలోని నాగ్‌పుర్‌కు చెందిన ఉషా తూసే 97 సంవత్సరాల వయసులో పారామోటరింగ్ సాహసం చేసి నెటిజనులు 'వావ్' అనేలా చేసింది. 'ఎక్స్'లో పోస్ట్ చేసిన ఈ వీడియో 1.2 మిలియన్‌ల వ్యూస్‌ను దక్కించుకుంది.



ఆర్మీ పారా–కమాండో పైలట్స్, ఎయిర్ ఫోర్సు వెటరన్స్ ఆపరేట్ చేసే ఫ్లైయింగ్ రైనో పారామోటరింగ్ విభాగం బామ్మ చేత ఈ సాహసాన్ని చేయించింది. '97 ఇయర్ వోల్డ్ కరేజ్ అండ్ 20 ప్లస్ ఇయర్స్ ఆఫ్ ఎక్స్‌పీరియన్స్' అనే కాప్షన్‌తో 'ఎక్స్'లో ఈ వీడియో క్లిప్‌ను పోస్ట్ చేసింది.

'సాహసంలో జీవనోత్సాహం కూడా ఉంటుంది అనే వాస్తవాన్ని ఆవిష్కరించే వీడియో ఇది'

'ఎంతోమందిని ఇన్‌స్పైర్ చేసే వీడియో'.... ఇలాంటి కామెంట్స్ ఎన్నో కనిపించాయి.

నిజానికి ఉషాకు సాహసం కొత్త కాదు. భర్త ఆకస్మిక మరణం, పిల్లల బరువు బాధ్యతల సమయంలో కూడా ఆమె డీలా పడిపోలేదు. ఒంటి చేత్తో కుటుంబాన్ని ధైర్యంగా పోషించింది.



మంకీ డ్యాన్స్ చాలెంజ్

ఎప్పటికప్పుడు కొత్త కొత్త డ్యాన్స్‌లు వస్తూ ఇంటర్‌నెట్‌లో హల్‌చల్ చేస్తున్నాయి. ఈ సందడి ఇంటర్‌నెట్‌కే పరిమితం కావడం లేదు. బయట రకరకాల ఫంక్షన్‌లలో నృత్యాభిమానులు ఈ ట్రెండింగ్ డ్యాన్స్‌లను ఫాలో అవుతున్నారు.

'గాంగ్నమ్' డ్యాన్స్ తరువాత రకరకాల డ్యాన్సులు వచ్చాయి.

తాజాగా 'మంకీ డ్యాన్స్ చాలెంజ్' ఇన్‌స్టాగ్రామ్‌లో ట్రెండింగ్‌గా మారింది. బాలీవుడ్ హీరోయిన్ ఫాతిమ సనా షేక్ 'నేను సైతం' అంటూ ఈ చాలెంజ్‌ను స్వీకరించింది. పింక్ శారీలో మెరిసిపోతూ తన బృందంతో కలిసి చేసిన మంకీ డ్యాన్స్ వీడియో వైరల్ అయింది. 'దిస్ ఈజ్ అమేజింగ్'లాంటి కామెంట్స్‌తో కామెంట్ సెక్షన్ నిండిపోయింది. కొత్త స్టైల్లో డ్యాన్స్ ట్రై చేయాలనుకుంటున్నావారికి ఈ వీడియో బెస్ట్ ఛాయిస్.



వితిన్ వన్ మంత్... డాడీ మళ్లీ నవ్వుతాడు!

వరల్డ్ కప్ ఫైనల్ ఫలితం 'అయ్యయ్యో' అనిపించింది. కన్నీళ్ల పర్యంతం అయిన రోహిత్‌శర్మను చూసిన తరువాత ఈ 'అయ్యయ్యో'లు రెట్టింపు అయ్యాయి. ఈ అయ్యయ్యోల సంగతి ఎలా ఉన్నా రోహిత్‌శర్మ కూతురు సమైర వీడియో క్లిప్ ఇంటర్‌నెట్‌లో నవ్వుల పువ్వులు పూయిస్తోంది. ఈ వీడియోలో... సమైర తల్లితో కలిసి వస్తుంటే రోహిత్ గురించి 'ఎక్కడ ఉన్నారు? ఎలా ఉన్నారు?' అని ఎవరో అడిగారు. 'రూమ్‌లో ఉన్నారు. వితిన్ వన్ మంత్ ఆయన మళ్లీ నవ్వుతాడు' అన్నది సమైర. ఈ చిన్నారి పెద్దరికానికి నెటిజనులు మురిసిపోతున్నారు. ఇంతకీ ఇది తాజా వీడియో కాదు. గత ఏడాది ఏదో సందర్భంలో ఒక అభిమాని షేర్ చేసిన వీడియో. అయితే మాత్రం ఏమిటీ తాజా పరిస్థితికి జిరాక్స్‌లా ఉంది.

అమ్మ ఎక్కడైనా అమ్మే

నెలల పసికందు. తల్లి ఆస్పత్రిలో.
బిడ్డ పోలీసు వాడిలో.
బిహార్‌కు చెందిన ఒక కూలి మనిషి
కేరళలో హాస్పిటల్ పాలైంది.
ఆలనా పాలనా చూసేవారులేక
బిడ్డ పోలీస్ స్టేషన్‌కు చేరింది.
వెక్కి వెక్కి ఏడుస్తున్న పసిగుడ్డును
చూసి ఒక పోలీసు గుండె ఆగలేదు.
వెంటనే పాలిచ్చింది.
ఈ వీడియో చూసినవారు
అమ్మ ఎక్కడైనా అమ్మే అంటున్నారు.

ఖాకీ యూనిఫామ్ వేసుకున్న మాత్రాన తల్లి గుండె తల్లి గుండె కాకుండా పోతుందా? ఏ తల్లి మనసైనా తన బిడ్డను ఒకలా మరొకరి బిడ్డను ఒకలా చూస్తుందా? ప్రాణం పోసే స్వభావం కదా తల్లిది.



ఎర్నాకుళానికి పట్నా నుంచి వలస వచ్చిన ఒక కుటుంబంలో తల్లికి గుండె జబ్బు రావడంతో ఐసియులో చేరింది. అప్పటికే ఆమె భర్త ఏదో కారణాన జైల్లో ఉన్నాడు. ఆమెకు నలుగురు పిల్లలు. ఆఖరుది నాలుగు నెలల పాప. హాస్పిటల్ వాళ్లు దిక్కులేని ఆమె పిల్లల గురించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు వెళ్లి స్టేషన్‌కు తీసుకొచ్చారు. పసిపాప ఏడ్వడం మొదలెట్టింది. ఆర్య అనే పోలీసు ఆఫీసర్ మనసు ఊరికే ఉండలేకపోయింది. ఆమెకు కూడా 9 నెలల పసిపాప ఉంది. అందుకే చటుక్కున పసిదాన్ని ఒడిలోకి తీసుకొని పాలు ఇచ్చింది. ఊరుకో బెట్టింది. పై అధికారులు ఇందుకు అనుమతించారు. కొచ్చి పోలీసులు ఈ వీడియోను ఫేస్‌బుక్ పేజీలో లోడ్ చేశారు. సాటి మహిళా పోలీసులే కాదు నెటిజన్లు కూడా ఆర్యను మెచ్చుకున్నారు.

ఆ బిహార్ మహిళ పూర్తిగా కోలుకునే వరకు పిల్లలను స్టేట్ హోమ్‌కు తరలించి అక్కడ ఉంచుతామని అధికారులు తెలిపారు. పాలిచ్చిన బంధంతో ఆర్య ఆ పసిగుడ్డును హోమ్‌కు వెళ్లి చూడకుండా ఉంటుందా?

నా పెళ్లి నా ఇష్టం

పెళ్లిలో పెళ్లికొడుకు మెడలో పూలదండ కనిపించడం సాధారణమే. హరియాణ రాష్ట్రం ఖురేషీపూర్ గ్రామానికి చెందిన ఈ వరుడు మాత్రం సంప్రదాయానికి భిన్నంగా ఖరీదైన కొత్తరకం దండ తయారు చేయించాడు. దీని అర్థం... ఖరీదైన పువ్వులతో దండ తయారు చేయించాడు అని కాదు. అది కరెన్సీ దండ. 20 లక్షల అయిదు వందల నోట్లతో తయారు చేయించిన ఈ వరుడి దండ సోషల్ మీడియాలో సెన్సేషన్‌గా మారింది. ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఈ వీడియో క్లిప్‌పై నెటిజనులు రకరకాలుగా స్పందించారు.



కొందరు 'ఆహా! అద్భుతం' అంటే–

మరికొందరు 'ఏమిటీ అతి' అని చురకలు అంటించారు. 'ఇన్‌కమ్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్ వాళ్లకు ఫిర్యాదు చేస్తాం' అని కొందరు బెదిరించారు.

ఎవరి స్పందన ఎలా ఉన్నా ఈ వీడియో క్లిప్ 15 మిలియన్‌ల వ్యూస్‌ను దక్కించుకుంది.



'కీడా కోలా' చిత్రంలో ఓ దృశ్యం

ఈ మధ్య వచ్చిన 'కీడా కోలా' సినిమాలో హీరో బార్బీ డాల్ మీద మనసు పడతాడు. పెళ్లంటూ చేసుకుంటే బార్బీ డాల్‌నే చేసుకుంటానని ప్రతిన పూనుతాడు. అది సినిమా కాబట్టి నవ్వుకుంటాం. 'నిజజీవితంలో ఇంత సీన్ ఉంటుందా!' అనుకుంటాం. అయితే బ్రెజిల్‌కు చెందిన రోచా మోరేస్ వివాహ వేడుకను చూస్తే 'నిజ జీవితంలో కూడా ఇలాంటివి జరుగుతుంటాయి' అనే వాస్తవం బోధపడుతుంది. రోచా 'మార్సెల్'ను పెళ్లి చేసుకుంది. సదరు ఈ మార్సెల్ మానవమాత్రుడు కాదు. ఓ బొమ్మ. 40 మంది గెస్ట్‌లతో ఈ పెళ్లి ఘనంగా జరిగింది.


హెల్త్



చిన్నారుల్లో బ్రెయిన్ ట్యూమర్‌లు...!

ఇటీవల చిన్నారుల్లో బ్రెయిన్ ట్యూమర్ల (మెదడులో గడ్డలు) కేసులు చాలా ఎక్కువగా వస్తుండటం అటు తల్లిదండ్రులు, ఇటు వైద్యులు... ఇలా అన్ని వర్గాల్లోనూ బెంబేలు పుట్టిస్తోంది. మరీ ముఖ్యంగా మన దేశంలో నెలలు నిండకుండానే పుట్టిన బిడ్డల్లో ఈ సమస్య మరింత ఎక్కువగా వస్తుండటం వైద్యవర్గాల్లో ఆందోళన పెంచుతోంది. మామూలుగానైతే బిడ్డ తన తల్లి కడుపులో 37 వారాలు పెరగాలి. తల్లి కడుపులో అంతకంటే తక్కువగా ఉన్న పిల్లల్లో కొన్ని శారీరక వ్యవస్థలు పూర్తిగా ఎదగకుండా పోయే ప్రమాదముంటుంది. ఇలాంటి చిన్నారుల్లోనే మెదడు గడ్డలు ఎందుకు ఎక్కువగా వస్తున్నా యనే అంశంపై వైద్యవర్గాలు ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరిస్తున్న ఈ తరుణంలో... చిన్నారుల్లో మెదడు గడ్డల సమస్యపై అవగాహన కోసం ఈ కథనం.

చిన్నారులు తమ తల్లి కడుపులో ఉండాల్సిన వ్యవధి కన్నా తక్కువ కాలం ఉండటం వల్ల... ప్రీ–మెచ్యూర్ బేబీస్‌లో కొన్ని అవయవాలు పూర్తిగా ఎదగకపోవచ్చు. మిగతా అవయవాల సంగతి ఎలా ఉన్నా, అన్ని అవయవాల్లోకెల్లా మెదడు ఎదుగుదల చాలా కీలకం. కాబట్టి అదొక్కటి ఎదగకపోవడం వల్ల చాలా వ్యవస్థలు ప్రభావితం అయ్యే అవకాశముంటుంది.



ప్రీమెచ్యూర్ బేబీస్‌కీ, అవయవాల పెరుగుదల లోపాలకీ సంబంధమేమిటంటే...

కడుపులో పూర్తికాలం లేకపోవడం వల్ల మెదడు సహా, కొన్ని అవయవాలు పూర్తిగా ఎదగకపోవడం ఒక ముప్పు (రిస్క్ ఫ్యాక్టర్)కాగా... మెదడులో గడ్డలు రావడం, క్రమేణా అవి పెరగడం, దాంతో... కొన్ని వ్యవస్థలను నియంత్రించే సెంటర్లను ఆ పెరిగే గడ్డలు నొక్కేయడంతో ఈ ముప్పు మరింత పెరుగుతుంది. కడుపులో పూర్తిగా ఎదిగిన బిడ్డలతో పోలిస్తే... ప్రీ–టర్మ్ చిన్నారుల్లో ఈ ముప్పు పెరిగేందుకు ఈ అంశాలు దోహదపడతాయి. దానికి తోడు జన్యుపరమైన సమస్యలతో పుట్టుకతోనే (కంజెనిటల్‌గా) వచ్చే ఆరోగ్య సమస్యలూ, పర్యావరణ కారణాలతో వచ్చే ఆరోగ్యలోపాలూ... ఇవన్నీ కలిసి ప్రీ–మెచ్యూర్ బేబీల రిస్క్‌ను మరింతగా పెంచేస్తాయి.

లక్షణాలు

మెదడులో గడ్డలున్న పిల్లల్లో కొన్ని సాధారణ లక్షణాలు కనిపిస్తాయి. అవి...

- ఎంతకూ తగ్గని తలనొప్పి... ఇది నిరంతరమూ చిన్నారులను వేధిస్తుంటుంది.
- కారణం తెలియకుండా కనిపించే వాంతులు
- పిల్లల ప్రవర్తనలో తేడాలు, మెదడులో గడ్డలు ప్రభావితం చేసే బోటు (సెంటర్)ను బట్టి కొన్నిసార్లు పిల్లలు వింతగా ప్రవర్తించవచ్చు. అలా ఎందుకు ప్రవర్తిస్తున్నారో కారణం వెంటనే తెలియక పోవచ్చు.
- చిన్నారుల ఎదుగుదల ఆలస్యం కావడం (డెవలప్‌మెంటల్ డిలే)

సమస్యను గుర్తించడం, త్వరగా నిర్ధారణ చేయడమెలా...

పిల్లలు తమ సమస్యను పెద్దవారిలా చెప్పలేరు. పైగా మెదడులో గడ్డలు ఉన్నప్పుడు పిల్లల్లో కనిపించే లక్షణాలు కూడా మామూలు పిల్లల్లోనూ ఏదో ఒక సమయంలో కనిపించేవే. ఈ అంశం కూడా సమస్యను గుర్తించడం, త్వరగా నిర్ధారణ చేయడంలో సమస్యగా మారుతుంది.

ఇక నిర్ధారణ కోసం లక్షణాలను బట్టి ఈఈజీ, అల్ట్రా సౌండ్ లేదా ఎమ్మారై స్కాన్‌లాంటి మెదడు స్కానింగ్ ప్రక్రియలతో పాటు మరికొన్ని పరీక్షలు చేయించాల్సి ఉంటుంది.

చిన్నారుల్లోని మెదడులో గడ్డలు ఉన్నట్లుగా ఎంత త్వరగా గుర్తిస్తే... చికిత్సకు అంతగా మేలు చేస్తుంది. నిజానికి ఈ అంశమే చికిత్సలో చాలా కీలకం. అందుకే తల్లిదండ్రులు మాత్రమే కాకుండా... పిల్లల స్కూలు టీచర్లు, ఇతరత్రా వారికి సేవలందించేవారు, సహాయకులు (కేర్ గివర్స్), డాక్టర్ల వంటి హెల్త్ కేర్ ప్రొఫెషన్స్ అందరూ చిన్నారుల మెదడులో గడ్డలున్నప్పుడు కనిపించే లక్షణాలు, ఇతరత్రా అంశాలూ, సవాళ్లపై అవగాహన కలిగి ఉండాలని డాక్టర్లు సూచిస్తున్నారు.



ఎన్నో కొత్త పరిశోధనలు

ఇటీవల మెదడులో వచ్చే రకరకాల గడ్డలు... అందునా మరీ ముఖ్యంగా నెలలు నిండకుండానే పుట్టిన చిన్నారుల్లో వచ్చే మెదడు గడ్డల విషయంలో చాలా కీలకమైన పరిశోధనలు జరుగుతున్నాయి.

మరిన్ని అధునాతన పరిశోధన ఫలితాలు ఇప్పుడు అందుబాటులోకి వచ్చాయి. ఉదాహరణకు మెదడు సర్జరీల్లో 'న్యూరోనావిగేషన్', 'న్యూరోమానిటరింగ్), అలాగే కోత తక్కువగా ఉండే విధానాలు. ఈ పద్ధతుల్లో చేసే శస్త్రచికిత్సలో మెదడులోని అత్యంత సంక్లిష్టమైన భాగాలను 3–డీ ఇమేజ్‌లో గడ్డ నిర్దిష్టంగా ఎక్కడ ఉందో చూస్తూ, సర్జన్ సరిగ్గా అక్కడికే చేరడానికి వీలవుతుంది. తక్కువ కోతతో శస్త్రచికిత్స చేయడం వల్ల నొప్పి బాగా తగ్గడంతో పాటు, కోత కూడా తక్కువ కావడంతో బాధితులైన చిన్నారులు చాలా త్వరగా కోలుకుంటారు. మెదడులోని అత్యంత సున్నితమైన భాగాలకు చేరే సమయాల్లో కలిగే రిస్కులను అంచనా వేసి, మిగతా భాగాలకు ఎలాంటి విఘాతం లేకుండా గడ్డ ఉన్న చోటికి చేరడానికి ఇప్పుడు అందుబాటులో ఉన్న అత్యాధునిక సునిశిత పరికరాలు బాగా తోడ్పడతాయి. అందువల్ల గతంతో పోలిస్తే ఇప్పుడీ సమస్య పట్ల అంతగా ఆందోళన పడాల్సిన అవసరం లేదు.

చికిత్స

ఒకసారి సమస్య నిర్ధారణ జరిగాక చికిత్స అన్నది కేవలం ఒక స్పెషలిస్టు డాక్టరుతో కాకుండా అనేక రకాలుగా (మల్టీ డిసిప్లినరీ అప్రోచ్) జరగాల్సిన అవసరం ఉంటుంది. మందులతో పాటు మెదడులో గడ్డ ఉన్న ప్రాంతాన్ని బట్టి... కొన్ని సందర్భాల్లో కీమోథెరపీ, రేడియేషన్ వంటి చికిత్సలూ అవసరమవుతాయి. ఒకవేళ శస్త్రచికిత్స చేయాల్సి వస్తే... మెదడులో గడ్డ ఎలాంటి ప్రాంతంలో ఉంది, దానికి శస్త్రచికిత్స చేసే సమయంలో ఏయే వ్యవస్థలు ప్రభావితమయ్యే అవకాశముంది...లాంటి అనేక అంశాను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. కొన్నిసార్లు సునిశితమైన, అనుభవజ్ఞులైన పీడియాట్రిక్ ఆంకాలజీ కేర్ స్పెషలిస్టుల ఆధ్వర్యంలో చికిత్స జరగాల్సి రావచ్చు. అందుకే ఇలాంటి పిల్లల తల్లిదండ్రులకూ... ఈ సమస్యలపై ప్రత్యేక అవగాహన ఉండటం చాలా అవసరం.



డా॥ శ్రీకాంత్ రెడ్డి,
సీనియర్ కన్సల్టెంట్
న్యూరో అండ్ స్పైన్ సర్జన్



కొలాజెన్ వాస్క్యులార్ డిసీజెస్ అంటే!

కొన్ని వ్యాధులు ప్రధానంగా చర్మం, ఎముకలు, కీళ్లు, కండరాల వంటి వాటి చుట్టూ ఉండే కొలాజెన్ అనే మృదు కణజాలాన్ని ప్రభావితం చేస్తాయి. ఇలా వాటిని ఏకకాలంలో ప్రభావితం చేసే రకరకాల వ్యాధుల సమాహారాన్ని కలిపి 'కొలాజెన్ వాస్క్యులార్ డిసీజెస్'గా చెబుతారు. వీటిల్లో జోగ్రన్స్ డిసీజ్, సిస్టమిక్ స్క్లిరోసిస్, మిక్స్‌డ్ కనెక్టివ్ టిష్యూ డిసీజ్‌తో పాటు వెజెనెర్స్, పాలీకాండ్రయిటిస్, లూపస్, రుమటాయిడ్ ఆర్థ్రైటిస్ వంటి జబ్బులు ఉంటాయి. ఇవి తమ ఆటో యాంటీబాడీస్ కారణంగా ఎముకలనూ, మృదులాస్థిని దెబ్బతీస్తాయి. పురుషులతో పోలిస్తే ఇవి మహిళల్లోనే ఎక్కువ. ఈ కొలాజెన్ వాస్క్యులార్ డిసీజెస్ లక్షణాలూ, ఇవి చేసే హానీ, వీటికి చికిత్స వంటి అనేక అంశాలపై అవగాహన కోసం ఈ కథనం.

కొలాజెన్ వాస్క్యులార్ డిసీజెస్‌లో ప్రధానమైనది లూపస్ అని పిలిచే వ్యాధి. లూపస్ అంటే తోడేలు అని అర్థం. ముక్కుకు ఇరువైపులా మచ్చతో చూడగానే తోడేలులా కనిపించే అవకాశం ఉంది కాబట్టి దీన్ని లూపస్ అంటారు. అలాగే రుమటాయిడ్ ఆర్థ్రైటిస్ చిన్న కీళ్లపై చూపే ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

లక్షణాలు...

- లూపస్‌లో కనిపించే ఈ (మాలార్) ర్యాష్ సూర్యకాంతి పడ్డప్పుడు మరింత పెరగవచ్చు.
- కొందరిలో వెంట్రుకమూలాలు మూసుకుపోతాయి. లూపస్‌లో ఇది ఒక రకం. దీన్ని డిస్కాయిడ్ లూపస్ అంటారు. ఇది వచ్చిన వారిలో చేతులు, ముఖం మీద వస్తుంది. కొన్నిసార్లు ఒళ్లంతా కూడా ర్యాష్ రావచ్చు.
- తరచూ జ్వరం వస్తుంటుంది.
- బరువు తగ్గుతుంది.
- కొందరిలో జుట్టు రాలిపోవచ్చు.
- మరికొందరిలో నోటిలో, ముక్కులో పుండ్లు (అల్సర్స్) కూడా రావచ్చు. ఈ అల్సర్స్ వల్ల నొప్పి ఉండదు.
- కొందరిలో డిప్రెషన్ కనిపించి ఉద్వేగాలకు లోనవుతుంటారు. దాంతో దీన్ని ఓ మానసికమైన లేదా నరాలకు సంబంధించినది సమస్యగా పొరబాటు పడేందుకు ఆస్కారం ఉంది. అయితే డిప్రెషన్ తాలూకు లక్షణాలు కనిపించినప్పుడు ఏఎన్ఏ పరీక్ష నిర్వహించి... మెదడుపై ఏదైనా దుష్ప్రభావం పడిందేమో తెలుసుకోవాలి.
- కొందరిలో ఫిట్స్ రావచ్చు. ఇక రుమటాయిడ్ ఆర్థ్రైటిస్‌తో పాటు మిగతా వాస్క్యులార్ జబ్బుల లక్షణాలు ఇలా ఉంటాయి.
- రుమటాయిడ్ ఆర్థ్రైటిస్ కీళ్లను ప్రభావితం చేసి, వైకల్యానికి దారితీయవచ్చు. అప్పుడు సర్జరీతో మినహా దాన్ని చక్కదిద్దడం సాధ్యం కాకపోవచ్చు.
- అరుదుగా కొందరిలో కళ్లలో రక్తపోటు పెరగడంతో గ్లకోమాకు దారితీయడం, కన్ను పొడిబారడం, రెటీనాకూ, తెల్లగుడ్డులోని స్క్లెరా పొరకు మధ్య ఇన్‌ఫ్లమేషన్ రావడం, కార్నియాకు ఇన్‌ఫ్లమేషన్ రావడం వంటి సమస్యలు రావచ్చు.

పిల్లల్లోనూ... కొలాజెన్ వాస్క్యులార్ డిసీజ్‌లోని లూపస్ పిల్లల్లోనూ రావచ్చు. దీన్ని జువెనైల్ సిస్టమిక్ లూపస్ అంటారు.

చికిత్స... ప్రధానమైన సమస్యలైన ఎస్‌ఎల్ఈ, రుమటాయిడ్ ఆర్థ్రైటిస్ వంటి వాటికి రుమటాలజిస్టుల ఆధ్వర్యంలో తగిన చికిత్స తీసుకోవాలి. డాక్టర్లు ఈ సందర్భంగా జబ్బును అదుపు చేసే మందులతో పాటు అవసరాన్ని బట్టి ప్రెడ్నిసలోన్ వంటి స్టెరాయిడ్స్ కూడా ఇచ్చి చికిత్స చేస్తుంటారు. ఇది చాలా జాగ్రత్తగా అందించాల్సిన చికిత్స.



డా॥ విజయ ప్రసన్న పరిమి,
సీనియర్ రుమటాలజిస్ట్

మెడి టిప్

గురకతో వచ్చే ఆరోగ్య అనర్థాల నివారణకు...



నిద్రలో కొంతమందికి గురక వస్తుంది. గురక మంచి నిద్రకు సూచన అని చాలా మంది అనుకుంటారు. కానీ ఇది సరికాదు. నిద్రలో అన్ని కండరాల్లాగే గొంతు కండరాలూ రిలాక్స్ అవుతాయి. దాంతో ఊపిరితిత్తులకు వెళ్లే నాళం ముడుచుకుపోయినట్లుగా (ఫ్లాపీగా) అవుతాయి. అందులోంచి గాలి వెళ్తున్నప్పుడూ, అంగిలికి తాకినప్పుడూ... అందులో ప్రకంపనలు కలిగి, గురక వస్తుంది. ఇలా గురక వస్తూ వాయునాళంలోంచి పది సెకండ్లకు పైగా గాలి ఊపిరితిత్తుల్లోకి వెళ్లకపోతే... ఆ కండిషన్‌ను 'అప్నియా' అంటారు. అప్పుడు తగినంత ఆక్సిజన్ అందకపోవడంతో పాటు కార్బన్ డై ఆక్సైడ్ మోతాదులు పెరుగుతాయి.. దాంతో మెదడుకు తగినంత ఆక్సిజన్ అందక, రాత్రిళ్లు నాణ్యమైన నిద్రలేక, పగలంతా జోగుతూ ఉంటారు. ఫలితంగా రక్తపోటు పెరగడం, డయాబెటిస్ ఉన్నవాళ్లలో చక్కెరలు నియంత్రణలో ఉండకపోవడం, పక్షవాతం, ఆస్తమా, సీవోపీడీ జబ్బు ఉన్నవాళ్లలో వాటి తీవ్రత పెరగడం, గుండెజబ్బులు రావడం వంటి సమస్యలూ వస్తాయి. ఒక్కోసారి స్లీప్ అప్నియా కారణంగా వచ్చే ఈ దుష్ప్రభావాలూ మరణానికి దారితీసే అవకాశాలూ లేకపోలేదు.

అప్నియాను నివారణకు పాటించాల్సిన సూచనలివి...

- మంచి జీవనశైలి అలవాట్లతో అప్నియాను చాలావరకు నివారించవచ్చు.
- స్థూలకాయం ఉన్నవారు బరువు తగ్గాలి.
- ఆల్కహాల్ అలవాటు ఉన్నవారు పూర్తిగా మానేయాలి. అలవాటు మానేయలేకపోతే... నిద్రపోవడానికి కనీసం నాలుగు నుంచి ఆరు గంటలకు ముందు ఆల్కహాల్ ఎట్టిపరిస్థితుల్లోనూ తీసుకోకూడదు. అయితే ఇలా మానకపోవడం చాలామందిలో ప్రమాదకరంగా పరిణమించిన దాఖలాలు స్పష్టంగా ఉన్నాయి. అందుకే ఆల్కహాల్‌ను పూర్తిగా మానేయడమే మంచిది.



ఫైనల్లో రష్మిక భమిడిపాటి

ఐటీఎఫ్ మహిళల వరల్డ్ టెన్నిస్ టూర్ టోర్నీలో హైదరాబాద్ అమ్మాయి భమిడిపాటి శ్రీవల్లి రష్మిక ఫైనల్లోకి ప్రవేశించింది. బెంగళూరులో జరుగుతున్న ఈ టోర్నీలో శనివారం జరిగిన సెమీ ఫైనల్లో రష్మిక 6-2, 6-1 స్కోరుతో రెండో సీడ్ లన్‌లనా తరారుడీ (థాయిలాండ్)పై విజయం సాధించింది. 57 నిమిషాల పాటు సాగిన పోరులో ఆద్యంతం రష్మిక ఆధిపత్యం కొనసాగింది. తరారుడీ ఒక ఏస్ కొట్టినా ఐదు డబుల్ ఫాల్ట్‌లతో ఓటమిని ఆహ్వానించింది. మరో భారత క్రీడాకారిణి జీల్ దేశాయ్ కూడా ఫైనల్లోకి అడుగు పెట్టింది. హోరాహోరీగా సాగిన ఈ సెమీస్‌లో జీల్ 3-6, 6-4, 7-5 స్కోరుతో భారత్‌కే చెందిన మూడో సీడ్ రుతుజ భోసలేను ఓడించింది. 2 గంటల 31 నిమిషాల పాటు పోటాపోటీగా సాగిన ఈ మ్యాచ్‌లో తొలి సెట్‌ను కోల్పోయినా...పట్టుదలగా ఆడిన జీల్ విజేతగా నిలిచింది. రుతుజ 2 ఏస్‌లు కొట్టగా, జీల్ ఒక ఏస్ సంధించింది. జీల్ 7 డబుల్ ఫాల్ట్‌లతో పోలిస్తే 10 డబుల్ ఫాల్ట్‌లు చేసిన రుతుజ ఓటమిపాలైంది.

మరో విజయంపై భారత్ కన్ను



- సమం చేసే లక్ష్యంతో ఆస్ట్రేలియా
- నేడు ఇరు జట్ల మధ్య రెండో టి20
- రా.గం.7 నుంచి స్పోర్ట్స్–18, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

తిరువనంతపురం: ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో శుభారంభం చేసిన ఉత్సాహంతో ఉన్న భారత్ ఇప్పుడు సిరీస్‌లో ఆధిపత్యం చాటేందుకు సిద్ధమైంది. ఆదివారం జరిగే రెండో టి20లో ఆస్ట్రేలియాపై వరుసగా విజయం సాధించాలనే లక్ష్యంతో సూర్యకుమార్ సేన బరిలోకి దిగుతోంది. మరోవైపు విశాఖపట్నంలో ఎదురైన పరాజయానికి ఇక్కడ బదులుతీర్చుకొని సిరీస్‌లో సమంగా నిలవాలనే పట్టుదలతో ఆస్ట్రేలియా ఉంది. అనుభవం లేని ఆతిథ్య బౌలింగ్‌ను ఆసరా చేసుకొని రెచ్చిపోయే ప్రదర్శన కనబరచాలని కంగారూ సేన ఆశిస్తోంది. అయితే ఇక్కడి గ్రీన్‌ఫీల్డ్ పిచ్ పేస్‌కు అనుకూలం కావడంతో తొలి టి20లా ఇక్కడ భారీ స్కోర్ల మజా ఉండకపోవచ్చు. మెరుపులు తక్కువైనా... పోరు మాత్రం ఆసక్తికరంగా జరిగే అవకాశముంది.



బౌలర్లపైనే బెంగంతా!

సీనియర్ బ్యాటర్లు లేకపోయినా... బ్యాటింగ్‌లో మాత్రం భారత్ పటిష్టంగా ఉంది. యశస్వి జైస్వాల్, ఇషాన్ కిషన్‌లు కంగారు పెట్టించే ఆసీస్ బౌలింగ్‌ను దీటుగా ఎదుర్కొన్నారు. లక్ష్య ఛేదనలోనూ దానిని కొనసాగించారు. తొలి మ్యాచ్‌లో దురదృష్టవశాత్తూ రనౌటైన రుతురాజ్ గైక్వాడ్ కూడా తనవంతు మెరుపులు మెరిపిస్తే తర్వాత వచ్చే కెప్టెన్ సూర్యకుమార్, తిలక్‌వర్మ, రింకూ సింగ్‌లు భారత ఇన్నింగ్స్‌ను వేగంగా ముందుకు తీసుకెళ్లగలరు. లోయర్ ఆర్డర్‌లో అక్షర్ పటేల్ రూపంలో స్పిన్ ఆల్‌రౌండర్ ఉండటం, భారీ షాట్లతో విరుచుకుపడే సత్తా ఉండటం బ్యాటింగ్ దళానికి అదనపు బలమవుతుంది. ఏ రకంగా చూసిన బ్యాటర్లపై జట్టు మేనేజ్‌మెంట్‌కు ఏ అప నమ్మకం లేదు. ఎటొచ్చి అనుభవంలేని బౌలింగ్‌తోనే సమస్యంతా! గత మ్యాచ్‌నే పరిశీలిస్తే ఒక్క ముకేశ్ కుమార్ మినహా ప్రధాన బౌలర్లుగా బరిలోకి దిగిన అర్ష్ దీప్, ప్రసిధ్‌కృష్ణలతో పాటు రవి బిష్ణోయ్, అక్షర్ పటేల్‌లు ధారాళంగా పరుగులు సమర్పించుకోవడం కలవరపెడుతోంది. అయితే ఇక్కడ బౌలింగ్‌కు అనుకూలించే పిచ్‌పై పట్టుసాధిస్తే మరో విజయం సులువవుతుంది.

ఆల్‌రౌండ్ ప్రదర్శనపై ఆసీస్ గురి

తొలి టి20లో ఆస్ట్రేలియా చక్కగా పరుగులు చేసింది. భారత్ లక్ష్య ఛేదనకు దిగితే ఆరంభంలోనే వికెట్లు తీసింది. కానీ ఆ తర్వాతే సూర్యకుమార్ నిలదొక్కుకోవడంతో కష్టాలపాలైంది. ప్రపంచకప్‌లో చెలరేగిన హెడ్, మ్యాక్స్‌వెల్ ఈ మ్యాచ్ బరిలోకి దిగే అవకాశముంది. దీంతో ఆస్ట్రేలియా బ్యాటింగ్ దళం మరింత విధ్వంసంగా మారిపోనుంది. అనుభవజ్ఞుడైన స్మిత్, ఇంగ్లిస్, టి20 స్పెషలిస్టు టిమ్ డేవిడ్‌లతో భారత బౌలర్లకు ఇబ్బందులు తప్పవు. అయితే భారత్‌లాగే గతి తప్పిన బౌలింగ్‌తో మూల్యం చెల్లించుకున్న ఆస్ట్రేలియా ఈ సారి మళ్లీ ఆ పొరపాట్లకు తావివ్వకుండా జాగ్రత్త పడాలనుకుంటోంది. కలిసొచ్చే వికెట్‌పై స్టొయినిస్, అబాట్, ఎలిస్, తన్వీర్ సంఘా కట్టుదిట్టంగా బౌలింగ్ చేస్తే తప్పకుండా అనుకున్న ఫలితం సాధించవచ్చు.

జట్లు (అంచనా): భారత్: సూర్యకుమార్ (కెప్టెన్), రుతురాజ్, ఇషాన్ కిషన్, యశస్వి, తిలక్ వర్మ, రింకూ సింగ్, అక్షర్ పటేల్, రవి బిష్ణోయ్, అర్ష్‌దీప్, ముకేశ్, ప్రసిధ్ కృష్ణ. **ఆస్ట్రేలియా:** మాథ్యూ వేడ్ (కెప్టెన్), స్మిత్, షార్ట్ / హెడ్, ఇన్‌గ్లిస్, స్టొయినిస్ / మ్యాక్స్‌వెల్, టిమ్ డేవిడ్, అరోన్ హార్డి, అబాట్, నాథన్ ఎలిస్, బెహ్రెన్‌డార్ఫ్, తన్వీర్ సంఘా.

పిచ్–వాతావరణం

గ్రీన్‌ఫీల్డ్ వికెట్ పేసర్లకు అనుకూలం. టాస్ గెలిచిన జట్టు బ్యాటింగ్ ఎంచుకోవచ్చు. ఆదివారం మ్యాచ్‌కు వానముప్పు అయితే లేదు.

‘X’ విలువ ఎంత?

ముంబై ఇండియన్స్‌కు హార్దిక్ పాండ్యా • ప్రకటించని మొత్తానికి కుదిరిన డీల్!

భారత క్రికెట్‌లో అత్యుత్తమ పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్...ఆడిన రెండు సీజన్లలో ఆటగాడిగా మంచి ప్రదర్శన...కెప్టెన్‌గా ఒక సారి జట్టును విజేతగా నిలిపి మరో సీజన్‌లో ఫైనల్ చేర్చిన ఘనమైన రికార్డు...అన్నింటికి మించి స్థానిక ఆటగాడు...ఇలాంటి అర్హత ఉన్న క్రికెటర్‌ను ఏ ఫ్రాంచైజీ అయినా ఎందుకు వదులుకుంటుంది? క్రికెట్ కోణంలో చూస్తే మాత్రం ఇందులో 'సున్నా' శాతం కూడా సరైన కారణం కనిపించడం లేదు. వేరే ఇతర కారణాలు హార్దిక్ పాండ్యాను గుజరాత్ టైటాన్స్ జట్టునుంచి ముంబై ఇండియన్స్ వైపు నడిపించాయా అనేది ఆసక్తికరం. అన్నింటికి మించి ఐపీఎల్ నిబంధనలను అతిక్రమించేలా ఉన్న చర్యతో పాండ్యా బదిలీ వ్యవహారం చర్చనీయాంశంగా మారింది.

(సాక్షి క్రీడా విభాగం)



హార్దిక్ పాండ్యా 2015 ఐపీఎల్‌లో 'అన్‌క్యాప్డ్' ప్లేయర్‌గా ముంబై ఇండియన్స్ రూ. 10 లక్షలకు తీసుకుంది. ఇక్కడే కెరీర్ మొదలు పెట్టిన పాండ్యా ఆ తర్వాత తన పదునైన ఆటతో పైపైకి దూసుకుపోయాడు. భారత్‌లో అత్యుత్తమ పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్‌గా ఎదిగాడు. ఐపీఎల్ ప్రదర్శనే అతడికి దాదాపు ఎనిమిదేళ్ల క్రితం భారత జట్టులో చోటు కల్పించింది. అతనికి పోటీనిచ్చే, అతని స్థాయి ఆటగాడు భారత్‌లో ఎవరూ లేకపోవడంతో ఏ దశలోనూ కెరీర్‌లో సమస్య రాలేదు. ముంబై ఇండియన్స్ జట్టు అతను వచ్చాక నాలుగు టైటిల్స్ (2015, 2017, 2019, 2020) సాధిస్తే ఆ విజయాల్లో పాండ్యా కీలక పాత్ర పోషించాడు. 2021 వరకు అదే జట్టులో అతని ప్రయాణం కొనసాగింది. 2022 మెగా వేలానికి ముందు నలుగురు ఆటగాళ్లనే కొనసాగించే అవకాశం ఉండటంతో ముంబై అతడిని వదులుకుంది.

నాయకుడిగా నడిపించి...

2022 ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్ ఫ్రాంచైజీని సీవీసీ క్యాపిటల్ పార్ట్‌నర్స్ తీసుకుంది. మెగా వేలానికి ముందు అందుబాటులో ఉన్న ఆటగాళ్లలో హార్దిక్ పాండ్యాను రూ.15 కోట్లకు ఎంచుకుంది. ఐపీఎల్ కెప్టెన్ కావాలనే పాండ్యా కోరిక కూడా ఇక్కడ తీరింది. 2022లో విజేతగా నిలిచిన టీమ్ 2023లో కూడా ఫైనల్ చేరి ఆఖరి బంతికి త్రుటిలో ఓడింది. ఈ రెండూ సార్లు గ్రూప్ దశలో టైటాన్స్‌దే అగ్రస్థానం. 30 ఇన్నింగ్స్‌లలో 41.65 సగటు, 133.49 స్ట్రయిక్ రేట్‌తో 833 పరుగులు చేసి పాండ్యా 11 వికెట్లు కూడా తీశాడు.

ముంబై ఇండియన్స్ చొరవతోనే...

ఐపీఎల్–2024 కోసం హార్దిక్ గుజరాత్ నుంచి ముంబై ఇండియన్స్‌కు మారడం ఖాయమైంది. దీనిపై అధికారిక ప్రకటన రావడమే తరువాయి. అన్ని రకాలుగా కలిసొచ్చిన ఫ్రాంచైజీనుంచి మళ్లీ ముంబైకి మారాలని పాండ్యా ఎందుకు అనుకున్నాడనేదానిపై స్పష్టత లేదు. టీమ్ యాజమాన్యంతో ఆర్థికాంశాల్లో విభేదాలు అనేది ముందుగా వినిపిస్తున్న కారణం. తన ఫీజు పెంచమని, దాంతో పాటు తన కోసం ప్రత్యేకంగా బ్రాండింగ్ అవకాశాలు ఎక్కువగా కావాలని కోరగా, టైటాన్స్ అందుకు తిరస్కరించినట్లు తెలుస్తోంది. అయితే వరల్డ్ కప్‌కు ముందే ముంబై యాజమాన్యంతో పాండ్యా చర్చలు జరిపాడని, అక్కడ అంగీకారం రావడంతోనే వెళ్లేందుకు సిద్ధమయ్యాడని కూడా వినిపించింది. 36 ఏళ్లు దాటిన రోహిత్ మరెంతో కాలం ఐపీఎల్ కూడా ఆడే అవకాశం లేదని, అందువల్ల మున్ముందు కెప్టెన్‌గా ముంబైని నడిపించాలనే కోరిక కూడా పాండ్యా వెళ్లిపోయేందుకు ఒక కారణంగా చెబుతున్నారు. అయితే ఇవన్నీ కూడా అంతర్గత అంశాలే కాబట్టి పూర్తిగా బయటపెడితే తప్ప వీటిలో వాస్తవం ఏమిటనేది ఎవరూ చెప్పే అవకాశం లేదు. పాండ్యాతో సమస్య ఉంటే ఐపీఎల్ నిబంధనల ప్రకారం టైటాన్స్ అతడిని నేరుగా విడుదల చేసుకోవచ్చు. అప్పుడు అతను వేలంలోకి వస్తాడు. అన్ని జట్లకూ పాండ్యాను ఎంచుకునే అవకాశం ఉంటుంది. కానీ 'ట్రేడింగ్' సమయంలో నేరుగా గుజరాత్ యాజమాన్యంతో మాట్లాడి భారీ మొత్తం ఇచ్చేందుకు ముంబై సిద్ధమయిందంటే అంబానీ టీమ్‌కే పాండ్యాపై ఆసక్తి ఉన్నట్లు అర్థమవుతోంది.

రూ. 15 కోట్లు + ట్రాన్స్‌ఫర్ ఫీజులో 50%

అధికారికంగా 2022 నుంచి పాండ్యాకు గుజరాత్ చెల్లిస్తున్న రూ. 15 కోట్లను ఇప్పుడు ముంబై నేరుగా నగదు రూపంలో చెల్లిస్తుంది. బదిలీ ప్రకారం ఆ టీమ్ మరే ఆటగాడిని ఇవ్వడం లేదు. ఇంతే మొత్తం వేలానికి ముందు టైటాన్స్ వద్ద మిగులుతుంది. అయితే దీంతో పాటు 'ట్రాన్స్‌ఫర్ ఫీజు' రూపంలో గుజరాత్‌కు ముంబై భారీ మొత్తం ఇస్తోందని, ఇందులో 50 శాతం పాండ్యా ఖాతాలోకి వెళుతుందని వార్తలు వస్తున్నాయి. అసలు లొసుగు ఇక్కడే ఉంది. ఈ ఫీజు ఎంత అనే విషయంపై ఎలాంటి స్పష్టత లేదు. గణితం ప్రకారం దానిని 'x'గా భావిస్తే దాని విలువ ఏమిటో ఎవరికీ తెలీదు. అలాంటప్పుడు ఆటగాళ్లను ఎంచుకునేందుకు టీమ్‌లకు విధించిన 'గరిష్ఠ మొత్తం' నిబంధనకు అర్థమే లేదు. ముంబై ఖాతానుంచి రూ. 15 కోట్లు మాత్రమే అధికారికంగా తగ్గుతోంది. అంతకంటే ఎక్కువగా వారు చెల్లించినా అది ఈ లెక్కలోకి రాదు. 2024 సీజన్ కోసం రూ.100 కోట్లు ఖర్చు చేసేందుకు గవర్నింగ్ కౌన్సిల్ అనుమతిచ్చింది. ప్రస్తుతం ముంబై వద్ద రూ. 5.05 కోట్లు మాత్రమే ఉన్నాయి. దాంతో ఆ జట్టు కామెరాన్ గ్రీన్ (రూ.17.5 కోట్లు), జోఫ్రా ఆర్చర్ (రూ. 8 కోట్లు)లను విడుదల చేసే అవకాశం ఉంది.

ఫైనల్లో సాత్విక్‌–చిరాగ్

చైనా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీ



షెన్‌జెన్: భారత అగ్రశ్రేణి షట్లర్లు సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి జోడీ మరో టైటిల్‌కు కేవలం అడుగు దూరంలో ఉంది. చైనా మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్–750 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో టాప్ సీడ్ భారత ద్వయం టైటిల్ పోరుకు అర్హత సంపాదించింది. శనివారం జరిగిన పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో సాత్విక్–చిరాగ్ జంట 21–15, 22–20తో హి జి తింగ్– రెన్ జియాంగ్ యు (చైనా) జోడీపై విజయం సాధించింది. 50 నిమిషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో తొలి గేమ్ నుంచే రెండు జోడీలు చెమటోడ్చాయి. ప్రతి పాయింట్‌కు భారత జంట సమన్వయంతో శ్రమించింది. రెండో సెట్‌లో చైనా ఆటగాళ్లు దూకుడుగా ఆడటంతో హోరాహోరీ పోరు జరిగింది. స్కోరు 20–20 వద్ద సమంకాగా సాత్విక్–చిరాగ్ జోడీ వరుసగా రెండు పాయింట్లు సాధించి గేమ్‌తో పాటు మ్యాచ్‌ను గెలిచింది.

హైదరాబాద్, ఆంధ్ర గెలుపు

జైపూర్: విజయ్ హజారే ట్రోఫీ వన్డే టోర్నమెంట్‌లో హైదరాబాద్ వరుసగా రెండో విజయం సాధించింది. తన్మయ్ అగర్వాల్ (108 బంతుల్లో 112; 12 ఫోర్లు, 2 సిక్స్‌లు) సెంచరీ సాధించడంతో హైదరాబాద్ 17 పరుగులతో జార్ఖండ్‌పై నెగ్గింది. మొదట హైదరాబాద్ 50 ఓవర్లలో 8 వికెట్లకు 297 పరుగులు చేసింది. ఆ తర్వాత జార్ఖండ్ 50 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 280 పరుగులకే పరిమితమైంది. సౌరభ్ తివారీ (82 బంతుల్లో 78; 8 ఫోర్లు, 1 సిక్స్), ఆర్యమాన్ (64 బంతుల్లో 63; 9 ఫోర్లు), వికాస్ (63 బంతుల్లో 61; 8 ఫోర్లు 1 సిక్స్) అర్ధసెంచరీలు సాధించారు.

భరత్, అశ్విన్ సెంచరీలు

చండీగఢ్: ఇదే టోర్నీలో అరుణాచల్ ప్రదేశ్‌తో జరిగిన లీగ్ మ్యాచ్‌లో ఆంధ్ర 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. అరుణాచల్ ప్రదేశ్ 50 ఓవర్లలో 4 వికెట్లకు 234 పరుగులు చేసింది. ఓపెనర్ సచిన్ శర్మ (145 బంతుల్లో 100 నాటౌట్; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు) అజేయ సెంచరీ సాధించాడు. అనంతరం ఆంధ్ర 34.1 ఓవర్లలో వికెట్ మాత్రమే కోల్పోయి 235 పరుగులు చేసి గెలిచింది. కెప్టెన్ శ్రీకర్ భరత్ (108 బంతుల్లో 117 నాటౌట్; 16 ఫోర్లు), అశ్విన్ హెబ్బర్ (93 బంతుల్లో 103 నాటౌట్; 12 ఫోర్లు, 2 సిక్స్‌లు) అజేయ సెంచరీలతో కదంతొక్కారు.

సినిమా

కథలు ఊహల్లో నుంచే కాదు.. వాస్తవ జీవితాల్లో నుంచి కూడా వస్తుంటాయి. ఇలా రియల్‌గా జరిగిన కొన్ని ఘటనల ఆధారంగా కొందరు దర్శకులు రాసుకున్న కథలతో కొన్ని సినిమాలు సిద్ధం అవుతున్నాయి. రియల్ టు రీల్‌గా రానున్న ఆ చిత్రాల గురించి తెలుసుకుందాం.

రియల్ టు రీల్!



'డాన్ శీను (2010)', 'బలుపు (2013)', 'క్రాక్ (2021)' చిత్రాల తర్వాత హీరో రవితేజ, దర్శకుడు గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో నాలుగో సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాను కొన్ని వాస్తవ ఘటనల స్ఫూర్తితో తెరకెక్కించనున్నట్లుగా చిత్ర యూనిట్ ఇప్పటికే వెల్లడించింది. అయితే ఇది కంప్లీట్ పీరియాడికల్ ఫిల్మ్ అని, ఆంధ్రప్రదేశ్‌లో 1991లో జరిగిన ఓ సంచలన ఘటన ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కిస్తారనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. తమిళ దర్శకుడు సెల్వరాఘవన్, ఇందూజ రవిచంద్రన్ కీలక పాత్రల్లో నటించనున్నారు. మైత్రీమూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మించనున్న ఈ సినిమాకు తమన్ స్వరకర్త. మరోవైపు రవితేజ, గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో వచ్చిన 'క్రాక్' కూడా కొన్ని వాస్తవ ఘటనల ప్రేరణతో తెరకెక్కి, హిట్ చిత్రంగా నిలిచిన సంగతి తెలిసిందే.

•••

హీరో మహేశ్‌బాబు, దర్శకుడు రాజమౌళి కాంబినేషన్‌లోని సినిమాపై అంతర్జాతీయ స్థాయిలో అంచనాలు ఉన్నాయి. ఆఫ్రికన్ ఫారెస్ట్ అడ్వెంచరస్ యాక్షన్ డ్రామాగా ఈ సినిమా కథనం ఉంటుంది. అయితే ఈ సినిమా కథలోని కొంతభాగం వాస్తవ ఘటనల ఆధారంగా ఉంటుందని ఈ చిత్ర రచయిత కె. విజయేంద్ర ప్రసాద్ గత ఏడాది అక్టోబరులో ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ సినిమా స్క్రిప్ట్ వర్క్ జరుగుతోంది. కథను బట్టి ఈ సినిమాను రెండు భాగాలుగా విడుదల చేస్తే ఎలా ఉంటుందనే అంశాన్ని కూడా రాజమౌళి అండ్ కో ఆలోచిస్తున్నారని సమాచారం. ఈ సినిమా షూటింగ్ వచ్చే ఏడాది ద్వితీయార్ధంలో ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది. భారీ బడ్జెట్‌తో కేఎల్ నారాయణ ఈ సినిమాను నిర్మించనున్నారు.

•••

శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు చెందిన దాదాపు 25 మంది మత్స్యకారులు బతుకుతెరువు కోసం గుజరాత్ తీర ప్రాంతంలోని వీరవల్ వద్ద చేపల వేట కొనసాగిస్తూ, 2018 నవంబరులో పొరపాటున పాకిస్తాన్ కోస్ట్‌గార్డ్ అధికారులకు బందీలుగా చిక్కారు. దాదాపు ఏడాదిన్నర పాటు జైలు జీవితం అనుభవించిన వారి జీవితాల్లోని వాస్తవ ఘటనల సమాహారంగా 'తండేల్' సినిమా తెరకెక్కనుంది. 'ప్రేమమ్ (2016)', 'సవ్యసాచి (2018)' చిత్రాల తర్వాత హీరో నాగచైతన్య, దర్శకుడు చందూ మొండేటి కాంబి నేషన్‌లో తెరకెక్కనున్న మూడో చిత్రం ఇది. ఇందులో సాయి పల్లవి హీరోయిన్‌గా నటించనున్నారు. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ డిసెంబరులో ప్రారంభం కానుంది. అల్లు అరవింద్ సమర్పణలో 'బన్నీ' వాసు ఈ సినిమాను నిర్మించనున్నారు. కాగా వివాహం జరిగిన కొద్ది కాలానికే, తాను తండ్రి కాబోతున్న సమయంలోనే పాకిస్తాన్‌లో ఖైదు కాబడిన శ్రీకాకుళం మత్స్యకారుడి పాత్రలో నాగచైతన్య నటిస్తున్నట్లుగా తెలిసింది. వచ్చే ఏడాది చివర్లో 'తండేల్' సినిమా విడుదలయ్యే అవకాశాలు ఉన్నాయి. ఈ సినిమాకు దేవి శ్రీ ప్రసాద్ స్వరకర్త.

•••

ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ ఆఫీసర్‌గా వరుణ్ తేజ్ నటించిన దేశభక్తి చిత్రం 'ఆపరేషన్ వాలెంటైన్'. హిందీ, తెలుగు భాషల్లో రూపొందిన ఈ ద్విభాషా చిత్రంతో శక్తీ ప్రతాప్ సింగ్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఈ చిత్రంతో మానుషీ చిల్లర్ హీరోయిన్‌గా తెలుగు తెరకు పరిచయం అవుతుండగా, వరుణ్ తేజ్ హిందీకి పరిచయం అవుతున్నారు. ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో చోటు చేసుకున్న కొన్ని వైమానిక దాడుల వాస్తవ ఘటనల సమాహారంగా ఈ సినిమాను తెరకెక్కించినట్లు చిత్రయూనిట్ వెల్లడించింది. సోనీ పిక్చర్స్ ఇంటర్నేషనల్ ప్రొడక్షన్స్, రినైసెన్స్ పిక్చర్స్ సందీప్ ముద్దా నిర్మించారు. తొలుత ఈ సినిమాను డిసెంబరు 8న విడుదల చేయాలనుకున్నారు. కానీ ఈ సినిమా రిలీజ్ వాయిదా పడిందని, వచ్చే ఏడాది ప్రారంభంలో విడుదల చేసే ఆలోచన ఉందని యూనిట్ వెల్లడించింది.

•••

సుధీర్‌బాబు హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'హరోం హర: ది రివోల్ట్'. జ్ఞానసాగర్ ద్వారక దర్శకత్వంలో సుమంత్ జి. నాయుడు నిర్మిస్తున్న ఈ సినిమాలో సునీల్ ఓ కీలక పాత్రధారి. కాస్త రివెంజ్ టచ్ ఉన్న ఈ సినిమా 1989లో చిత్తూరు జిల్లా కుప్పంలో జరిగిన కొన్ని వాస్తవ ఘటనల స్ఫూర్తితో ఉంటుందనే టాక్ వినిపిస్తోంది. ఈ సినిమాను ఈ ఏడాది డిసెంబరు 22న విడుదల చేయాలనుకున్నారు. అయితే ఈ తేదీకి ప్రభాస్ 'సలార్' చిత్రం రిలీజ్ కానున్న నేపథ్యంలో 'హరోం హర' చిత్రం విడుదల వాయిదా పడినట్లు తెలుస్తోంది.

•••

శ్రీకాంత్ శ్రీరామ్ హీరోగా రూపొందిన హారర్ ఫిల్మ్ 'పిండం'. ఖుషీ రవి, ఈశ్వరీరావు, అవసరాల శ్రీనివాస్, రవివర్మ ఇతర ప్రధాన పాత్రలు పోషించారు. ఓ నిజజీవిత ఘటన ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కించామని, చిత్రీకరణ సమయంలో కొన్ని ఘటనలు జరగడంతో కాస్త భయంగానే ఈ సినిమాను తెరకెక్కించినట్లుగా ఈ చిత్ర దర్శకుడు సాయికిరణ్ దైదా చెబుతున్నారు. యశ్వంత్ దగ్గుమాటి నిర్మించిన ఈ చిత్రం డిసెంబరు 15న విడుదల కానుంది. 1930, 1990.. ప్రస్తుతం.. ఇలా మూడు కాలాలతో 'పిండం' స్క్రీన్ ప్లే ఉంటుందని చిత్రయూనిట్ పేర్కొంది.

ఇలా వాస్తవ ఘటనల ఆధారంగా రూపుదిద్దుకుని, ప్రేక్షకులను అలరించేందుకు మరికొన్ని సినిమాలు సిద్ధం అవుతున్నాయి.



• భరత్ కృష్ణ, ప్రియా హెగ్డే

మొబైల్ డాన్

భరత్‌కృష్ణ హీరోగా నటించి, దర్శకత్వం వహించిన యాక్షన్ చిత్రం 'డాన్ 360'. ప్రియా హెగ్డే హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో శ్రీకాంత్ అయ్యంగార్, అర్చన అనంత్, సతీష్ సారిపల్లి కీలక పాత్రలు పోషించారు. ఓ మొబైల్ యాప్‌తో రౌడీలను బుక్ చేసుకోవచ్చనే ఓ కొత్త కాన్సెప్ట్‌తో ఈ చిత్రం తెరకెక్కింది. ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో భరత్ కృష్ణ మాట్లాడుతూ– ''కొత్తదనం ఉంటే ఆ సినిమాను ప్రేక్షకులు ఆశీర్వదిస్తారు. ఈ కోవలో మా చిత్రాన్ని కూడా ప్రేక్షకులు ఆదరిస్తారనే నమ్మకం ఉంది'' అన్నారు. ఈ కార్యక్రమంలో హీరోయిన్ ప్రియా హెగ్డే, సతీష్ సారిపల్లి మాట్లాడారు.

''ప్రేమ, కోపం కాదు..పగ తీర్చుకోవడమే బలమైన భావోద్వేగమని 'యానిమల్' సినిమా ప్రయాణంలో నాకు అనిపించింది. మనతో పగను ముందుకు తీసుకువెళ్లడం అనేది చిన్న విషయం కాదు. నేను ఎందుకు ఇలా చెబుతున్నానో 'యానిమల్' సినిమా చూస్తే ప్రేక్షకులు అర్థం చేసుకుంటారని అనుకుంటున్నాను'' అన్నారు దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా. రణ్‌బీర్ కపూర్, రష్మికా మందన్నా హీరో హీరోయిన్లుగా, అనిల్ కపూర్, బాబీ డియోల్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'యానిమల్'. తెలుగు, తమిళం, కన్నడం, మలయాళం, హిందీ భాషల్లో ఈ చిత్రం డిసెంబరు 1న విడుదల కానుంది. ఈ సందర్భంగా సందీప్‌రెడ్డి వంగా చెప్పిన విశేషాలు...

ప్రేమ కాదు.. పగ అనేది బలమైన భావోద్వేగం



- దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా

- తండ్రీకొడుకుల భావోద్వేగమే 'యానిమల్' సినిమా ప్రధానాంశం. ఓ వ్యక్తి తన భావోద్వేగంతో కుటుంబం కోసం ఎంత దూరం వెళ్లాడు? అన్నదే ఈ సినిమా. ఈ సినిమాలో హింసాత్మక సన్నివేశాలను, భావోద్వేగ సన్నివేశాలను బ్యాలెన్స్ చేశాననే అనుకుంటున్నాను.
- 'యానిమల్' కథను తొలిసారిగా విన్నప్పుడు కొంతమంది యాక్టర్స్‌కు కొన్ని అంశాలు నచ్చలేదనే చర్చ జరిగి ఉండొచ్చు. అయితే 'యానిమల్' కథ రణ్‌బీర్ కపూర్‌కు నచ్చింది. పైగా నాకు బాగా నచ్చిన నటుడు. గొప్ప వ్యక్తిత్వం ఉన్న వ్యక్తి రణ్‌బీర్ కపూర్.
- ఈ సినిమా లవ్‌స్టోరీతోనే మొదలవుతుంది. ఈ సినిమాలో హీరో పాత్రను అతని తల్లిదండ్రులు కన్నా ఎక్కువగా అర్థం చేసుకున్నది హీరోయిన్ పాత్రే అని సినిమా చూసినప్పుడు ప్రేక్షకులకు అనిపిస్తుంది. కథలో రష్మికా మందన్నా, అనిల్‌కపూర్ పాత్రలు చాలా కీలకంగా ఉంటాయి. బాబీ డియోల్‌ది విలన్ రోల్. ఆయన పాత్ర గురించి నేను ఇప్పుడే చెప్పలేను. ప్రేక్షకులు థియేటర్స్‌లో చూడాలి. నిర్మాత భూషణ్‌కుమార్‌గారు ఫుల్ ఫ్రీడమ్ ఇచ్చారు. నా సొంత సోదరుడు ప్రణయ్ ప్రొడక్షన్‌లో ఉండటం నాకు ప్లస్‌గానే అనిపించింది. నా సినిమా నాకంటే ఎక్కువగా మరొకరికి అర్థం కాదేమోనని నా సినిమాలకు నేనే ఎడిటింగ్ చేసుకుంటున్నాను. అలా 'యానిమల్' సినిమాకు ఎడిటింగ్ చేశాను.
- అన్నివర్గాల ప్రేక్షకులకు నచ్చేలా సినిమా అంటే స్టోరీ, క్యారెక్టర్స్‌లో ఇంటెన్స్ తగ్గిపోవచ్చు. సినిమాకు 'ఏ' సర్టిఫికెట్ వచ్చింది. ఇది చిన్నపాటి మైనస్ అనుకుంటున్నాను. అయితే 'యానిమల్' నిడివి మూడుగంటల ఇరవై నిమిషాలు ఉండటం అనేది పెద్ద సమస్య కాదని నేను అనుకుంటున్నాను. ఓ అమ్మాయి, అబ్బాయి ప్రేమకథలా వచ్చిన 'అర్జున్ రెడ్డి' సినిమా మూడుగంటల ఆరు నిమిషాలైనా ప్రేక్షకులు ఆదరించారు. 'యానిమల్' సినిమాలో ప్రేమకథే కాదు.. కుటుంబ అంశాలను ప్రస్తావించాము. కాబట్టి నిడివి కాస్త ఎక్కువైంది. 'అర్జున్‌రెడ్డి' కంటే కేవలం ఓ పది నిమిషాలు ఎక్కువ అంతే. ప్రేక్షకులకు 'యానిమల్' కూడా నచ్చుతుందనే నమ్మకం ఉంది.
- ఇండస్ట్రీపై 'శివ' సినిమా చూపించినంత ప్రభావం 'అర్జున్‌రెడ్డి' సినిమా కూడా చూపించిందంటే నేను ఒప్పుకోలేను. 'శివ' సినిమా టైమ్‌లెస్ క్లాసిక్. 'అర్జున్‌రెడ్డి' చిత్రం ఎంత క్లాసిక్ అనేది టైమ్ చెబుతుంది.
- ఓ దర్శకుడిగా నాకు అందరి హీరోలతో సినిమాలు చేయాలని ఉంది. 'అర్జున్‌రెడ్డి' తర్వాత మహేశ్‌బాబుగారికి ఓ స్టోరీలైన్ చెప్పాను. రామ్‌చరణ్‌కు ఓ కథ చెప్పాను. వారు బిజీగా ఉండటం వల్ల కుదర్లేదు. అయితే ప్రభాస్‌గారితో నా తర్వాతి సినిమా 'స్పిరిట్' ఉంటుంది. వచ్చే ఏడాది సెప్టెంబరులో షూటింగ్ స్టార్ట్ చేసే ఆలోచనలో ఉన్నాం. అల్లు అర్జున్‌గారితో ఓ కమిట్‌మెంట్ ఉంది.

జన్మంత జాతర...

సంపూర్ణేష్ బాబు, సంజోష్, ప్రాచీబంసాల్, ఆరతి గుప్తా ప్రధాన తారాగణంగా మన్ మోహన్ మైనంపల్లి దర్శకత్వంలో చంద్ర చాంగల నిర్మిస్తున్న చిత్రం 'సోదరా'. ఈ సినిమాలోని 'అన్నంటే దోస్తే సోదరా.. సీక్రేట్సే లేవురా..చిన్నోడై పుడితే సోదరా.. జన్మంత జాతర' అంటూ సాగే పాటను హీరో మంచు మనోజ్ విడుదల చేసి, మాట్లాడుతూ–''అన్నదమ్ముల మధ్య ఈగోలు, డబ్బు సమస్యలు ఉండకూడదు. హ్యూమన్ ఎమోషన్స్ నేపథ్యంలో 'సోదర' సినిమా తీయడం నాకు సంతోషంగా ఉంది'' అన్నారు. ''మంచు మనోజ్ నన్ను ఓ సొంత సోదరుడిలా భావించి, ఈ సాంగ్ ఈవెంట్‌కు వచ్చినందుకు ధన్యవాదాలు'' అన్నారు సంపూర్ణేష్‌బాబు. ''అన్నదమ్ముల అనుబంధం నేపథ్యంలో ఈ సినిమా ఉంటుంది'' అన్నారు మన్ మోహన్. ''ఈ సినిమాను ప్రేక్షకులు ఆదరించాలి'' అన్నారు సంజోష్, చంద్ర చగంలా. ఈ సినిమాకు సంగీతం: సునీల్ కశ్యప్.



• సంజోష్, మంచు మనోజ్, సంపూర్ణేష్ బాబు

ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి
మేకల కళ్యాణ్ చక్రవర్తి

భద్రాద్రి రాముడు, స్తంభాద్రి లక్ష్మీనరసింహుడు కొలువైన నేల.. తెలంగాణ నల్లబంగారం సింగరేణి ప్రాంతం, నిత్యం ఆటుపోట్లు ఎదుర్కొంటూ అడవి జీవనం సాగించే ఆదివాసీలకు అడ్డా, రాష్ట్రంలోనే అత్యధిక రిజర్వ్‌డ్ నియోజకవర్గాలున్న ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఈసారి ఆసక్తికర ఎన్నికలు సాగుతున్నాయి. గత రెండుసార్లు కాంగ్రెస్ పార్టీ పక్షానే నిలబడిన ఖమ్మం జిల్లా ప్రజలు ఈసారి ఏం చేస్తారోననే ఉత్కంఠ రాష్ట్ర వ్యాప్తంగా రాజకీయవర్గాల్లో నెలకొంది. పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుల చేరికతో కాంగ్రెస్ పార్టీకి మళ్లీ పాత ఫలితాలు పునరావృతమవుతాయా? లేక కేసీఆర్ నాయకత్వంలో పదేళ్ల సంక్షేమ పాలన ఈసారి ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్ పట్టును చూపెడుతుందా? అన్నది చర్చనీయాంశమవుతోంది. ఇక్కడ ఉభయ కమ్యూనిస్టు పార్టీల్లో సీపీఐ కాంగ్రెస్ కూటమిలో చేరగా, సీపీఎం ఒంటరిగా పోటీ చేస్తోంది. మార్క్సిస్టులకు ఏ నియోజకవర్గంలో ఎన్ని ఓట్లు వస్తాయి? ఎవరి గెలుపు అవకాశాలనైనా ఈ ఓటు బ్యాంకు ప్రభావితం చేస్తుంది? బీజేపీకి ఎన్ని చోట్ల డిపాజిట్ దక్కుతుంది? స్వతంత్రులెవరైనా గట్టెక్కుతారా అనే చర్చ జరుగుతోంది. రెండు ప్రధాన రాజకీయ పక్షాలైన కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు పోటాపోటీగా ప్రచార పర్వాన్ని సాగిస్తున్న ఖమ్మం జిల్లాలోని 10 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏం జరుగుతుందన్న దానిపై 'సాక్షి' గ్రౌండ్ రిపోర్ట్ ఇది... !

పాలేరు ప్రత్యేకం...?


ఖమ్మం జిల్లాకు సరిహద్దులో ఉండే పాలేరు నియోజకవర్గంలో పోటీ ఈసారి ప్రత్యేకత సంతరించుకుంది. ఇక్కడి నుంచి ప్రస్తుతం ఉన్న ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డికి సౌమ్యుడిగా, ఆపదలో ఆదుకునే వ్యక్తిగా పేరుంది కానీ పార్టీ మార్పు వ్యవహారం ఈసారి ఆయనకు ఇబ్బందిగా మారే అవకాశం ఉంది.కాంగ్రెస్ నుంచి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి బరిలోకి దిగడంతో పరిస్థితిలో మార్పు వచ్చింది. ప్రజాప్రతినిధులతో పాటు ప్రజలు కూడా ఈసారి పొంగులేటి వైపు మొగ్గుచూపుతున్నట్టు కనిపిస్తోంది. బలమైన నాయకుడు కావడం, మంచి వ్యక్తి అనే పేరుండడం పొంగులేటికి కలిసివచ్చే అంశాలు. సాంప్రదాయ ఓటు బ్యాంకు కాంగ్రెస్‌కు ఎలాగూ ఉంది. ఇక, సీపీఎం నుంచి ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పోటీ చేస్తుండడంతో ఈసారి మార్క్సిస్టులకు పాలేరులో ఎన్ని ఓట్లు వస్తాయి..? ఆ ఓట్ల చీలిక ఎవరికి లాభిస్తుందన్నది చర్చతోపాటు రాష్ట్రంలో సీపీఎం భవిష్యత్‌ను అంచనా వేసేందుకు కీలకం కానుంది.

కొత్తగూడెం కొంగొత్త రాజకీయం

కాంగ్రెస్‌తో రాష్ట్ర వ్యాప్త పొత్తు కుదుర్చుకున్న సీపీఐ అధికారికంగా పోటీ చేస్తోంది కొత్తగూడెంలోనే. ఈ పొత్తు కారణంగానే ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఎక్కడా లేని విధంగా కొత్తగూడెంలో త్రిముఖ పోటీ కనిపిస్తోంది. బీఆర్ఎస్ నుంచి మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ మద్దతుతో సీపీఐ నుంచి కూనంనేని సాంబశివరావు పోటీ చేస్తున్నారు. కాంగ్రెస్ బరిలో లేకపోవడంతో ఇక్కడి నుంచి మాజీ ఎమ్మెల్యే జలగం వెంకట్రావు ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పక్షాన పోటీ చేస్తున్నారు. పార్టీ మార్పు, కుమారుడి వ్యవహారశైలి వనమాకు కొంత ప్రతికూలంగా ఉన్నా నియోజకవర్గానికి సుపరిచితుడు, అందుబాటులో ఉండే వ్యక్తి కావడం, తోడల్లుడు ఎడవెల్లి కృష్ణతో ఉన్న గొడవలు పరిష్కారం కావడం, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర మద్దతు కలిసిరానున్నాయి. జలగం వెంకట్రావు పూర్తిగా తన సొంత బలంపై వెళుతుండగా, కూనంనేనికి కాంగ్రెస్ ఓటు బ్యాంకు బదిలీ ఆశాదీపంగా కనిపిస్తోంది. ఏం జరుగుతుందో చూడాల్సిందే!

సత్తుపల్లి సత్తా చాటేదెవరో?

ఎస్సీ రిజర్వ్‌డు అయిన సత్తుపల్లిలో ఈసారి బీఆర్ఎస్, కాంగ్రెస్‌ల మధ్య భీకరంగా రాజకీయ యుద్ధం జరుగుతోంది. పోటీ చేసే అభ్యర్థులతో సమానంగా ఇక్కడ ఇరుపార్టీల ముఖ్య నేతలు గెలుపును ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. కాంగ్రెస్ నేతలు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులకు మంచి పట్టు ఉన్న ఈ స్థానం నుంచి ఆ పార్టీ పక్షాన పాతకాపు మట్టా దయానంద్ సతీమణి రాగమయి బరిలో ఉన్నారు. బీఆర్ఎస్ నుంచి బలమైన నాయకుడిగా గుర్తింపు పొందిన సండ్ర వెంకటవీరయ్య పోటీ చేస్తున్నారు. ఇరువురు గట్టి అభ్యర్థులు కావడం, ఇద్దరికీ కీలక నేతల మద్దతు ఉండడం, ప్రధాన భూమిక పోషించే సామాజిక వర్గాలు ఇద్దరినీ అక్కున చేర్చుకుంటుండడం, మండలాల వారీగా భిన్న పరిస్థితులు కనిపిస్తుండడం సత్తుపల్లిలో ఈసారి ఫలితం ఎలా ఉంటుందోననే ఉత్కంఠను రేకెత్తిస్తున్నాయి.



భద్రాచలం ఎవరి వరం?

కాంగ్రెస్ సిట్టింగ్ ఎమ్మెల్యే పొదెం వీరయ్య, బీఆర్ఎస్ నుంచి తెల్లం వెంకట్రావులు ఇక్కడ తలపడుతున్నారు. గత ఎన్నికల్లో అనూహ్యంగా ఇక్కడి నుంచి పోటీ చేసిన వీరయ్య వైఖరి పట్ల నియోజకవర్గ ప్రజల్లో పెద్దగా వ్యతిరేకత ఏమీ లేదు. అయితే, ప్రతిపక్ష పార్టీలో ఉండడం వల్ల పెద్దగా అభివృద్ధి చేయలేకపోయారనే భావన కనిపిస్తోంది. బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ కావడం, ఆయన గత రెండుసార్లు పోటీ చేసిన ఎన్నికల్లో ఓటమి పాలు కావడంతో, మూడోసారైనా గట్టెక్కుతారేమోననే సానుభూతి వ్యక్తమవుతోంది. కొన్ని రోజుల వరకు పూర్తిగా కాంగ్రెస్ పక్షానే కనిపించిన ఈస్థానంలో పరిస్థితిలో కొంతమార్పు కనిపిస్తోంది. సీపీఐతో పాటు కాంగ్రెస్ నుంచి కొందరు బీఆర్ఎస్‌లో చేరడంతో భద్రాచలం టౌన్‌లో హోరాహోరీ పోరు సాగుతోంది. సీపీఎం నుంచి పోటీ చేస్తున్న కారం పుల్లయ్యకు ఎన్ని ఓట్లు వస్తాయనేది కూడా ఆసక్తికరంగా మారింది. మొత్తంమీద భద్రాచలం ప్రజల్లో కొంత కాంగ్రెస్‌కు సానుకూల అభిప్రాయం కనిపిస్తోంది.

స్తంభాద్రి గడ్డపై..

సై అంటే సై

ఖమ్మం ఖిల్లాలో
కొట్లాడుతున్న బీఆర్ఎస్, కాంగ్రెస్

ప్రభుత్వ వ్యతిరేకత, సాంప్రదాయ ఓటు
బ్యాంకుతో దూసుకుపోతున్న హస్తం పార్టీ

అభివృద్ధి నినాదం, సంక్షేమ పథమే
విజయతీరాన్నిచేరుస్తాయన్నఆశలోకారుదళం

మార్క్సిస్టుల ప్రభావం ఎవరిని
దెబ్బతీస్తుందన్నదీ కీలకమే..

వైరా గరంగరం

ఈ దఫా ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లా ఆసక్తిగా ఎదురుచూస్తున్న మరో నియోజకవర్గం వైరా. ఇక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యే రాములునాయక్‌ను కాదని మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్ వైపు కేసీఆర్ మొగ్గుచూపడంతో బీఆర్ఎస్ అభ్యర్థిగా ఆయన బరిలోకి దిగారు. కాంగ్రెస్ పార్టీలో దశాబ్దాలుగా పనిచేస్తోన్న రాందాస్ నాయక్ భట్టి ఆశీస్సులతో టికెట్ తెచ్చుకున్నారు. వీరిద్దరి నడుమ పోరు రసవత్తరంగా సాగుతోంది. రాములునాయక్ బీఆర్ఎస్‌తో కలిసే ఉన్నా ఆయన వర్గం ఏ మేరకు సహకరిస్తుందన్నది చర్చనీయాంశమే. ఇక, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వర్గం మద్దతు కోసం రాందాస్ నాయక్ ఆశతో ఉన్నారు. స్థానిక నాయకత్వంతో ఆయనకు ఇంకా సయోధ్య కుదరనట్టు కనిపిస్తోంది. ప్రభుత్వ వ్యతిరేకత, కాంగ్రెస్ సాంప్రదాయ ఓటుబ్యాంకు, మార్పు కోరుతున్న నియోజకవర్గ ప్రజల ఆశీస్సులపై రాందాస్ ఆధారపడగా, కారుగుర్తు, కేసీఆర్ నాయకత్వం, సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, నియోజకవర్గ ప్రజలతో తనకున్న సన్నిహిత సంబంధాలపై మదన్‌లాల్ ముందుకెళుతున్నారు. మిగిలిన పార్టీలు బరిలో ఉన్నా పోటీ నామమాత్రమే.

ఇల్లెందు ఇంట ఇబ్బందిగానే..

ఇల్లెందులో ఈసారి ఆసక్తికర పోరు జరుగుతోంది. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి పోటీ చేసిన కోరం కనకయ్య ఈసారి కాంగ్రెస్ నుంచి, కాంగ్రెస్ ఎమ్మెల్యేగా గెలిచిన హరిప్రియా నాయక్ బీఆర్ఎస్ నుంచి బరిలో ఉన్నారు. ఇద్దరి మధ్యా తీవ్ర పోటీ కనిపిస్తోంది. లంబాడీ, కోయ, గిరిజనేతరుల కోణంలో ఇక్కడ ఎన్నికలు జరుగుతాయని అంచనా. పార్టీ మారిన అంశం హరిప్రియకు ప్రతికూలంగానే మారింది. గతంలో పోటీ చేసినప్పుడు ఆమె చేసిన ప్రమాణాలపై కూడా ప్రజలు చర్చించుకుంటున్నారు. పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మద్దతు ఉన్న కోరం కనకయ్య కాంగ్రెస్ పార్టీ ఓట్‌బ్యాంక్‌తో పాటు ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతపై ఆధారపడి ముందుకెళుతున్నారు. తన హయాంలో జరిగిన అభివృద్ధి, కేసీఆర్ నాయకత్వం, సంక్షేమ పథకాలపై హరిప్రియ ఆశలు పెట్టుకున్నారు.

పినపాక పాతకాపుల పోరు

ఎస్టీ రిజర్వుడు అయిన పినపాక అసెంబ్లీ నియోజకవర్గంలో ఈసారి హోరాహోరీ పోటీ నెలకొంది. గత ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన రేగా కాంతారావు ఈసారి బీఆర్ఎస్ నుంచి, బీఆర్ఎస్ నుంచి పోటీ చేసిన పాయం వెంకటేశ్వర్లు కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తున్నారు. కాంగ్రెస్‌కు బలమైన ఓటు బ్యాంకు ఉన్న పినపాకలో ఆ పార్టీ కంచుకోటను బద్దలు కొట్టేందుకు పాత కాంగ్రెస్ మనిషి కాంతారావు ఇప్పుడు బీఆర్ఎస్ నుంచి ప్రయత్నిస్తున్నారు. రేగా కాంతారావు రూ.300 కోట్లతో ఇక్కడ ఎంతోకొంత అభివృద్ధి చేశారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. మిగిలిన నియోజకవర్గాలతో పోలిస్తే ఎమ్మెల్యే పార్టీ మారిన అంశంపై పినపాకలో పెద్దగా చర్చ జరగడం లేదు. కాంగ్రెస్‌కు సీపీఐ తోడయింది. పాయం వెంకటేశ్వర్లుకు పొంగులేటి మద్దతు, సీపీఐ చేయూత, గతంలో ఆయన ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు చేసిన అభివృద్ధి కలిసి వచ్చే అవకాశాలున్నాయి.

పేట పట్టం ఎవరికో?



ఎస్టీ రిజర్వ్‌డ్ అయిన అశ్వారావుపేట నియోజకవర్గంలో పోటీ చేస్తున్న అభ్యర్థులతో సమానంగా మరో ఇద్దరు నేతల మధ్య పోటీ కనిపిస్తోంది. కాంగ్రెస్ బలమైన నాయకుడు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎంపీ బండి పార్థసారథిరెడ్డిల ప్రభావం ఈనియోజకవర్గంలో స్పష్టంగా ఉంది. ఇక్కడ కాంగ్రెస్ నుంచి జారె ఆదినారాయణకు టికెట్ వచ్చినప్పటికీ టికెట్ ఆశించిన మిగిలిన ముగ్గురు నేతలు బీఆర్ఎస్‌లోకి వెళ్లిపోయారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతుతో తెలుగుదేశం నుంచి గెలిచిన మెచ్చా నాగేశ్వరరావు పెద్దగా అభివృద్ధి చేయలేకపోయారనే అభిప్రాయం కనిపించింది. చాలాకాలం పాటు అటూ ఇటూ ఊగిసలాడిన మెచ్చా చివరకు బీఆర్ఎస్‌లో చేరినా ఫలితం దక్కలేదని అక్కడి ప్రజలంటున్నారు. కాంగ్రెస్ పార్టీకి ఉన్న బలమైన ఓటు బ్యాంకు, టీడీపీ నుంచి లభిస్తున్న పరోక్ష సహకారం ఓవైపు, అధికార పార్టీ అవిశ్రాంత ప్రయత్నాలు మరోవైపు హోరాహోరీ తలపడుతున్నాయి. ఫలితం ఎలా ఉంటుందో వేచి చూడాల్సిందే...!

ఖమ్మం గుమ్మంలో విజేత ఎవరో?

ఉమ్మడిజిల్లా వ్యాప్తంగా అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్నది ఖమ్మం అసెంబ్లీ ఫలితం కోసమే. ఇక్కడ ఇద్దరు బడా నేతలు హోరాహోరీగా తలపడుతున్నారు. ప్రస్తుతం మంత్రిగా ఉన్న పువ్వాడ అజయ్‌కుమార్ బీఆర్ఎస్ నుంచి, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కాంగ్రెస్ నుంచి అమీతుమీ తేల్చుకునేందుకు సిద్ధమయ్యారు. గతంలో జరిగిన అభివృద్ధిని చూపించి తుమ్మల బృందం, ఇప్పుడు కళ్ల ముందు కనపడుతున్న అభివృద్ధిని చూడండంటూ పువ్వాడ టీం ఊరూవాడా కలియ తిరుగుతున్నాయి. సీపీఎం నుంచి ఎర్రా శ్రీకాంత్ పోటీ చేస్తున్నా పెద్దగా ప్రభావం చూపే పరిస్థితి కనిపించడం లేదు. ఇక్కడ సీపీఐ మద్దతు కాంగ్రెస్‌కు ఉంటుందా లేక మంత్రి పువ్వాడ వైపు నిలబడుతుందా అన్న దానిపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. ఒకే సామాజిక వర్గానికి చెందిన ఈ ఇద్దరు నేతలకు ఆ సామాజికవర్గం మద్దతుతో పాటు ఖమ్మం సిటీ ప్రజల మద్దతు తోడైతేనే ఇక్కడ ఎవరు గెలిచేది తేలనుంది.


పువ్వాడ అజయ్


తుమ్మల నాగేశ్వరరావు

మధిర ముచ్చట తీరేనా?


భట్టి విక్రమార్క


కమల్‌రాజ్

సీఎల్పీ నేత మల్లుభట్టి విక్రమార్క ఇక్కడి నుంచి మరో మారు కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో ఉన్నారు. ఆయనకు ప్రత్యర్థిగా పాతకాపు లింగాల కమల్‌రాజ్ (బీఆర్ఎస్) బరిలో ఉన్నారు. సీపీఎం నుంచి పాలడుగు భాస్కర్ పోటీ చేస్తున్నారు. పోటీ ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల మధ్యనే కనిపిస్తోంది. దళితబంధు పథకాన్ని పైలట్ కింద ఈ నియోజకవర్గంలో అమలు చేసింది. బీఆర్ఎస్‌కు సానుకూలమైనా ఇతర వర్గాల నుంచి అసంతృప్తి వ్యక్తమవుతోంది. వైఎస్సార్‌టీపీ మద్దతు, ఆరు గ్యారంటీలు, గెలిస్తే భట్టి ముఖ్యమంత్రి అవుతారని జరుగుతున్న చర్చ భట్టికి కలసి వస్తున్నాయి. కమల్‌రాజ్ బీఆర్ఎస్ బలంతో పాటు సంక్షేమం, అభివృద్ధి ఎజెండాతోనే వెళుతున్నారు.

ఈ అంశాలే కీలకం

ఈసారి 9 అంశాలు స్పష్టమైన ప్రభావాన్ని చూపించబోతున్నాయని 'సాక్షి' క్షేత్రస్థాయి పరిశీలనలో వెల్లడయింది. అభ్యర్థుల వ్యక్తిత్వం, గుణగణాలకు తోడు 1) జిల్లాలోని 10 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ సాంప్రదాయ ఓటు బ్యాంకు, 2) పొంగులేటి, తుమ్మలతో సహా పలువురి చేరికలు, 3) క్షేత్రస్థాయికి వెళ్లిన ఆరు గ్యారంటీలు, 4) బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి, 5) కేసీఆర్ నాయకత్వం, పరిపాలనపై పెద్దగా ప్రతికూలత లేకపోవడం, 6) రైతుబంధు, పింఛన్లతో సహా ఇతర సంక్షేమ పథకాలు, 7) సీపీఐ, కాంగ్రెస్‌ల కలయిక, 8) గతంతో పోలిస్తే ప్రభ తగ్గిన మార్క్సిస్టు పార్టీకి వచ్చే ఓట్లు, 9) పట్టణ ప్రాంతాల్లోని ఓటర్లలో కనిపిస్తోన్న ఊగిసలాట అంశాలు ఈసారి ఎన్నికల్లో ఖమ్మం జిల్లాలో వచ్చే ఫలితాల విషయంలో ప్రభావం చూపనున్నాయి.

అందరికీ అవకాశమివ్వాలి



'తెలంగాణ ఏర్పాటయ్యాక రెండుసార్లు బీఆర్ఎస్ గెలిచింది. ఎప్పుడూ ఒక్కరే గెలవొద్దు. అప్పుడప్పుడు పరిపాలించే పార్టీలు మారుతుండాలి. అందరినీ ప్రేమించి, అందరికీ అవకాశం ఇవ్వాల్సిన బాధ్యత ఉంది. ఏం చేశారు, ఏం చేయలేదన్న దానిపై చర్చ అవసరం లేదు. తెలంగాణకు మరింత మంచి జరగాలంటే ఈసారి మార్పు కావాలి.'

– షేక్ కొండయ్య, వికలాంగుడు, ఖమ్మం

నన్ను కాపాడింది ఆరోగ్యశ్రీనే



'చనిపోయానని అనుకున్న నేను బతికానంటే దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ పెట్టిన ఆరోగ్యశ్రీనే కారణం. ఆరోగ్యశ్రీకి మొదటి లబ్దిదారు నేనే. 2006లో నా కిడ్నీలు పాడయ్యాయి. హైదరాబాద్‌కు తీసుకెళ్లి ఆరోగ్యశ్రీ కింద చేర్పించి చికిత్స అందించారు. 17 ఏళ్లుగా నా ఆరోగ్యానికి ఎలాంటి ఇబ్బంది లేదు. అప్పటినుంచి మేం ఆయన చూపించిన దారిలోనే నడుస్తున్నాం. ఈసారి కూడా అంతే.'

– భీంశెట్టి రంగనాయకమ్మ, పాలేరు

మంచిని అందరూ మెచ్చుకోవాలి



'నాకు పదెకరాల భూమి ఉంది. రైతుబంధు వస్తుంది. కరెంటు బాగుంది. ధాన్యం కూడా కొంటున్నారు. ఇలాంటి ప్రభుత్వానికి అందరూ మద్దతివ్వాలి. రైతువారీగా ఎలాంటి ఇబ్బంది లేదు. మంచిని మెచ్చుకోవాలి. అందరూ ప్రోత్సహించాలి.'

– కొండపల్లి రమేశ్‌రెడ్డి, సత్తుపల్లి

కారు జోరా.. హస్తం హవానా.. హంగా?

తెలంగాణ శాసనసభ ఎన్నికల పోలింగ్‌కు గడువు దగ్గరపడింది. ఈ ఎన్నికల్లో ఎవరు గెలుస్తారన్న దానిపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. రకరకాల సర్వేలు భిన్నమైన ఫలితాలు చెబుతున్నాయి. అధికారంలో ఉన్న బీఆర్ఎస్‌కు, ప్రతిపక్ష కాంగ్రెస్‌కు మధ్యనే ప్రధాన పోటీ అన్నది స్పష్టమైంది. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఆఖరు నిమిషంలో పోరాట పటిమను ప్రదర్శిస్తున్నప్పటికీ ఇప్పటికైతే మూడో స్థానానికే పరిమితమయ్యే సంకేతాలు కనిపిస్తున్నాయి. నాలుగైదు నెలల క్రితం వరకు బీఆర్ఎస్‌కు ఎదురులేదన్న భావన ఉండేది. కానీ క్రమేపీ కాంగ్రెస్ నుంచి తీవ్రమైన పోటీని ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం నోటి మాట (మౌత్ టాక్) ప్రకారమైతే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా ఆశ్చర్యం కాకపోవచ్చన్న అభిప్రాయం ఉంది. అలా అని బీఆర్ఎస్ అవకాశాలు పూర్తిగా పోయాయని కాదు. బీఆర్ఎస్ ప్రభుత్వం నెగటివ్ సమస్యను ఎదుర్కొంటున్న మాట వాస్తవం. కొద్దిరోజుల క్రితం మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హైదరాబాద్ అశోక్‌నగర్‌కు వెళ్లి అక్కడ నిరుద్యోగులతో భేటీ అయినప్పుడు వచ్చిన ప్రశ్నలు ఆ విషయాన్ని చెబుతాయి. ఆయన సమర్థంగా వారి ప్రశ్నలకు జవాబిచ్చినా, మౌలికంగా నిరుద్యోగుల సమస్య, టీఎస్‌పీఎస్సీ వైఫల్యం ప్రభుత్వాన్ని వెంటాడుతోందన్న విషయం అర్థమవుతుంది. అంతేగాక సీఎం కేసీఆర్ వ్యవహార శైలిపై కొంత అసంతృప్తి ఏర్పడింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై మరికొంత వ్యతిరేకత ఉంది. పదేళ్ల ఈ పాలన చూశాంగా అన్న భావన కూడా ఉంది. అదే సమయంలో కేసీఆర్ వ్యూహాత్మక సుడిగాలి ప్రచారం, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, హైదరాబాద్‌కు సంబంధించి చేసిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలు బీఆర్ఎస్‌కు ప్లస్ పాయింట్ అని చెప్పాలి. వీటితోపాటు పోల్ మేనేజ్‌మెంట్ కానీ, ఆర్థిక వనరుల విషయంలో కానీ బీఆర్ఎస్‌కు ఇబ్బంది ఉండదని, ఎలాగైనా తిరిగి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేస్తుందని ఆ పార్టీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. కేసీఆర్ తమకు గతంలో వచ్చిన సీట్లకన్నా నాలుగైదు ఎక్కువే వస్తాయని చెబుతున్నా, వాస్తవ పరిస్థితి అంత సులువుగా లేదనే చెప్పాలి. గత రెండు ఎన్నికల్లో లేనంతటి గట్టి పోటీని బీఆర్ఎస్ ఎదుర్కొంటోంది. బీఆర్ఎస్ బొటాబొటీ మెజార్టీతో అధికారంలోకి రావడమో, లేక ఎంఐఎంకు వచ్చే ఆరేడు సీట్లతో గండం నుంచి బయటపడటమో జరగొచ్చన్నది ఒక అంచనా. ఒకవేళ కాంగ్రెస్ ఇంకా పుంజుకుంటే కష్టం కావొచ్చు. ముస్లింలు గతసారి బీఆర్ఎస్ వైపు పూర్తిగా మొగ్గుచూపారు. ఇప్పుడు వారు ఎలా ఉంటారన్న దానిపై భిన్నాభిప్రాయాలున్నాయి.


కొమ్మినేని శ్రీనివాసరావు

హస్తం పార్టీ ఇలా...

కాంగ్రెస్ విషయానికొస్తే పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఆ పార్టీకి బలంగాను, బలహీనతగాను కనిపిస్తున్నారు. ఆయన చేసే ప్రసంగాలు కేడర్‌లో జోష్ నింపుతున్నాయి. ఆయనైతే కచ్చితంగా కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని నమ్ముతున్నారు. తమకు అనుకూలంగా వేవ్ వస్తుందన్నది ఆయన ఆశ. కేసీఆర్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడుతూ పర్యటనలు చేస్తున్నారు. రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ తదితరులు అదనపు ఆకర్షణగా ప్రచారం సాగిస్తున్నారు. అదే సమయంలో రేవంత్ టీడీపీ నుంచి వచ్చి కాంగ్రెస్‌కు నాయకత్వం వహించడం నచ్చకపోవడం, ఆయనపై ఉన్న ఇతర విమర్శలు బలహీనత కావొచ్చు. ప్రస్తుతానికైతే ఆయన బలహీనతలు పెద్దగా చర్చనీయాంశమవడం లేదనే చెప్పాలి. కాంగ్రెస్‌కు 70–80 స్థానాలు వస్తాయని రేవంత్ చెబుతున్నా.. అది అంత సులభం కాదు. ఎందుకంటే పైకి కాంగ్రెస్ అనుకూల వాతావరణం ఉన్నట్లు కనబడుతున్నా, కొన్ని పరిమితులూ ఉన్నాయని క్షేత్రస్థాయిలో చూసినవారు వ్యాఖ్యానిస్తున్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్యే పోటీ అయితే కాంగ్రెస్‌ది పై చేయి కావొచ్చన్నది వారి పరిశీలనలో వెల్లడవుతోందట. కానీ కొన్ని పరిణామాలు దానిని దెబ్బతీయొచ్చు. హైదరాబాద్‌లో కాంగ్రెస్‌కు అంత బలమైన అభ్యర్థులు ఎక్కువ చోట్ల లేకపోవడం ఒక లోటుగా చెబుతున్నారు. పోల్ మేనేజ్‌మెంట్ విషయంలో కాస్త వెనకబడే అవకాశం ఉంది.

30 స్థానాలపై కమలం దృష్టి

బీజేపీ సుమారు 30 నియోజకవర్గాలపై దృష్టి పెట్టింది. వాటిలో ఎక్కువ చోట్ల కనుక గణనీయంగా ఓట్లను పొందితే అది కాంగ్రెస్‌కు చేటు చేయొచ్చు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలడం వల్ల ఈ పరిస్థితి రావొచ్చు. సిర్పూరు, పెద్దపల్లి, సూర్యాపేట వంటి కొన్ని చోట్ల బీఎస్పీ కూడా గట్టి పోటీ ఇస్తోంది. దీనివల్ల కూడా కొంత కాంగ్రెస్‌కు, మరికొంత బీఆర్ఎస్‌కు నష్టం జరగొచ్చు. ఫార్వర్డ్ బ్లాక్ పేరుతోకానీ, స్వతంత్ర అభ్యర్థులుగా గానీ మరో పది, పదిహేను చోట్ల ప్రధాన పార్టీలకు పోటీ ఇస్తున్నారు. ఉదాహరణకు కొత్తగూడెంలో మాజీ ఎమ్మెల్యే జలగం వెంకటరావు ఫార్వర్డ్ బ్లాక్ పక్షాన నిలబడ్డారు. ఇక్కడ కాంగ్రెస్ తన మిత్రపక్షమైన సీపీఐకి సీటు కేటాయించింది. కాంగ్రెస్ పూర్తిస్థాయిలో సహకరిస్తే ఫర్వాలేదు. అలాకాకుండా కాంగ్రెస్‌లోని కొందరు, అలాగే బీఆర్ఎస్‌కు చెందిన మరికొందరు జలగం వైపు మళ్లితే ఇరుపక్షాలకు నష్టం కలగవచ్చు. లేదా ఆయన చీల్చే ఓట్లను బట్టి గెలుపుఓటములు నిర్ణయమవుతాయి. ఈ రకంగా చూస్తే సుమారు 30–40 చోట్ల కాంగ్రెస్‌కు ఇబ్బందికర పరిస్థితులు ఉండొచ్చు. వాటన్నిటినీ అధిగమించి కాంగ్రెస్ పుంజుకుని ప్రభంజనం సృష్టించుకోవాల్సి ఉంటుంది.

ఎంఐఎం ఆరేడు సీట్లలో గెలిస్తే..

119 సీట్లలో ఆరేడు సీట్లలో ఎంఐఎం గెలుస్తుంటుంది. మిగిలిన 112 సీట్లలో ఈ రకంగా 30 నుంచి 40 సీట్లలో తేడా వస్తే మిగిలిన సుమారు 70 నుంచి 80 సీట్లలోనే కాంగ్రెస్ తన ప్రభావం చూపగలుగుతుంది. సహజంగానే అన్నిట్లోనూ గెలిచే అవకాశం ఉండదు. ఇదే సమస్య బీఆర్ఎస్‌కూ ఎదురుకావొచ్చు. కాకపోతే ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలడం బీఆర్ఎస్‌కు కలిసి రావొచ్చు. ఈ రెండింట్లో ఏ పార్టీ అయితే వేవ్ సృష్టించుకోగలుగుతుందో దానికి పూర్తి మెజార్టీ రావొచ్చు. కానీ అలా జరుగుతుందా అన్నది సస్పెన్స్‌గానే ఉంది. అందువల్ల హంగ్ అవకాశాలను తోసిపుచ్చలేని పరిస్థితి.

కర్ణాటకలో, మునుగోడులో ఓడి..

బీజేపీ గురించి పరిశీలిస్తే, ఒకప్పుడు బీఆర్ఎస్‌కు ఇదే ప్రధాన ప్రత్యర్థి అవుతుందని అనుకున్నారు. కర్ణాటకలో, మునుగోడులో ఓటమి, బండి సంజయ్ తొలగింపు, ఢిల్లీ లిక్కర్ స్కాంలో సీఎం కుమార్తె పట్ల కొంత ఉదారంగా ఉండటం వంటి కారణాలతో ఆ పార్టీపై విశ్వాసం పోయింది. దానికి తగ్గట్టుగానే బీజేపీలో చేరిన పలువురు ప్రముఖులు మళ్లీ కాంగ్రెస్ బాట పట్టారు. అయినా బీజేపీ కొన్నిచోట్ల గట్టి పోటీలోనే ఉంది. కానీ అది తాను విజయం సాధించడం కన్నా, రెండు ప్రధాన పార్టీల్లో ఏదో ఒకదాని గెలుపు లేదా ఓటమికే ఉపకరించవచ్చన్నది ఒక అంచనా. దానిని దృష్టిలో పెట్టుకుని మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో విశ్వరూప ప్రదర్శనకు ప్రధాని హాజరై మాదిగలకు వర్గీకరణకు హామీ ఇవ్వడం, మళ్లీ మూడు రోజులపాటు ప్రచారంలో పాల్గొనడానికి రానుండటం, హోం మంత్రి అమిత్ షా తదితరులు గట్టిగా తిరుగుతూ కేసీఆర్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు సాగించడం జరుగుతోంది. తద్వారా తమ పార్టీకి 60 సీట్లు వస్తాయని ఆ పార్టీ నేతలు చెబుతున్నా, అంత సీన్ కనిపించడం లేదు. ప్రస్తుతం ఉన్న పరిస్థితిలో ఐదు నుంచి పది సీట్లు వస్తే గొప్ప అన్న భావన ఉంది. అందుకు భిన్నంగా జరిగితే ఆశ్చర్యపోవాలి.

ఎవరికైనా వేవ్ వస్తేనే భారీ ఆధిక్యత

మరో విశ్లేషణ ఏమిటంటే తెలంగాణలో వేవ్ వస్తే తప్ప ఏ పార్టీకి భారీ ఆధిక్యత రావట్లేదు. 1983 నుంచి పరిశీలిస్తే, టీడీపీ అధికారంలోకి వచ్చినప్పటికీ, ఆ ఎన్నికల్లో తెలంగాణలో 107 స్థానాలకు గాను టీడీపీకి, కాంగ్రెస్‌కు చెరో 43 సీట్లు వచ్చాయి. ఒకరకంగా ఇది హంగ్ వంటి పరిస్థితి. 1985లో టీడీపీకి వేవ్ రావడంతో తెలంగాణలో టీడీపీకి 74 సీట్లు వచ్చాయి. 1989లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా బొటాబొటిగా ఇక్కడ 58 స్థానాలు వచ్చాయి. 1994లో టీడీపీ వేవ్‌లో మిత్రపక్షాలతో కలిసి 90 సీట్లు సాధించింది. 1999లో టీడీపీ అధికారంలోకి రాగలిగినా, తెలంగాణలో బీజేపీతో కలిపి 58 స్థానాలే సాధించింది. 2004లో కాంగ్రెస్‌కు వేవ్ రావడంతో మిత్రపక్షాలతో కలిపి 84 సీట్లు వచ్చాయి. 2009లో 119 స్థానాలకుగాను కాంగ్రెస్ పవర్‌లోకి వచ్చినా ఇక్కడ మాత్రం 50 స్థానాలే లభించాయి. టీడీపీ, బీఆర్ఎస్, సీపీఐ, సీపీఎం కూటమికి 54 సీట్లు వచ్చాయి. అంటే ఎవరికీ ఆధిక్యత రాలేదన్నమాట. 2014లో బీఆర్ఎస్ కేవలం 63 సీట్లతోనే అధికారంలోకి వచ్చింది. 2018లో మాత్రం బీఆర్ఎస్‌కు వేవ్ ఏర్పడి 88 స్థానాల్లో విజయ ఢంకా మోగించింది. ఆ ఎన్నికల్లో టీడీపీ, కాంగ్రెస్, సీపీఐ కూటమి కట్టినా కేవలం 21 స్థానాలే దక్కాయి. దీని ప్రకారం ఏ పార్టీకి ప్రభంజనం లేకపోతే బీఆర్ఎస్‌కు బొటాబొటి మెజార్టీ లేదా హంగ్ వచ్చే అవకాశాలు ఉన్నాయనిపిస్తుంది. ఏమవుతుందో చూద్దాం!

అది పార్టీ సభా.. లేక కుల సభా..?

గాసిప్ టైమ్

అసలే ఎన్నికల సమయం. ప్రజలతో భారీ బహిరంగసభలు, రోడ్ షోలు నిర్వహించడం ద్వారా ప్రజలంతా తమ వైపు ఉన్నారన్న సంకేతాలు పంపించడమే వాటి ఉద్దేశం. ఇందుకోసం కోట్లాది రూపాయల వ్యయం అవుతుంది. అయినా ఫర్వాలేదు. పార్టీ ప్రతిష్ట ముఖ్యం. రాష్ట్రంలో అధికారంలోకి రావడమే పరమావధి. అలాంటిదే పరేడ్ గ్రౌండ్‌లో ప్రతిష్టాత్మకంగా భారీ బహిరంగసభ నిర్వహించాలని నిర్ణయించింది. అయితే సదరు సభ నిర్వహణకు పార్టీ పేరుమీద కాకుండా.. ఓ సంఘం పేరిట బహిరంగసభ నిర్వహణకు రంగం సిద్ధం చేసుకుంది. ఈ బహిరంగసభకు కీలక నేత ముఖ్య ప్రసంగం ఉంటుందని, తద్వారా ప్రత్యర్థి పార్టీలపై విరుచుకుపడేలా సర్వం సిద్ధం చేసుకున్నారు. కానీ ఇక్కడే తిరకాసు వచ్చిపడింది. అనుమతి తీసుకున్నది ఓ కులసంఘం. ఎన్నికల రిటర్నింగ్ అధికారి సభకు అనుమతినిచ్చారు. అయితే సభలో ఎక్కడా పార్టీ జెండాలు ఉండరాదని మౌఖికంగా ఆదేశించారట. లేదు.. కూడదు.. బహిరంగసభలో పార్టీ జెండాలు పెడితే.. సంబంధిత ఖర్చులో సగం వరకు స్థానిక అభ్యర్థి లెక్కలో వేస్తామని హెచ్చరించారట... ఏమి చేయాలో పాలుపోని నాయకులకు ఎన్నికల బహిరంగసభ రద్దుకు నిర్ణయం తీసుకున్నారట. అయితే అదే సమయానికి వాతావరణశాఖ కూడా వర్షాలు పడే సూచనలున్నాయంటూ ఇచ్చిన హెచ్చరిక కూడా వీరికి కలిసి వచ్చిందంటున్నారు. గతంలో ఇదే ప్రాంతంలో ఓ జాతీయ పార్టీ కూడా ఓ కులసంఘానికి సంబంధించిన బహిరంగసభ నిర్వహించింది. అది కూడా ఇంచుమించుగా రాజకీయ వేదికగానే ఉపయోగించుకుంది. కానీ అక్కడ ఎక్కడా తన పార్టీ జెండాలు ఏర్పాటు చేయకుండా జాగ్రత్త పడింది. ఆ సభ ద్వారా కావాల్సినంత ప్రయోజనాన్ని ఎన్నికల్లో పొందడానికి ప్రయత్నం చేసింది. ఆ కుల సంఘం కూడా ఎన్నికల ప్రచారంలో ఆ జాతీయ పార్టీకి పూర్తి మద్దతుగా రంగంలోకి దిగింది. ఇది ఎన్నికల కాలం మహిమ.



బొల్లోజు రవి

ఎన్నికల్లో రైతులను ఆకర్షించే పనిలో అన్ని పార్టీలూ నిమగ్నమయ్యాయి. రైతులను ప్రసన్నం చేసుకుంటేనే అధికారం దక్కుతుందని ప్రధాన పార్టీలు భావిస్తున్నాయి. అందుకే రైతు కేంద్రంగా అనేక పథకాలకు శ్రీకారం చుడుతున్నాయి. ఈ మేరకు ఆయా పార్టీలు ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టోలే నిదర్శనం. గ్రామీణ ప్రాంతాల్లో కీలకమైన రైతులు, వ్యవసాయ కూలీలను పార్టీలు టార్గెట్‌గా చేసుకొని ప్రచారం చేస్తున్నాయి.



రైతు చుట్టూ రాజకీయం

అన్నదాతలను ఆకర్షించే పనిలో అన్ని పార్టీలు

- ఎన్నికల మేనిఫెస్టోల్లో వారికే అందలం
- బీఆర్ఎస్ రైతుబంధు, కాంగ్రెస్ రైతు భరోసా
- కౌలు రైతులు, కూలీలకు కూడా కాంగ్రెస్ అభయం
- రూ. 2 లక్షల రుణమాఫీ ప్రకటించిన కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ
- గ్రామాల్లో ఎన్నికలను ప్రభావితం చేసేది రైతులు, కూలీలే

వ్యవసాయం : 2 కోట్ల మంది

రాష్ట్రంలో రైతుబంధు పథకం కింద పెట్టుబడి సాయం అందుకుంటున్న రైతులు 66 లక్షల మంది ఉన్నారు. వీరే కాకుండా సెంటు భూమిలేని కౌలు రైతులు 6 లక్షల మందికి పైగా ఉంటారు. అంటే రైతులు, కౌలుదారులు కలిపి దాదాపు 72 లక్షల రైతు కుటుంబాలు ఉన్నట్లు ఓ లెక్క. కుటుంబంలో కనీసం ఇద్దరు చొప్పున ఓటు హక్కు కలిగి ఉన్నా, దాదాపు కోటిన్నర మంది వరకు ఉంటారు. ఉపాధి హామీ పథకం కింద నమోదు చేసుకున్న కూలీల సంఖ్య 52 లక్షలు. అంటే రాష్ట్రంలో వ్యవసాయం, దానిపై ఆధారపడిన వారే 2 కోట్ల మంది ఉంటారని వ్యవసాయ వర్గాలు చెబుతున్నాయి.

బీఆర్ఎస్ రైతుబంధు రూ.16 వేలు

రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ పార్టీ రైతులపై పెద్ద ఎత్తున ఫోకస్ పెట్టింది. సాగునీటి ప్రాజెక్టులు మొదలు వ్యవసాయానికి 24 గంటల ఉచిత కరెంట్, రైతుబంధు, రైతు బీమా పథకాలు ప్రవేశపెట్టింది. రైతుబంధు కింద రైతులకు ఇప్పటివరకు రాష్ట్రంలో రూ. 72 వేల కోట్లు అందజేసింది. ప్రస్తుతం ఎకరానికి ఏడాదికి రూ. 10 వేలు ఇస్తుండగా, మరోసారి అధికారం అప్పగిస్తే విడతల వారీగా పెంచుతామని తెలిపింది. రైతుబంధు సాయాన్ని మొదటి సంవత్సరం ఎకరానికి ఏటా 12 వేల రూపాయలకు పెంచుతామని హామీనిచ్చింది. వచ్చే ఐదేళ్లలో రైతుబంధు సహాయాన్ని క్రమంగా పెంచుతూ... గరిష్టంగా ఎకరానికి ఏటా 16 వేల రూపాయలకు పెంచుతామని చెబుతోంది. రైతుబీమా ఎలాగూ ఉంది. అయితే గత రెండుసార్లు రైతులకు రూ. లక్ష రుణమాఫీ ప్రకటించి అమలు చేసిన బీఆర్ఎస్, ఈసారి మాత్రం తన ఎన్నికల మేనిఫెస్టోలో రుణమాఫీని ప్రకటించకపోవడం గమనార్హం.

కాంగ్రెస్ మేనిఫెస్టోలో రూ.2 లక్షల రుణమాఫీ

రైతులకు భరోసా దిశగా కాంగ్రెస్ అడుగులు వేస్తోంది. 24 గంటల ఉచిత కరెంట్ కాంగ్రెస్ పేటెంట్ అని ఆ పార్టీ చెబుతోంది. రైతుబంధుకు బదులుగా రైతు భరోసా పేరుతో ఏడాదికి ఎకరానికి ఒక్కో రైతుకు రూ. 15 వేలు ఇస్తామని వెల్లడించింది. కౌలు రైతులకు రైతు భరోసా రూ. 15 వేల పెట్టుబడి సాయం అందిస్తామని ప్రకటించింది. ఇక వ్యవసాయ కూలీలకు, ఉపాధి కూలీలకు ఏటా రూ.12 వేల ఆర్థిక సాయం అందిస్తామని చెబుతోంది. అన్ని పంటలకు మెరుగైన మద్దతు ధర, వరికి క్వింటాలుకు రూ. 500 బోనస్ ఇస్తామని పేర్కొంది. అలాగే రైతు డిక్లరేషన్లో భాగంగా ఒకేసారి రూ. 2 లక్షల రుణ మాఫీ చేస్తామని తెలిపింది. మద్దతు ధరకు అన్ని పంటలను కొనుగోలు చేస్తామని ప్రకటించింది. మూతపడిన చక్కెర కర్మాగారాన్ని తెరిపిస్తామని, పసుపు బోర్డును ఏర్పాటు చేస్తామని తెలిపింది. భూమి యాజమాన్య హక్కులను అందిస్తామని, పోడు భూముల రైతులకు, అసైన్డ్ భూముల లబ్ధిదారులకు క్రయ విక్రయాలతో సహా అన్ని యాజమాన్య హక్కులు కల్పిస్తామని తెలిపింది. రైతు కమిషన్ ఏర్పాటుతో సహా సరికొత్త వ్యవసాయ విధానం తెస్తామని చెబుతోంది.

వరికి మద్దతు ధర రూ. 3,100 ఇస్తామన్న బీజేపీ

మరోవైపు తామూ అధికారంలోకి వస్తామని చెబుతోన్న బీజేపీ కూడా తన మేనిఫెస్టోలో చిన్న సన్నకారు రైతులకు ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసుకునేందుకు రూ. 2,500 సాయం అందిస్తామని తెలిపింది. ఉచిత పంటల బీమాను ప్రకటించింది. వరికి రూ. 3,100 మద్దతు ధర ఇస్తామని తెలిపింది. పసుపు కోసం మార్కెట్ ఇంటర్వెన్షన్ ఫండ్‌ను ఏర్పాటు చేస్తామని పేర్కొంది. ఆసక్తి కలిగిన రైతులకు దేశీ ఆవులను ఉచితంగా అందిస్తామని తెలిపింది. జాతీయ పసుపు బోర్డు నిర్ణయానికి అనుగుణంగా నిజామాబాద్ టర్మరిక్ సిటీని అభివృద్ధి చేస్తామని ప్రకటించింది.

ఏమాత్రం తగ్గని లెఫ్ట్ పార్టీల మేనిఫెస్టో...

ఇక ఒంటరిగా బరిలో నిలిచి 19 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేస్తున్న సీపీఎం తన ఎన్నికల మేనిఫెస్టోలో రైతుకు అనుకూలంగా అనేక హామీలు ఇచ్చింది. రైతులకు ఒకేసారి రూ. 2 లక్షల రుణమాఫీ కోసం కృషి చేస్తామని తెలిపింది. కేరళ తరహాలో రైతు రుణ విమోచన చట్టం రూపొందించాలని కోరుతామని, రైతుల పంటలపై 80 శాతం రుణాలు ఇచ్చి గోదాముల సౌకర్యం కల్పించాలని, ధరల నిర్ణాయక కమిషన్ ఏర్పాటు చేసి పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, పంటలు సేకరించాలని కోరుతామని స్పష్టం చేసింది. కౌలు రైతుల గుర్తింపు, వ్యవసాయ రుణాలు, సబ్సిడీలు, పంట బీమా, కౌలు, పోడు తదితర రైతులందరికీ రూ. 5 లక్షల రైతు బీమా సౌకర్యం కల్పించాలని, ప్రకృతి వైపరీత్యాలు, అటవీ జంతువుల వల్ల పంట నష్టం జరిగితే సాగు చేసిన రైతులకు పరిహారం అందించేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తామని సీపీఎం పేర్కొంది. మరోవైపు కాంగ్రెస్ మద్దతుతో ఒక స్థానంలో పోటీ చేస్తున్న సీపీఐ కూడా తన ఎన్నికల మేనిఫెస్టోలో కీలకమైన అంశాలను పొందుపర్చింది. రైతులకు పెట్టుబడి సాయాన్ని ఎకరాకు రూ. 20 వేలు ఇవ్వాలని కోరింది. ఒకేసారి రైతులకు రూ. 2 లక్షల వరకు పంట రుణాలను మాఫీ చేయాలని పేర్కొంది.



వారి తీర్పే కీలకం!

టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో ఓటీఆర్ చేసుకున్న వారు 25 లక్షలు

- అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై ప్రభావం ఉంటుందంటున్న పరిశీలకులు

సాక్షి, హైదరాబాద్: ''ప్రభుత్వ విభాగాల్లో ఉద్యోగ ఖాళీల భర్తీ''. ఎన్నికల సందర్భంగా అన్ని పార్టీలు జపిస్తున్న మంత్రం ఇదే. తమకు అధికారం కట్టబెడితే ఫలానా గడువులోగా ఉద్యోగాలన్నీ భర్తీ చేస్తామంటున్నాయి. ఇప్పటికే ఆయాపార్టీలు తమ మేనిఫెస్టోల్లో ఈ అంశాన్ని ప్రస్తావించాయి. ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగ ఖాళీలు పరిమిత సంఖ్యలోనే ఉన్నా, వాటిని సాధించేందుకు కసరత్తు చేస్తున్న అభ్యర్థుల సంఖ్య లక్షల్లో ఉంది. తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) వెబ్‌సైట్‌లో ఉద్యోగాల కోసం వన్ టైమ్ రిజిస్ట్రేషన్ చేసుకున్న అభ్యర్థుల సంఖ్య 25 లక్షలు. ఇక తెలంగాణ గురుకుల విద్యా సంస్థల నియామకాల బోర్డు (టీఆర్ఈఐఆర్‌బీ), తెలంగాణ స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు (టీఎస్ఎల్ఆర్‌బీ), తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు (టీఎంహెచ్ఎస్ఆర్‌బీ) పరిధిలో రిజిస్ట్రేషన్లు కలుపుకుంటే అభ్యర్థుల సంఖ్య మరింత ఎక్కువగానే ఉంటుంది.రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాల విభాగంలో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ పద్ధతిలో కనీస విద్యార్హత గ్రాడ్యుయేషన్. దీంతో ప్రతి గ్రాడ్యుయేట్ ఓటు హక్కు నమోదు చేసుకున్న వారే కావడంతో ఎన్నికల్లో వీరి తీర్పు కీలకం కానుందని రాజకీయ పార్టీలు భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలో వారిని ఆకర్షించేందుకు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నాయి.

ఒక్కో సెగ్మెంట్‌లో 21 వేలకు పైమాటే..

రాష్ట్రంలో 119 అసెంబ్లీ నియోజకవర్గాలుండగా.. ఒక్కో నియోజకవర్గంలో సగటున 21 వేల మంది ఉద్యోగాలర్థులున్నట్లు అంచనా. దీంతో ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ విషయంలో స్పష్టత ఇస్తే వారి ఓట్లన్నీ పడతాయనే భావనతో రాజకీయ పార్టీలు ఎన్నికల్లో ఈ అంశాన్ని ప్రచారస్త్రంగా మలుచుకుంటున్నాయి. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో జాబ్ కేలండర్‌ను ప్రకటించి ముమ్మరంగా ప్రచారం చేస్తోంది. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇప్పటికే 1.63 లక్షల ఉద్యోగాలు భర్తీ చేసిందని, మిగిలిన ఖాళీల భర్తీకోసం మరోసారి అధికారంలోకి రాగానే జాబ్ కేలండర్ ప్రకటిస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎన్నికల ప్రచారంలో చెబుతున్నారు. ఇక బీజేపీ సైతం ఉద్యోగ ఖాళీల భర్తీ అంశాన్ని కూడా మేనిఫెస్టోలో చేర్చింది. దీనితోపాటు ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్న సీపీఐ, సీపీఎం, బీఎస్పీ సైతం మేనిఫెస్టోలో ప్రభుత్వ కొలువుల అంశాలను ప్రస్తావించాయి. ఇటీవల బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిరుద్యోగులతో ప్రత్యేకంగా సమావేశమై ప్రభుత్వ రంగంలో ఉద్యోగాల భర్తీ, ప్రైవేటు రంగంలో ఉద్యోగాల కల్పనపై సుదీర్ఘంగా వివరణ ఇచ్చారు. దీంతో ఈ దఫా వీరంతా ఎవరికి ఓటేస్తారో చూడాలి.



క్రికెట్‌లాంటివే పాలిటిక్స్ కూడా!

క్రీడేశ్వర్రావు ఓ స్పోర్ట్స్ కామెంటేటర్. క్రీడావ్యాఖ్యాతగా రకరకాల వ్యాఖ్యానాలు చేయడంతో పాటు వాటిని సమర్థించే దాఖలాలూ బానే ఇస్తుంటాడు.

''జీవితమే ఓ ఆటన్నారు. జీవితంలో భాగం కాబట్టి పాలిటిక్సూ ఆటే. కాబట్టే 'పొలిటికల్ గేమ్' అనే మాట స్థిరపడింది. పాలిటిక్స్ అంటే అదో 'చెడ'రంగం అంటారుగానీ..నిజానికి పాలిటిక్స్ అంటేనే క్రికెట్, క్రికెట్ అంటేనే పాలిటిక్స్'' స్టేట్‌మెంట్ ఇచ్చాడు క్రీడేశ్వర్రావు.

''భలే చెబుతారు సార్ మీరు. పాలిటిక్స్ క్రికెట్ ఎలా అవుతుంది?'' అడిగాడు రాంబాబు.

''చెబుతా విను. క్రికెట్ వరల్డ్ కప్ మొన్నే అయ్యింది కదా. ఈ ప్రక్రియలో ఎప్పుడే గేమ్ జరుగుతుందో ఓ షెడ్యూలు ప్రకటిస్తారు. పాలిటిక్స్‌లోనూ అంతే..షెడ్యూలూ, నోటిఫికేషనూ, నామినేషన్లు, వాటి ఉపసంహరణా..చివర్న ఎన్నికలు. ఇలా చూసినప్పుడు క్రికెట్‌లో ఫైనల్స్ ఎలాగో..ఎన్నికల్లో పోలింగ్ డేట్ అలాగ. ఇక క్రికెట్‌లో అంపైర్లూ, థర్డ్ అంపైర్ ఉన్నట్టే... పాలిటిక్స్‌లోనూ, రిటర్నింగ్ అధికార్లుంటారు. ఏదైనా పొరబాటు జరిగినా లేదా ఔటయ్యాడని అనిపించినా..అక్కడ అప్పీళ్లు చేసినట్టే..ఇక్కడా చేస్తుంటారు అభ్యర్థులు ఫిర్యాదులు''

''అది సరే సర్. కానీ క్రికెట్‌లో వివిధ దేశాల టీములు ఒకదానితో మరోటి ఆడుతూ..గెలిచినవి చివరన సెమీఫైనల్సు ఆడి, అక్కడా గెలిచినవి ఫైనల్‌కొస్తాయి. కానీ పాలిటిక్స్‌లో ప్లేయర్లందరూ ఒకేసారి ఆడేస్తారు కదా ఎన్నికల ఆట?'' అడిగాడు రాంబాబు.

''అదొక్కటే తేడా. అక్కడ అంచెలంచెలూ..ఇక్కడ మూకుమ్మడి. మిగతా వాటిల్లో చాలావరకు సేమ్ టు సేమ్.

ఉదాహరణకు... క్రికెట్‌లో బౌలర్ బంతి విసురుతాడు. దాన్ని సరిగా కొట్టక గాల్లోకి లేపుతాడు బ్యాట్స్‌మన్. దాన్ని ఒడిసి పట్టుకుంటాడు ఫీల్డర్. కానీ క్రెడిట్ ఎవరికెళ్తుంది? వికెట్ పడగొట్టాడని ఎవర్నంటారూ? బౌలర్‌నే కదా!.. ఇక్కడ పాలిటిక్స్‌లోనూ ఎవర్నో ఓడించాలనుకున్న ప్రధాన అభ్యర్థి ఇంకెవర్నో నిలబెడతాడు. వాడు ఓట్లు చీల్చి, ప్రత్యర్థిని ఓడిస్తాడు.

అంతే! వాడు ఔటు కాగానే... క్రికెట్‌లో మోచేతులు సోడా కొడుతున్నట్టుగా మడిచి, తానే ఔటు చేశానంటూ ఆ ఘనత తీసుకునేవాడెవడూ? మన అభ్యర్థే కదా. ఇక... అక్కడ ఆట మొదలుపెట్టడానికి ముందే ఎవడ్ని ఓపెనర్‌గా పంపాలి, బౌలింగుకు ఎవర్ని దింపాలి.. ఇలా



షుగర్ & పెప్పర్
..:: యాసీన్

వ్యూహాలు సాగుతాయి కదా. పాలిటిక్స్‌లో కూడా ఎవరి మీద ఎవర్ని పోటీకి దింపాలి, ఏ సామాజికవర్గపు అభ్యర్థిని నిలబెట్టాలి.. ఇలాంటి వ్యూహాలూ, ఎత్తుగడలూ ఉంటాయా, ఉండవా నువ్వే చెప్పు.

మరోమాట... క్రికెట్‌లో స్లెడ్జింగ్ ఉన్నట్టే..పాలిటిక్స్‌లోనూ ఉంది. ఇది నీకూ, నాకే కాదు... అందరికీ తెలుసు. నోరెవడికి ఎక్కువ. ఎవడితో ఏం మాట్లాడించాలి, ఎవరేమి మాట్లాడితే, దాని ఎఫెక్టు ఎలా ఉంటుంది, ఎంత ఉంటుంది..ఇలాంటివన్నీ. ఉదాహరణకు మొన్న ఆస్ట్రేలియన్ క్యాప్టెన్ అన్నాడు కదా 'మ్యాచు అహ్మదాబాద్‌లో అయినా, మీకు సపోర్టిచ్చే ప్రేక్షకుల్ని సైలెన్స్ చేయించడంలోనే ఉంది మజా' అని. ఇక్కడ రాజకీయాల్లోనూ..'ప్రత్యర్థిని అతడి నియోజకవర్గంలోనే ఓడిస్తా, అతడికి డిపాజిట్ కూడా దక్కకుండా చేస్తా'.. లాంటి పొలిటికల్ కామెంట్లన్నీ అలాంటివే.

ఇంకో విషయం చెప్పనా! ఆడేదెవరైనా డబ్బులున్న వాళ్లు బెట్టింగులు వేసేది..అక్కడ క్రికెట్‌లో... అటు తర్వాత ఇక ఇక్కడ ఎన్నికల్లోనే''

''బానే ఉందిగానీ..మొన్న మన టీము అన్నీ గెలిచి.. ఫైనల్స్ ఓడింది కదా. మరి పాలిటిక్స్‌లో ఇదెలా సాధ్యం?'' అడిగాడు రాంబాబు.

దేశంలోని ప్రధాన పార్టీలన్నింటికీ అనువర్తింపజేస్తూ... ఈ ప్రశ్నకు క్రీడేశ్వర్రావు ఇలా సమాధానమిచ్చాడు.

''దీనికీ ఉంది జవాబు..ప్రతి పార్టీకీ ఇది వర్తిస్తుంది. అదెలాగో చెబుతా విను. రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటివరకూ ఒకట్రెండు తప్ప బీఆర్ఎస్ కీలకమైన ఎన్నికలన్నింటినీ దాదాపుగా గెలిచేసింది.

అలాగే మొన్న కాంగ్రెస్..కీలకమైన కర్ణాటక గెలుపును సాధించింది.

ఇక బీజేపీ..దేశంలోని చాలా రాష్ట్రాల్లో గెలిచి, అధికారంలో ఉంది. ఇవన్నీ భారత్ టీమ్ తాలూకు వరుస గెలుపుల్లాంటివి.

ఇలా చూసినప్పుడు... ఇప్పుడు తెలంగాణలో ఏ పార్టీ ఓడుతుందో..అది అన్నీ గెలిచి..అసలుది ఓడినట్టే కదా'' ముక్తాయించాడు క్రికెటేశ్వర్రావు..సారీ..క్రీడేశ్వర్రావు.

అనుమానం లేదు అధికారంలోకి వస్తాం

రాష్ట్రంలో బీజేపీ జెండా ఎగరేస్తాం

- మోదీ పట్ల యువత, ప్రజాభిమానమే గెలిపిస్తుంది
- హిందువుల గురించి మాట్లాడితే బీజేపీ మతోన్మాద పార్టీనా?
- హిందూయిజం ఉన్నంతకాలమే దేశంలో సెక్యులరిజం ఉంటుంది

సాక్షి టీవీ ఇంటర్వ్యూలో కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీనే అంటూ ఆ పార్టీ నేతలు ఎన్నికల సంగ్రామంలోకి దిగారు. ఈసారి తెలంగాణలో బీజేపీ జెండా రెపరెపలాడుతుందని గట్టిగానే సౌండ్ వినిపిస్తున్నారు. నాటి దుబ్బాక ఎన్నికల్లో గెలుపు నుంచి మొన్నటి జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీజేపీ పొందిన సీట్లే ఇందుకు నిదర్శమని కాషాయనేతలు చెబుతున్నారు. ఈ క్రమంలో తెలంగాణ బీజేపీ చీఫ్ కిషన్‌రెడ్డి సాక్షితో మాట్లాడుతూ కొన్ని కీలక వ్యాఖ్యలు చేశారు. బీజేపీ ఎలా, ఎందుకు అధికారంలోకి వస్తుందో చెప్పుకొచ్చారు. తెలంగాణ ప్రజలు బీజేపీకి ఎందుకు మద్దతిస్తారో క్లారిటీ ఇచ్చారు.

జోడు పదవులకు న్యాయం జరుగుతుందా?

నేను పదవిలోకి వచ్చి రెండు నెలలే అవుతోంది. ఈ సమయంలో పార్టీ కోసం , ఎన్నికల కోసం పూర్తిస్థాయిలో నా అనుభవం పెట్టి పనిచేస్తున్నాను.

బీజేపీ టెంపో డౌన్ అయ్యిందా?

ఒక పథకం ప్రకారం కొన్ని శక్తులు ఇలాంటివి ప్రచారం చేస్తున్నాయి. ప్రజల్లో అలాంటి పరిస్థితి లేదు. సుమారు 100 స్థానాల్లో బీజేపీ బలంగా ఉంది. కొన్ని స్థానాల్లో బీఆర్ఎస్‌కు, మరికొన్ని స్థానాల్లో కాంగ్రెస్‌కు దీటుగానే బీజేపీ ఉంది. మాకొచ్చే ఫీడ్ బ్యాక్‌లో మేం బలంగా ఉన్నాం.

కిషన్‌రెడ్డి వల్ల బీజేపీకి లాభమా?.. బీఆర్ఎస్‌కి లాభమా?

రాష్ట్ర అధ్యక్షుడి మార్పుపై సోషల్ మీడియాలో కొంత అసత్య ప్రచారం జరుగుతోంది. సామాన్య ప్రజలు ఈ విషయాన్ని పట్టించుకోలేదు. కొన్నేళ్లుగా బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నది బీజేపీనే. నేను అధ్యక్షుడైన రెండు నెలల్లో పలుమార్లు కేసీఆర్ సర్కార్‌కు వ్యతిరేకంగా నిరసనలు తెలిపాను. రెండు సార్లు నన్ను అరెస్ట్ కూడా చేశారు. ప్రజల కోసం కాంగ్రెస్ నేతలు బీఆర్ఎస్‌పై ఏనాడూ పోరాటం చేయలేదు. జైళ్లకు వెళ్లింది, కేసులు పెట్టించుకున్నది బీజేపీ నేతలే. గతంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ కలిసి పనిచేశాయి. బీఆర్ఎస్ పార్టీ.. కాంగ్రెస్ నేతలను కొనుగోలు చేసిన విషయం ప్రజలకు తెలుసు. బీజేపీ ఎప్పటికీ కుటుంబ పార్టీలో కలవదు. బీఆర్ఎస్, మజ్లిస్ ఒక్కటే. కానీ, మజ్లిస్ పార్టీతో బీజేపీ ఎన్నటికీ కలిసే ప్రసక్తే లేదు. సూర్యుడు తూర్పున ఉదయిస్తాడన్నది ఎంత నిజమో.. మజ్లిస్‌తో బీజేపీ కలవదు అన్నది కూడా అంతే నిజం.

తెలంగాణపై కర్ణాటక ఎఫెక్ట్ ఉందా?

కర్ణాటక ఫలితాల తర్వాత తెలంగాణకు భారీ మొత్తంలో డబ్బు చేరుతోంది. అక్కడ పన్నుల ద్వారా వచ్చిన డబ్బును తెలంగాణలో ఎన్నికల ప్రచారం కోసం వాడుకుంటున్నారు. రూ.వేల కోట్లను మీడియా మేనేజ్‌మెంట్, సోషల్ మీడియాకు వాడుకుంటున్నారు. కానీ, కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మడం లేదు.

అంబర్‌పేట నుంచి ఎందుకు పోటీలో లేరు?

నేను పోటీ చేయాలనుకున్నాను. నా వ్యక్తిగత నిర్ణయం వేరు.. పార్టీ హైకమాండ్ నిర్ణయం వేరు. నాకు పార్టీ టికెట్ ఇవ్వలేదు. బీసీని సీఎంను చేయాలని మా పార్టీ నిర్ణయించింది. ఈ సమయంలో నేను పోటీ చేస్తే గెలిచి.. ప్రజల్లో సీఎం అభ్యర్థిపై సందిగ్ధత ఉండకూడదనే ఉద్దేశంతోనే నేను పోటీలో లేను.

4 శాతం రిజర్వేషన్ల తొలగింపు కరెక్టేనా?

ఇది రాజకీయపరమైన అంశం. రాష్ట్ర హైకోర్టు నాలుగు శాతం రిజర్వేషన్లను రాజ్యాంగ వ్యతిరేకమని తీర్పు ఇచ్చింది. మతపరమైన రిజర్వేషన్లు రాజ్యాంగ వ్యతిరేకం. ఇప్పటికే ముస్లింలలో కొందరికి బీసీ-డీలో రిజర్వేషన్ దొరుకుతోంది. మేము ఈబీసీలో ఏదైతే 10 శాతం రిజర్వేషన్ ఇస్తున్నామో అందులో ముస్లింలకు రిజర్వేషన్ కల్పిస్తున్నాం. అందులో అందరికీ రిజర్వేషన్ ఉంటుంది. మతపరమైన రిజర్వేషన్లను బాబా సాహెబ్ అంబేడ్కర్ కూడా వ్యతిరేకించారు.

రాజకీయాల్లో అటు ఇటు అయితే ?

ఆ ప్రశ్న ఉత్పన్నం కాదు.

ఒకవేళ బీజేపీకి సరిపడా సీట్లు రాకపోతే ప్రతిపక్షంలో కూర్చుంటుందా?

బీజేపీ కచ్చితంగా అధికారంలోకి వస్తుంది. గతంలో జీహెచ్ఎంసీ ఎన్నికలు జరిగినప్పుడు మాకు 100 సీట్లు వస్తాయని బీఆర్ఎస్ చెప్పింది. బీజేపీకి కేవలం రెండు మూడు సీట్లు వస్తాయని చెప్పింది. కానీ ఫలితాలు వెల్లడైన తర్వాత పరిస్థితి తారుమారైంది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీకి ఇన్ని సీట్లు వస్తాయని ఏ ఒక్కరూ ఊహించలేదు. ఇప్పుడు కూడా అలాంటి పరిస్థితి ఉందని భావిస్తున్నాం.

దేని ఆధారంగా చెబుతున్నారు?

తెలంగాణలో 18 నుంచి 25 సంవత్సరాల వయసున్న యువతలో బీజేపీ పట్ల అభిమానం ఉంది. ఒక ఇంట్లో తండ్రి బీఆర్ఎస్ పార్టీలో ఉండవచ్చేమో కానీ వాళ్ల పిల్లలు బీజేపీ పట్ల.. నరేంద్ర మోదీ పట్ల సానుకూలంగా ఉన్నారు. ప్రధాని నరేంద్ర మోదీకి ఎంతోమంది యువత అభిమానులుగా ఉన్నారు. ఇదే మిగతా పార్టీలకు బీజేపీకి ఉన్న తేడా.

బీజేపీ అధికారంలోకి వస్తే సీఎం అభ్యర్థి ఎవరు.. మీ మద్దతు ఎవరికి ?

నా మద్దతు పార్టీకి ఉంటుంది. ప్రజాస్వామ్య పద్ధతిలోనే ముఖ్యమంత్రి ఎంపిక ఉంటుంది. పార్టీ అభ్యర్థుల అభిప్రాయాలను తీసుకుంటాం.. ఢిల్లీలో పార్లమెంటరీ బోర్డు ఉంటుంది.. వాళ్ల అభిప్రాయాలు తీసుకుని, విశ్లేషించి, మిగతా ఎమ్మెల్యేల అందరితో మాట్లాడిన తర్వాతే సీఎంను ప్రకటిస్తాం. యూపీ ఎన్నికలప్పుడు కూడా యోగి ఆదిత్యనాథ్‌ను తర్వాతే ఎంపిక చేశాం. ఒకసారి ముఖ్యమంత్రి అయిన తర్వాత యోగి ఆదిత్యనాథ్ ప్రతీ విషయంలోనూ ముద్రవేశారు.

ఈ ఎన్నికల్లో ఎన్ని సీట్లు వస్తాయని భావిస్తున్నారు?

అధికారంలోకి రావడానికి కావలసినన్ని సీట్లు బీజేపీ గెలుస్తుంది



బీఆర్ఎస్ లౌకిక రాజ్యం, కాంగ్రెస్ ఇందిరమ్మ రాజ్యం అంటున్నారు, మీరేమో రామరాజ్యం అంటున్నారు?

హిందువుల గురించి మాట్లాడితే మతోన్మాద పార్టీనా? ఈ దేశ ప్రజలందరికీ మనవి చేస్తున్నాను.. దేశంలో హిందూయిజం ఉన్నప్పుడే సెక్యులర్‌గా ఉంటుంది. హిందువులు మైనార్టీలోకి వెళ్లినప్పుడు దేశంలో సెక్యులరిజం ఉండదు. నేను రాసిస్తాను. మేము అన్ని మతాల గురించి మాట్లాడతాం. క్రిస్టియన్ల గురించి, ముస్లింల గురించి మాట్లాడతాం. మేం ముస్లింలను వ్యతిరేకించం, కేవలం మజ్లిస్ పార్టీ విధానాలతో వ్యతిరేకిస్తాం. హిందువుల గురించి కచ్చితంగా మాట్లాడతాం. హిందువులు దేశ పౌరులు కారా? వాళ్లకి ఇక్కడ హక్కులు లేవా?. వాళ్లకు అన్యాయం జరిగినప్పుడు మేము ప్రశ్నిస్తే అది మతోన్మాదం ఎలా అవుతుంది? నేను మళ్లీ మళ్లీ చెబుతున్నాను హిందూయిజం ఉన్నంతకాలమే దేశంలో సెక్యులరిజం ఉంటుంది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited Survey No 158/A, Nadipalli Village, Dichpalli Mandal, Nizamabad Dist - 503 175, TG, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) 08461 - 222645, 222646, 222647, Fax: 08461 - 222649, RNI Regn No. TELTEL/2008/23795.